ఇంగ్లీషు జర్నలిజంలో తొలి తెలుగు వెలుగు

# దంపూరు నరసయ్య




డాక్టర్ కాళిదాసు పురుషోత్తం

**English Journalismlo Toli Telugu Velugu**

**Dampuru Narasaiah**

A Publication of

**Society for Social Change, Nellore.**

First Published 2007

**© Dr. Kalidasu Purushotham**

For copies :

**Mrs. K. Sathyavathi**

16/1179, Kasturidevi Nagar,

Nellore-524 001. A.P.

Ph. : 0861-2320305

**Mani Book Stall**

Sunday Market, Nellore.

Cover Design:

**Ramana Jeevi**

Type set & composed :

**Aishwarya Graphics**, Nellore.

Tel. : 2327463

Printed at :

Charita impressions

Price : Rs. 120/-

ఇంగ్లీషు జర్నలిజంలో

తొలి తెలుగు వెలుగు

# దంపూరు నరసయ్య

('పీపుల్స్ ఫ్రెండ్' సంపాదకుడు)

డాక్టర్ ఎం. చంద్రశేఖర్ గారికి,
శుభాకాంక్షలతో
కాళిదాసు పురుషోత్తం
17/5/2011

డాక్టర్ కాళిదాసు పురుషోత్తం

నెల్లూరు

2007

సంస్కర్త

పత్రికోద్యమానికి ఆద్యుడు, మార్గదర్శి

మహామనీషి, దేశభక్తుడు

**దంపూరు నరసయ్యకు**

# కృతజ్ఞతలు

ఈ పుస్తకం పాఠకుల ముందు ఉంచుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

తమిళనాడు ఆర్కైవ్స్ చెన్నై, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్ - హైదరాబాదు, తిరుపతి కార్యాలయాల్లో, నెల్లూరు కలెక్టరాఫీసులో ఈ రచనకు అవసరమైన విషయాలు సేకరించాను.

ఆర్. సుందరలింగం పరిశోధన గ్రంథం "పాలిటిక్స్ అండ్ నేషనలిస్ట్ అవేకనింగ్ ఇన్ సౌత్ ఇండియా 1852-1891" నుంచి పందొమ్మిదో శతాబ్ది మద్రాసు సామాజిక పరిస్థితులను గ్రహించాను.

గురజాడ ఇంగ్లీషు రచనలు తెలుగు అనువాదాల రూపంలో తప్ప మాతృకలు చదివి ఆనందించడానికి అవకాశంలేని దురదృష్టకర పరిస్థితి కల్పించబడింది. నరసయ్యకు అటువంటి దుస్థితి ఏర్పడకుండా ఆయన రాసిన ముఖ్యమైన వ్యాసాలు, ఆయన అందుకొన్న ఉత్తరాలు, ఆయన పత్రిక మీద ప్రభుత్వ అనువాదకులు రాసిన రిపోర్టులు అనుబంధంలో చేర్చాను.

ఈ పుస్తకంలో అవసరాల సూర్యారావు, బంగోరె మొదలైనవారి రచనల నుంచి ఉదాహరించినపుడు వారు వాడిన భాషను మార్పుచేయకుండా ఉంచాను.

నా ఆత్మీయమిత్రులు శ్రీ పెన్నేపల్లి గోపాలకృష్ణ, డాక్టర్ ఎం. శివరామ ప్రసాద్ ఈ కృషిలో అండగా ఉన్నారు. మా బావ శ్రీ పి.ఎల్.ఎన్. ప్రకాశం ప్రూఫులు చూసే బాధ్యత స్వీకరించాడు. ఈ పరిశోధనకోసం,ఈ పుస్తక ప్రచురణకోసం నరసయ్య మనుమలు స్వర్గీయ నరసింహకృష్ణమూర్తి సంతానం పదిహేను వేల రూపాయలు ఇచ్చి సహాయపడ్డారు.

పెద్దలు, సీనియర్ పాత్రికేయులు, విశాలాంధ్ర దినపత్రిక పూర్వసంపాదకులు శ్రీ చక్రవర్తుల రాఘవాచారిగారు నా అభ్యర్థనను మన్నించి పరిచయ వాక్యాలు రాసి ఆదరించారు.

*అందరికి అభివందనాలు.*

నెల్లూరు
1-1-2007

కాళిదాసు పురుషోత్తం

# పరిచయం

విలక్షణ సంపాదకుడు, విశిష్ట పత్రికారచయిత దంపూరు నరసయ్యగారి జీవితం, కృషిని వివరిస్తూ వెలువరించిన ఈ పుస్తకం చారిత్రక ప్రాధాన్యం కలది; సాంఘిక ప్రయోజనం కలది. ఇరవయ్యవ శతాబ్దపు తొలిదశకంలో వారు అనేక కష్టనష్టాలకోర్చి నిర్వహించిన ఆంధ్రభాషా గ్రామవర్తమాని ఇప్పటికీ ప్రజానుకూల పత్రికల ఒరవడికి ఆదర్శమని చెప్పవచ్చు.

నరసయ్యగారు మద్రాసులో పచ్చెయ్యప్ప ఉన్నతపాఠశాలలో అధ్యాపకులుగా ఉన్నపుడు రెండు సంవత్సరాలు 'నేటివ్ అడ్వొకేట్'ను, నెల్లూరులో ప్రభుత్వోద్యోగిగా ఉన్నపుడు సంవత్సరం పాటు 'నెల్లూరు పయొనీర్'ను నిర్వహించిన అనుభవంతో 'పీపుల్స్ ఫ్రెండ్'ను 1881లో ఆరంభించి పదిహేడు సంవత్సరాలు జయప్రదంగా నిర్వహించారు. పీపుల్స్ ఫ్రెండ్ అను సమాసమే కేవలం ఆలంకారిక విశేషణంగా కాక, పత్రిక ప్రజల కనుకూలమైన పాత్ర నిర్వహించవలసిన పరమార్థాన్ని శీర్షిక ద్వారా నిర్వచించటం అర్థవంతమైన సూచనగా భావించవచ్చు. ఇటీవల 'పీపుల్స్' అనే విశేషణ పూర్వపద మైనవన్నీ పురోగామిశీలమైనవే కదా!

అప్పుడప్పుడే దేశంలో జాతీయోద్యమ ఆవిర్భావానికి ప్రయత్నాలు జరుగుతున్న కాలం. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానంతరం, బ్రిటిష్ ప్రభుత్వం వ్యూహం కొద్దీ ప్రారంభించిన పరిమిత సంస్కరణల ప్రభావం ఇంగ్లీషు విద్యావంతులైన మధ్యతరగతి వారి మీద బాగా ప్రసరిస్తున్న రోజులవి. రిప్పన్ ప్రభువు స్థానిక కౌన్సిళ్లకు నాంది పలికిన సమకాలీన స్ఫూర్తితో పీపుల్స్ ఫ్రెండ్ ప్రారంభం కావటం యాదృచ్ఛికమే అవచ్చు కానీ, ఆ పత్రిక తర్వాత సంవత్సరాల చరిత్ర నరసయ్యగారి సంస్కరణాభిలాషను, జాతీయ అభినివేశాన్నీ, ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న ప్రగాఢమైన అవగాహన, సానుభూతినీ ప్రస్ఫుటంగా తెలియజేస్తుంది.

ఆనాటి పత్రికల్లో సాంఘికసంస్కరణ, భాషా సంస్కరణల ప్రస్తావనలు బహుళంగా ఉండటం ఆశ్చర్యం కలిగించదు. సంఘసంస్కరణకు నిబద్ధులైన నరసయ్యగారు హిందూ సమాజంలో రావలసిన అనేక సంస్కరణలపై తాము నడిపిన పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక ద్వారా విశేషమైన కృషి చేశారు. బ్రహ్మసమాజపు ప్రభావంలో ఆయన చేసిన కృషికి "లెటర్స్ ఆన్ హిందూ మేరేజస్" తిరుగులేని తార్కాణం. సంస్కరణలో ఆయనది వెనుచూపు లేని దృక్కోణం. వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు ప్రభృతుల కృషికి ఆనాటి ఛాందసవర్గాల వ్యతిరేకతను సరకుచేయకుండా పత్రిక ద్వారాను, ప్రత్యక్షంగాను దోహదమొనర్చిన కర్మవీరుడు.

తెలుగు వ్యావహారిక భాషావాదంపై పెద్ద ఎత్తున గ్రాంథికవాదుల దాడి జరుగుతున్న రోజుల్లో నిర్భయంగా, నిజాయితీగా వాడుకభాషను సమర్థించిన ప్రముఖుల్లో

నరసయ్యగారు ఒకరు. గురజాడ అప్పారావు కన్యాశుల్క నాటక సమీక్షలో, వేదం వేంకటరాయశాస్త్రి పాత్రోచిత భాషను మెచ్చుకొంటూ చేసిన ప్రతాపరుద్రీయ నాటక సమీక్షలో ఈ వ్యావహారిక భాషా పక్షపాతం కన్పడుతుంది. కేవలం భాషావిషయమైనా, ప్రగతిశీల ధోరణే కాకుండా, ప్రజాసమస్యలపై ఆయన పత్రికల ద్వారా నిర్వహించిన కృషి అనన్య సాధ్యమనిపిస్తుంది. బ్రిటిష్ ప్రభుత్వం పట్ల తొలితరం పత్రికా రచయితలలో ఉన్న అనుకూల వైఖరిని, తరువాత కాలంలో అనుభవంకొద్దీ, పరిస్థితుల ప్రభావంలో మార్చుకొని రాజకీయంగా చైతన్యం ప్రోది చేయటంతో పాటు, ప్రజాసమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కారం సాధించటంలో ఆయన ప్రదర్శించిన పట్టుదల, ఆసక్తి ఏనాటి జర్నలిస్టుకైనా ఆదర్శప్రాయమే.

తెలుగువాడుగా పుట్టి ఇంగ్లీషు పత్రికల్లో పెద్దపేరు తెచ్చుకొన్న వారెందరో ఉన్నారు– అదీ తర్వాతికాలంలో. తొలిదశలోనే ఇంగ్లీషుపత్రికా ప్రపంచంలో తెలుగు'వాడి' రుచి చూపించిన ప్రశస్తి నరసయ్యగారిది. అవసరమైనపుడు తీక్షణత, అనుకూలతనుబట్టి సంయమనం, ఎట్టి పరిస్థితిలోనూ రాజీపడని నిష్కర్ష ఇవి ఏ 'క్రూసేడింగ్' జర్నలిస్టుకైనా కావలసినవి. ఈ ప్రమాణాలతో, అననుకూల పరిస్థితులలో తన ఆశయసాధన కోసం పత్రికను 'నమ్ముకొన్న' ప్రజాపక్షపాత పత్రికారచయితలకు ఆద్యుడుగా, తరగని స్ఫూర్తిగా నిలిచిన నరసయ్యగారికి నివాళి.

నరసయ్యగారికి వెంకటగిరి జమీందారుతో సన్నిహిత సంబంధాలు ఉన్నా, కోదూరు గ్రామం కేంద్రంగా చేసుకొని జమీందారి గ్రామాల పరిస్థితులను, అక్కడి రైతుల, ప్రజల పరిస్థితులను ఆయన తన పత్రికద్వారా వివరించి తర్వాతకాలంలో ప్రారంభమైన జమీందారి రైతులపోరాటానికి పటిష్టమైన భూమిక ఏర్పాటు చేశారు. ఆ విధంగా ఉద్యమపత్రికలకు శ్రీకారం చుట్టిన ఖ్యాతి ఆయనకే చెందుతుంది. ఇన్ని విధాల కృషి చేసిన నరసయ్యగారి చరిత్ర సమగ్రంగా రాని లోటు ఇప్పటికి కొంతవరకు తీరింది. రేఖామాత్రంగా బంగోరె, గోపాలకృష్ణ జమీన్‌రైతు ద్వారా చూపిన ఆకరాలను, ఆధారాలను శోధించి, వివరాలను వెదికి పట్టుకొని, విశేష శ్రమకోర్చి ఏ యూనివర్శిటీయో, అకాడమీయో నిర్వహించవలసిన కార్యభారాన్ని తనపై వేసుకొని నరసయ్యగారి జీవితచరిత్రను అందించటంలో పరిశోధకరచయిత డాక్టర్ పురుషోత్తంగారి కృషి సమాదరణీయమైనది. ఆయనకు తెలుగు పత్రికాలోకం ఇందుకెంతైనా రుణపడి ఉంటుంది. అలనాటి మంచి పత్రికారచయితను ఈనాటివారికి పరిచయం చేస్తూ, వెలువరిస్తున్న ఈ పుస్తకానికి ఈ రెండు మాటలు అభినందన పూర్వకంగా చెప్పడం జర్నలిస్టుగా సార్థకత, సంతృప్తి.

21-12-2006 చక్రవర్తుల రాఘవాచారి

విజయవాడ

ఈ వరుసలో ...... పుట


| | | |
|---|---|---|
| 1. | అర్ధ సత్యాలు - అసమగ్ర ప్రయత్నాలు | 1 |
| 2. | చెన్నపట్నం అనుభవాలూ - ప్రభావాలు | 9 |
| 3. | లెటర్స్ ఆన్ హిందూ మేరేజస్ | 19 |
| 4. | నేటివ్ అడ్వొకేట్ | 37 |
| 5. | నెల్లూరు పయొనీర్ | 41 |
| 6. | పీపుల్స్ ఫ్రెండ్ | 55 |
| 7. | చివరి మజిలీ : ఆంధ్రభాషా గ్రామవర్తమాని | 105 |
| 8. | దినచర్య : కొన్ని జీవిత విశేషాలు | 131 |
| 9. | పాదసూచికలు | 142 |
| 10. | అనుబంధాలు | 155 |

# 1

# అర్ధ సత్యాలు అసమగ్ర ప్రయత్నాలు

*నరుచేతను నా చేతను*
*వరమడిగిన కుంతిచేత వాసవుచేతన్*
*ధరచేత శల్యుచేతను*
*నరయంగా౯గర్ణుఁ డీల్గె నార్గురచేతన్*
*(ఒక చాటుపద్యం)*

నరసయ్య దురదృష్టవంతుడు. బతికినంతకాలం కష్టాలను కొనితెచ్చుకొని బతికాడు. దురదృష్టం చావు తర్వాత కూడా ఆయనను వెంటాడుతూనే వచ్చింది. జీవించినన్ని రోజులు ప్రజాశ్రేయస్సు కోసం పత్రికలు నిర్వహించిన ఆయన పేరు మద్రాసు జర్నలిజం చరిత్రలో ఎవరూ ప్రస్తావించలేదు. ఆయన కృషి కాలగర్భంలో కలిసిపోయింది. చివరకు ఆయన మరణవార్తను ఏ పత్రికా ప్రచురించినట్లు లేదు. వీరేశలింగం స్వీయచరిత్రలో "సంస్కరణాభిమాన షట్చక్రవర్తులు" అని వర్ణించిన ఆరుగురిలో నరసయ్య పేరు పేర్కొనకుండా ఉండి ఉంటే, లోకానికి ఆయన పేరు అసలు తెలిసేదే కాదు. గురజాడ ఒంగోలు మునిసుబ్రహ్మణ్యానికి రాసిన లేఖలో నరసయ్యను గురించి ప్రస్తావించడం వల్ల, పరిశోధకులు ఆయన మీద ఆసక్తి ప్రదర్శించారు.

ఒంగోలు వెంకటరంగయ్య మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చదువుతున్న కాలంలో సామాజిక ఉద్యమాలలో పాల్గొన్నాడు. ఆయనకు మద్రాసులోనే నరసయ్య పరిచయం అయినట్లుంది. నరసయ్య నెల్లూరు వచ్చి, స్థిరపడిన తర్వాత ఈ పరిచయం స్నేహంగా మారింది. "నా ప్లీడరు ఓ.వి.ఆర్" అని నరసయ్య దినచర్యలో రాసుకొన్నాడు. నెల్లూరులో నరసయ్య కోర్టు కేసులన్నీ వెంకటరంగయ్య వాదించాడు. నరసయ్య జీవిత చరమాంకాన్ని సన్నిహితంగా ఉండి పరిశీలించాడు. "కొందరు నెల్లూరు గొప్పవారు" శీర్షిక పేరుతో కొంతమంది పెద్దల జీవితాలను, కృషిని గ్రంథస్థం చేసిన ఆయన, తన పుస్తకరచనా ప్రణాళికలో నరసయ్యను చేర్చుకోలేదు. "కొందరు నెల్లూరు గొప్పవారు" లో నరసయ్య జీవితాన్ని గ్రంథస్థం చేసి ఉంటే, మనకు ఒక సాధికారికమైన జీవితచరిత్ర మిగిలి ఉండేది. నరసయ్య చనిపోయిన పదమూడు సంవత్సరాల తర్వాత, వెంకటరంగయ్య ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో నెల్లూరుమండల పత్రికల చరిత్ర వివరిస్తూ వ్యాసం రాశాడు.[1] ఈ వ్యాసంలో నరసయ్య జీవితవివరాలను, కృషిని సంగ్రహంగా, పదివాక్యాలలో వివరించాడు. ఈ నాలుగు మాటలే నరసయ్యను గురించి పరిశోధించడానికి దారిచూపాయి. అది వేరే సంగతి.

నరసయ్య పోయేనాటికి, ఆయన కుమారుడు రామకృష్ణయ్య ఇరవై రెండేళ్ళవాడు. యుక్త వయస్సు వచ్చేదాకా, బడికి పోకుండానే తండ్రి శిక్షణలో విద్యాబుద్ధులు నేర్చుకొని సమర్థుడయ్యాడు. తండ్రి తదనంతరం పీపుల్స్ ఫ్రెండ్ ముద్రణాలయాన్ని నిర్వహించాడు. ఇరవైనాలుగోఏట ఒక నవల రాసి ప్రచురించాడు. తండ్రి జీవితం, కృషి, కష్టాలు అన్నీ తనకు బాగా తెలుసు. చిన్నప్పటి నుంచీ తండ్రి ఉత్తరప్రత్యుత్తరాలు, రాతకోతలు, అన్నీ తానే చూచాడు. తండ్రితోపాటు తానూ కష్టాలు అనుభవించాడు. వెంకటగిరిలో ఉపాధ్యాయవృత్తిలో ఉంటూ రెండు మూడు పత్రికలకు విలేకరిగా పనిచేశాడు. తండ్రిని గురించి ఇంత బాగా తెలిసినా, తాను జర్నలిస్టు, రచయిత అయిఉండీ, ఆయనను గురించి ఒక్కమాట కూడా రాయలేదు. విషాదం అంతా ఇక్కడే ఉంది.

రామకృష్ణయ్య తన హయాంలో నరసయ్య వ్యక్తిగత గ్రంథాలయం, పత్రికల సంపుటాలు వగైరా రికార్డంతా భట్టారంవారి కండ్రికలోని (నెల్లూరుజిల్లా) సొంత ఇంట్లో జాగ్రత్తగా కాపాడుతూ వచ్చాడు. తండ్రి పుస్తకసంచయంలో కొంతభాగాన్ని వెంకటగిరి ఆర్.వి.ఎం. హైస్కూలుకు బహూకరించాడు.[2] రామకృష్ణయ్య మరణించిన తర్వాత, ఆయన కుమారులు (నరసయ్య మనుమలు) నెల్లూరులో బాడుగఇళ్ళలో కాపురం ఉన్నారు. ఇల్లు మారినపుడల్లా పాత పుస్తకాలు, రికార్డు 'పడేస్తూ' వచ్చారు. ఆ విధంగా నరసయ్యకు సంబంధించిన ఆధారాలన్నీ కనిపించకుండా పోయాయి.

నరసయ్య తన జీవితచరిత్రను సంగ్రహంగా అరవై పేజీల పుస్తకంగా రాసిపెట్టాడు. ఆ రాతప్రతిని కూడా ఆయన వారసులు కాపాడుకోలేకపోయారు[3]. నరసయ్య క్రమశిక్షణతో

మెలిగే వ్యక్తి. ఎవరికి జాబురాసినా, కార్డుముక్క రాసినా 'లెటర్ బుక్' లో కాపీ చేస్తే తప్ప, పోస్టుచేసేవాడు కాదు. కాపీ చెయ్యడానికి కుమారుడు అందుబాటులో లేకపోతే, ఉత్తరాలు పోస్టు చెయ్యకుండానే నిలిపి ఉంచిన వైనం దినచర్యలో రాసుకున్నాడు[4]. తను అందుకున్న ప్రతి ఉత్తరానికి, పోస్టుకార్డుకు నంబరు వేసి భద్రపరచేవాడు. ఈ కరస్పాండెన్సు ఇప్పుడు లభించడం లేదు.

నరసయ్య మనుమలు వెంకటగిరి విడిచిపెట్టి నెల్లూరు కాపురం వచ్చినప్పుడు నరసయ్య పుస్తకాలలో కొంతభాగాన్ని పెద్ద భోషాణంపెట్టెలో పెట్టి, జాగ్రత్త చేసి బంధువుల అధీనంలో ఉంచారు. అవి తలా ఒకటి పట్టుకొనిపోయారు. పోయినవిపోగా మిగిలిన రికార్డు, పుస్తకాలు, లేఖలు, డైరీలు, నరసయ్య మనుమలు పత్రికలవారికి, పరిశోధకులకు ఇచ్చి రాయమని కోరుతూ వచ్చారు. పనప్పాకం అనంతాచారి, వీరేశలింగం మొదలైన ప్రముఖులు రాసిన లేఖలు, రికార్డు ఎవరెవరి చేతుల్లోనోపడి అదృశ్యమయ్యాయి.

పందొమ్మిదోశతాబ్దిలో మద్రాసు ప్రెసిడెన్సీలో వెలువడిన పత్రికల మీద, ముఖ్యంగా ఇంగ్లీషుపత్రికల మీద విస్తృతపరిశోధనలు జరిగాయి. మద్రాసులో పుట్టి, మద్రాసులో విద్యాభ్యాసంచేసి, అక్కడే అధ్యాపకుడుగా, పత్రికాసంపాదకుడుగా, సంస్కర్తగా జీవించిన నరసయ్య పేరైనా ఈ పరిశోధకులు ప్రస్తావించలేదు. క్రెసెంట్, నేటివ్ పబ్లిక్ ఒపీనియన్, మదరాసీ మాత్రమే వారి దృష్టిలో మైలురాళ్ళు. పీపుల్స్ ఫ్రెండ్ పుట్టుక, అస్తమయం అన్నీ వారి పరిశోధన గ్రంథాల్లో ఒకవాక్యంలో ఇమిడిపోయాయి. కనీసం నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక సంపాదకుడని కూడా ఎవరూ పేర్కొనలేదు. కొందరు ఈ పత్రిక 1878 కల్లా మూతపడినట్లు రాశారు.

మదరాసు నగరం మూడువందల సంవత్సరాలు పూర్తిచేసుకొన్న సందర్భంలో ఒక ప్రత్యేక సంపుటాన్ని *(Tercentenary Commemoration Volume)* వెలువరించారు. అందులో కె.పి. విశ్వనాథఅయ్యరు మద్రాసు జర్నలిజంచరిత్రను రాస్తూ నేటివ్ పబ్లిక్ ఒపీనియన్ *(Native Public Opinion)* మదరాసీ *(Madrassee)* లతో పాటుగా పీపుల్స్ ఫ్రెండ్‌ను ప్రస్తావించాడు. "Another paper of the time, The People's Friend, suffered similar fate" అని ఒక మాట అన్నాడు. పీపుల్స్ ఫ్రెండ్ ముందు వెలువడిన పత్రికాసంపాదకుల పేర్లను పేర్కొన్నా, నరసయ్య పేరు ప్రస్తావించలేదు.[5] The Asylum Press Almanac, Madras 1882 సంపుటం నుంచి 1898 సంపుటం వరకు ప్రతి సంపుటంలోను పీపుల్స్ ఫ్రెండ్ మద్రాసు నుంచి వెలువడే ఇంగ్లీషు వారపత్రిక అని, డి. నరసయ్య ప్రకాశకుడని ఉంది. ఆల్మనాక్‌ను సంప్రదించని పరిశోధకులు ఉండరు.

మెయిల్ దినపత్రిక నూరేళ్ళ సంచిక (Centenary Supplement, Mail) లో మాతృభూమి ప్రధాన సంపాదకుడు పి. కేశవమీనన్ మద్రాసు జర్నలిజం చరిత్ర

వివరించాడు[6]. ఈ వ్యాసంలోనూ నరసయ్య పత్రికల ప్రస్తావన లేదు. హిందూ శతజయంతి ప్రత్యేక సంపుటంలో *(A Hundred Years of the Hindu)* మదరాసీ పత్రిక ఎక్కువరోజులు కొనసాగలేదని పేర్కొంటూ, *"However it did not live long and another paper of the time, People's Friend suffered the same fate"* అని పొడిమాటలు రాశారు[7]. పత్రికారచయిత రేండర్ గై *(Rander Guy)* ఈ మాటలనే కొంచెం మార్చుచేసి *"By the 1870's Madras had many Indian run newspapers, like Public Opinion, Madrassee and People's Friend. The going was tough for these national papers and so in 1878, these three publications merged to become "The Hindu"* అని రాశాడు[8]. హిందూ ప్రారంభమైన రెండున్నర సంవత్సరాల తర్వాతగాని, పీపుల్స్ ఫ్రెండ్ మొదలు కాలేదు. ఈ పత్రిక హిందుకూ సమాంతరంగా పదిహేడేళ్ళు కొనసాగింది. జె.నటరాజన్ తన సుప్రసిద్ధ గ్రంథం భారతదేశ జర్నలిజంచరిత్ర *(History of Indian Journalism)*లో ఈ పత్రికను 'పీపుల్స్ ఫ్రంట్' గా పేర్కొని, నెల్లూరు నుంచి వెలువడినట్లు చిత్రించాడు.[9] ఏ.ఏ.నాయర్ పీప్సు ఎట్ ది ప్రెస్ ఇన్ సౌత్ ఇండియా *(Peeps at the Press in South India)* లో *"another paper the People's Friend, also failed for want of public support"* అని రాశాడు.[10]

అకడమిక్ పరిశోధకుడు సి.జె. నిర్మల్ పరిశోధన "ది ప్రెస్ ఇన్ మద్రాసు *1785-1900" (The Press in Madras)* లో, డాక్టరు నడిగ్ కృష్ణమూర్తి "ఇండియన్ జర్నలిజం" (Indian Journalism) పరిశోధన గ్రంథంలోను నరసయ్య ప్రస్తావన కనిపించదు[11]. పీపుల్స్ ఫ్రెండ్, నేటివ్ అడ్వొకేట్‌లను పేర్కొన్న మొట్టమొదటి అకడమిక్ పరిశోధకుడు ఆర్. సుందరలింగం. 1881లో పీపుల్స్ ఫ్రెండ్ ప్రారంభమైనట్లు స్పష్టంగా రాసినా, ఆయన కూడా నరసయ్య పేరు ప్రస్తావించలేదు.[12] డి. సదాశివన్ తన పరిశోధన గ్రంథంలో *"Another paper came to be founded was People's Friend. But all these papers disappeared in course of time"* అని ముగించాడు.[13]

ఈ రచనలను అట్లా ఉంచితే, తెలుగు పరిశోధకుడు, విద్వాంసుడు ఆరుద్ర 1980 తర్వాత, "ఇంగ్లీషు జర్నలిజంలో తెలుగువారి ఘనత" అనే శీర్షికతో పెద్ద వ్యాసమే రాశాడు.[14] అప్పటికి ఆయనకు నరసయ్యను గురించి, నరసయ్య పత్రికలను గురించి తెలుసు. తెలుగు పరిశోధకులు అడపా దడపా ఏదో ఒక సందర్భంలో నరసయ్య పేరు ప్రస్తావిస్తూనే ఉన్నారు. ఇంత అవగాహన ఉండీ, ఏ కారణంచేతో నరసయ్య కృషిని తన వ్యాసంలో ప్రస్తావించలేదు.

విశాలాంధ్ర ప్రచురణ సంస్థ మొదట గురజాడ ఇంగ్లీషు లేఖలను అవసరాల సూర్యారావుచేత అనువదింపచేసి ప్రకటించింది.[15] ఆ పుస్తకంలో ఒంగోలు మునిసుబ్రహ్మణ్యానికి రాసిన ఒక లేఖలో నరసయ్య ప్రస్తావన ఉంది. ఈ సంస్థ గురజాడ

ఇంగ్లీషు లేఖలను రెండో పర్యాయం సెట్టి ఈశ్వరరావుచేత తెలుగులోకి అనువదింపచేసి "గురజాడ జాబులు" పేరుతో ప్రచురించింది.[16]

"వొక తెలుగు పుస్తకాన్ని. ఎలా రెవ్యూ చెయ్యాలో తెలిసున్న వ్యక్తి నా ఎరికలో ఎవడూ లేదు. అన్నట్టు శ్రీ డి. నరసయ్య అనే పండితుడు వొకాయన "పీపుల్స్ ఫ్రెండ్" అనే వొక వారపత్రికను నడుపుతూ ఉండేవాడు. ఆ పత్రిక ఇప్పుడు వెలువడడం లేదు; ఆయన నెల్లూరు వాస్తవ్యుడు. ఇప్పుడు వున్నారూ? వుంటే ఆయన చిరునామా నాకు పంపించు. ఆంగ్ల భాషలో ఆయన గట్టివాడు. వొకసారి ఆయన్ని కలుసుకో" అని సూర్యారావు అనువాదంలో ఉన్న ఈ భాగాన్ని ఈశ్వరరావు అనువదించకుండా విడిచిపెట్టాడు.

మూలంలో కొంతభాగాన్ని ఏ కారణం చేతయినా అనువాదకుడు అనువదించకుండా విడిచిపెట్టినపుడు ఆ సంగతి పాదసూచికలో సూచించాలి. ఈ సంప్రదాయాన్ని ఈశ్వరరావు పాటించలేదు. మహాకవి గురజాడ రాసిన వాక్యాలను అనాలోచితంగా తొలగించి, నరసయ్య కీర్తిమూర్తికి గ్రహణం పట్టించాడు. గురజాడ ఇంగ్లీషు లేఖ మాతృక ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్, హైదరాబాదు ఆఫీసులో భద్రపరచబడి ఉంది. గురజాడ రాసిన వాక్యాలు ఇట్లా ఉన్నాయి.

*"There was a scholar by name D.V. Narasaiah who used to edit a bright English weekly "The People's Friend" now defunct. He was a native of Nellore. Is he living - If so give me his address. He had a wonderful command on English. Please see him".*[17]

విశాలాంధ్ర ప్రచురణ సంస్థ "ఆంధ్రప్రదేశ్ దర్శిని" పేరుతో ఒక రెఫరెన్సు గ్రంథాన్ని ప్రచురించింది.[18] రఘుపతి వెంకటరత్నం సంపాదకత్వంలో పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక వెలువడినట్లు ఈ గ్రంథంలో పేర్కొనబడింది. ఆ సంస్థ దృష్టిలో ఇది చిన్న పొరపాటు కావచ్చేమో కానీ, నరసయ్య విషయంలో పెద్ద అన్యాయమనే చెప్పాలి.

బంగోరె (బండి గోపాలరెడ్డి), ఒంగోలు వెంకటరంగయ్య వ్యాసం స్ఫూర్తితో, నెల్లూరు మండల పత్రికల చరిత్ర పరిశోధించి ఒక వ్యాసం రాశాడు.[19] ఈ రోజుల్లోనే నెల్లూరు వారపత్రిక "యూత్ కాంగ్రెస్" లో "నెల్లూరు మొదటి జర్నలిస్టు దంపూరు నరసయ్య" శీర్షికతో ఇంకో వ్యాసం వెలువడింది.[20] నరసయ్య నెల్లూరు జర్నలిజానికి ఆద్యుడని గ్రహించి ఆయన జీవితవిశేషాలు సేకరించడానికి బంగోరె కృషి చేశాడు. వెంకటగిరి వెళ్ళి నరసయ్య పుస్తకాలు పరిశీలించి వచ్చాడు. నరసయ్య మనుమలను కలుసుకొని, ఉత్తరాలు, దినచర్యలు, ఇతర రికార్డు సేకరించాడు. ఈ ఆధారాలతో జమీన్‌రైతులో మూడువ్యాసాలు రాశాడు.[21]

బంగోరె శ్రీకారంచుట్టిన ఈ పరిశోధన పెన్నేపల్లి గోపాలకృష్ణ కొనసాగించాడు. నరసయ్య వారసుల వద్ద మిగిలిన రికార్డు సేకరించాడు. వెంకటగిరిలో భాస్కర రాఘవన్

వద్ద ఉన్న నరసయ్య పుస్తకాలను చూడడానికి గోపాలకృష్ణ వెంట ఈ రచయిత కూడా వెళ్ళాడు. కరణకమ్మవీధిలో ఒక ఇంటి పంచలో ఉన్న పాత భోషాణంపెట్టెలో వందలకొద్ది పుస్తకాలు పేర్చి ఉన్నాయి. పుస్తకాలన్నీ 1900 ముందు ప్రచురించబడినవే. ప్రతి పుస్తకం మీద "పీపుల్స్ ఫ్రెండ్ లైబ్రరీ" అని రాసి ఉంది. పుస్తకాలన్నీ కేటలాగు చెయ్యబడ్డాయి. ప్రతి పుస్తకం మీద నరసయ్య చేవ్రాలు ఉంది. దాదాపు అన్నీ ఇంగ్లీషు పుస్తకాలే. సాహిత్యం, చరిత్ర, రాజకీయశాస్త్రం, మతం, జీవితచరిత్రలు, బైబిలు కాపీలు, నిఘంటువులు ఇట్లా ఎన్నో విషయాలమీద పుస్తకాలున్నాయి. గోపాలకృష్ణ తను సేకరించిన ఆధారాలతో జమీన్‌రైతులో రెండు వ్యాసాలు రాశాడు.[22] నరసయ్య దినచర్య సహాయంతో ఆయన జన్మదినాన్ని నిర్దుష్టంగా నిరూపించగలిగాడు. పీపుల్స్ ఫ్రెండ్ ఎంతకాలం వెలువడింది చెప్పగలిగాడు. ఇది పాతికేళ్ళనాటి సంగతి.

నేను 1972 నుంచి మిత్రులు పెన్నేపల్లి గోపాలకృష్ణను కలుసుకోడానికి తరచుగా జమీన్‌రైతు ఆఫీసుకు వెళ్ళేవాణ్ణి. ఆయన ప్రోత్సాహంతో ఆ పత్రికలో అప్పుడప్పుడు ఏదో ఒక వ్యాసం రాస్తూ ఉండేవాణ్ణి. ఆయన సేకరించిపెట్టిన, నరసయ్యకు సంబంధించిన కాగితాలు సంవత్సరాల తరబడి అక్కడే టేబులుమీద దుమ్ముపట్టి పడిఉన్నా, అవి ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలం నాలో ఎన్నడూ కలగలేదు. 1989 జనవరిలో తెలుగు విశ్వవిద్యాలయం ఆతిథ్యంలో శ్రీశైలంలో ఆంధ్రప్రదేశ్ చరిత్రసభలు జరిగాయి. ఆ సభల్లో నరసయ్య మీద ఒక పరిశోధన పత్రం చదవమని, గోపాలకృష్ణ తన వద్ద ఉన్న రికార్డంతా ఇచ్చి నన్ను ప్రోత్సహించాడు. అప్పటికే ఆ రికార్డులో కొంతభాగం పోయింది.

నరసయ్య మీద రాసిన వారెవరూ ఆయన నడిపిన పత్రికలు చూడలేదు. నా మిత్రుడు ఎం. మునిరత్నం ద్వారా మద్రాసు తమిళనాడు ఆర్కైవ్స్ (Tamil Nadu Archives) లో పీపుల్స్ ఫ్రెండ్ రెండు సంచికలు భద్రపరచబడి ఉన్నాయని తెలుసుకొని, అక్కడ వాటి కోసం అన్వేషించాను.[23] మునిరత్నం ఇచ్చిన భోగట్టా ప్రకారం ఆ జి.ఓ నంబర్లు కలిగిన ఫైళ్ళు, ఆ జి.ఓలకు అనుబంధంగా జతచేయబడిన పీపుల్స్ ఫ్రెండ్ సంచికలు కన్పించలేదు. అవి ఏమయ్యాయో, ఎక్కడ మిస్‌ప్లేస్ అయ్యాయో ఎవరూ సంతృప్తికరంగా సమాధానం ఇవ్వలేకపోయారు. నా ఉత్సాహం అంతా చల్లబడిపోయింది. అయినా ఓపికగా, పట్టుదలతో ఆర్కైవ్స్‌లో నా అన్వేషణ కొనసాగించాను. చివరకు పబ్లిక్ జి.ఓ నంబరు 2402 ఫైల్లో పీపుల్స్ ఫ్రెండ్ సంచిక ఒకటి కనిపించింది. పుటలు విప్పి చదవడానికి ప్రయత్నిస్తే, పేజీలు పెళపెళమని విరిగి ముక్కలు కావడంతో నా ప్రయత్నం విరమించుకొన్నాను. నూట అయిదు సంవత్సరాలనాటి పత్రికను నాలుగు రోజుల వ్యవధిలో, ఆర్కైవ్స్ ఉద్యోగులు చదవడానికి అనువుగా 'మెండ్' చేసి ఇచ్చారు. ఆర్కైవ్స్‌లో నా పరిశోధనలో పీపుల్స్ ఫ్రెండ్ సంపాదకుడు, పత్రికాధిపతిగా నరసయ్య ప్రభుత్వానికి రాసిన కొన్ని ఉత్తరాలు, 'నేటివ్ అడ్వొకేట్' పత్రిక ప్రారంభించినపుడు సంపాదకులు ప్రభుత్వానికి పంపుకొన్న

ఉత్తరం కనుగొన్నాను. అక్కడే నరసయ్య నడిపిన ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో ప్రచురించబడ్డ వార్తలకు, వ్యాసాలకు ఇంగ్లీషు అనువాదాలను నేటివ్ న్యూస్‌పేపరు రిపోర్ట్సు నుంచి వెదికి పట్టుకోగలిగాను. ఈ సమాచారాన్ని విశ్లేషించి, నరసయ్య మీద శ్రీశైలం చరిత్ర సభలలో ఒక పరిశోధనాపత్రం సమర్పించాను. అప్పుడు నాకు నరసయ్య మీద చిన్న పుస్తకం రాయడానికి అవసరమైన సమాచారం ఉందని తట్టింది. ఇందుకోసం నరసయ్య తాలూకు బంధువుల ఆచూకి తెలుసుకోడానికి ప్రయత్నించాను. మద్రాసు, వెంకటగిరి, నెల్లూరు, కోడూరు మొదలైన ఊళ్ళు తిరిగి, నరసయ్య తర్వాత తరాలవారిని, బంధువులను, పరిచయస్థులను కలిసి మౌఖికచరిత్ర సేకరించాను. 1989-90 సంవత్సరంలో ఎంతమందినో కలుసుకొని విచారించాను. నరసయ్య ముగ్గురు మనుమలలో పెద్దవాడు ఆదిశేషయ్య ఉద్యోగవిరమణ చేసిన తర్వాత చనిపోయాడు. ఆయన భార్య కమలమ్మ తనకు తెలిసిన సంగతులు స్పష్టంగా చెప్పింది. నరసయ్య రెండవ మనుమడు కృష్ణమూర్తి, మూడవ మనుమడు రామచంద్రయ్య, కృష్ణమూర్తి కుమార్తె భారతి చాలా విషయాలు చెప్పారు. నరసయ్య అన్న (పార్థసారథిశాస్త్రి) మనుమరాలు మద్రాసులో ఉందని తెలుసుకొని ఆమెను విచారించాను.

బంగోరె చనిపోయిన తర్వాత, ఆయన సేకరించిన పుస్తకాలు, రాసిపెట్టుకొన్న నోట్సులు ఆయన శ్రీమతి సుమిత్ర కొంతమంది సాహితీపరులకు ఇచ్చింది. బంగోరె నరసయ్య మీద రాసిపెట్టుకున్న నోట్సు లభిస్తుందేమో అని ప్రయత్నించాను. చివరకు బంగోరె దూరపుచుట్టం వేమూరు రవీంద్రరెడ్డి పరిచయం అయింది. ఆయనకు చరిత్ర అంటే శ్రద్ధ, అభిమానం ఉంది. సుమిత్ర వద్ద మిగిలిన పుస్తకాలు, నోట్సులు సేకరించి జాగ్రత్త చేశాడు. నరసయ్య రచించిన లెటర్స్ ఆన్ హిందూ మేరేజస్ పుస్తకం, 1906 దినచర్య, పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక ఫోటోలు, కొన్ని ఉత్తరాలు, నరసయ్య మెయిల్ పత్రికకు రాసిన లేఖ ఇచ్చాడు. రవీంద్రరెడ్డి బంగోరె ఉత్తర ప్రత్యుత్తరాలను కూడా సేకరించి పెట్టాడు. బంగోరె నార్లకు రాసిన ఉత్తరాల్లో నరసయ్య ప్రస్తావన ఉన్న ఉత్తరాలను ఇచ్చి సహకరించాడు.

బంగోరె నార్లకు రాసిన ఉత్తరంలో "*ఈ రోజు అనుకోకుండా మద్రాసు ఆర్కైవ్స్‌లో ప్రవేశానికి పర్మిషన్ లభించింది. ఎన్నాళ్ళ నుంచో నేను తపిస్తూ వచ్చిన మా నెల్లూరు జర్నలిజం జనకుడు దంపూరు నరసయ్య edit చేసిన People's Friend పత్రిక సంచికలు రెండింటిని కళ్ళారా చూసే భాగ్యం లభించింది. వాటిలో కొన్ని ముఖ్య Editorial items చదివిన మీదట దంపూరు నరసయ్య నిస్సందేహంగా గొప్ప జర్నలిస్టు అనే అభిప్రాయం సాక్ష్యాధారాలతో సహా నేడు మరింత ధృవపడిందే తప్ప అది తగ్గలేదు..*" అని అభిప్రాయం వ్యక్తం చేశాడు.[24] రెండు నెలల తర్వాత మళ్ళీ నార్లకు ఉత్తరం రాస్తూ "*దంపూరు నరసయ్య (నెల్లూరు జర్నలిజం జనకుడు)* – ఆయన *edit* చేసిన *'People's*

*Friend'* రెండు సంచికలను ముందరి పుటలను ఫోటో తీయించాను. ఆయన *edit* చేసిన నాలుగు పత్రికల్లో కనీసం ఒకటైనా *original* రూపంలో చూడగలిగినందుకు నేను ఎంత పరవశం చెందానో. దాదాపు తొమ్మిదేళ్ళ తపస్సు ఫలించింది. ఆయనను గురించి ఒక చిన్న గ్రంథం రాయడానికి ఆత్మవిశ్వాసం కలుగుతున్నది" అని తన ఆనందాన్ని పంచుకొన్నాడు.[25] ఆయన సంకల్పం ఏ కారణం వల్లనో నెరవేరలేదు. ఆ రెండు సంచికలు చదివి ఆయన రాసుకొన్న నోట్సు కూడా నాకు లభించలేదు.

1990 వేసవిలో ముగ్గురు మిత్రులం - మధ్వపతి జయరామారావు, మాచవోలు శివరామప్రసాద్, నేను కలిసి నరసయ్య దినచర్యలు చదవడానికి ప్రయత్నించాము. 1898, 1906 దినచర్యలు దాదాపు సమగ్రంగా చదవగలిగాము. 1905 దినచర్య చదవడం మాకు సాధ్యం కాలేదు.

నరసయ్య మీద పుస్తకం రాయడానికి ప్రయత్నం చేస్తున్న రోజుల్లో నేను సేకరించుకొన్న నోట్సులు, కాగితాలు మొత్తం ఫైలు కన్పించకుండా పోయింది. ఆ తర్వాత, పదేళ్ళకు యాదృచ్ఛికంగా ఆ ఫైలు బయటపడింది. నేను రాసుకొన్న నోట్సులు, కాగితాలు చివికి చినిగిపోయాయి. కొన్ని పుటలు కన్పించలేదు. పోయినవిపోగా మిగిలిన నోట్సులు, కాగితాలు దగ్గర పెట్టుకొని నా ప్రయత్నం మళ్ళీ కొనసాగించాను. 1905 దినచర్య 'scan' చేసి, కంప్యూటరు స్క్రీన్ మీద చదవడం సాధ్యమయింది. ఈ సమాచారంతో పుస్తకం తయారుచేశాను. పుస్తకాన్ని ముద్రణకు సన్నద్ధం చేస్తున్న తరుణంలో, పద్దెనిమిదేళ్ళ తర్వాత, మళ్ళీ ఒకసారి చెన్నై తమిళనాడు ఆర్కైవ్స్‌లో నరసయ్యకు సంబంధించి కన్పించకుండా పోయిన ఫైళ్ళ కోసం 'దింపుడుకళ్ళం' ఆశగా అన్వేషించాను. అదృష్టవశాత్తు జి.ఓ నంబరు 455 ఫైలు బయట పడింది. ఇందులో 1888 ఫిబ్రవరి 25 పీపుల్స్ ఫ్రెండ్ సంచిక, ఇతర పత్రాలు ఉన్నాయి. ఈ సమాచారం కూడా పుస్తకంలో చేర్చాను.

నరసయ్య బతికినదినాల్లో, పోయినతర్వాత 'చంపబడుతూనే' ఉన్నాడని అనిపించింది. మన చారిత్రక స్పృహకు, దేశశ్రేయస్సు కోసం పాటుపడిన మహనీయుల ఎడల మనం ప్రదర్శించే ఉపేక్షకు నరసయ్య ఉదంతం సాక్ష్యంగా నిలుస్తుంది. ఈ సందర్భంలో నరసయ్య దినచర్యలో రాసుకొన్న మాటలను ఉదాహరించడం అనౌచిత్యం కాదనుకొంటాను.

"Lord ! when will all this cease and will a quiet life (begin) free of anxiety and trouble from creditors, enemies and false friends".

(11th September 1905)

# 2

# చెన్నపట్నం అనుభవాలూ - ప్రభావాలు

## తుమ్మగుంట ద్రావిడ బ్రాహ్మణులు

నరసయ్య తుమ్మగుంట ద్రావిడ బ్రాహ్మణుడు. ఈ శాఖవారు వందలసంవత్సరాల కిందట తమిళదేశంలోని 'మళైనాడు' నుంచి నెల్లూరు మండలానికి వలసవచ్చారు.[1] నెల్లూరుకు తూర్పుగా, సముద్రతీరానికి సమీపంలో ఉన్న తుమ్మగుంట గ్రామంలో స్థిరపడడం వల్ల, వీరికి తుమ్మగుంట ద్రావిడులనే పేరు వచ్చింది. కొన్ని ద్రావిడ కుటుంబాలు తమిళదేశం నుంచి వచ్చి నెల్లూరుమండలంలో పుదూరుగ్రామంలో మొదట స్థిరపడ్డారు. వారికి పుదూరు ద్రావిడ బ్రాహ్మణులనే పేరు వచ్చింది. తుమ్మగుంట ద్రావిడులు తమిళాన్ని విడిచిపెట్టి, తెలుగు మాతృభాషగా స్వీకరించినా, తెలుగువారి సాంస్కృతిక జీవనాన్ని అంగీకరించి, తెలుగు వారిలో కలిసిపోయినా, మతాచార వ్యవహారాలలో మాత్రం తమిళదేశపు సంప్రదాయాలనే అనుసరిస్తూ వచ్చారు. ఇరవయ్యో శతాబ్ది నగబడేవరకూ, వీరిలో అధికసంఖ్యాకులు వ్యవసాయంచేసి, జీవనం కొనసాగించారు. స్వయంగా

పొలాలు దున్ని, శరీరకష్టంచేసి, పంటలు పండించారు. ఈ ద్రావిడ కుటుంబాలలో ఎంతోమంది మహావిద్వాంసులు జన్మించారు.

## దుబాసీలు

రెండు మూడు వందల సంవత్సరాల కిందటే, తుమ్మగుంట ద్రావిడులు నెల్లూరు మండలం నుంచి తమిళ, కన్నడ దేశాలకు వలసవెళ్ళారు. కొందరు చెన్నపట్నంలో, తమిళదేశంలోని ఇతర ప్రాంతాలలో స్థిరపడ్డారు. ఆ ప్రదేశాల్లో చిన్న చిన్న వ్యాపారాలు చేశారు. మద్రాసు పగడాలసెట్టి వీధిలో సూరంవారు, కృష్ణప్ప నాయకన్ వీధిలో గుర్రంవారు ప్రఖ్యాతి పొందారు, వీళ్ళకు ఓడ వర్తకంతో సంబంధం ఉండేది.[2] ఎక్కడఉన్నా నెల్లూరుతో సంబంధ బాంధవ్యాలు సాగిస్తూ, నెల్లూరు వారుగానే వ్యవహరించబడుతూ వచ్చారు.

ఇంగ్లీషువారికి, ఇతర యూరపు దేశస్థులకు స్థానిక వ్యాపారపద్ధతులు, కొలతలు, చట్టాలు తెలియకపోవడంవల్ల దుబాసీల అవసరం ఏర్పడింది. ఈస్టిండియా కంపెనీ, ఇతర వర్తకసంస్థలు దుబాసీలను నియమించుకొన్నాయి. తెలుగుదేశం నుంచి మద్రాసు తరలి వచ్చిన కోమట్లు, ఇతర కులాలవారిలో కొందరు దుబాసీలుగా మారారు. పాశ్చాత్య వాణిజ్యవర్గాలకు, భారతీయులకు మధ్య వారధిగా నిలిచారు. ఆనందరంగపిళ్ళై, పచ్చయ్యప్ప మొదలియారు దుబాసీ వృత్తిలో మహా సంపన్నులయ్యారు.

పద్దెనిమిదోశతాబ్ది ముగింపుకు వచ్చేసరికి, బ్రిటిష్‌వారు ఈదేశంలో తమ అధికారాన్ని స్థిరపరచుకొన్నారు. దుబాసీల మీద ఆధారపడే పరిస్థితి క్రమంగా తొలగిపోవడంవల్ల, ఈ వ్యవస్థ బలహీనపడింది. 1830 ప్రాంతాలకు దుబాసీలు చిల్లర ఉద్యోగులుగా మార్పు చెందారు. వీరు నాలుగురాళ్ళు వెనక వేసుకోడానికి ఇంగ్లీషు నేర్చుకొన్నారే తప్ప, ఆభాష ద్వారా నూతన భావజాలాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని గ్రహించే ప్రయత్నం చెయ్యలేదు. ఇంగ్లీషు వ్యవహార జ్ఞానం దుబాసీల కుటుంబాలలో వారసత్వంగా కొనసాగినట్లుంది.

## అవధానం పాపయ్య

అవధానం పాపయ్య నెల్లూరువాడు, తుమ్మగుంట ద్రావిడులలో ప్రసిద్ధుడు. కంపెనీ కొలువులో మామూలు గుమాస్తాగా జీవితం ఆరంభించాడు. మద్రాసు ఓడరేవులో 'సీ కస్టమ్స్ ఆఫీసరు' (Sea Customs Officer) వద్ద 'ఏంకరేజి అకౌంటెంట్' (Anchorage Accountant) ఉద్యోగం చేశాడు. రేవుకు వచ్చిపోయే ఓడలను నమోదు చేసుకోవడం ఆయన వృత్తి కావడం వల్ల 'లంగరు పాపయ్య' అని పేరు స్థిరపడింది. బంధువర్గంలో మాత్రం 'రఘుపతి' అనే పేరుతో పిలవబడేవాడు. పద్దెనిమిదవ శతాబ్ది ముగింపుకు

వచ్చే సమయానికి పాపయ్య మద్రాసులో పెద్ద ఆస్తిపాస్తులు సంపాదించి పురప్రముఖులలో ఒకరుగా ప్రసిద్ధి పొందాడు. 1789-90 మధ్యకాలంలో మద్రాసు గవర్నరులుగా పనిచేసిన హాలెండ్ సోదరుల వద్ద (John Holland 7th Feb. to 12th Feb. 1789 ; Edward John Holland 12th Feb.1789 to 19th Feb. 1790) దుబాసీగా ఉండి వారి అభిమానాన్ని సంపాదించాడు. వారి ఆంతరంగికుడుగా మసలుకొన్నాడు. ఆ సమయంలోనే హాలిబర్టన్ (Haliburton) అనే ప్రభుత్వఅధికారి ఆగ్రహానికి గురయి, రాజద్రోహనేరం మోపబడి జైలుశిక్ష అనుభవించి 1809లో మరణించాడు. మద్రాసులో చూళైప్రాంతంలో శిక్ష అనుభవించడంవల్ల అక్కడ ఒక వీధి అవధానం పాపయ్యవీధి అని వాడుకపడింది.[3] పాపయ్య ప్రభ వెలిగిపోతున్న సమయంలో వెంకటగిరి సంస్థానంవారు సూళ్ళూరుపేట (నెల్లూరుజిల్లా) సమీపంలో ఉన్న సామంతమల్లాం గ్రామాన్ని ఆయనకు బహూకరించారు. ఆయన గొప్ప పండితుడు. అనేక భాషలు అనర్గళంగా మాట్లాడేవాడు. స్కాంద పురాణంలో కొంతభాగాన్ని - శంకరసంహితను తెలుగులో పద్యగ్రంథంగా అనువదించాడు.[4] సర్ వాల్టర్‌స్కాట్ సర్జన్స్ డాటర్ (Sir Walter Scott's Surgeon's Daughter) నవలలో పాపయ్యను ఒక అప్రధాన దుష్టపాత్రగా చిత్రించాడు. ఈ పాపయ్య మనుమరాలు (కూతురు బిడ్డ) అన్నపూర్ణమ్మ నరసయ్య తల్లి. నరసయ్య తండ్రి ఆదినారాయణయ్య మద్రాసులో పుట్టి, అక్కడే స్థిరపడ్డాడు. ఆయన వృత్తేమిటో తెలియదు. ఇంగ్లీషు చదువులు చదివినట్లుంది. ఆయనకు ప్రెస్ వ్యాపారంతో సంబంధం ఉన్నట్లు అనిపిస్తుంది.

## మద్రాసులో దంపూరు కుటుంబాలు

క్రైస్తవ మతప్రచారకుల కృషివల్ల దేశభాషలలో పుస్తకప్రచురణ సాధ్యపడింది. వారు మద్రాసు, విశాఖపట్నం, బళ్ళారి మొదలైన ప్రదేశాలలో అచ్చుకూటాలు ప్రారంభించి పుస్తక ప్రచురణ మొదలుపెట్టారు. బైబిలును, ఇతర మత సంబంధమైన పుస్తకాలను, వ్యాకరణ, నిఘంటు గ్రంథాలను ప్రచురించారు. 1820లో మద్రాసు స్కూల్ బుక్ సొసైటీ ఏర్పడింది. మద్రాసులో పుస్తకప్రచురణ వ్యాపారంగా మార్పు చెందుతున్న దశలో 'కోమట్లు', ఇతర కులాల తెలుగువారు ఈ వ్యాపారంలో ప్రవేశించారు. పాఠ్యపుస్తకాలు రాయడం, పరిష్కరించడం, ప్రూఫులు సరిచూడడం, మొదలైన పనులకు పండితులు అవసరం అయ్యారు. నెల్లూరుమండలం నుంచి మద్రాసుకు వలసవచ్చిన పుదూరు, తుమ్మగుంట ద్రావిడ పండితులు ఈ కొత్త అవకాశాన్ని అందిపుచ్చుకొన్నారు.

## దంపూరువారు

దంపూరువారిది పండితకుటుంబం. దంపూరు నెల్లూరుకు తూర్పున, తుమ్మగుంటకు, వావిళ్ళకు సమీపంలో ఉన్న గ్రామం. ఊరి పేరే ఇంటి పేరయింది. పందొమ్మిదోశతాబ్ది

మొదలయ్యే వేళకు కొన్ని దంపూరు కుటుంబాలు మద్రాసులో స్థిరపడ్డాయి. కొంతమంది దంపూరువారు అచ్చాఫీసు పనులలో స్థిరపడ్డారు. దంపూరు వేంకటసుబ్బాశాస్త్రి పర్యవేక్షణ, సంపాదకత్వంలో తెలుగు, సంస్కృత గ్రంథాలు అచ్చయ్యాయి. ఈయన గొప్ప పండితుడని ప్రసిద్ధి.[5] నరసయ్య తండ్రి ఆదినారాయణయ్య ఈయన సమకాలికుడు. ఇద్దరూ రక్తసంబంధీకులయి ఉంటారు. ఆదినారాయణయ్య తన ముగ్గురు కుమారులకు ఇంగ్లీషు చదువు చెప్పించాడు. మహాపండితులని పేరుపడ్డ గుర్రం అప్పన్నశాస్త్రి, వెంకన్నశాస్త్రి సోదరులు ఈయనకు దగ్గర బంధువులు. పందొమ్మిదో శతాబ్ది ఉత్తరార్ధంలో ఇంగ్లీషుచదువులు చదువుకొని, పరీక్షలు పాసై, ప్రభుత్వోద్యోగాలు చేసిన దంపూరువారు మరికొంతమంది ఉన్నారు.[6] ఈ శతాబ్దంలో ఇంగ్లీషుచదువులు చదివినవారిలో ఎక్కువమంది బ్రాహ్మణులే అయినా, తెలుగుదేశంలో నియోగులు, దేశస్థులు, మాధ్వులు ముందుగా ఇంగ్లీషుచదువు 'విలువ' ను గ్రహించారు.

నరసయ్యకు ఇద్దరు అక్కలు. ఒకరు మీనాక్షమ్మ, నరసయ్యకన్న ఆరేళ్ళు పెద్దది. చదువుకొన్న స్త్రీ. పదిహేనేళ్ళకే భర్త చనిపోయాడు. రెండోఆమె వివరాలు తెలియవు. నరసయ్య పెద్దన్న 'పార్థసారథయ్య' లేక పార్థసారథిశాస్త్రి మద్రాసు అకౌంటెంట్ జనరలు ఆఫీసులో క్లర్కుగా పనిచేసినట్లు ఫోర్టు సెంటుజార్జి గెజిటు ప్రకటనవల్ల తెలుస్తూంది. రెండవ అన్న కృష్ణయ్య పచ్చయ్యప్ప ఉన్నత పాఠశాలలో 'టీచరు'. ఇద్దరూ 1869-70 సంవత్సరానికి మద్రాసులో 'క్రౌను ఆఫీసు'కు స్పెషల్ జూరర్లుగా నియమించబడ్డారు. ఈ 'గౌరవ' పదవికి ఇంగ్లీషు భాషాజ్ఞానం, మూడువేలరూపాయల ఆస్తి ఉండడం అర్హత. పార్థసారథిశాస్త్రి ట్రిప్లికేన్‌లో, కృష్ణయ్య బ్లాక్ టౌన్‌లో నివాసం ఉంటూ, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు[7]. అవధానం పాపయ్య తరంనుంచి నరసయ్య వరకు అందరికీ ఇంగ్లీషు వారసత్వంగా సంక్రమించింది.

## నరసయ్య జననం, విద్యాభ్యాసం

నరసయ్య మద్రాసులో పుట్టి పెరిగినట్లు ఒంగోలు వెంకటరంగయ్య రాశాడు. 1849 సెప్టెంబరు 25న జన్మించినట్లు పెన్నేపల్లి గోపాలకృష్ణ నిరూపించాడు. నరసయ్య 1896 దినచర్యలో సెప్టెంబరు 25వ తారీకున తన 48వ పుట్టినదినమని, తెలుగు తిథుల ప్రకారం మహర్నవమినాడు తన పుట్టినదినం వస్తుందని రాసుకున్నట్లు ఆధారం చూపాడు[8]. ఆ దినచర్య ఇప్పుడు లభించడం లేదు. 1906 సెప్టెంబరు 25వ తారీకు, మంగళవారం దినచర్యలో నరసయ్య ఈ విధంగా రాశాడు.

"Thankful-This day is my birthday according to English Calender.

NB : This is my 58th Birthday. ie. I Completed 57 Years.

My Birthday was Tuesday 25th September 1849."

మరుసటి రోజు 26వ తారీకు బుధవారం మహార్నవమినాడు ఇట్లా రాశాడు. "According to native calender this is my 58th birthday."

వీరేశలింగంకన్న నరసయ్య ఏడాది చిన్న. మద్రాసు పచ్చయ్యప్ప సెంట్రల్ స్కూల్లో ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో చదువు కొనసాగించాడు. పనప్పాకం అనంతాచార్యులు నరసయ్య సహాధ్యాయి. అనంతాచార్యులు నరసయ్యకన్న ఆరేళ్ళు పెద్ద. ఇద్దరూ 1864లో జరిగిన మెట్రిక్యులేషన్ పరీక్ష రెండవ తరగతిలో పాసయ్యారు.[9] నరసయ్య పచ్చయ్యప్ప ఉన్నత పాఠశాలలో "అసిస్టెంట్ టీచరు" ఉద్యోగంలో ఎప్పుడు చేరాడో తెలియదు. 1867 మార్చి నాటికి ఆ ఉద్యోగం చేస్తున్నాడు. అప్పటికి మైనారిటీ కూడా తీరలేదు. ఆయన సహాధ్యాయి అనంతాచార్యులు 1867లో ఎఫ్.ఏ పాసయి, ఆ పాఠశాలలోనే అధ్యాపకవృత్తిలో కొంతకాలం ఉన్నాడు.[10]

నరసయ్య బి.ఏ. పాసయినట్లు ఒకరు అన్నారు. ఆయన బి.ఏ. అని ఎక్కడా చెప్పుకోలేదు. 1872వ సంవత్సరం ఆరంభంలో ఆయన డెప్యూటీ స్కూల్ ఇన్‌స్పెక్టరు ఉద్యోగానికి ఎంపిక అయ్యాడు. *"... Graduates and under Graduates who have had experience as teachers and have good knowledge of Telugu"* అని ఆ ఉద్యోగానికి అర్హతలు నిర్దేశించారు.[11] ఆ ఉద్యోగానికి అర్హత ఉత్త మెట్రిక్యులేషన్ కాదని అనిపిస్తుంది. నరసయ్య మెట్రిక్యులేషన్ పాసయిన మూడేళ్ళకు పచ్చయ్యప్ప ఉన్నత పాఠశాలలో అధ్యాపకుడుగా చేరాడు. ఈ వ్యవధిలో ఆయన ఎఫ్.ఎ. పాసయి ఉంటాడనిపిస్తుంది. 1876లో పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ డైరెక్టరు కల్నల్ ఆర్.ఎం.మెక్‌డొనాల్ట్ (Col. Mac Donald) రాజమండ్రి ప్రభుత్వ కళాశాల స్థాయి పెంచవలసిన అవసరాన్ని పై అధికారుల దృష్టికి తీసుకొనివస్తూ, తనవాదనకు బలమిచ్చే రెండు అంశాలను పేర్కొన్నాడు. మొదటిది విద్యకు ఉపాధికి మధ్య ఉన్న సంబంధం. తెలుగుభాష వ్యవహారంలో ఉన్న ప్రదేశాలలో ఎక్కడా కళాశాల లేదని, అందువల్ల ప్రభుత్వోద్యోగాలలో నియమించడానికి, అర్హులైన అభ్యర్థులు లభించడం కష్టంగా ఉందంటాడు. "డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్సు హోదాలో గానీ, ఒక ముఖ్యమైన స్కూల్లో ఉపాధ్యాయుడుగా గానీ తెలుగువాడు లేడు" అని ఇంకోవాస్తవాన్ని పేర్కొన్నాడు.[12] ఇందువల్ల డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉద్యోగానికి కళాశాల చదువు అవసరమని స్పష్టమవుతూంది. గెజిటు ప్రకటనలో *"Graduates and under Graduates"* అని ఉండడంవల్ల నరసయ్య ఎఫ్.ఏ. పాసయినట్లు భావిస్తున్నాను. ఆ రోజుల్లో ఆంగ్లో వర్నాక్యులర్ స్కూళ్ళల్లో *(Anglo vernacular Schools)* ఉపాధ్యాయుడుగా నియమించబడడానికి మెట్రిక్యులేషన్ పాసయి ఉండాలి. కాబట్టి నా ఊహ సరి అయినదే అని తోస్తూంది. ఆ రోజుల్లో

ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేయడానికి రకరకాల పరీక్షలు నిర్వహించేవారు. నరసయ్య హయ్యరు గ్రేడు ట్రాన్సులేటరు పరీక్ష పాసయి “హుజూరు ట్రాన్సులేటరు” ఉద్యోగానికి అవసరమైన అర్హతలు సంపాదించాడు.[13]

## మద్రాసులో సాంస్కృతిక పునరుజ్జీవనం

పందొమ్మిదో శతాబ్దం ఆరంభమయ్యేసరికి, మద్రాసు ప్రపంచనగరాలలో ఒకటిగా ప్రసిద్ధికెక్కింది. ప్రభుత్వ కార్యాలయాలు, సైనిక కార్యాలయాలు, ఆస్పత్రులు, మార్కెట్ ప్రదేశాలు ఏర్పడ్డాయి. మద్రాసు పెద్ద వాణిజ్యకేంద్రంగా ఎదిగింది. వ్యాపారవర్గాలు పెద్ద ఎత్తున మద్రాసుకు వలసవచ్చాయి. తెలుగుదేశం నుంచి ‘కోమట్లు’, ఇతర కులాలవారు తరలివచ్చారు.

1820 నాటికి మద్రాసులో ప్రతిసందులో ఒకవీధిబడి ఉండేది. సాధారణంగా తెలుగువారే ఈ బళ్ళు నిర్వహించేవారు. వీటిలో తెలుగు, తమిళం, లెక్కలు నేర్పేవారు. 1830 ప్రాంతంలో మద్రాసులో *హిందూ లిటరరీ సొసైటీ* ప్రారంభమైంది. ఈ సమాజంలో బ్రాహ్మణులు, ఇతర కులాలవారు సభ్యులు. చరిత్ర, సాహిత్యం, ఇతర సమకాలీన సమస్యలమీద ఉపన్యాసాలు, చర్చలు నిర్వహించేవారు. ఇదే సమయంలో వ్యాపారాలు, కులవృత్తులు కాపాడుకోడానికి కులసంఘాలు ఏర్పాటు అయ్యాయి. హిందువుల సాంఘికజీవనంలో అనేకమార్పులు వచ్చాయి. వాణిజ్య వ్యాపారాల్లో ధనం గడించి కొత్తగా సంపన్నులైనవారు ధర్మకార్యాలు చెయ్యడం మొదలుపెట్టారు. సత్రాలు పెట్టించారు, గుళ్ళు కట్టించారు, సంస్కృత పాఠశాలల నిర్వహణకు డబ్బు కర్చు చేశారు. పచ్చయ్యప్ప మొదలియారు ధర్మనిధి స్థాపన ఇందుకు ఒక ఉదాహరణ.

మొదట తటస్థంగా ఉన్న బ్రిటిష్ పాలకులు హిందూమత విశ్వాసాలలో జోక్యం చేసుకొన్నారు. క్రైస్తవ మిషనరీలను ప్రోత్సహించారు. మిషనరీలు మద్రాసు ప్రెసిడెన్సీలో అనేక ప్రదేశాల్లో చర్చిలు, పాఠశాలలు, అచ్చాఫీసులు పెట్టి మతప్రచారం చేశారు. విద్య వారి ప్రధాన కార్యరంగం అయింది. బ్రిటిష్‌వారి అధికారం స్థిరపడుతున్న కాలంలోనే, మిషనరీల కార్యక్రమాలు ఉద్ధృతమయ్యాయి. వారు హిందువులను సంస్కరించడానికి మతాంతరీకరణ మార్గమని విశ్వసించారు. మతమార్పిడులు ఎక్కువ కావడంతో హిందువులకు, క్రైస్తవులకు నడుమ పెద్ద అఘాతం ఏర్పడింది.

1841లో మిషనరీలు మద్రాసులో కొంతమంది విద్యార్థులను క్రైస్తవమతంలోకి మార్చారు. ఈ సంఘటనతో హిందువుల అసమ్మతి తీవ్రరూపం ధరించింది. తమ బిడ్డలకు క్రైస్తవమతం ఇప్పిస్తారనే భయంతో, హిందువులు సొంత పాఠశాలలు

స్థాపించుకోడానికి కృషిచేశారు. ఈ నేపథ్యంలోనే 1842లో మద్రాసు నగరంలో పచ్చయ్యప్ప పాఠశాల ప్రారంభం అయింది. హిందువులకు మిషనరీల ప్రచారాన్ని ఎదుర్కోడానికి పత్రిక అవసరం అయింది. సి. నారాయణస్వామినాయుడు అచ్చాఫీసు నెలకొల్పి, నేటివ్ ఇంటర్‌ప్రిటర్ *(Native Interpretor)* పత్రికను ప్రారంభించాడు. గాజుల లక్ష్మీనరసుసెట్టి తండ్రి నెలకొల్పిన సిద్దులు అండ్‌కో లో ఈయన భాగస్వామి. హిందూసమాజానికి పనికివచ్చే విజ్ఞానదాయకమైన విషయాలు ప్రచురించడం, హిందువుల మనోభావాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొనిరావడం పత్రిక లక్ష్యాలుగా నిర్దేశించుకొన్నాడు. మిషనరీల ప్రచారాన్ని ఈ పత్రిక ద్వారా సమర్థవంతంగా తిప్పికొట్టి, తీవ్రంగా రాస్తూ వచ్చాడు.

1840-68 మధ్యకాలంలో మద్రాసు పౌరజీవితంలో గాజుల లక్ష్మీనరసుసెట్టి ప్రముఖ పాత్ర వహించాడు. ప్రభుత్వం ప్రదర్శిస్తున్న మత పక్షపాతాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. హిందువుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని రావడంలో గొప్ప కృషి చేశాడు. నారాయణస్వామినాయుడునుంచి నేటివ్ ఇంటర్‌ప్రిటర్ పత్రికను కొని క్రెసెంట్ *(Crescent)* పేరుతో దాన్ని కొనసాగించాడు. ఈ పత్రికకు ఎడ్వర్డ్ హార్లీ *(Edward Harley)* ని సంపాదకుడుగా నియమించాడు. హార్లీ మద్రాసు వెపేరీలో ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. విదేశీయుడైనా భారతీయులంటే అభిమానం ఉండేది. మిషనరీల కార్యక్రమాల వల్ల హిందూసమాజానికి ప్రమాదం పొంచిఉందని క్రెసెంట్ రాస్తూ వచ్చింది.

లక్ష్మీనరసుసెట్టి పదిసంవత్సరాలు మిషనరీల మతాంతరీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపాడు. ఆధునిక పద్ధతులలో, అనేక రూపాలలో ప్రజల నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన సాగించాడు. ఈయన ఆధ్వర్యంలో కలకత్తాలో స్థాపించబడిన బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఒక సంస్థ నెలకొల్పబడింది. కొంతకాలానికి ఇది మద్రాసు నేటివ్ అసోసియేషన్ *(Madras Native Association)* పేరుతో స్వతంత్ర సంస్థగా రూపొందింది. లక్ష్మీనరసుసెట్టి, ఈయన మిత్రుడు కోమలేశ్వరపురం శ్రీనివాసపిళ్ళై ఈ సంస్థ తరపున బ్రిటిష్ పార్లమెంటుకు ఒక మహజరు తయారు చేశారు.

మద్రాసు తెలుగువారిలో కోమలేశ్వరపురం శ్రీనివాసపిళ్ళై ప్రముఖుడు. ఇంగ్లీషు చదువుకోకపోయినా, విచక్షణాజ్ఞానం, ఉదారస్వభావం ఉన్నవాడు. సంపన్నకుటుంబంలో జన్మించాడు. తన కాలాన్ని, సంపదను ప్రజల హితంకోసం వినియోగించాడు. భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి పాశ్చాత్య విద్య దోహదపడుతుందని గ్రహించాడు. ఈయనకు స్త్రీవిద్యమీద అభిమానం ఉండేది. మద్రాసు ప్రముఖులు ఏనుగుల వీరాస్వామి, వెన్నెలగంటి

సుబ్బారావు, వెంబాకం రాఘవాచారి మొదలైన ఆయన మిత్రులు కూడా ఉదారస్వభావులు. పాశ్చాత్యుల పరిచయాలు, జార్జి నార్టన్ *(George Norton)* స్నేహం వీరి ఆలోచనలలో మార్పు తెచ్చింది. నార్టన్ మద్రాసు సుప్రీంకోర్టులో అడ్వొకేట్ జనరల్‌గా ఉండేవాడు. మార్పును అభిలషించే హిందువులతో సంబంధాలు పెట్టుకొన్నాడు. ఆయన ఇంట్లో జరిగే గోష్ఠులు, చర్చలు ఈ హిందూ మిత్రులమీద ప్రభావం చూపాయి. పాశ్చాత్య విద్య అభ్యసించడం వల్ల హిందువులు ఉన్నతోద్యోగాలు పొందగలరని, రాజకీయ ప్రయోజనాలు సాధించుకోగలరని నార్టన్ భావించాడు.[14] ఆయన ప్రోత్సాహంతో శ్రీనివాసపిళ్ళై, ఇతర మిత్రులు మద్రాసు హిందూ లిటరరి సొసైటీ *(Madras Hindu Literary Society)* ప్రారంభించారు. ఆ సొసైటీ సమావేశాలలో నార్టన్, మరికొందరు యూరోపియన్ మేధావులు - చరిత్ర, రాజకీయశాస్త్రం, సాహిత్యం మొదలైన అనేక విషయాల మీద ఉపన్యసించేవారు. ఈ ఉపన్యాసాలు విద్యావంతులైన యువకుల ఆలోచనల్లో మార్పును తీసుకొచ్చాయి. ప్రజలు ఆధునిక విద్య అవసరాన్ని గుర్తించారు. హిందూ లిటరరీ సొసైటీ పర్యవేక్షణలో మద్రాసులో ఒక ఇంగ్లీషు బోధించే స్కూలు ప్రారంభం అయింది. "గౌరవప్రదమైన" కులాల విద్యార్థులు ఈ స్కూలుకు వెళ్ళి చదువుకోవడం మొదలుపెట్టారు. నార్టన్, శ్రీనివాసపిళ్ళై మొదలైన వారి కృషివల్ల 1841లో మద్రాసు యూనివర్సిటీ హైస్కూలు ప్రారంభమయింది. ఈ స్కూలు ప్రెసిడెన్సీ కాలేజీగా అభివృద్ధి చెందింది.

సంస్కరణ విషయంలో లక్ష్మీనరసుసెట్టి, శ్రీనివాసపిళ్ళైల మధ్య అభిప్రాయభేదాలు తలఎత్తాయి. లక్ష్మీనరసుసెట్టి పాశ్చాత్యీకరణను వ్యతిరేకించాడు. మార్పు హిందూసమాజం అంతర్గతంగా రావాలని, వెలుపలినుంచి కాదని ఆయన అభిప్రాయపడ్డాడు. బాలికలకు చదువులేకపోవడం, వారికి ఆస్తిహక్కు లేకపోవడం, అతి బాల్యవివాహాలు, వితంతు వివాహాల నిషేధం, సముద్రయానం మీద నిషేధం మొదలైన దురాచారాలు, మూఢనమ్మకాలు రద్దుకావడానికి ప్రభుత్వజోక్యం తప్పనిసరి అని శ్రీనివాసపిళ్ళై భావించాడు. ఈ అభిప్రాయ భేదాలవల్ల శ్రీనివాసపిళ్ళై, లక్ష్మీనరసుసెట్టితో విడిపోయి, 1852లో హిందూ ప్రోగ్రెసివ్ ఇంప్రూవ్‌మెంట్ సొసైటి *(Hindu Progressive Improvement Society)*ని స్థాపించాడు. ఈ సొసైటీ తరపున స్త్రీ విద్యను ప్రోత్సహించాలని, వితంతువివాహాలను నిర్వహించాలని, అణగారిన బడుగువర్గాల అభివృద్ధికి కృషిచెయ్యాలని తలపెట్టాడు. ఈ కార్యక్రమంలో సదర్ కోర్టు *(Sadar Court)* లో ప్లీడరయిన ఎం.వెంకటరాయులునాయుడు ఆయనకు అండగా నిలబడ్డాడు. భారతీయ పునరుజ్జీవనం విషయంలో ఇద్దరి ఆలోచనలలో ఏకీభావం కుదిరింది. వెంకటరాయులునాయుడు పత్రికలలో సంస్కరణకు, వితంతువివాహాలకు అనుకూలంగా రాస్తూ వచ్చాడు. 1853లో 'రైసింగ్ సన్' (Rising Sun) పత్రిక స్థాపించి, హిందువుల

సాంఘికసమస్యల మీద చర్చ లేవదీశాడు. ఆనాటి ఇతర స్థానిక పత్రికలలో కూడా సంఘ సంస్కరణకు సంబంధించిన విషయాల మీద, వివాహాలలో మితవ్యయాన్ని గురించి, వితంతువివాహాలను గురించి, శుభకార్యాలలో కళావంతుల నృత్య, గాన కార్యక్రమాలను ఏర్పాటుచేయడం గురించి చర్చలు కొనసాగుతూ వచ్చాయి.

శ్రీనివాసపిళ్ళై మరణంతో మద్రాసు సంస్కరణవాదులకు పెద్ద నష్టం జరిగింది. వెంకటరాయులునాయుడు హిందూ ప్రోగ్రెసివ్ ఇంప్రూవ్‌మెంట్ సొసైటి నిర్వహణ బాధ్యతను తలకెత్తుకొని, శ్రీనివాసపిళ్ళై ఆలోచనలను, ఆకాంక్షలను ముందుకు తీసుకొని వెళ్ళాడు. దళితవర్గాల శిశువులకు పాఠశాలలు పెట్టడం, అర్హులైన విద్యార్థులకు ఉపకారవేతనం అందించడం, సంస్కరణను ముందుకు తీసుకొని వెళ్ళే 1856 విడో మేరేజి యాక్టు (Widow Marriage Act) వంటి చట్టాల అమలుకు కృషి మొదలైన కార్యక్రమాలు చేపట్టాడు. హిందూ రీడింగ్ రూం, (Hindu Reading Room) హిందూ డిబేటింగ్ సొసైటీ (Hindu Debating Society) లను స్థాపించి, వాటి కార్యక్రమాల ద్వారా మద్రాసులోని యువకులను, విద్యార్థులను ఆకర్షించాడు. ప్రభుత్వ ప్రచురణలన్నీ ఉచితంగా ఈ రీడింగ్ రూంకు అందేవి. మద్రాసు ప్రముఖులు ఈ సమాజ వేదికమీద ఉపన్యసించేవారు. యువకులలో ఉపన్యాసకళ, చర్చానైపుణ్యం అభివృద్ధి కావడానికి తరచుగా చర్చలు, గోష్ఠులు నిర్వహించబడేవి. ఈ కార్యక్రమాలవల్ల యువకుల్లో ప్రశ్నించేగుణం పెంపొందుతుందని వెంకటరాయులునాయుడు విశ్వసించాడు. మితవాద హిందూవర్గాలు ఈ కార్యక్రమాలను అంతగా ప్రోత్సహించలేదు. 1863లో వెంకటరాయులునాయుడు మరణంతో, ఆయన స్థాపించిన సంస్థలు, పత్రిక ఆయనతోనేపోయాయి.

మద్రాసు యూనివర్సిటీ హైస్కూలులో ఫీజులు ఎక్కువగా ఉండడంవల్ల, పై వర్గాల విద్యార్థులకు మాత్రమే అందులో చదివే అవకాశం కలిగింది. పావెల్ *(Eyre Burton Powell)* ఈ స్కూలు అధిపతి. ఆయన ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దాడు. టి.మాధవరావు, సి.వి. రంగనాథశాస్త్రి మొదలైన విద్యార్థులు యూరోపియన్ అధ్యాపకుల ఆలోచనలతో ప్రభావితులయ్యారు. జీవితంలో అభివృద్ధికి వచ్చి గొప్ప ప్రభుత్వోద్యోగాలు చేశారు. ఆధునిక విద్యావిధానం వారికి కొత్త చూపునిచ్చింది. నిర్జీవమైన సాంస్కృతిక విలువలు, నియంతలైన పాలకుల పరిపాలన హిందువుల వెనుకబాటుతనానికి కారణాలని మాధవరావు భావించాడు. సాంఘిక దురాచారాలను విడిచిపెట్టిననాడే జాతి పురోగమించగలదని ఆయన నమ్మాడు. పశ్చిమదేశాల విలువలను స్వీకరించి, పాశ్చాత్యుల శాస్త్రాలను, సాహిత్యాన్ని అధ్యయనం చెయ్యడంవల్ల భారతీయులు ఉన్నతస్థితికి చేరుకోగలరని గ్రహించాడు. పాశ్చాత్య విద్యను అభ్యసించిన ఆనాటి మేధావులు ఇటువంటి

భావాలు వ్యక్తంచేస్తూ వచ్చారు.

1858లో మద్రాసు, కలకత్తా, బొంబాయి విశ్వవిద్యాలయాలు ఆరంభమయ్యాయి. పాశ్చాత్య విద్యను ఇంగ్లీషుమాధ్యమంలో బోధించడం ప్రారంభమయింది. ఇంగ్లీషు విద్యావ్యాప్తి, పాశ్చాత్యుల సంసర్గం, *సంస్కరణభావాలకు* స్ఫూర్తినిచ్చాయి. ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్దడంలో పత్రికలు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించాయి. మద్రాసు వేదసమాజ ప్రభావంవల్ల బాలికావిద్య ప్రచారంలోకి వచ్చింది. పురుషులు ఉపాధ్యాయులుగా ఉండడంవల్ల తల్లిదండ్రులు బాలికలను బడులకు పంపడానికి ఇష్టపడని రోజుల్లో, 1866లో మేరీ కార్పెంటర్ (Mary Carpenter), మద్రాసు వచ్చి, స్త్రీ విద్యకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మలచడానికి కృషిచేసింది. పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ డైరెక్టరు పావెల్ చొరవతో స్త్రీలకోసం ప్రత్యేకంగా నార్మల్ స్కూలు (Female Normal School – ఉపాధ్యాయ శిక్షణ పాఠశాల) అవసరాన్ని ఆమె మద్రాసు హిందూ సమాజానికి నచ్చచెప్పింది. రంగనాథశాస్త్రి, రామయ్యంగారు ఆమె అభిప్రాయాలను సమర్థించారు. ప్రభుత్వం స్త్రీలకోసం ప్రత్యేకంగా నార్మల్ స్కూలు ప్రారంభించింది.

# 3

# లెటర్స్ ఆన్ హిందూ మేరేజస్

## బ్రహ్మసమాజ భావాలు

1864 ఫిబ్రవరి, మార్చి నెలల్లో కేశవచంద్రసేన్ మద్రాసులో ఉన్నాడు. బ్రహ్మసమాజ భావాలను ప్రచారం చెయ్యడానికి అక్కడ కొన్ని ఉపన్యాసాలు చేశాడు. ఆయన గొప్పవక్త. తన ఉపన్యాసాలతో శ్రోతలను మంత్రముగ్ధులను చేసేవాడు. స్త్రీ విద్యను ప్రోత్సహించమని, కులనిర్మూలన చెయ్యమని, సంస్కరణోద్యమాన్ని కొనసాగించడం కోసం సంఘాలు స్థాపించమని ఉద్బోధించాడు. ఆయన ఉపన్యాసాలు హిందూయువకులమీద, విద్యార్థులమీద తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. చైతన్యవంతులను చేశాయి.[1] *"హిందూమతానికి వేదకాలంనాటి ఔన్నత్యం తిరిగి కలిగించడం"* అనే బ్రహ్మసమాజ భావన విద్యావంతులను ఆలోచింపచేసింది. కేశవచంద్రసేన్ మద్రాసులో ఉపన్యసించిన మూడునెలల లోపలే, బెంగాల్ బ్రహ్మసమాజం నమూనాలో మద్రాసు వేదసమాజం ప్రారంభమైంది. సభ్యులు ఏకగ్రీవంగా సమాజ నిబంధనలు తయారుచేశారు. ఆస్తికత, ఏకేశ్వరోపాసన, విగ్రహారాధన మానడం, కులభేదాలను విస్మరించడం, మతద్వేషాన్ని విడిచిపెట్టడం, స్త్రీ విద్య, వితంతు వివాహాలను ప్రోత్సహించడం, దేశ భాషలలో పుస్తక ప్రచురణ మొదలైనవి ఈ సమాజ ఆశయాలు.

వీరికి వేదాలమీద విశ్వాసం ఉన్నందువల్ల వేదసమాజమని పేరు పెట్టారు. ఈ సమాజానికి వి. రాజగోపాలాచార్యులు, సి. సుబ్బరాయులుసెట్టి, అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. ఇద్దరూ న్యాయవాదులే. దీనికి తంజావూరు, సేలం, కోయంబత్తూరు, బెంగుళూరులో అనుబంధసంస్థలు ఏర్పడ్డాయి. వేదసమాజ సభ్యులు ఉపన్యాసాలకు, ప్రార్థన సమావేశాలకు తమ కార్యక్రమాలను పరిమితం చేసుకొన్నారు. సనాతన ఆచారాలమీద, ఉపనిషత్కాలం తర్వాత వాడుకలోకి వచ్చిన సంప్రదాయాలమీద విమర్శలు చేయడంవల్ల వేదసమాజం సంప్రదాయవాదులకు, సామాన్య ప్రజలకు దగ్గరకాలేక పోయింది. అధ్యక్ష కార్యదర్శులు మరణించిన తర్వాత, ఈ సమాజం కొంతకాలం నిద్రాణంగా ఉండిపోయింది. మద్రాసు ప్రెసిడెన్సీలో మత సాంఘిక సంస్కరణల మీద చర్చను, జిజ్ఞాసను రేకెత్తించడంలో మాత్రం వేదసమాజం సఫలమైంది.

## సి.వి. రంగనాథశాస్త్రి (1819-1881)

వేదసమాజం స్ఫూర్తితో కలమూరు వెంకట రంగనాథశాస్త్రి, ఆయన మిత్రులు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు. రంగనాథశాస్త్రి చిత్తూరుజిల్లాలో ఒక పండిత కుటుంబంలో జన్మించాడు. పావెల్ పర్యవేక్షణలో 1842లో అత్యున్నతశ్రేణిలో 'ప్రొఫిషియెంట్' *(proficient)* గా హైస్కూలు చదువు పూర్తిచేసి, మద్రాసు హైకోర్టులో ఉద్యోగ జీవితం ఆరంభించాడు. అనేక యూరోపియన్ భాషలు నేర్చుకొన్నాడు. 1859లో మద్రాసు స్మాల్‌కాజ్‌కోర్టులో జడ్జి పదవి చేపట్టాడు.

రంగనాథశాస్త్రి విద్యాభిమాని. పాశ్చాత్య విద్యావిధానం ఆయన ఆలోచనల మీద గాఢమైన ప్రభావం చూపింది. ప్రజలు విద్యావంతులైన నాడే దేశం అభివృద్ధి చెందుతుందని గట్టిగా నమ్మాడు. స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. తన కుమార్తెకు చదువు చెప్పించాడు. హిందూ మతగ్రంథాలను అనుశీలనంచేసి, ఆ మతం ఉత్కృష్టమైనదని గ్రహించాడు. ఆయనకు వర్ణభేదాలమీద విశ్వాసం తొలగిపోయింది.[2] వేదసమాజం కలిగించిన స్ఫూర్తితో హిందూసమాజాన్ని పట్టి పీడిస్తున్న సాంఘిక దురాచారాలను పరిశీలించాడు. ఈ విషయంలో శాస్త్రగ్రంథాలేమంటున్నది తెలుసుకోదానికి కృషి చేశాడు. ఈ అనుశీలనంతో బాల్యవివాహవ్యవస్థ దారుణమైనదని గ్రహించాడు.

బాల్యవివాహాలు నిరసిస్తూ దక్షిణ భారతదేశంలో రచించబడిన తొలిపుస్తకం ఏదో స్పష్టంగా తెలియడంలేదు. కేశవచంద్రసేన్ మద్రాసు వచ్చిన సంవత్సరమే వితంతువివాహాలను నిరసిస్తూ, తెలుగులో ఒక పుస్తకం వెలువడినట్లు తెలుస్తోంది. "హిందూవివాహ శాస్త్రసంగ్రహం" అనే అనువాద గ్రంథం మనుస్మృతిని ఉల్లేఖిస్తూ, రజస్వలానంతర వివాహాలను, వితంతువివాహాలను శాస్త్రాలు అనుమతించాయని, వాటి మీద నిషేధంలేదని తెలియజేసింది. కలియుగంలో "ఆయుస్సు తక్కువ గనుక ఆడపిల్లలకు *16* యేండ్ల లోపల పెండ్లి చేయకపోవడం వాంఛనీయం, యెట్టి

*పరిస్థితులలోను 12 ఏండ్లలోపల చేయకూడదు"* అని గ్రంథ రచయిత వాదించినట్లుంది.[3] సామినేని ముద్దునరసింహం 1862 ప్రాంతంలో 'హితవాది' పత్రికలో సాంఘిక విషయాల మీద అనేక వ్యాసాలు రాశాడు.[4] మద్రాసు వేదసమాజ పత్రిక 'తత్త్వబోధిని' లో సంస్కరణ, బాలికావిద్య, వితంతు పునర్వివాహాలు మొదలైన విషయాలమీద వ్యాసాలు ప్రచురించబడ్డాయి. సి.వి. రంగనాథశాస్త్రి తన మిత్రుడు చదలువాడ అనంతరామశాస్త్రిని రజస్వలానంతర వివాహాలు శాస్త్ర సమ్మతమైనవని నిరూపిస్తూ, ఒక పుస్తకం రాయమని ప్రోత్సహించాడు. ఆయన కోరిక ప్రకారం అనంతరామశాస్త్రి "వివాహ్యా కన్యా స్వరూప నిరూపణమ్" అనే పుస్తకాన్ని సంస్కృతభాషలో, శ్లోకరూపంలో రచించాడు.

## అనంతరామశాస్త్రి (1835-1872 ప్రాంతం)

అనంతరామశాస్త్రి నెల్లూరు పుదూరు ద్రావిడ బ్రాహ్మణుడు. ఆయన అన్న చదలువాడ సీతారామశాస్త్రి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగుపండితుడు. వీరిద్దరూ చిన్నాయనశాస్త్రి, పెదనాయనశాస్త్రి పేర్లతో ప్రసిద్ధులయ్యారు. అనంతరామశాస్త్రి *"సకల కళాకోవిద"* అల్లాడి రామబ్రహ్మశాస్త్రి వద్ద శాస్త్రాలు అభ్యసించాడు. పండితగోష్ఠులలో, చర్చలలో పాల్గొని కీర్తి గడించాడు. వెంకటగిరి ఆస్థానంలో జరిగిన పండితవాదంలో ఆస్థానపండితుడు తర్కభూషణం వేంకటాచార్యులను ఓడించి, సంస్థానాధిపతి సర్వజ్ఞ కుమారునికి అద్వైతం బోధించినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి. *"పరమహంస, చిదానందయోగి, గతాగతవేది, సాహిత్యచక్రవర్తి, సాంగోపాధ్యాయుడు"* అని హిందూ బాంధవి పత్రిక, ఆయన మరణించిన ఏభైసంవత్సరాల తర్వాత ప్రస్తుతించింది. అనంతరామశాస్త్రి చివరిదశలో సన్యాసం స్వీకరించాడని, శాస్త్రాచారాలను లెక్కపెట్టకుండా 'అస్పృశ్యుల' ఇళ్ళలో కూడా భోజనం చేసేవాడని అంటారు.[5] ఆయన 32 సంవత్సరాల వయస్సులో 1872 ప్రాంతంలో మరణించినట్లు ఒంగోలు వెంకటరంగయ్య అభిప్రాయపడ్డాడు.[6]

## వివాహ్యా కన్యా స్వరూప నిరూపణమ్

1928లో *"దేశీయ సంఘసంస్కరణ సభ"* వారి అభ్యర్థన ననుసరించి, ఒంగోలు వెంకటరంగయ్య ఈ పుస్తకాన్ని తెలుగులో సంగ్రహంగా అనువదించాడు. 1860 శిక్షాస్మృతి, సెక్షన్ 375 ప్రకారం పదేళ్ళ ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు జరపవచ్చు. ఇంత చిన్న వయసులో బాలికలకు పెళ్ళిచెయ్యడం న్యాయంకాదని కేశవచంద్రసేన్ అలజడి చేస్తూ వచ్చాడు. *"బహుశః కేశవచంద్రసేన్ ప్రచారము మద్రాసుకు గూడా వ్యాపించి ఈ చిన్నపుస్తకమునకు కారణమై యుండవచ్చును"* అని పుస్తకరచన నేపథ్యాన్ని వెంకటరంగయ్య వివరించాడు.[7] సుందరలింగం కూడా తన పరిశోధన గ్రంథంలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశాడు.[8] వివాహ్యా కన్యా స్వరూప నిరూపణమ్ 1866లో శ్రీరామాదర్పణ ముద్రాక్షరశాలలో అచ్చయినట్లు వెంకటరంగయ్య తెలియజేశాడు.

అయితే 1865 ఆగష్టు 3 నాటికే ఈ పుస్తకం అచ్చయి, ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది.[9] అనంతరామశాస్త్రి మనుస్మృతిని ప్రమాణంగా గ్రహించి రజస్వలానంతర వివాహాలను సమర్థించాడు. మనుస్మృతికి విరుద్ధంగా ఉన్న పరాశర, వైద్యనాథ స్మృతులను, ఇతర శాస్త్రగ్రంథాలను ప్రమాణంగా గ్రహించనవసరం లేదని తీర్మానించాడు. నాలుగు ఆశ్రమాలలో గృహస్థాశ్రమం ఉత్తమమైనది. ఇందులో స్త్రీలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అందువల్ల వివాహానికి యోగ్యమయిన స్త్రీ లక్షణాలు తెలుసుకోవాలి. స్త్రీరూపంలో ఇప్పుడు జరుగుతున్న బాల్యవివాహాలకు, మనుస్మృతి ఇతర శాస్త్రాల ఆమోదం లేదు. కనుక బాలికలు ఈడేరిన తరువాతనే వివాహం చెయ్యాలని తీర్మానించాడు. శాస్త్రగ్రంథాల ప్రమాణం సంగతి అట్లా ఉంచితే, లౌకికదృష్టితో చూచినా, బాల్యవివాహాలు అన్యాయమైనవని ఆయన భావించాడు. *"చంటి పాపల వయసులో జరుగుతున్న వివాహాలు ఈ లోకం నుంచి తొలగిపోవాల"* నే ఆకాంక్ష వ్యక్తం చేశాడు. అనంతరామశాస్త్రి తన పుస్తకాన్ని కంచికామకోటి పీఠాధిపతి *"శ్రీమన్మహాదేవేంద్ర శ్రీసరస్వతీపాదు"* లకు అభిప్రాయాన్ని అర్థిస్తూ పంపుకొన్నట్లు పీఠికలో వివరించాడు.[10]

## గుర్రం వెంకన్నశాస్త్రి (1825-1880 ప్రాంతం)

పీఠాధిపతి, అనంతరామశాస్త్రి పుస్తకాన్ని తిరస్కరించి, బాల్యవివాహాలను సమర్థిస్తూ ఖండనగ్రంథాలు రాయమని పండితులను ప్రోత్సహించినట్లుంది. *"విరించి నగర వాస్తవ్యులు, అనారత ధర్మశాస్త్ర పాఠకులు, సముత్తేజిత ప్రజ్ఞులు"* శ్రీరామశాస్త్రి అనంతరామశాస్త్రి అభిప్రాయాలను తిరస్కరిస్తూ ఒక పుస్తకంరాసి, పీఠాధిపతులకు దాఖలు చేసుకొన్నాడు. *'సిద్ధాంత సిద్ధాంజనం'* పేరుతో గుర్రం వెంకన్నశాస్త్రి ఒక ఖండన గ్రంథం రాశాడు. ఈ పుస్తకానికి *'వాద ప్రహసనమ్'* అని మరొక పేరు పెట్టాడు.[11]

వెంకన్నశాస్త్రి నెల్లూరువాడు. రామస్వామిశాస్త్రి కుమారుడు. వెంకన్నశాస్త్రి అన్న అప్పన్నశాస్త్రి మదరాసు హైకోర్టులో "హిందూలా పండితులుగా ఉండి హిందూ ధర్మశాస్త్రముపై 'అధారిటి' అనిపించుకున్నాడు."[12] వెంకన్నశాస్త్రి తన ప్రతిభా పాండిత్యాలను, ప్రసిద్ధిని గురించి వాద ప్రహసనంలో చెప్పుకొన్నాడు. ఈయన మంచి హాస్యప్రియుడని, హాస్యరసం ఉట్టిపడే శ్లోకాలు అలవోకగా చెప్పేవాడని, *'వికటకవి'* అని ప్రఖ్యాతి చెందాడని, ఈయన వంశీయులు తెలిపారు. ఈయనకు *"చతుష్షష్టి కళాత్మక"*, *"ఆలంకారిక సార్వభౌమ"* బిరుదులున్నట్లు నరసయ్య పేర్కొన్నాడు. నరసయ్య వెంకన్నశాస్త్రిని ఆప్యాయంగా *"మై డియర్ బ్రదర్ ఇన్ లా"* అని చెప్పుకొన్నాడు.[13] వెంకన్నశాస్త్రితో తనకున్న బంధుత్వం స్పష్టంగా తెలియడం లేదు.

## సిద్ధాంత సిద్ధాంజనమ్ (వాద ప్రహసనమ్)

"కొందరు ఆచారభ్రష్టులు నాస్తిక వాదులవుతున్నారు. వారిని సంతోషపెట్టడానికి అనంతరామశాస్త్రి రజస్వలానంతర వివాహాలను సమర్థిస్తూ పుస్తకం రాశాడు. మనువు మాటలకు అపార్థం కల్పించి బ్రాహ్మణ, బ్రాహ్మణేతర కులాలవారు గాంధర్వవివాహం చేసుకోవచ్చని, దీనిని మనుస్మృతి అంగీకరించిందని, పరాశరస్మృతిని పాటించనవసరం లేదని వాదించాడు. ఆయన మాటలు మూర్ఖులను మోసగించవచ్చు. అవి శాస్త్ర విరుద్ధమైనవి" అని వెంకన్నశాస్త్రి తన పుస్తకాన్ని మొదలుపెట్టాడు. ఈ పుస్తకంలో ఎనిమిది పరిహాసాలున్నాయి. ఒక్కో పరిహాసంలో అనంతరామశాస్త్రి ఒక్కో వాదాన్ని పూర్వపక్షంచేసి, తన నిర్ధారణను ప్రతిపాదించాడు. ఎనిమిదో పరిహాసంలో ప్రత్యర్థి వాదాన్ని సమగ్రంగా సమీక్షించి ఖండించాడు. ఈ పుస్తకాన్ని 1865 అక్టోబరు 1న కంచి పీఠాధిపతి మద్రాసు వచ్చినప్పుడు, పీఠాధిపతి నివాసంలో జరిగిన పండితసభలో పఠించాడు. ఆ సభలో రంగనాథశాస్త్రి, అనంతరామశాస్త్రి ఉన్నారు. వీరి మధ్య చర్చ తీవ్రంగా జరిగి, ఒకరినొకరు దూషించుకొనే స్థాయికి దిగజారింది.

### మద్రాస్ టైమ్స్ (1858)

గాంట్జు సోదరులు (Gantz brothers) మద్రాసులో పుస్తకవిక్రేతలుగా ఉంటూ, మద్రాస్ టైమ్స్ పత్రికను ప్రారంభించారు. 1857 సంక్షోభం తర్వాత, యూరోపియన్లకూ, దేశీయులకూ మధ్య సంబంధాలు బెడిశాయి. రెండుజాతుల మధ్య సామరస్యం, సత్సంబంధాల పునరుద్ధరణ కోసం ఈ పత్రిక కృషి చేసింది. మద్రాస్ టైమ్స్ పత్రిక సి.ఏ. లాసన్, హెన్రీ కోర్నిష్ (C.A. Lawson, Henry Cornish)ల సంపాదకత్వంలో ప్రారంభమైంది. పత్రిక ఉదయం, సాయంత్రం సంచికలు వెలువడేవి. న్యూస్‌సర్వీసు సౌకర్యం లేకపోవడంవల్ల, విలేకరులు, 'కంట్రిబ్యూటర్సు' పంపే వార్తల మీద, రచనల మీద పత్రిక ఆధారపడుతూ వచ్చింది. చిన్నవ్యాపారులు, టీతోటల యజమానులు, మధ్యతరగతి యూరోపియన్ల అభిప్రాయాలను పత్రిక వినిపించింది. ప్రభుత్వ విధానాల మీద ఘాటుగా విమర్శలుండేవి. ఈ పత్రికలో మద్రాసు ప్రెసిడెన్సీకి సంబంధించిన అనేక విషయాలు ప్రస్తావించబడ్డాయి. సుందరలింగం, లెనార్డ్ తమ పరిశోధన గ్రంథాలలో ఈ పత్రికను ఎక్కువగా ఉపయోగించుకొన్నారు. వెంకన్నశాస్త్రికి, అనంతరామశాస్త్రి వర్గానికి మధ్య జరిగిన చర్చను నరసయ్య ఈ పత్రికలో సంపాదకీయ లేఖల ద్వారా వివరించాడు.

## లెటర్స్ ఆన్ హిందూ మేరేజస్

రంగనాథశాస్త్రి , వెంకన్నశాస్త్రి మధ్య వివాదం పూర్తిగా చల్లారక ముందే, పదిహేడేళ్ళ వయసులో పచ్చయ్యప్ప ఉన్నతపాఠశాలలో 'అసిస్టెంట్ టీచరు' ఉద్యోగంచేస్తూ, నరసయ్య ఈ పుస్తకాన్ని ప్రచురించాడు. "లెటర్స్ ఆన్ హిందూ మేరేజస్ ఆర్ జి.

వెంకన్నశాస్త్రియర్, సి.ఎస్.ఐ వెర్సెస్ సి. రంగనాథశాస్త్రియర్ అండ్ సి. అనంతరామశాస్త్రియర్" అని పుస్తకానికి రెండు పేర్లు పెట్టాడు. ఈ పేర్ల కింద "హిందువులలో బాల్యవివాహాలను సమర్థిస్తూ కొంతకాలంక్రింద మద్రాస్ టైమ్స్‌లో ప్రచురించబడిన లేఖలు" అని ఒక వివరణ ప్రచురించాడు.

నరసయ్య పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చిన తొలి పరిశోధకుడు బంగోరె. జమీన్‌రైతు పత్రికలో దీన్ని సంగ్రహంగా పరిచయం చేశాడు. ఆర్. సుందరలింగం ఈ పుస్తకాన్ని సంప్రదించాడు. అనంతరామశాస్త్రికి, వెంకన్నశాస్త్రికి జరిగిన వివాదం సందర్భంలో ఎథీనియం అండ్ డెయిలీన్యూస్‌లో, మద్రాస్ టైమ్స్‌లో ప్రచురించబడిన ఉత్తరాలను తన గ్రంథంలో ఉదాహరించాడు.[14] లెనార్డ్ ఈ పుస్తకాన్ని పేర్కొనలేదుగాని, రంగనాథశాస్త్రి పేరుతో నరసయ్య రాసిన లేఖను తన థీసిస్‌లో ఉదాహరించాడు. వేదసమాజ ప్రభావంలో రజస్వలానంతర వివాహాలను సమర్థిస్తూ కొన్ని రచనలు వెలువడ్డాయని, ఆ రచనలలో ప్రతిపాదించబడిన సూత్రీకరణలను శంకరాచార్యులు తిరస్కరించిన విషయం, మద్రాస్ టైమ్స్ వార్తలను ఉదాహరించి రాశాడు.[15] ఆచార్య వి. రామకృష్ణ ఈ పుస్తకాన్ని పేర్కొన్నాడు.[16]

నరసయ్య అన్నలిద్దరికి విద్యార్థి దశలోనే వెంకటరాయులునాయుడు ఏర్పాటుచేసిన సంస్థలతో సంబంధం ఏర్పడి ఉంటుంది. కేశవచంద్రసేన్ మద్రాసులో చేసిన ఉపన్యాసాలు, మద్రాసు వేదసమాజ కార్యక్రమాలు, ప్రార్థన సమావేశాలు ఈ ముగ్గురుసోదరుల వ్యక్తిత్వం మీద ప్రభావం చూపిఉంటాయి. వెంకటరాయులునాయుడు 'రైసింగ్ సన్' ఆగిపోయినతర్వాత, ఆయన ఆశయాలను నరసయ్యసోదరులు ప్రారంభించిన 'నేటివ్ అడ్వొకేట్' పత్రిక కొనసాగించినట్లు సుందరలింగం అభిప్రాయపడ్డాడు.[17]

నరసయ్యకు విద్యార్థిదశలోనే లౌకికభావాలున్న వ్యక్తులతో, బ్రహ్మసమాజం అభిమానులతో పరిచయాలు, స్నేహాలు ఏర్పడినట్లు తోస్తుంది. పళ్ళె చెంచలరావు, చుండూరు కోటయ్యసెట్టి, మన్నవ బుచ్చయ్య మొదలైనవారితో ఆత్మీయమైన సంబంధం ఉన్నట్లుతోస్తుంది. రాజగోపాలాచార్యులు మరణించిన తర్వాత మదరాసు బ్రహ్మసమాజ ఉద్యమానికి శ్రీధరనాయుడు నాయకత్వం వహించాడు. మన్నవ బుచ్చయ్య మొదలైన యువకులు ఈయన పర్యవేక్షణలో బ్రహ్మసమాజ అనుయాయులుగా తీరారు. నరసయ్య మీద కూడా ఈయన ప్రభావం పడిఉంటుంది.

జాన్ బ్రూస్ నార్టన్ (John Bruce Norton) అభిప్రాయాలు ఉదారభావాలున్న ఆనాటి మద్రాసు యువకులందరినీ ప్రభావితం చేశాయి. ఆయన మీద వారికి అపారమైన గౌరవం ఉంది.[18] నరసయ్యకు ఆయనంటే గొప్ప ఆరాధనాభావం ఉంది. పీపుల్స్ ఫ్రెండ్ సంపాదకీయంలో ఎథీనియం అండ్ డెయిలీ న్యూస్ పత్రిక ప్రకాశకులను, ఆ పత్రికకు కొంతకాలంపాటు సంపాదకత్వం వహించిన నార్టన్‌ను నరసయ్య ఎంతో గౌరవభావంతో

ప్రస్తావించాడు. ఈ చిన్నచిన్న సంగతులే నరసయ్య వ్యక్తిత్వవికాసంలో పనిచేసిన శక్తులను ఊహించుకోడానికి సహాయపడ్డాయి.

## ఆరు లేఖలు

ఈ పుస్తకంలో ఆరు లేఖలున్నాయి. నరసయ్య ఈ ఆరు లేఖలు 1865 జూలై-అక్టోబరు మధ్యకాలంలో రాశాడు. బాల్య వివాహాల మీద రంగనాథశాస్త్రి వర్గానికి, వెంకన్నశాస్త్రికి మధ్య ఏర్పడిన వివాదంలో, వెంకన్నశాస్త్రి అభిప్రాయాలను వివరిస్తూ నరసయ్య ఈ లేఖలు రాశాడు. ఈ లేఖలు రాస్తున్న సమయంలో ఆయనకు పదహారోయేడు పూర్తయి పదిహేడో ఏడు పెట్టింది. ఆయన ఎంత 'మేధావి' అయినా, ఈ లేఖలు రాయడంలో ఎవరో ఒకరి సహకారం, సహాయం ఉండి ఉండాలి. తన బావ వెంకన్నశాస్త్రి 'సిద్ధాంత సిద్ధాంజనమ్' లో విపులీకరించిన అభిప్రాయాలను, వాదనలను తాను ఈ లేఖలలో వివరించినట్లు నరసయ్య 'ముందుమాట' లో వినయంగా తెలియచేశాడు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, రజస్వలానంతర వివాహాలకు అనుకూలంగా మద్రాస్ స్టాండర్డులో ఆయన ప్రచురించిన లేఖ కూడా ఈ పుస్తకంలో ఉంది. ఈ లేఖలో వ్యక్తంచేసిన భావాలు వెంకన్నశాస్త్రివి కావు. రంగనాథశాస్త్రి వర్గానికి చెందినవి కావు. తాను గాఢంగా విశ్వసించిన అభిప్రాయాలనే నరసయ్య ఇందులో వ్యక్తం చేశాడు. నరసయ్య కన్నా ముందు ఆయన సోదరులిద్దరు ఉదార పాశ్చాత్య విద్యావిధానంలో చదువు సాగించారు. వీరి ప్రభావం నరసయ్యమీద ఉంది. లౌకిక విద్యా విధానం, బ్రహ్మసమాజ భావాలు, పాశ్చాత్య సమాజ విలువలు, క్రైస్తవ మత బోధనలు, అప్పుడప్పుడే ననలువేస్తున్న సంస్కరణవాదుల అభిప్రాయాలు యవ్వనంలో అడుగుపెడుతున్న నరసయ్య మీద చెరగని ముద్రవేశాయి. ఈ నేపథ్యంలోనే ఆయన రాసిన ఈ లేఖలను పరిశీలించవలసి ఉంటుంది. తన పుస్తకానికి ఆయన రాసిన పరిచయ వాక్యాల అనువాదం :-

## ముందుమాట

ఈ లేఖలు నేనే రాశానని ఎంతో సంకోచంతో ఇప్పుడు ప్రకటిస్తున్నాను. ఈ లేఖలలో ఏదైనా మంచి ఉంటే, అది ఆ లేఖల చివర ఉన్న పేర్లకు చెందుతుంది. ఈ లేఖలలో ఒకే విధంగా వ్యక్తమయ్యే భావాలు, వాదనలు మాబావ గౌరవనీయులు, చతుష్షష్టి కళాత్మక, అలంకార సార్వభౌమ బిరుదాంకితులైన జి. వెంకన్నశాస్త్రి 'సిద్ధాంత సిద్ధాంజనమ్' లో ఎంతో సమర్థవంతంగా ప్రకటించినవే. ఆయన భావాలకు ఇంగ్లీషు భాష అనే ముసుగు తొడగడం మాత్రమే నేను చేసినపని అని మనసుకు తెచ్చుకొన్నప్పుడు, ఈ విధంగా ఆ లేఖలను ప్రజల ముందుంచడం ఎంత తొందరపాటు పనో నాకు తెలియకపోలేదు. ప్రజలదగ్గర పొగడ్తలు ఆశించనపుడు, నిజాన్ని వారిముందుంచితే, నేను చేసిన మహాపరాధాన్ని క్షమిస్తారని నాకు తెలుసు. ఒక

నిజాన్ని సంతోషంగా అంగీకరించినపుడు, అందుకు ప్రతిఫలం ఏదీ ఆశించనపుడు, అది అంత చెడ్డ సంగతేమీ కాదు కదా?

పచ్చయ్యప్ప ఉన్నత పాఠశాల, డి. నరసయ్య
16 ఫిబ్రవరి, 1867

## మొదటి లేఖ

ఈ లేఖ సి.వి. రంగనాథశాస్త్రి పేరుతో, 1865 జూలై 13వ తారీకు మద్రాస్ టైమ్స్‌లో ప్రచురించబడింది. బాల్యవివాహాలను నిరసిస్తూ రంగనాథశాస్త్రి ఈ లేఖ రాసినట్లు సుందరలింగం పేర్కొన్నాడు కాని, ఈ లేఖలన్నిటికీ నరసయ్యే కర్త అని గుర్తించ లేదు.[19] తన పేరుతో ఇతరులెవరో పత్రికకు లేఖ రాస్తే, రంగనాథశాస్త్రి అంతటి ప్రసిద్ధ వ్యక్తి ఎందుకు ఊరుకొని ఉంటాడు? తానా లేఖ రాయలేదని ప్రకటించకుండా ఉండడు. ఆయన అటువంటి లేఖరాసి ఉంటే మద్రాస్ టైమ్స్ తప్పకుండా ప్రచురించి ఉండేది. ఆనాటి మద్రాస్ టైమ్స్ నుంచి, ఇతర ఇంగ్లీషు పత్రికల నుంచి అంత తరచుగా 'కోట్' చేసిన సుందరలింగంగాని, లెనార్డ్‌గాని ఈ విషయాన్ని విడిచిపెట్టి ఉండరు. రంగనాథశాస్త్రితో నరసయ్య సోదరులకు పరిచయం ఉండి ఉంటుంది. అప్పుడప్పుడే విస్తరిస్తున్న సంస్కరణ భావాలకు అందరూ సుముఖులు కావడంవల్ల, బాల్యవివాహాలను తిరస్కరిస్తూ తన పేరుతో నరసయ్య లేఖరాసినా, రంగనాథశాస్త్రి మౌనంగా ఉండి ఉంటాడు. నరసయ్య పసివయసును, వ్యక్తిత్వాన్ని బట్టి కూడా మన్నించి ఉంటాడు.

రంగనాథశాస్త్రి అభిప్రాయాలను మొదట వివరించవలసిన అగత్యం నరసయ్యకు ఉంది. తర్వాత బాల్యవివాహాలను సమర్థిస్తూ వెంకన్నశాస్త్రి వాదాన్ని వివరించడానికి ఇది ప్రాతిపదిక అవుతుంది. రంగనాథశాస్త్రి పేరుతో ఉన్న లేఖ అనువాదం :-

ప్రియమైన దేశ ప్రజలారా ! సాటి హిందువులారా ! నేను బ్రాహ్మణుణ్ణి. శైశవావస్థనుంచి సంస్కృతం శ్రద్ధగా చదువుతున్నాను. వివిధ మతకర్మలు ఆచరించే సందర్భాలలో, దేశానికి ప్రాణపదమైన వివాహక్రతువులో పఠించే మహామంత్రాల అర్థాన్ని చాలాకాలంగా అనుశీలన చేస్తున్నాను. పసిపాపలకు చేసే వివాహాలు అన్యాయమైనవని, అనాగరికమైనవని, నా పరిశోధనలో తేలింది. ఈ వివాహాలు లోకజ్ఞానానికీ , వివాహ సందర్భంలో పఠించే మంత్రాలలో వివరించబడిన సిద్ధాంతాలకూ, వివాహ విధులకు ఆధారమైన శాస్త్ర గ్రంథాలకూ విరుద్ధమైనవి. బాల్యవివాహాల మీద, ఇంకా రెండు ముఖ్యమైన విషయాలమీద నా అభిప్రాయాలను ప్రచారంచేస్తూ వచ్చాను. వీటికి పండితుల సమర్థన సంపాదించాను. వారు నాతో గొంతు కలిపారు. మన ఆధ్యాత్మిక గురువు పూజ్యులు శ్రీమత్ శంకరాచార్యులవారి సమక్షంలో, సుప్రసిద్ధులైన మన మిత్రులు, గౌరవనీయులు అనంతరామశాస్త్రి బాల్యవివాహాలమీద త్వరలో చర్చ ప్రారంభిస్తారు.

ఆసక్తిఉన్న దేశీయులందరూ గౌరవ పురస్సరంగా ఆహ్వానించబడుతున్నారు.

మీ క్షేమాన్ని కాంక్షించే దేశీయుడు
సి.వి. రంగనాథశాస్త్రి

రెండో లేఖ

ఈ లేఖ 1865 ఆగష్టు 3వ తారీకు మద్రాస్ టైమ్స్‌లో వెంకన్నశాస్త్రి పేరు మీద ప్రచురించబడింది. మొదటిలేఖకు సమాధానంగా ఈ లేఖ రాయబడింది. పీఠాధిపతి సముఖంలో అనంతరామశాస్త్రి బాల్యవివాహాలకు శాస్త్రాల ఆమోదంలేదని, తనవాదం వినిపించినట్లుంది. ఆయన రచించిన 'వివాహ్య కన్యా స్వరూప నిరూపణమ్' అంతకు ముందుగానే ప్రచురించబడి పండితులకు అందుబాటులోకి వచ్చినట్లుంది. ఈ లేఖలో కొన్ని ముఖ్యమైన భాగాలను మాత్రం, అనువదించి వివరించడం జరుగుతూంది.

"పూజ్యులు శంకరాచార్యుల వద్ద అనంతరామశాస్త్రి ఈ కరపత్రాన్ని చదివినపుడు నేనక్కడే ఉన్నాను.[20] అందులో వ్యక్తంచేయబడ్డ కొన్ని అభిప్రాయాలకు నేను అక్కడికక్కడే అభ్యంతరం చెప్పాను. ఆయన పట్టుపట్టడంవల్ల, ఆయన కోరినట్లుగానే, ఈ కరపత్రానికి సమాధానంగా మరొక కరపత్రం తయారు చేశాను. త్వరలో దీన్ని ప్రచురించి, స్వామివారి సన్నిధిలో పఠిస్తాను.

ముందుగా మీ దృష్టి ఈ క్రింది విషయాల మీద నిలిపి, శ్రద్ధగా పరిశీలించమని అర్థిస్తున్నాను. అనంతరామశాస్త్రి వాదం పూర్తిగా మనుస్మృతి 9వ ప్రకరణంలో 28వ శ్లోకం, 10వ ప్రకరణంలో 3వ శ్లోకం - ఈ రెండు శ్లోకాల మీదే ఆధారపడి ఉంది. వీటికి అపార్థంచెప్పి, లేదంటే, తన వాదానికి పనికివచ్చే అర్థాన్ని బలవంతంగా రాబట్టి, ఆయన తన స్వరూపాన్ని, తన మిత్రుడు రంగనాథశాస్త్రి స్వరూపాన్ని బహిర్గతం చేశాడు. రంగనాథశాస్త్రి అపఖ్యాతిపాలయ్యే ఇటువంటి విషయాల జోలికి ఇంతకు ముందెప్పుడూ పోలేదు. ఇప్పుడు మాత్రం తనకు సహజ గుణమయిన వివేచనను కోల్పోయి, అనంతరామశాస్త్రితో కలిసి నిరర్థకమైన సాహసానికి పూనుకొని అపహాస్యం పాలయ్యాడు."

అనంతరామశాస్త్రి ఉదాహరించిన మనుస్మృతిలోని శ్లోకాలకు విలియం జోన్స్ (William Jones) అనువాదాన్నిచ్చి, అనంతరామశాస్త్రి మనువు అభిప్రాయానికి ఏ విధంగా అపార్థాన్ని సృష్టించాడో వెంకన్నశాస్త్రి వివరించాడు. "ప్రస్తుతానికి మనుస్మృతికి పరిమితమయి మాట్లాడుతున్నాము. ఆనిషేధం లేకపోతే, బాల్యవివాహాలను సమర్థించే రుషిప్రోక్తాలు, ఇతర ప్రమాణాలు చాలా ఉన్నాయి" అంటూ, తన వాదాన్ని, ప్రత్యర్థులవాదాన్ని చక్కగా బోధపరచుకొన్నారు కనుక నిర్ణయాన్ని సహృదయ పాఠకులకు విడిచిపెడుతున్నట్లు లేఖ ముగించాడు.

మూడో లేఖ

ఈ లేఖ 1865 ఆగష్టు 7వ తేది మద్రాస్ స్టాండర్డు (Madras Standard) లో ప్రచురించబడింది. లెటర్స్ ఆన్ హిందూ మేరేజస్ పుస్తకం ముఖపత్రంమీద "Being a reprint of the letters that appeared in the Madras Times some time back upholding infant marriages among Hindus" అని ఉంది కాని మద్రాస్ స్టాండర్డు ప్రస్తావన లేదు. ఈ పత్రిక ప్రస్తావన మద్రాసు జర్నలిజం చరిత్రలలో కనిపించదు. పందొమ్మిదవ శతాబ్ది చివర పరమేశ్వర పిళ్ళె సంపాదకత్వంలో వెలువడిన మద్రాస్ స్టాండర్డు ప్రస్తావన మాత్రమే కనిపిస్తుంది. అసైలం ప్రెస్ ఆల్మనాక్‌లలో 1865 నుంచి వరుసగా ఈ పత్రిక ప్రస్తావన ఉంది. పత్రిక ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ఉదయం వెలువడేది. అన్ని ఉత్తరాలు మద్రాస్ టైమ్స్‌లో ప్రచురించి, ఈ ఒక్క ఉత్తరాన్ని ఈ పత్రికకు ఎందుకు పంపవలసి వచ్చిందో కూడా తెలియదు. లేఖ చివర ఎవరిపేరూ లేదు. నరసయ్య సొంత అభిప్రాయాలు, ఆలోచనా ధోరణి ఈ లేఖలో వ్యక్తమయ్యాయి. ఆయన శాస్త్ర గ్రంథాల సహాయంతో సంస్కరణను సమర్థించే వర్గానికి చెందడు. సమాజానికి మేలు చేకూర్చే మార్పును హృదయపూర్వకంగా ఆహ్వానించాడు. మద్రాసు సంస్కరణవాదులు తర్వాత కాలంలో మితవాదులుగా, అతివాదులుగా ముద్రపడ్డారు. నరసయ్య అతివాద వర్గంతో ఉండి ఉండవచ్చని ఈ లేఖలో వ్యక్తమయిన ధోరణి సూచిస్తుంది. ఒకవైపు తనబావ వెంకన్నశాస్త్రికి అండగా ఉంటూ, ఆయన అభిప్రాయాలను ఆయన పేరు మీదనే సంపాదకీయ లేఖలు రాసి వివరించాడు. మద్రాస్ స్టాండర్డుకు రాసిన ఈ లేఖలో స్పష్టంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశాడు; ఈ వైజ్ఞానిక యుగంలో పాతపడి వాడుకలో నుంచి తొలగిపోయిన ధర్మశాస్త్రాల ప్రామాణ్యాన్ని నిరాకరించాడు. ఒక సంప్రదాయం సమాజానికి కీడు కలిగిస్తున్నపుడు దాన్ని అనుసరించడంలో సబబును ప్రశ్నించాడు. అభివృద్ధి చెందుతున్న జాతులతోపాటుగా నూతన భావాలను అలవరచుకొని, సనాతన భావాలను, దుష్ట సంప్రదాయాలను ధైర్యంగా విడిచిపెట్టి ముందుకు సాగాలని సూచించాడు. ఈ లేఖ రాసేనాటికి నరసయ్యకు సమాజాన్నిపట్టి పీడిస్తున్న సాంఘిక దురాచారాలమీద మంచి అవగాహన ఉన్నట్లనిపిస్తుంది. బాల్యవివాహాలవల్ల, వితంతువివాహాల నిషేధంవల్ల సమాజంలో వ్యభిచారం అనేక రూపాల్లో వ్యాపించి ఉందని పేర్కొన్నాడు. నరసయ్య లేఖకు తెలుగు అనువాదం :-

“ముగ్గురు శాస్త్రులు, ఒక ఆచార్యులు; వెంకన్నశాస్త్రి, రంగనాథశాస్త్రి, అనంతరామశాస్త్రి, పూజ్యులు, ఆధ్యాత్మిక పీఠాధిపతి శ్రీమత్ శంకరాచార్యులు - మొత్తం నాలుగు పెద్ద తలలు (పైగా చాలా పొడవైన పేర్లు). వీరు ఇష్టంగా పిలిచే “హిందూ శైశవ వివాహాలు” అనే అంశంపైన ఇద్దరు అనుకూలంగా, ఇద్దరు వ్యతిరేకంగా ఉండి బుర్రలు బద్దలు కొట్టుకొంటూ వివాదం సాగిస్తున్నారు. సమకాలిక పత్రిక మద్రాస్ టైమ్స్ ‘కాలం’ లను యుద్ధరంగంగా ఎన్నుకొన్నారు. మహామనీషులు

విభేదిస్తే, సంతృప్తికరమైన నిర్ణయానికి రావడం కష్టమని అంటారు. ఈ సంవాదంలో పాల్గొంటున్నవారు మహామేధావులు. వారు ఆర్జించిన పాండిత్యాన్ని మనం బోధపరచుకొన్నా, అనాదిగా సమకూడిన జ్ఞానసంపదను సాధించినా, ఈ వివాదంలో పాల్గొంటే మమ్మల్ని వారు స్వాతిశయంతో మిడిసిపడుతూ చురుకైన వాగ్బాణాలు సంధించే అహంభావిగా భావిస్తారు. తాను పట్టిన కుందేటికి మూడేకాళ్ళని మొండిగా వాదించేవాణ్ణని అనుకొంటారు. ఇతరుల తగాదాలలో అనవసరంగా జోక్యం చేసుకొంటే, గొడవపడుతున్నవారి మోచేతులు తగిలి ముక్కు పచ్చడవుతుందన్న చందంగా, ఎంతో సుకుమారమైన మా ఘ్రాణేంద్రియాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ ఉదయం మేము వివాదాస్పదమైన రంగస్థలంమీద అడుగు పెడుతున్నాము. ఈ తొందరపాటు చర్యవల్ల తప్పనిసరిగా మేము ఏదో ఒక పక్షంవైపు నిలబడవలసి వస్తుంది. ఒక వర్గం మమ్ములను స్నేహితుడుగా భావిస్తే, రెండోవర్గం నిష్కారణంగా వివాదంలో జోక్యం చేసుకొన్న వ్యక్తిగా తలచి దూషిస్తుంది. "ఒక సాధారణ ప్రేక్షకుడుగా ఉండి ప్రపంచాన్ని బోధపరుచుకోవాలని భావించడం బుద్ధి తక్కువ పని" అని మహానుభావుడైన ఒక ఫ్రాన్సుదేశపు తత్త్వవేత్త అన్నాడు. ఆలంకారికంగానే అయినా, ముక్కు పగిలి, రక్తసిక్తం కావడానికి మేము సిద్ధపడి, బాల్యవివాహాలను వ్యతిరేకిస్తున్న శాస్త్రుల తరఫున - శాస్త్రాలు చక్కగా అనుశీలనంచేసి, బాల్యవివాహాలను సమర్థిస్తున్న ఉత్సాహవంతులకు వ్యతిరేకంగా రంగప్రవేశం చేస్తున్నాము.

అనాదిగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం, హిందూ బాలికలకు శైశవంలోనే వివాహం చెయ్యడమా? లేకపోతే, విజ్ఞానం చక్కగా అభివృద్ధి చెందిన ఈనాటి స్ఫూర్తితో, ఏషియా నాగరిక సమాజాల్లో, యూరపు అంతటా అమలులోఉన్న, ఆచరణయోగ్యమైన, సులభమైన పద్ధతిని అనుసరించడమా? ఇదే హిందువుల ముందున్న అసలు సమస్య. ఈ చరణాలు అంత అందంగా లేకపోయినా, విషయాన్ని క్లుప్తంగా చెప్తున్నాయి.

హిందూ స్త్రీలు
అర్హుడైన వరుణ్ణి ఎన్నుకోడం మాత్రమే కాదు;
వివాహయోగ్యమైన వయస్సును కూడా ఎంచుకోవాలి.

ఇదీ అసలుసమస్య. వెంకన్నశాస్త్రి, ఆయన మిత్రుడు, పీఠాధిపతి శ్రీమత్ శంకరాచార్యులు ఏ మాత్రం మార్పు లేకుండా సంప్రదాయాన్ని కొనసాగించాలని వాదిస్తారు. రంగనాథశాస్త్రి, ఆయన మిత్రుడు అనంతరామశాస్త్రి ఈ సంప్రదాయాన్ని రద్దుపరచాలని కోరుతున్నారు. మేమూ ఆమాటే అంటున్నాము. రంగనాథశాస్త్రి, ఆయన మిత్ర బృందం తమ వాదానికి రుజువుగా మనుధర్మశాస్త్రంలోని సూత్రాలను నిదర్శనంగా చూపుతున్నారు. వెంకన్నశాస్త్రి బృందం తమ అభిప్రాయాలకు అనుకూలంగా అవే ప్రమాణాలను ప్రదర్శిస్తున్నారు. హిందూ మిత్రులందరి మాదిరే, మనం ఒకే ఆకరాన్ని

ప్రదర్శించి, పరస్పర విరుద్ధమయిన రెండు నిశ్చయాలకు రాగలుగుతున్నాము. ఒకే గ్రంథంలో విషయాన్ని ఉటంకించి, మన మతంలో వివిధ శాఖలకు, తెగలకు చెందినవారం రకరకాల సూత్రీకరణలు చేస్తున్నాము. హిందూశాస్త్రులు ఒక సూత్రీకరణను ఉదాహరించి, పరస్పర విరుద్ధమైన నిర్ధారణలకు వస్తారు. ఎవరు సరైనఅర్థం చెప్పారో, ఎవరు తప్పుఅర్థం చెప్పారో నిశ్చయించడం చాలా కష్టం. బాధాకరమే, అయినా ఆ ఇబ్బందిని స్పష్టంగా అధిగమించగలిగాము. రంగనాథశాస్త్రి, ఆయన మిత్రబృందం తమవాదాన్ని సమర్థించుకోడానికి తప్పు ఆకరాలను చూపించారు. మనువచనానికి వెంకన్నశాస్త్రి చెప్పిన అర్థం ఒక్కటే సరైనది. రంగనాథశాస్త్రి, కాకపోతే ఆయన మిత్రుడు అనంతరామశాస్త్రి తాను చూపిన ఆధారాలకు, చిత్రంగా తర్క విరుద్ధమైన అర్థాలను రాబట్టాడు. వెంకన్నశాస్త్రి తన ప్రత్యర్థి ఉదాహరించిన మనువాక్యాలనే ఉటంకించి, ఆయన వాదాన్ని తిప్పికొట్టాడు. వెంకన్నశాస్త్రివర్గం సమర్థవంతంగా తమవాదాన్ని వినిపించినందుకు వారియోగ్యతను గుర్తిస్తున్నాము.

ఈ వాదం ప్రధానంగా మనుస్మృతి మీద ఆధారపడి కొనసాగించబడింది. సంస్కృత మాతృకను పరిశీలించినా, తమిళ అనువాదాలను, ఇతర భాషల నుంచి ఇంగ్లీషులోకి చేయబడ్డ అనువాదాలను చదివినా, మనుస్మృతి హిందువులకు బాల్య వివాహాలను విధించినట్లు తెలుస్తుంది. మూడు వేల సంవత్సరాల నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతూ ఉంది.

ఇప్పటివరకూ బాల్యవివాహాలను సమర్థించేవారితో కలిసి వాదించాము. ఇప్పుడు బాల్యవివాహాలను వ్యతిరేకిస్తున్న వారితో కలిసి వాదించడానికి సిద్ధంగా ఉన్నాము. (మేము విన్న ప్రకారం, ఈ వర్గంవారు మేము అనుసరిస్తున్న పద్ధతి ప్రకారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వాదించమని మమ్మల్ని కోరలేదు.)

ఏనాటివో పురాతన ధర్మశాస్త్రాలు బాల్యవివాహాలను అనుమతించి, ఆదేశించాయని, ఈ సంప్రదాయం ఎంతో కాలంగా కొనసాగుతున్నదనే సాకు చూపి, ఈ దురాచారం కొనసాగాలని చెప్పడానికి వీలులేదు. ఒకసంప్రదాయం నాగరికత పురోభివృద్ధికి అడ్డంకిగా నిలిచినా, విద్యావ్యాప్తిని అడ్డుకొన్నా, అనాదిగా కొనసాగుతున్న అపోహలను సమూలంగా పెకలించే ప్రయత్నానికి అవరోధమైనా, దాన్ని కొనసాగించవలసిన పనిలేదు. బ్రతుకులో స్త్రీని అర్థమైన స్థితిలో, నిజమైన స్థానంలో నిలబెట్టడానికి చేసే ప్రయత్నంలో సంప్రదాయం అడ్డు నిలిస్తే, అటువంటి సంప్రదాయాన్ని కొనసాగించడానికి వీల్లేదు. ఒక సమాజ అవసరాలను, ఆకాంక్షలను నెరవేర్చిన తర్వాత ఆ సంప్రదాయాలు, అపేక్షలు, ఆకాంక్షలు పాతపడి, తర్వాత కాలానికి కొరగాకుండా పోతాయి, ఉపయోగపడవు. మనం చేసే కార్యాలన్నీ పూర్వుల సంప్రదాయానుసారం, వాడుక అనుసరించి ఉండాలనుకొంటే పురోగమనం అనే పందెంలో ఎక్కడో వెనకబడి పోతాము. యుగయుగాలుగా ఇది

హిందువుల పాలిట శాపంగా మారింది. హిందువుల నాగరికత చలనం లేకుండా ఉండడానికి ఇదే కారణం. విజ్ఞానం వ్యాప్తి చెందుతున్న ఈ రోజుల్లో అనాదిగా కొనసాగుతున్న అపోహలను, పక్షపాతంతో కూడిన ప్రమాదకరమైన భావాలను హిందువులు వదిలించుకొంటున్నారు. హిందువుల అభివృద్ధిపథంలో అడ్డుగానిలిచిన ఇటువంటి విషయాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఈ దురాచారాలలో బాల్య వివాహాలు తక్కువైనవేమీ కావు. ప్రజలు వీటిని పాటించడం వల్ల, అనేక సంక్లిష్ట సామాజిక దురన్యాయాల పాల పడుతున్నారు. వీటిని గురించిన మా పరిశీలన వివరించడానికి ఇప్పుడు వ్యవధి లేదు, అవకాశమూ లేదు. బాల్య వివాహాలవల్ల కలిగే దురన్యాయాన్ని మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తాము. ఈ సాంఘిక దురాచారం ఇతరజాతుల వారిలోకన్నా హిందువులలో తక్కువ కీడు కలిగించేది కాదు. బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహ నిషేధం ప్రమాదకరమైన ఈ రెండు దుష్టసంప్రదాయాలు పెద్దఎత్తున బహిరంగ వ్యభిచారానికి కారణమయ్యాయి. "మీ వాదనలో పసలేదు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. దీన్ని మీరు పెద్దదిచేసి భూతద్దంలో చూపుతున్నారు" అని మా మిత్రులంటారు. ప్రజల అనుభవం ఈ నిజాన్ని ధ్రువీకరిస్తుంది. సహజంగా ఇటువంటి ఫలితంతప్ప, మరొకదాన్ని ఊహించలేము. దీన్ని ఎత్తిచూపడం, దీనికి చికిత్స సూచించడం బాధాకరమైన మా కర్తవ్యం అయింది. ఈ దేశంలో మహిళల సాంఘిక, నైతిక ఉన్నతిని హృదయంలో అభిలషించే ప్రతి హిందువు రంగనాథశాస్త్రి, ఆయన స్నేహితులతో చేయి కలపాలి. వ్యవహారం నుంచి తొలగిన మనుధర్మంగానీ, మరొక ధర్మంగానీ ఏంచెప్తున్నదని కాక, ఇంతగా అభిలషించబడుతున్న సంస్కరణకు కార్యరూపం ఇవ్వాలి. పవిత్రమైన దాంపత్యసిద్ధిని కోరుకోవాలి. హిందువులు అపోహలను వదిలించుకొని తమకు తాము కొత్తగా ఆలోచించుకోవాలి."

## నాలుగో లేఖ

ఈ లేఖ మద్రాస్ టైమ్స్‌లో 1865 ఆగష్టు 19న వెంకన్నశాస్త్రి పేరు మీద ప్రచురించబడింది.

అనంతరామశాస్త్రి మద్రాసులో లేకపోవడంవల్ల బాల్యవివాహాలమీద చర్చ వాయిదా పడింది. ఈ సమయంలో వెంకన్నశాస్త్రి వాదం ఈ లేఖలో సమగ్రంగా వివరించబడింది. "అనంతరామశాస్త్రికి వ్యతిరేకంగా కొరడా ఝుళిపిస్తాను. ఆయనతో ఢీకొని నా వాదాన్ని వినిపించడానికి సిద్ధంగా ఉన్నాను" అంటూ లేఖ ఆరంభమవుతుంది. కరపత్రం రాయడం పూర్తికాకపోవడం వల్ల, వెంకన్నశాస్త్రి అభిప్రాయాలు ముందుగా లేఖలో వివరించబడ్డాయి. తన మొదటి లేఖలో అనంతరామశాస్త్రి పుస్తకంలో కొన్ని అప్రధానమైన అంశాలకు సమాధానం చెప్పడానికి అవకాశం లేకపోవడంవల్ల, ఈ లేఖలో వాటిని ప్రస్తావిస్తున్నట్లు పేర్కొన్నాడు. ఈ లేఖలో ప్రధానాంశాలు సంగ్రహంగా ఇక్కడ పేర్కొనడం జరిగింది.

"అనంతరామశాస్త్రి తన అభిప్రాయాలను వివరించే సందర్భంలో తరచుగా సభ్యతను విడిచిపెడుతూ ఉంటాడు. ఆయన సంప్రదించిన ఆకరాలు హాస్యాస్పదమైనవి. సభ్యత విడిచిపెట్టకుండా ఆయనకు సమాధానం చెప్పడం వీలుపడదు. ఉద్దేశపూర్వకంగా అటువంటి విషయాలు ఈ లేఖలో ప్రస్తావించడం లేదు, చర్చలో వచ్చే విషయాల స్వభావమే అటువంటిదని పాఠకులు గ్రహించాలి" అని వెంకన్నశాస్త్రి ముందుగా హెచ్చరిస్తాడు.

"తన వాదానికి ఆధారంగా అనంతరామశాస్త్రి మనుస్మృతి 83వ ప్రకరణంలో 8వ శ్లోకాన్ని ఉదాహరించాడు. వివాహయోగ్యమైన కన్యకు కేశాలు అతిగా ఉండడం, పల్చగా ఉండడం మంచిదికాదు. బాలిక ఈడేరిన తర్వాతగాని ఈ విషయం తెలిసే అవకాశం లేదు. అప్పటివరకు చాలా శరీరభాగాలలో కేశాలు రావు. అందుచేత ఈడేరిన బాలికనే పెళ్ళాడాలని మనువు భావించాడు. ఇదీ అనంతరామశాస్త్రి వాదం! పరిహాసాస్పదంగా లేదా ?

ధర్మశాస్త్రాలు విధి నిషేధాలను స్పష్టంగా పేర్కొన్నాయి. ఈ విషయంలో ఎటువంటి స్వేచ్ఛలేదు. శాస్త్రాలు కొన్నికార్యాలను చెయ్యమనో, చెయ్యవద్దనో చెపుతాయి. వీటి ఆచరణలో మనకు స్వేచ్ఛ ఉంటుంది. అనంతరామశాస్త్రి ఉదాహరించిన మనువాక్యాలు రెండో పద్ధతివి. కేశాల ప్రస్తావన సౌందర్యానికి సంబంధించినదేగానీ, ఆయన భావించిన అర్థం దానికి లేదు.

శిశువు జన్మించిన నాటి నుంచి ఎనిమిదేళ్ళు వచ్చే లోపల మనువు షోడశకర్మలు విధించాడు. ఉపనయనంతప్ప, మిగతా కర్మలను ఆడపిల్లలకు కూడా మంత్రాలు లేకుండా ఆచరించాలని విధించాడు. పురుషుడికి ఉపనయన విధితో ఈ కర్మలు ముగిసినట్లు, స్త్రీకి వివాహ విధితో ఇవి పూర్తవుతాయని పేర్కొన్నాడు. స్త్రీకి ఎనిమిదో ఏట వివాహ విధి పూర్తి చెయ్యాలి. ఈ వయసులో కుమార్తె వివాహం నిర్వహించని తండ్రి గర్హనీయుడని స్మృతి పేర్కొంటుంది. బాలికలకు ఎనిమిదో ఏడు నిండేలోపల వివాహకార్యం పూర్తిచేయాలని శాస్త్రగ్రంథాల నుంచి విస్తారంగా ఉదాహరించాము. అనంతరామశాస్త్రి మనువును తప్ప ఇతర రుషుల ధర్మసూత్రాలను అంగీకరించ నన్నాడు. ఆయన వాటిని చదివిన పాపాన పోలేదు. రంగనాథశాస్త్రికి ఇంగ్లీషు వచ్చుకదా! హైస్కూలు పరీక్షలో 'ప్రొఫిషియెంట్' గా ఉత్తీర్ణుడయ్యాడుకదా ! మనుస్మృతి ఇంగ్లీషు అనువాదాలను పరిశీలించవచ్చు కదా !"

## అయిదో లేఖ

వెంకన్నశాస్త్రి పేరుతో ఈ లేఖ మద్రాస్ టైమ్స్‌లో ప్రచురించబడింది. ప్రచురణ తేది లేదు. లేఖ 1865 సెప్టెంబరు 19 నాడు రచించబడినట్లు పేర్కొనబడింది.

రంగనాథశాస్త్రి ఎథీనియం అండ్ డెయిలీ న్యూసు పత్రికలో రాసిన లేఖకు సమాధానంగా ఈ లేఖ రాయబడింది. ఈ లేఖ అనువాదం :-

"అయ్యా !

నేను శాశ్వతంగా నోరు మూయించాననుకొన్న రంగనాథశాస్త్రి నా పుస్తకంకోసం ఎదురుచూస్తున్నట్లు, శ్రీమత్ శంకరాచార్యుల సమక్షంలో పఠిస్తే, వినడానికి తాను, తన స్నేహితుడు అనంతరామశాస్త్రి ఉత్సుకతతో ఉన్నట్లు "ఎథీనియం అండ్ డెయిలీన్యూసు" లో రాశాడు. ఏమీ ఎరగనట్లు నటిస్తున్నాడు కానీ, నా పుస్తకం పూర్తయి, ఎప్పుడు వెలుగు చూస్తుందో ఆయనకు తెలుసు. వచ్చే అక్టోబరు మాసంలో ఏదో ఒకరోజు పుస్తక పఠనానికి ముహూర్తం నిశ్చయించబడింది. ఆయన మిత్రుడు మద్రాసులో లేకపోవడంవల్లే పుస్తక పఠనం ఇంతకాలంగా వాయిదాపడుతూ వచ్చింది. నా ప్రత్యర్థి ఊళ్ళల్లో ఎక్కడో తిరుగుతూ ఉంటే, పుస్తక పఠనం ఏ విధంగా ఏర్పాటు చేస్తారు? అనంతరామశాస్త్రి మద్రాసుకు తిరిగివచ్చిన తర్వాత, మా ఇద్దరిమధ్య నలుగుతున్న వివాదాన్ని మహాపండితుల సమావేశంలో నిర్ణయిస్తారు. ఇందుకు మేమిద్దరం అంగీకరించాము. మద్రాసు ప్రెసిడెన్సీలో కాంచీపురం మొదలైన ప్రదేశాల్లోని సుప్రసిద్ధ పండితులకు ఆహ్వానాలు వెళ్ళాయి. ఆ మహావిద్వాంసులు ఇక్కడికి రావడానికి కొంతసమయం పడుతుంది కదా ! ఇదంతా తెలిసే రంగనాథశాస్త్రి పత్రికకెక్కాడు. నా పుస్తకం అచ్చయితే, నా సత్తా, పుస్తకం సత్తా తెలుస్తుందని రాశాడు. మనువు అష్టవిధ వివాహాలను అంగీకరించాడు కనుక, గాంధర్వవిధిని కూడా అంగీకరించాడని అనంతరామశాస్త్రి తన వాదానికి ఉపపత్తి చూపాడు. మనువు గాంధర్వ వివాహాన్ని గర్హించాడు. ఈ విషయాన్ని అనంతరామశాస్త్రి గమనించలేదు."

## ఆరో లేఖ

మద్రాస్ టైమ్స్‌లో ప్రచురించబడిన తారీకుగాని, లేఖ రాయబడిన తారీకుగాని ఇవ్వలేదు. లేఖ చివర ఎన్.వి.డి. అని పొడి అక్షరాలు ఉన్నాయి. (దంపూరు వెంకట నరసయ్యకు ఇది సంగ్రహ రూపం) ఈ లేఖ సంగ్రహానువాదం :-

"అయ్యా,

మొన్న జరిగిన అవమానకరమైన సంఘటనకు సాక్షిగా నేను ఉన్నాను. అక్కడ ఉండి జరిగిన సంగతులు గమనించిన నావంటి వారెవరికైనా, వార్తాపత్రికలోనో, మరొక వేదికమీదనో వాస్తవాన్ని ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత ఉందని విశ్వసిస్తున్నాను. అందువల్ల వీరు ఏ అద్భుతమైన వేదికమీద అదుపు తప్పి మాట్లాడారో, అటువంటి ప్రదేశాలకు దూరంగా ఉండమని ప్రజలను హెచ్చరించినట్లవుతుంది. ఆ విధంగా ప్రవర్తించినవారు తర్వాత అయినా, మనస్ఫూర్తిగా తమ ప్రవర్తనకు సిగ్గుపడేట్లు చేస్తుంది. మిమ్మల్ని విసిగిస్తున్నందుకు క్షమాపణ కోరకుండా, జరిగిన విషయాలను మీ

ముందుంచడానికి ప్రయత్నిస్తాను.

మీ పత్రికలో ప్రకటన ప్రకారం, గుర్రం వెంకన్నశాస్త్రి ఒకటవతేది, ఆదివారం తిరువత్తూరు వెళ్ళి, మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పూజ్యులు ఆచార్యులను ముందుగా అనుకొన్న ప్రకారం ఆ రోజు కార్యక్రమం మొదలుపెట్టడానికి అనుజ్ఞ కోరాడు. ఆయన అనుమతి ఇవ్వగానే, తాను రాసిన పుస్తకం వినిపించడం మొదలుపెట్టాడు. పుస్తకపఠనం మొదలయ్యే సమయంలో అక్కడే ఉన్న రంగనాథశాస్త్రి, అనంతరామశాస్త్రి కనిపించకపోవడం గమనించి, వారిద్దరినీ లోపలకు వచ్చి కూర్చోవలసినదిగా ప్రార్థిస్తూ, ఒక సేవకుని ద్వారా సందేశం పంపాడు. ఇంత ముఖ్యమైన సందర్భంలో వారు వెళ్ళిపోవడంవల్ల, పుస్తకపఠనం జరుగుతున్నవేళ అక్కడ ఉండడం వారికి ఇష్టంలేదనో, మరేదైనా సంగతో అని అనిపిస్తుంది. ఇదంతా గమనిస్తున్న నాకు అప్పుడు ఏదో ఆశ్చర్యం కలిగించే విషయం జరగబోతున్నట్లు స్ఫురించింది. ఆందోళన, ఉత్సుకత మనసును పెనవేసుకొంటూ ఉంటే, ఈ సాయంత్రం ఇంకా ఏంచూడబోతామో అని అందరం ఎదురుచూచాము. తినబోతూ రుచులడగడమెందుకని, కళ్ళు చెవులు అప్పగించి గమనిస్తూ ఉన్నాను. ఇంతలో ఆ ఇద్దరు శాస్త్రులు వెంకన్న ముందుకు వచ్చి, ఆయన వాదంలో లోపాలకు అక్కడికక్కడే అభ్యంతరం తెలపడానికి అవకాశం ఇవ్వాలని ఒక్కమాటగా అడిగారు. వారి ఇష్టప్రకారమే చెయ్యవచ్చునీ, ముందు వారిద్దరు తన వద్ద ఉన్న కాగితం మీద చేవ్రాలు చెయ్యాలని, తాను చేవ్రాలు చెయ్యడానికి సిద్ధంగా ఉన్నానని వెంకన్నశాస్త్రి సమాధానం చెప్పాడు. మొదట కట్టుబడి ఉంటామని చేసుకొన్న ఒప్పందం ప్రకారం, ఆ కాగితంలో వివరించబడిన నిబంధనలను అనుసరించి వివాదం పరిష్కరించుకోవచ్చని వివరించాడు. (ఈ నిబంధనలు ఈ ప్రయోజనాలను ఉద్దేశించి తయారుచేసినవని నాకు తర్వాత తెలిసింది. వెంకన్నశాస్త్రి, రంగనాథశాస్త్రి అనంతరామశాస్త్రులకు రాసిన లేఖలో ప్రతిపాదించిన విధంగా, ఎంపికచేయబడిన పండితమండలి తీర్పు సంతృప్తికరమైన చివరి తీర్మానంగా ఓడినవారు అంగీకరించాలి. అందువల్ల పుస్తకం ప్రజాశ్రేయస్సుకు భంగం కలిగించేదని, అందులో ప్రమాదకరమయిన సిద్ధాంతాలున్నాయని, నిరూపణ అవుతుంది. అటువంటి పుస్తకం రచించినట్లు రచయిత సిగ్గుపడి, ఒప్పుకొన్నట్లవుతుంది. ఇటువంటివే ఇంకా కొన్ని నిబంధనలు ఆ కాగితంలో ఉన్నాయి. మొదట వారు ఆ ప్రతిపాదనను అంగీకరించారు కాబట్టి, ఇవి న్యాయమైన నిబంధనలే అని అంటున్నాను. అటువంటి నియమాలు పెట్టుకోవాలని వారే పట్టుపట్టారు.)

మద్రాస్ టైమ్స్‌లో ప్రచురించిన నోటీసులో ఈ నిబంధనలేవీ లేవు గనుక, వెంకన్నశాస్త్రి హేతుబద్ధ ప్రతిపాదనలకు తాము కట్టుబడడానికి సిద్ధంగా లేమని వారు సమాధానం

చెప్పారు. వారిట్లా ప్రవర్తిస్తారని ఆయన ఊహకు తట్టలేదు. ప్రతి ఒక్కరూ తనలాగే మాటకు కట్టుబడి, నిర్మలమైన ఆత్మగౌరవం, వ్యక్తిత్వం కలిగి ఉంటారని, వారిమాటలు పూర్తిగా విశ్వసించవచ్చని, ఆ భోళామనిషి, నిర్దోషి అయిన వెంకన్నశాస్త్రి నమ్మాడు. దురదృష్టవంతుడు. గొప్ప వ్యక్తిత్వం కలిగిన ఆయనకు ఈ విధంగా జరిగింది.

ఈ పండితుల మధ్య జరిగిన వాదం సారాంశాన్ని ఇట్లా చెప్పుకోవచ్చు.

వెంకన్నశాస్త్రి :

పత్రికా ప్రకటనలో ఇటువంటి ప్రాముఖ్యంలేని సంగతులు పేర్కొనడం అవసరం అంటారా? బహిరంగసభలకు సంబంధించిన ప్రకటనలు పత్రికల్లో ఎన్నో చూచాను. సభాధ్యక్షులెవరో, ఏ తీర్మానాలు చేయబోతారో ఇటువంటి వివరాలు నేనెన్నడూ చూడలేదు. ఇవన్నీ ఇరుపక్షాల ఆమోదంతో అక్కడికక్కడే చర్చించుకొని నిర్ణయించుకొనవలసిన అంశాలని నేను భావిస్తున్నాను.

వెంకన్నశాస్త్రి మాటలకు ఎదుటిపక్షంవారు సమాధానం చెప్పలేదు. అనంతరామశాస్త్రి ఆ కాగితం మీద చేవ్రాలు చెయ్యడానికి సిద్ధపడుతున్నట్లు అనిపించింది. ఇంతలో రంగనాథశాస్త్రి అతని చెవిలో ఏదో ఊదాడు. ఇద్దరూ వెంకన్నశాస్త్రితో ఇట్లా సంభాషించారు.

రంగనాథశాస్త్రి :

అనంతరామశాస్త్రి : మీరు పత్రికల్లో నిందిస్తూ మా గురించి అవమానకరంగా రాశారు. ఈ అసభ్యపు రాతలవల్ల మాకు కోపం వచ్చింది.

వెంకన్న (సమాధానంగా) : మీ గురించి చెడ్డగా రాసి కోపం తెప్పించి ఉంటే, కోర్టుకు వెళ్ళవచ్చు కదా? ఇక్కడ జరుగుతున్న దానికి మీరందరూ సాక్ష్యం. (సభాసదుల వంక చూచి) వారి వ్యక్తిత్వాన్ని కించపరిచే మాటలేవీ అనలేదని నా అంతరాత్మ చెప్తూంది. టైమ్స్ పత్రికకు నేను రాసిన మూడు లేఖల్లో వారు ప్రతిపాదించిన విషయాలకు వ్యతిరేకంగా వాదించానేకాని, వారికి వ్యతిరేకంగా కాదు. నా బుద్ధికి తట్టిన పొరపాట్లు విమర్శించాను. వారికి సమ్మతం కాకపోతే నా వాదానికి బదులెందుకు రాయలేదు? నా వాదనలను వారు తిప్పికొట్టి ఉండవచ్చు. వారిమీద నేను ఆరోపించిన 'అజ్ఞానం' మొదలైన ఆరోపణలు నామీద వారు ఆరోపించి ఉండవచ్చు.

పరిస్థితి ఇంతవరకూ వచ్చిన తర్వాత, పూజ్యులు శంకరాచార్యులు చర్చను ఆపించారు. సభాపతి, ఆ సభాస్థలి యజమాని అయిన ఆయన మొదటే హద్దూ పద్దూలేని రంగనాథశాస్త్రి ఆగ్రహాన్ని అదుపుచేసి ఉండాలి కదా ! రంగనాథం అదుపు తప్పి, ఉద్రేకంతో వివాదాస్పదంగా మాట్లాడుతూ ఉంటే ఆయనను మందలించి ఉండాలి కదా ! వెంకన్నశాస్త్రి అంతటి పెద్దమనిషిని రంగనాథశాస్త్రి 'ముష్టివాడు' అనే విశేషణంతో సంబోధిస్తే, ఆ ప్రవర్తనకు తగినట్లు ఆయనను సభ నుంచి

బహిష్కరించ వలసింది కదా ! రెచ్చిపోయి వాదించుకొంటున్న వారిని ఒక మందలింపు మాటతో సమాధాన పరచవలసిన అవసరం లేదా ! అక్కడ సమావేశమైన వారందరూ కళ్ళముందు నడుస్తున్న ఈ వివాదాన్ని చూస్తూ ఉన్నారు. వారిలో నేనూ ఉన్నాను. శ్రీ మన్మహాపీఠాధిపతులను నేనొక్కణ్ణే ఎందుకు తప్పుపట్టాలి?

మీ, ఎన్.వి.డి"

నరసయ్య రాసిన ఈ లేఖలో కొంతభాగాన్ని ప్రచురణార్హంగా లేదని విడిచిపెట్టినట్లు మద్రాస్ టైమ్స్ సంపాదకులు ఒక వివరణ ఇచ్చినట్లుంది. నరసయ్య ఆ వివరణ కూడా తన పుస్తకంలో యథాతథంగా వేసుకొన్నాడు. ఆనాటి పండితవాదాలు సాగిన తీరుకు ఈ సంఘటన ఒక ఉదాహరణ. వీరేశలింగం స్వీయచరిత్రలో ఇటువంటి సంఘటనలను వివరంగా చిత్రించాడు. పీఠాధిపతుల సమక్షంలో తనబావగారికి జరిగిన అగౌరవాన్ని తెలియచెయ్యడానికే నరసయ్య ఈ లేఖ రాశాడు. పదిహేడేళ్ళ నరసయ్య దృష్టికోణం నుంచి ఈ లేఖ రాయబడింది. ఆయనలో దాగిఉన్న పత్రికావిలేకరి, రచయిత అంకురరూపంలో ఇందులో వ్యక్తమయ్యాడు. సభలో పాల్గొన్న వ్యక్తుల, సంభాషణలను ప్రత్యక్ష ఉల్లేఖనంలో రాయడం ఆనాటి పత్రికా రచనా పద్ధతులను సూచిస్తుంది. విద్యావంతుడైన తెలుగువాడు బాల్యవివాహాలపై వెలువరించిన మొదటి పుస్తకం అని పరిశోధకులు ఈ పుస్తకాన్ని ప్రస్తుతించారు.[21]

ఈ పుస్తకంలోని మూడో లేఖవల్ల, పీఠాధిపతి బాల్య వివాహాలను సమర్థించిన విషయం స్పష్టంగా తెలుస్తుంది. సంప్రదాయ రక్షకుడైన ఈ పీఠాధిపతి పరిశీలనకోసం అనంతరామశాస్త్రి తాను రచించిన వివాహ్య కన్యా స్వరూప నిరూపణాన్ని పంపాడు. ఈ పుస్తకాన్ని పూర్వపక్షం చేస్తూ వెలువడిన గ్రంథాల్లో తన రచన వాద ప్రహసనాన్ని పీఠాధిపతి, సమగ్ర ఖండనగ్రంథంగా ఎంపికచేసి, సన్మానించినట్లు వెంకన్నశాస్త్రి వాద ప్రహసనమ్ ఉపోద్ఘాతంలో పేర్కొన్నాడు. పీఠాధిపతి అనంతరామశాస్త్రి వాదాన్ని తిరస్కరించినట్లు 1865 అక్టోబరు 4,9 తారీకుల ఎథీనియం అండ్ డెయిలీ న్యూస్ సంచికలు, తదితర పత్రికల వల్ల తెలుస్తూంది.[22] ఈ వివాదం తాత్కాలికంగా సద్దుమణిగిందని, బ్రాహ్మణసంఘంనుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదురుకావడంవల్ల రంగనాథశాస్త్రి బాల్యవివాహాలచర్చ అంతటితో ముగించినా, స్త్రీ విద్య మొదలయిన అభ్యుదయకర విషయాలమీద కృషిచేసినట్లు సుందరలింగం పేర్కొన్నాడు.[23] సంస్కరణవాదులు బహిష్కరణ భయంతో బాల్యవివాహాల మీద చర్చను ముందుకు తీసుకొనిపోయి ఉండరని లెనార్డ్ అభిప్రాయపడ్డాడు.[24] అనంతరామశాస్త్రి మాత్రం అటు తర్వాత మరింత 'రేడికల్' గా మారినట్లు అనిపిస్తుంది.

4

# నేటివ్ అడ్వొకేట్

కోమలేశ్వరపురం శ్రీనివాసపిళ్ళై మరణించిన తర్వాత ఆయన అనుచరుడు సి. వెంకటరాయులు నాయుడు 'రైసింగ్ సన్' పత్రిక ప్రారంభించి, సంఘ సంస్కరణ, ఉదార విద్యావ్యాప్తి, లౌకికభావాలు ప్రోత్సహించడానికి కృషి చేసినట్లు, ఈ పత్రిక నిలిచిపోయిన తర్వాత, 1860 దశాబ్దంలో ఆరంభమైన నేటివ్ అడ్వొకేట్ ఆ ఆశయాలను కొనసాగించిందని, ఈ పత్రిక ఎక్కువ కాలం కొనసాగలేదని చెప్పడం తప్ప సుందరలింగం వివరాలేమి ఇవ్వలేదు[1]. అసైలం ప్రెస్ ఆల్మనాక్ 1867, 68, 69 మూడు సంపుటాల్లోని పత్రికల జాబితాలో ఈ పత్రిక పేరు కన్పించలేదు.

ఇద్దరు నరసయ్య సమకాలికులు నేటివ్ అడ్వొకేట్ పత్రికను గురించి రాశారు. వీరిలో మొదటివాడు గోమఠం శ్రీనివాసాచార్యులు.[2] మద్రాసులో ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ, రచయితగా, నటుడుగా, నాటకప్రయోక్తగా ప్రసిద్ధి పొందాడు. కొంతకాలం సూర్యాలోకం పత్రిక నడిపాడు.[3] నరసయ్యను బాగా ఎరిగినవాడు. సూర్యాలోకం పత్రిక రెండేళ్ళు పూర్తిచేసుకొని, మూడో సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంలో 1901 జూలై 18 సంచికలో తన ప్రత్యర్థి వర్గాన్ని దృష్టిలో ఉంచుకొని 'స్వవిషయము' అనే శీర్షిక పెట్టి గొప్ప సంపాదకీయం

రాశాడు. ఆ సంపాదకీయంలో మద్రాసు ప్రసిద్ధ పత్రికలను ప్రస్తావిస్తూ, పత్రికలకు పుట్టుక, చావు రెండూ సహజమే అంటూ ఈ విధంగా రాశాడు. "... *సూర్యాలోకము పుట్టుటచే ఎవరికే గొప్ప లాభము కలిగెను? గిట్టనేమి ఎవరికేమి నష్టము? రమారమి 25 సంవత్సరములకు ముందు "అథీనియం అండ్ డెయిలీ న్యూస్" అనబడు ఆంగ్లేయ దినవర్తమాన పత్రిక యొకటి యుండెను. అది జాన్ మిల్లర్ మొదలగు గొప్ప దొరలచే జరిపించ బడుచుండెను. చెన్నపురి గవర్నరులలో విశేషఖ్యాతి చెందిన లార్డ్ నేపియర్ గారితో దెబ్బలాడి, కోర్టుకెక్కి, అపరాధమిచ్చి, మరునాడు శ్రీవారిని మరల నెదుర్కొని పత్రికా లేఖకులకుందు హక్కును స్థాపించెను. అట్టి పత్రిక యేమాయెను? దాని పేరు గూడా లుప్తమాయెనుగా !!! మె౹౹ దంపూరు నరసయ్యగారిచే రమారమి 30 సం౹౹లకు ముందు నేటివ్ అడ్వొకేట్ అనబడు నాంగ్లేయ వారపత్రిక యొకటి యారంభించబడెను. మన రాజధానిలో హిందువులలో, ఆంగ్లేయ భాషలో పత్రికను ప్రకటించుటకు ప్రారంభించినవారు ప్రప్రథమమున శ్రీ నరసయ్యగారే. వీరి పేరిపుడెవరికైనా తెలియునా?*"

గోమఠం శ్రీనివాసాచార్యులు రాసినట్లు మద్రాసులో ఒక ఇంగ్లీషు పత్రికకు సంపాదకత్వం వహించిన తొలి దేశీయుడు నరసయ్య కావచ్చు. మద్రాసు పత్రికల చరిత్ర రాసిన వారెవరూ ఈ విషయాన్ని చర్చించలేదు. 1840 ప్రాంతంలో సి. నారాయణస్వామినాయుడు నేటివ్ ఇంటర్ప్రిటర్ (Native Interpretor) పత్రికను స్థాపించినా, ఆయన ఆ పత్రికకు సంపాదకుడుగా వ్యవహరించాడో లేదో ఎవరూ స్పష్టంగా పేర్కొనలేదు. సి. వెంకటరాయులునాయుడు రైసింగ్ సన్ పత్రికను ప్రారంభించాడు. ఆయన తన పత్రికలోనేకాక, ఆనాటి ఇతర పత్రికలలో కూడా రాస్తూ వచ్చినట్లు తెలిసింది. ఒక ఇంగ్లీషు పత్రికకు సంపాదకుడైన మొదటి దేశీయుడు వెంకటరాయులునాయుడే అయి ఉండాలి. ఆయన తెలుగువాడు. ఆయన పత్రిక రైసింగ్ సన్‌కు మరొకరెవరైనా సంపాదకుడుగా వ్యవహరించి ఉంటే, మద్రాసులో ఒక ఇంగ్లీషు పత్రికకు సంపాదకుడుగా వ్యవహరించిన మొదటి స్థానికుడు నరసయ్యే అని తీర్మానించవచ్చు.

నేటివ్ అడ్వొకేట్‌ను ప్రస్తావించిన రెండో సమకాలికుడు ఒంగోలు వెంకటరంగయ్య. "చిన్నతనమున మద్రాసులో నుండగా నేటివ్ అడ్వొకేట్ (Native Advocate) అను నాంగ్లేయ పత్రికను సాగించుచుండిరి. అద్దాని జాలించి కీర్తిశేషులగు వెంకటగిరి మహారాజా రాజగోపాలకృష్ణ యాచేంద్రుల వారికి ఇంగ్లీషు ఉపాధ్యాయులుగా వెంకటగిరి చేరిరి" అని రాశాడు.[4]

తమిళనాడు ఆర్కైవ్స్‌లో నేటివ్ అడ్వొకేట్ పత్రిక అధిపతి డి.కృష్ణయ్య మద్రాసు

ప్రభుత్వ ఛీఫ్ సెక్రెటరీకి రాసిన ఉత్తరం లభించింది.[5] ఆ ఉత్తరం :--

To

The Hone R.S. Ellis, Esq.C.B.

Ag. Chief Secretary to the Government of Fort Saint George.

Sir,

We have the honour to enclose a copy of the "Native Advocate" newspaper, a weekly publication lately started by us, and respectfully wish to be informed if the Madras Government will do us the honour of subscribing to the paper in question.

Ours being a Native newspaper, we have secured a large number of subscribers of some of the most respectable classes among the population. Information of a public character, such as is usually placed by the Government at the disposal of the Press, will therefore be very thankfully received by us, and given insertion to in our columns.

Our humble and respectful request to you therefore is that you would be pleased to obtain the sanction of Government to forward us for the use of the "Native Advocate", all the official papers weekly placed on the Editors' table.

We have the honour to remain, Your very obedient servants,

Kristnama Naick's Tank Street, — D. Krishniah Brothers
Madras, 31 — Proprietors of the
7th August 1867 — "Native Advocate" newspaper

ఈ ఉత్తరానికి సమాధానంగా ప్రభుత్వం ఈ క్రింది ఆర్డరు పాసు చేసింది.

"Order thereon, 21st August 1867, No. 1032

The proprietors of the Native Advocate are requested to furnish Government with one copy of their weekly periodical, and are informed that the Editor will have access to such official documents as are placed at the disposal of the Press.

Sd xxx

Acting Chief Secretary

ఈ ఉత్తరం వల్ల కృష్ణయ్య, ఆయన ఇద్దరు సోదరులు కలిసి పత్రిక ప్రారంభించినట్లు రూఢి అవుతూంది. పత్రిక ప్రారంభించే సమయంలో కృష్ణయ్య పచ్చయ్యప్ప ఉన్నత పాఠశాలలో 'టీచరు' గా పనిచేస్తున్నాడు. పార్థసారథిశాస్త్రి అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో 'క్లర్కు' ఉద్యోగంలో ఉన్నాడు. నరసయ్య పచ్చయ్యప్ప ఉన్నత పాఠశాలలో 'అసిస్టెంట్ టీచరు'. 1867 ఆరంభంలోనే నరసయ్య తన తొలి పుస్తకం 'లెటర్స్ ఆన్ హిందూ మేరేజస్' ప్రచురించాడు. ఆ సంవత్సరం ఆఖరులో "హిస్టారికల్ స్కెచెస్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్" పేరుతో తన రెండో పుస్తకాన్ని ప్రచురించాడు.[6] అప్పటికే ఆయనకు ఇంగ్లీషు భాషలో మంచి ప్రవేశం ఉంది. పత్రికారచనలో అభినివేశం ఉంది.

ఈ లేఖతో పాటు కృష్ణయ్య నేటివ్ అడ్వొకేట్ సంచికను జత చేసినట్లు తెలిపాడు. దురదృష్టవశాత్తు ఆ పత్రిక కాపీ ఫైల్లో కనిపించలేదు. పత్రికకు గౌరవనీయులైన చందాదారులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు కూడా తెలిపాడు. "Lately started" అని అనడంవల్ల పత్రిక 1867 ఆగష్టులోనో, అంతకంటే కొంచెం ముందుగానో ప్రారంభమైనట్లు తోస్తుంది. 1869 అక్టోబరు మాసంలోనో, ఆ మరుసటి నెలలోనో నరసయ్య మద్రాసు విడిచిపెట్టాడు. నేటివ్ అడ్వొకేట్ పత్రిక అంతకు కొంచెం ముందుగా ఆగిపోయి ఉండవచ్చని ఊహిస్తున్నాను. ఆర్థికబలం, పాఠకాదరణ లేక పత్రిక నిలిచిపోయి ఉంటుంది. ఆ కాలంలో దేశీయులు నడిపే పత్రికలకు పాఠకుల ఆదరణ ఉండేదికాదు. 1870లో నరసయ్యకు ఒక ఇంగ్లీషు అధికారి రాసిన జాబులో "No one told me about your insolvency" అనే మాటలు నరసయ్య పత్రిక నడిపి, ఆర్థికంగా చితికిపోయిన విషయాన్ని సూచిస్తున్నాయి. నేటివ్ అడ్వొకేట్ జీవించిన కొద్దికాలం, సామాజిక విషయాలకు, సంస్కరణ భావాలకు అంకితమై ఉంటుంది. నరసయ్య పత్రికా నిర్వహణలో తొలి పాఠాలు ఇక్కడే నేర్చుకొని ఉంటాడు.

5

# నెల్లూరు పయొనీర్

## వెంకటగిరి సంస్థానంలో కొన్నాళ్ళు

నరసయ్య ఏ పరిస్థితులలో మద్రాసు విడిచి పెట్టవలసి వచ్చిందో తెలియదు. ఉద్యోగంలో అసంతృప్తి ఒక కారణం కావచ్చు. ఆ రోజుల్లో పచ్చయ్యప్ప విద్యా సంస్థల యాజమాన్యం ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంలో పక్షపాత దృష్టితో వ్యవహరించేదనే అపవాదు ఉంది. నరసయ్య తండ్రి 1867 ప్రాంతంలో చనిపోయాడు.[1] ఇద్దరు అన్నలు ఉద్యోగాలు చేసుకొంటూ, వేరు కాపురాలు ఉంటున్నారు. ఈ దంపూరు సోదరులు ఉమ్మడిగా నిర్వహించిన నేటివ్ అడ్వొకేట్ పత్రిక వల్ల అప్పులపాలై ఉంటారు. విధిలేని పరిస్థితుల్లో నరసయ్య వెంకటగిరి వెళ్ళడానికి సిద్ధపడి ఉంటాడు.

వెంకటగిరి (నెల్లూరుజిల్లా) జమిందారు సర్వజ్ఞకుమార యాచేంద్ర తన పెద్ద కుమారుడు, పదేళ్ళ పసివాడు అయిన రాజగోపాలకృష్ణకు ఇంగ్లీషు నేర్పించడానికి సమర్థుడైన అభ్యర్థి కోసం అన్వేషిస్తున్న సమయంలో నరసయ్య ఇంగ్లీషు పాండిత్యం గురించి విని ఉంటాడు. ఈ జమిందారుకు నరసయ్య బావ గుర్రం వెంకన్నశాస్త్రితో పరిచయం ఉంది. వెంకన్నశాస్త్రిని మొహమాటపెట్టి నరసయ్యను

వెంకటగిరి పిలిపించుకొని ఉంటాడు. పుట్టి పెరిగిన మద్రాసు పట్నాన్ని, తనకెంతో ప్రియమైన బ్రహ్మసమాజ మిత్రులను, సంస్కరణ కార్యక్రమాలను, అన్నిటికన్నా తనకు ఇష్టమైన పత్రికావ్యాసంగాన్ని వదులుకొని వెంకటగిరి వెళ్ళి ఉంటాడు. 1905 అక్టోబరు 27వ తారీకు దినచర్యలో వెంకటగిరి ఉద్యోగం గురించి ఈ విధంగా రాశాడు. "Deepavali day, 36 Years ago this day, I entered the Venkatagiri Rajah's service as tutor to the present Rajah."

ఆ దినాల్లో వెంకటగిరి విద్వత్సంస్థానంగా పేరుపొందింది. సర్వజ్ఞకుమార యాచేంద్ర మేధావిగా, కవి పండిత పోషకుడుగా పేరు పొందాడు. అప్పుడప్పుడే ఆయన దృష్టి మత సాంఘిక విషయాలపైకి మళ్ళింది. ఆయనకు పాశ్చాత్య విజ్ఞానం మీద విశ్వాసం, శాస్త్రీయ దృక్పథం మీద గౌరవం ఉన్నాయి. ఆస్తికుడే, అయినా మతగ్రంథాలను గుడ్డిగా నమ్మడు. 'సేశ్వర' మతాలన్నీ తనకు ఆరాధ్యమైనవే అంటాడు. 'జ్ఞాన సమాజం' పేరుతో వెంకటగిరిలో ఒక సమాజాన్ని స్థాపించి, వారం వారం సామాజిక, విద్యావిషయాల మీద చర్చించేవాడు. మద్రాసు వేద సమాజం వారితో మత విషయాల మీద ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవాడు. విశ్వమత సిద్ధాంతాలను తెలుసుకోడానికి కృషిచేశాడు. రాధాకృష్ణ భక్తితత్త్వాన్ని అభిమానించి, అనుసరించాడు. ఆ రోజుల్లో ఎంతోమంది కవి పండితులు, గాయకులు, విద్వాంసులు వెంకటగిరి సంస్థానానికి వచ్చి సన్మానాలు అందుకొనేవారు.

ఈ కాలంలోనే సర్వజ్ఞకుమార యాచేంద్ర మత సంబంధమైన పుస్తకాలు రాయడానికి పూనుకొన్నాడు. పద్యంలోకన్నా వచనంలో రాస్తే సులభంగా బోధపడుతుందని, వ్యాకరణ పద్ధతిలో కాకుండా, వాడుకభాషలో రాస్తే, అందరికీ తెలుస్తుందని అప్పటికే ఆయన అనుభవ పూర్వకంగా గ్రహించాడు.[2] ఈ వాతావరణం నరసయ్య వ్యక్తిత్వం మీద ప్రభావం చూపి ఉంటుంది. భాషావిషయాలమీద నరసయ్య అభిప్రాయాలకు ఇక్కడే బీజం పడిఉంటుంది.

నరసయ్య వెంకటగిరి సంస్థాన వాతావరణాన్ని అసహ్యించుకోడానికి బలమైన కారణాలున్నాయి. సర్వజ్ఞకుమార యాచేంద్ర మేధావి, తత్త్వవేత్త అయినా, వేశ్యావ్యామోహం ఆయన బలహీనత. బ్రహ్మసమాజభావాలు, సంఘసంస్కరణోద్యమం నరసయ్య యవ్వనాశలకు ఆకృతి ఇచ్చాయి. మహానగరంలో స్వేచ్ఛగా పెరిగిన యువకుడికి వెంకటగిరి రాచరిక వ్యవస్థ, నిత్యం వేశ్యల నృత్యగాన వినోదాలతో ముగిసే సమావేశాలు, గోష్ఠులు రోత పుట్టించి ఉంటాయి. ఆ జీవితం అసహ్యంగా, ఇరుకుగా అనిపించి ఉంటుంది.[3] సంస్థానం కొలువులో నరసయ్య ఏడాది పాటైనా ఉన్నాడో లేదో! అప్పుడు వెంకటగిరిలో సంస్థానం యాజమాన్యంలో ఒక ఆంగ్లో వర్నాక్యులర్

పాఠశాల పనిచేస్తూంది. అదికాక ఒక 'యూనియన్ స్కూలు' ఉంది.[4] మొత్తం మీద నరసయ్య సంస్థానం కొలువు మానుకొని ప్రభుత్వ అజమాయిషీ ఉన్న ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా చేరిపోయాడు. చివరకు పచ్చయ్యప్ప ఉన్నత పాఠశాల ఉద్యోగం మానుకొని, మారుమూల, వెంకటగిరిలో ఒక చిన్నబడిలో ఉపాధ్యాయుడుగా, అనామకంగా రోజులు గడపవలసి వచ్చింది. నరసయ్య పరిస్థితి నెల్లూరురేంజి డెప్యూటీ స్కూల్స్ ఇన్‌స్పెక్టరు చుండూరు కోటయ్యసెట్టిద్వారా నెల్లూరు కలెక్టరాఫీసులో పనిచేస్తున్న ఒక ఇంగ్లీషు అధికారి దృష్టికి వచ్చింది. ఆయన నరసయ్యను నెల్లూరు కలెక్టరాఫీసులో అనువాదకుడుగా చేరమని ఆహ్వానిస్తూ ఉత్తరం రాశాడు.[5] ఆ ఉత్తరానికి అనువాదం:-

నెల్లూరు,
20, డిసంబరు 1870

సర్,

మీరు అప్పుల పాలైన విషయం నాకు ఎవరూ చెప్పలేదు. ఎవరైనా చెప్పినా నేను పట్టించుకొని ఉండను. సుదర్శనరావుచేత మీకు రాయించాను. ఆ ఉత్తరం ఆంతర్యం మీరు గ్రహించలేకపోయారు. మీరు రాజాగారి కొలువు మానుకొని వెంకటగిరి స్కూల్లో పనిచేస్తున్నారని, విద్యాశాఖనుంచి మీ సేవలు గ్రహించవచ్చని, నిన్ననే కోటయ్యసెట్టిద్వారా తెలిసింది. ఈ పరిస్థితులలో మిమ్మల్ని అనువాదకుడి ఉద్యోగంలో నియమించడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. మీ (నియామకాన్ని) రేపు అదనంగా వెలువరించే గెజిటులో ప్రచురిస్తాను. సెలవుల తర్వాత, తప్పకుండా పనిలో చేరాల్సి ఉంటుంది. ఈ ఆఫీసుపని మీకు నచ్చుతుందా అని నాకు సందేహంగా ఉంది. ఇష్టమైతే సక్రమంగా ఆఫీసుకు హాజరయి, కొంత గొడ్డుచాకిరి చెయ్యడానికి నిశ్చయించుకోవాలి. నేను మద్రాసు వెళ్తున్నాను. సెలవులు ముగిసేదాకా తిరిగిరాను.

మీ
విశ్వాసపాత్రుడు
గ్రాంట్ (........)

అప్పటి జిల్లా కలెక్టరు వేన్స్ ఏగ్న్యు నరసయ్య "విద్యాకుశలత" కు మెచ్చి కలెక్టరాఫీసులో "ట్రాన్సులేటరు" గా నియమించినట్లు ఒంగోలు వెంకటరంగయ్య పేర్కొన్నాడు.

## చుండూరు కోటయ్య సెట్టి

కోటయ్యసెట్టి నెల్లూరువాడు. పళ్ళె చెంచలరావు సమకాలికుడు, స్నేహితుడు. 1867 నాటికే నెల్లూరు జిల్లాలో విద్యాశాఖలో డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్సు ఉద్యోగం

చేస్తున్నట్లు, 1884 వరకు ప్రభుత్వ ఉద్యోగం చేసినట్లు, 1901 ప్రాంతాల వరకు జీవించి ఉన్నట్లు గెజిటు ప్రకటనల వల్ల తెలుస్తూంది.[6] ఈయన నెల్లూరులో తొలి బ్యాంకింగ్ వ్యవస్థ "పర్మనెంట్ ఫండాఫీసు" ఏర్పాటు చెయ్యడంలో పళ్ళె చెంచలరావుతో కలిసి కృషిచేసి ఆ సంస్థ తొలి అధ్యక్షుడయ్యాడు.[7]

కోటయ్యసెట్టి నెల్లూరు జిల్లాలో విద్యావ్యాప్తికి కృషి చేశాడు. 1872 జూన్ మాసంలో జరిగిన జిల్లా లోకల్‌ఫండ్ బోర్డు సమావేశంలో ఆయనచేసినకృషిని అభినందిస్తూ ఈ విధంగా తీర్మానించారు. "కోటయ్యశెట్టి ఇదివరలో చేసిన ప్రయోజనకారియైన నౌకరిని అంగీకరించుచు ఏప్రిల్ (...) లగాయతు 125 జీతం నుండి 150 రూపాయలకు ఇజాఫా చేయవలసినట్లు ప్రెసిడెంటుగారు చేసిన ప్రపోజలును అందరున్ను ఏక మనస్సుగా అంగీకరించిరి. విద్యా విషయమును గురించి ఉత్సాహముతో నున్ను యెడతెగకుండా కోటయ్య నౌకరి చేసి నందుకున్ను అతని యోగ్యతకున్ను యిట్లు చేయడం ప్రోత్సాహ పరుస్తుంది...."[8]

1874లో నెల్లూరుజిల్లాలో ఆరు బాలికా పాఠశాలలు స్థాపించాలని లోకల్‌ఫండు బోర్డు నిశ్చయించింది. ఈ పాఠశాలలకోసం కోటయ్యసెట్టి కృషిచేశాడు. ప్రతివిద్యార్థిని వద్ద అర్ధణా జీతం వసూలు చెయ్యాలని బోర్డుసభ్యులు తీర్మానించారు. కోటయ్యసెట్టి ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ, అసమ్మతిని 'డిసెంటు' రాసి తెలియచేశాడు. ఈ సమావేశంలో పాల్గొన్న నలుగురు నామినేటెడ్ సభ్యులు బడా భూస్వాములు. వీరు బాలికావిద్యను తీవ్రంగా వ్యతిరేకించారు.[9] ఒకేకుటుంబం నుంచి ఒకరి కంటె ఎక్కువ మంది పిల్లలు పాఠశాలకు, హాజరవుతున్నట్లయితే, మామూలుగా వసూలుచేసే స్కూలు ఫీజులో సగం మాత్రమే వసూలు చెయ్యాలని ఆయన చేసిన ప్రతిపాదనను బోర్డు సభ్యులు ఆమోదించలేదు.[10]

కోటయ్యసెట్టి – పళ్ళె చెంచలరావు, ఆర్. రఘునాథరావు మొదలైనవారి ఆలోచనాధోరణికి చెందినవాడు. బ్రహ్మసమాజ భావాలను అభిమానించాడు. మత విశ్వాసాల ప్రమేయంలేని లౌకిక విద్య ఈ దేశానికి అవసరం అని భావించాడు. పాఠ్యపుస్తకాలలో ప్రత్యేకంగా ఒకమతానికి సంబంధించిన దేవతలపేర్లను స్మరించడం లౌకిక విద్యావిధానానికి విరుద్ధమైనదని గట్టిగా నమ్మాడు. వెంకటగిరి జమీందారు సర్వజ్ఞకుమార యాచేంద్ర 'నీతి సూత్రము' పేరుతో చిన్న పుస్తకం రాసి అచ్చు వేశాడు.[11] దాన్ని బళ్ళలో పాఠ్యపుస్తకంగా ప్రవేశపెట్టించాలనే ఆలోచనతో, కోటయ్య సెట్టికి ఆ పుస్తకాన్ని పంపించాడు. అంతటి మహారాజు తన అభిప్రాయాన్ని కోరాడని ఉబ్బిపోకుండా, స్పష్టంగా, నిర్మొహమాటంగా కోటయ్యసెట్టి తనఅభిప్రాయాన్ని తెలియచేస్తూ సమాధానం

రాశాడు. ఈ ఉత్తరం ద్వారా ఆయన వ్యక్తిత్వం, మతవిశ్వాసాలు వ్యక్తమయ్యాయి.[12]

నెల్లూరు,
ఫిబ్రవరి తే 22 ది 1876

మహారాజ రాజశ్రీ, రాజా వెలుగోటి కుమారయాచమనాయుడు బహదర్ – సి.యస్.ఐ పంచహజార్ మనసబ్‌దార్ రాజా ఆఫ్ వెంకటగిరి వారి సముఖమునకూ –

తమరిచ్చిన నీతిసూత్రశతము దీనితోటి మరల పంపించద మగుచున్నది. అది యిచ్చినపుడు దానిని ప్రచురపరచి తెలుగు బళ్ళలోకి తేవచ్చునని వాక్రుచ్చితిరి. గనుక దాని విషయమై నాకు తోచిన యభిప్రాయము వ్రాసెదను. గనుక మన్నించెదరని నమ్మెద. దానిని పూర్తిగాఁ జూచినాను. మరియు కొందరికిఁ జూపించినాను. సదరు గ్రంథములో జెప్పిన నీతులు యందరికి నుపయోగించునవి కొన్ని అనఁగా పెన్సల్‌తో గురుతు చేయబడినది రాజ ధర్మములుగాను సమరసములేక యున్నవి. ఈ గ్రంథము లోకమున కుపయోగకరముగా నుండగోరిన యడల అందరికి నిరాక్షేపణీయముగ నుండుట బాగని తలచి.... కారము గురుతు పెట్టినాను. అవితప్ప కొదమవి అందరు ఒప్పుకొనదగినవిగానే యున్నవి. గనుక వాటిని యెత్తి సంధి లేకపోయినను వ్యాకరణ పద్ధతిగా వ్రాసి అచ్చువేయించిన యడల లోకోపకారముగానే యుండును. మరియు.... అన్ని మతస్థులకు సమానముగా నుండు నటుల శ్రీ రాధాకృష్ణ సహాయం అనక దైవసహాయం అనిగాని లేక అందరికి సామాన్యమైనటువంటి (.......) ముతోగాని ఆరంభించిన యడల బాగుండునని తోచుచున్నది. తమరు రచియించిన గ్రంథము మీద యేమిగాని చెప్పుటకు నాకంత యోగ్యత లేదు... యిప్పటికి సమరస అభిప్రాయము గురించి తమకు తెలిపిన యడల బాగుండునని వ్రాసితిని. గనుక చిత్తగించవలయును.

విధేయుడు
సి. కోటయ్య

భాషావిషయంలో కోటయ్యసెట్టిది వెనుకచూపు. 1864 నాటికే సర్వజ్ఞకుమార యాచేంద్ర వచనం ప్రాముఖ్యాన్ని, వాడుకభాష అవసరాన్ని గ్రహించాడు.

## నెల్లూరు పయొనీర్

నెల్లూరు పయొనీర్ గురించి ఒంగోలు వెంకటరంగయ్య రాసినది తప్ప, కొత్తగా ఎవరూ ఏమీ చెప్పలేకపోయారు. ఈ పత్రిక పందొమ్మిదవ శతాబ్ది అరవయ్యోపది చివర వెలువడిందని, కలెక్టరు కచేరి ఉద్యోగులు నంబెరుమాళ్ళయ్య, నరసయ్య కలిసి ఈ పత్రిక నడిపారని, పత్రికను వెలువరిస్తున్న సమయంలో నరసయ్య నెల్లూరు

కలెక్టరాఫీసులో అనువాదకుడుగా పనిచేసేవాడని, పత్రిక ఒక సంవత్సరకాలం లోపలే పాఠకుల ఆదరణలేక మూతపడిందని, ఈ పత్రిక నిర్వహణను ప్రత్యక్షంగా చూచినవారిని విచారించి తానీ విషయాలు రాసినట్లు ఆయన పేర్కొన్నాడు. ఇది వారపత్రికో, పక్షపత్రికో ఆయన తెలియజేయలేదు.

"Nellore had the People's Front" అని జె. నటరాజన్ మద్రాసు ప్రెసిడెన్సీ టౌన్‌లలో ప్రారంభమయిన తొలిపత్రికలను గురించి వివరిస్తూ రాశాడు[13]. ఈ పేరుతో నెల్లూరులో పత్రిక వెలువడినట్లు ఒంగోలు వెంకటరంగయ్య, బంగోరె వంటి స్థానిక చరిత్రకారులెవరూ పేర్కొనలేదు.

నరసయ్య నెల్లూరు కలెక్టరాఫీసులో అనువాదకుడుగా ఉద్యోగంలో చేరిన వార్త "Collector's office - Assumed charge - Dampuru Narasaya, Translator on 4th, January 1871" అని జిల్లాగెజిటులో ప్రచురించబడింది.[14] "Dampuru Narasaya, Translator Huzur" అని జూన్ 2వ తేది గెజిటులో నరసయ్య ప్రస్తావన ఉంది. ఉద్యోగంలో పదోన్నతి పొంది "హుజూరు ట్రాన్సులేటరు" అయ్యాడో లేక రెండూ ఒకటేనో స్పష్టంగా తెలియదు[15]. ఈ ఉద్యోగంలో అయిదునెలలు పనిచేసి, అనారోగ్య కారణంతో జూన్ ఆరంభం నుంచి నవంబరు 13 వరకు సెలవుమీద ఉన్నాడు.[16] కలెక్టరాఫీసులో ఉద్యోగం చేస్తున్న కాలంలో నరసయ్య నెల్లూరు మూలాపేటలో నివాసమున్నట్లు, 1872 సంవత్సరం నెల్లూరు సెషన్స్‌కోర్టులో జూరరుగా వ్యవహరించడానికి ఎంపిక చేయబడినట్లు గెజిటు ప్రకటనవల్ల తెలుస్తోంది[17]. 1870-1884 మధ్య వెలువడిన నెల్లూరుజిల్లా గెజిటు సంపుటాలను సమగ్రంగా పరిశీలించాను. అందులో నెల్లూరు పయొనీర్ పత్రిక ప్రస్తావన కనిపించలేదు. "ప్రవక్తక వ్యూహములోని నంబెరుమాళ్ళయ్య సబుమేజిస్ట్రేటు పదవి నందియుండెనట" అని వెంకటరంగయ్య రాశాడు. ఆరోజుల్లో నంబెరుమాళ్ళయ్య రెవెన్యూశాఖలో గుమాస్తా ఉద్యోగం చేస్తున్నట్లు గెజిటులో ఉంది. బహుశా ఉద్యోగ విరమణకు ముందెప్పుడో సబుమేజిస్ట్రేటు అయి ఉంటాడు.

మద్రాసు ప్రెసిడెన్సీ జిల్లాలలో అప్పుడప్పుడే పత్రికా ప్రచురణ మొదలవుతూంది. జిల్లాలో విద్యావ్యాప్తి తక్కువగా ఉండడం, పత్రికాపఠనం కొత్తకావడం, ఇంగ్లీషు పత్రిక కావడం మొదలైన అంశాలు నెల్లూరు పయొనీర్ వైఫల్యానికి దారితీసి ఉంటాయి. విద్యాశాఖలో ఉద్యోగం కావడంవల్ల నరసయ్య నివాసం ఒంగోలుకు మార్చవలసి రావడం, స్థానికుడు కాకపోవడం, అంగబలం, అర్థబలం చాలకపోవడం, వయసులో చాలా చిన్నవాడు కావడం కూడా పత్రిక కొనసాగక పోవడానికి కారణాలు అయి ఉంటాయి. ఈ ప్రయత్నంవల్ల నరసయ్యలోని పత్రిక వెలువరించాలనే తీవ్రమైన ఆరాటం

వ్యక్తమవుతూంది. నూతన ఆవిష్కరణలకోసం కృషిచేసిన శాస్త్రజ్ఞుల జీవితాలకు, నరసయ్య జీవితానికి చాలా పోలికలు కనిపిస్తాయి. ఆయన చేసిన ఈ రెండో ప్రయత్నమూ కొనసాగలేదు.

ఒంగోలు వెంకటరంగయ్య నరసయ్యను, నంబెరుమాళ్ళయ్యను "ఇద్దరాంగ్లేయ భాషా సాహితీ ధురీణులు" అని ప్రశంసించాడు. గురజాడ తర్వాత నరసయ్య ఆంగ్లభాషా వైదుష్యాన్ని ప్రస్తుతించిన వ్యక్తి వెంకటరంగయ్య. "దంపూరు నరసయ్య యన్నచో ఈయనకు వార్తాప్రచార ముగ్గుపాలతో నలవడియున్నది" అని ప్రస్తుతించాడు. నరసయ్యను "నెల్లూరు జర్నలిజం జనకుడ"ని బంగోరె నుతించాడు. నెల్లూరు పయొనీర్ కన్న ముందునుంచీ 'నెల్లూరు డిస్ట్రిక్ట్ గెజిటు' వారం వారం క్రమం తప్పకుండా వెలువడుతూనే ఉంది. పరిశోధకులు గెజిటును పత్రికగా అంగీకరించారు.[18] ప్రభుత్వేతర రంగంలో తొలిపత్రిక స్థాపించినందువల్ల కూడా నరసయ్య నెల్లూరు పత్రికారంగానికి ఆద్యుడు కాలేదు. ప్రజాశ్రేయస్సుకోసం జీవితం అంతా పత్రికలు నిర్వహించడంవల్ల, నిర్భయంగా, నిర్మోహమాటంగా రాసి ఉన్నత ప్రమాణాలు స్థాపించడంవల్ల నెల్లూరు పత్రికాలోకానికి ఆద్యుడు, ఆరాధ్యుడు అయ్యాడు, జనకుడయ్యాడు. నరసయ్య నెల్లూరు కలెక్టరాఫీసులో ఉద్యోగం చేస్తున్న కాలంలోనే "ఎసన్షియల్స్ ఆఫ్ ఇంగ్లీష్ గ్రామర్" పుస్తకం ప్రచురించాడు.[19] నాలుగైదేళ్ళ ఇంగ్లీషు బోధనానుభవం పుస్తక రచనకు దోహదం చేసి ఉంటుంది.

## డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉద్యోగం

మద్రాసు ప్రభుత్వ విద్యాశాఖ రెండవ డివిజన్‌లో నాలుగు డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉద్యోగాలకు అభ్యర్థులు అవసరం అని, 1871 డిసంబరు 9వ తారీకు నెల్లూరు జిల్లా గెజిటులో ప్రకటన వెలువడింది. నెల్లూరుజిల్లాలో విద్యాశాఖలో పనిచేస్తున్న కోటయ్యసెట్టి నరసయ్య అర్హతలకు, యోగ్యతకు ముచ్చటపడి, తన పలుకుబడితో ఈ ఉద్యోగం వేయించినట్లుంది. ఈ ఉద్యోగానికి ఎంపికఅయి, ఆ ఏడు మార్చినెలలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టినట్లుంది. కలెక్టరాఫీసులోనే రెండవ వర్నాక్యులర్ క్లర్కుగా పనిచేస్తున్న మేకల పార్థసారథినాయుణ్ణి ట్రాన్స్‌లేటరు పోస్ట్‌కు బదిలీ చేసినట్లు ఏప్రిల్ 27వ తేది నెల్లూరు జిల్లా గెజిటు ప్రకటన వెలువడడం వల్ల, నరసయ్య కొత్త ఉద్యోగంలో చేరినసంగతి రూఢి అవుతూంది.

### నెల్లూరు మునిసిపాలిటి కమిషనర్ల సమావేశం

ఆ రోజుల్లో మునిసిపాలిటి పాలకమండలి సభ్యులను కమిషనర్లని పిలిచేవారు. జిల్లా కలెక్టరు ముఖ్యమైన అధికారులను కమిషనర్లుగా నియమించేవాడు. 1872

మార్చి 27వ తారీకునాడు కమిషనర్ల సమావేశం జరిగింది. జిల్లా కలెక్టరు వేన్సు ఏగ్న్యూ ఈ సమావేశానికి అధ్యక్షత వహించాడు. కోటయ్యసెట్టి, నరసయ్య కమిషనర్లహోదాలో సమావేశంలో పాల్గొన్నారు. జె. మెక్లిన్, కె. జగన్నాథంచెట్టియారు, నరసయ్య ముగ్గురూ ఒక ఉపసంఘంగా ఏర్పడి, నెల్లూరు టౌన్‌లో ప్రాథమిక పాఠశాలల విస్తరణకోసం తయారుచేసిన నివేదికమీద ఈ సమావేశంలో చర్చ జరిగింది.[20] అటుతర్వాత ఎన్నడూ నరసయ్య నెల్లూరు మునిసిపాలిటి పాలకమండలి సమావేశాలలో పాల్గొన్నట్లు గెజిటులో రిపోర్టు కాలేదు.

## నెల్లూరు జిల్లా లోకల్‌ఫండ్ బోర్డు సమావేశాలు

నెల్లూరు జిల్లా లోకల్‌ఫండ్ బోర్డు సమావేశాల్లో డెప్యూటి స్కూల్ ఇన్‌స్పెక్టర్ల హోదాలో కోటయ్యసెట్టి, నరసయ్య పాల్గొంటూ వచ్చారు. కోటయ్యసెట్టి నెల్లూరు రేంజి విద్యాధికారి, నరసయ్య ఒంగోలు రేంజి విద్యాధికారి. 1872 ఏప్రిల్ మాసంలో జరిగిన బోర్డు సమావేశంలో నరసయ్య మొదటిసారి పాల్గొన్నాడు.[21] కోటయ్యసెట్టి, నరసయ్య నెల్లూరు జిల్లాలో పాఠ్యపుస్తకాల పంపిణిలో తీసుకోవలసిన చర్యలను సూచిస్తూ, రాసిన లేఖలను సమావేశంలో చర్చించారు. ఇన్‌స్పెక్టింగ్ మాస్టర్లకు అలవెన్సు కొనసాగించాలని వీరు చేసిన ప్రతిపాదనను బోర్డు సభ్యులు ఆమోదించారు.

1872 అక్టోబరునెలలో జరిగిన బోర్డుసమావేశంలో ఉత్తమవిద్యార్థులకు బహుమతులిచ్చి ప్రోత్సహించాలని నరసయ్య ప్రతిపాదించి, అందుకోసం అవసరమైన పుస్తకాలజాబితా తయారు చేసి సభ్యుల ముందుంచాడు. ఈ ప్రతిపాదనల మీద చర్చ జరిగింది. తరగతిలో పదిమంది కన్న తక్కువ విద్యార్థులున్నపుడు ఒక బహుమతి చాలని, అంతకు మించి విద్యార్థులున్నపుడు రెండు బహుమతులివ్వవచ్చని సభ్యులు తీర్మానించారు. ప్రతి పాఠశాలలోనూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యే ఒక విద్యార్థికి బహుమతి ఇవ్వాలని నరసయ్యచేసిన, ప్రతిపాదనకూడా సభ్యుల ఆమోదం పొందింది.[22]

1873 మే 12వ తారీకున జరిగిన బోర్డుసమావేశంలో ఒంగోలుడివిజను పాఠశాలల్లో, కింది తరగతుల్లో అనుసరించబడుతున్న పాఠ్యాంశాలమీద నరసయ్య ఒక నివేదికను తయారుచేసి, సమర్పించాడు. యూనియన్ స్కూళ్ళ నిర్వహణలో, ఇన్‌స్పెక్టింగ్ మాస్టర్ల విధులకు సంబంధించిన కొన్ని నిబంధనలు ప్రవేశపెట్టాలని కోరాడు.[23] 1874 మే 8న జరిగిన బోర్డు సమావేశానికి, కోటయ్యసెట్టి, నరసయ్య హాజరయ్యారు. ఉదయగిరిలో ఒక ఆంగ్లో వర్నాక్యులర్ పాఠశాల ప్రారంభించమని అభ్యర్థిస్తూ, అక్కడి తాసిల్దారు నరసయ్యకు ఒక ప్రతిపాదన పంపాడు. ఇదే విషయంమీద అక్కడి ప్రజలు నరసయ్యకు ఒక అర్జీ ఇచ్చారు. ప్రజల కోరికను మన్నించి, ఉదయగిరిలో స్కూలు నెలకొల్పి, హిందుస్థానీ, తెలుగు, ఇంగ్లీషు

బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని నరసయ్య చేసిన ప్రతిపాదనను బోర్డుసభ్యులు ఆమోదించారు.[24] ఆ ఏడే, ఆగస్టు 5వతేది జరిగిన బోర్డుసమావేశానికి కోటయ్యసెట్టి, నరసయ్య హాజరయ్యారు. "లోకలు ఫండు స్కూళ్ళకు ఒక కుటుంబము తాలూకు విశేషమంది చిన్నవాళ్ళు వచ్చిన యడల మామూలు ఫీజులో సగమే తీసుకొనేటట్టు ఉత్తర్వు చేయవలసినదిగా నెల్లూరు డిపిటీ స్కూలు యినిస్పెక్టరువారు చేసిన దరఖాస్తుకు సభికులలో అనేకులు వొప్పుకోనందున తోసివేయడమైనది." అని ఒక తీర్మానం ఉంది. కోటయ్యసెట్టి ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ, తన అసమ్మతిని లిఖితపూర్వకంగా తెలియచేశాడు. భూస్వామ్య వర్గం నుంచి బోర్డుకు నామినేట్ చేయబడిన ముగ్గురు సభ్యులూ కోటయ్యసెట్టి ప్రతిపాదనను వ్యతిరేకించారు.[25] ఇప్పుడు స్వల్ప విషయాలుగాతోచే, ఈ చిన్న చిన్న రాయితీలకోసం నిజాయితీగా కృషిచేసిన అధికారులు ఎంత వ్యతిరేకతను ఎదుర్కొన్నారో ఈ సంఘటన నిరూపిస్తుంది. 1875 జూన్ మొదటివారంలో జరిగిన బోర్డు సమావేశంలో కోటయ్యసెట్టి, నరసయ్య పాల్గొన్నారు.[26] నరసయ్య హాజరైన చివరి బోర్డు సమావేశం ఇదే. ఆ తర్వాత నెల్లూరు జిల్లాగెజిటులో ఆయన పేరు కన్పించలేదు. అసైలం ప్రెస్ ఆల్మనాక్‌లో కూడా 1875 తర్వాత డెప్యూటీ స్కూల్ ఇన్‌స్పెక్టర్ల జాబితాలో నరసయ్య పేరు కన్పించలేదు. 1876 నవంబరు 10వ తారీకున జరిగిన బోర్డు సమావేశం ఒంగోలు డెప్యూటీ స్కూల్ ఇన్‌స్పెక్టరు హోదాలో సి.ఎన్. నారాయణరావు, 1879 నవంబరు 1వ తారీకు సమావేశంలో సి. కుప్పుస్వామిఅయ్యరు పాల్గొన్నట్లు గెజిటులో ఉంది. నరసయ్య నెల్లూరు కోర్టు వాజ్యాలంలో "Before I settled in Madras in April 1881, I was employed in this district" అని పేర్కొన్నాడు. నరసయ్యకు తారీకులు, సంవత్సరాలు అన్నీ చిన్నవివరాలు కూడా తప్పిపోకుండా, నిర్దుష్టంగా వివరించే అలవాటుంది. దినచర్యలో ప్రతి విషయం స్పష్టంగా రాశాడు. బహుశా గృహచ్ఛిద్రాలు, ఇతర కారణాలవల్ల 1876-81 మధ్యకాలంలో తరచుగా సెలవుమీద ఉండడంవల్ల ఆయన స్థానంలో ఇతరులు పనిచేసి ఉంటారని భావిస్తున్నాను. మొత్తంమీద కోటయ్యసెట్టి సాహచర్యంలో నరసయ్య నెల్లూరుజిల్లాలో విద్యాభివృద్ధికి పాటుపడ్డాడు. ఆయన జీవితంలో ఇది ముఖ్యమైన కాలం. వ్యక్తిత్వం రూపుదిద్దుకొంటున్న కాలం.

## నరసయ్య ఒంగోలు జీవితం

నరసయ్య కష్టాలు 1875లో మొదలయ్యాయి. ఉద్యోగజీవితంలో, కుటుంబ విషయాల్లో అన్నీ ఇబ్బందులే. ఈ సమయంలోనే ఆయన సెలవుపెట్టి, రెవెన్యూ బోర్డులో ప్రవేశించడానికి ప్రయత్నం చేసినట్లు చెప్పడానికి ఆధారాలున్నాయి. ఈ ఉద్యోగ విషయంగా నరసయ్య ప్రయత్నాన్ని తెలియచేసే ఒక ఉత్తరం దొరికింది. ఆ ఉత్తరం

రాసినవ్యక్తి చేవ్రాలు పోల్చుకొని, తెలుసుకోలేక పోయాను. ఉత్తరం అనువాదం:-

19 ఆగస్టు 1875

ప్రియమైన నరసయ్యా,

మీ మొదటి ఉత్తరం చదివి దారుణమైన కుటుంబ విషయాలు తెలుసుకొన్నాను. అవి ఎంతో బాధకలిగించేవి. రెండుసార్లు మీకు ఉత్తరం రాయాలని ప్రయత్నించి, రాయలేకపోయాను. ఈ పరిస్థితుల్లో మాటలు హాస్యాస్పదంగా ఉంటాయి. మీకు సానుభూతి తెలియ చెయ్యడం తప్ప, నాకు ఏం రాయాలో తోచడం లేదు. ఈ గాయాలను కాలం తప్ప, ఏదీ మాన్చలేదు.

వేన్సు ఏగ్న్యూవంటి పలుకుబడి కలిగిన వారెవరైనా సహాయపడితేనే తప్ప, రెవెన్యూ బోర్డులో ఉద్యోగం సంపాదించాలనే మీ ప్రయత్నం నెరవేరడం చాలా కష్టం. మీరు కోరుకొనే పదోన్నతి కూడా దేశీయులైన అధికారుల అండలేకపోతే, చిన్న ఉద్యోగంలో చేరి, ఆ హోదాకు చేరుకొనే అవకాశాలు చాలా తక్కువ. మెంబర్లంతా సెక్రెటరీ మీద విడిచిపెడతారు. ఆయన తనను ఆశ్రయించుకొని ఉన్న వారిమీద విడిచిపెడతాడు. ఈ విషయంలో నేనేవిధంగానూ సహాయపడలేను. క్షమించు.

మర్యాదాపూర్వకంగా
భవదీయుడు
(..................)

ఉత్తరంలో నరసయ్య కుటుంబ బాధల ప్రస్తావన ఉంది. బహుశా నరసయ్య పెద్దన్న అకాల మరణాన్ని గురించిన ప్రస్తావనకావచ్చు. అన్న 'పార్థసారథయ్య' మరణం తర్వాత, తను మద్రాసు వెళ్ళి స్థిరపడాలని యోచించి ఉంటాడు.[27] ఈ ఉత్తరంలో రెవెన్యూబోర్డు ఉద్యోగాన్ని గురించి, పదోన్నతిని గురించి, ప్రస్తావించబడింది. ఇంగ్లీషు అధికారుల మెహర్బానీ సంపాదించిన దేశీయ ఉద్యోగుల ప్రాపకం, వేన్సు ఏగ్న్యూ వంటి గొప్పవారి అండ ఉంటేనే ఆ ఉద్యోగంలో ప్రవేశించడం సాధ్యపడుతుందని ఉత్తరం రాసిన వ్యక్తి తెలియచేశాడు.[28] ఆనాటి ప్రభుత్వ పరిపాలన గురించి పరిశోధించిన ఫ్రైకంబర్గ్[29] (R.E. Frykenberg), లెనార్డ్, సుందరలింగం మొదలైన పరిశోధకులు ప్రభుత్వోద్యోగాలలో అధికారుల ప్రాపకం గురించి వివరంగా రాశారు. నరసయ్యకు కులపెద్దల అండదండలు లేవు. ఆయన దేశస్థ బ్రాహ్మణుడూ కాదు, తెలుగు నియోగి బ్రాహ్మణుడూ కాదు. తెలుగు ద్రావిడ వైదికి. ఉద్యోగ జీవితంలో పైకి రాలేకపోవడానికి, ప్రాపకం లభించకపోవడానికి ఇది కూడా కారణం కావచ్చు. నిర్మొహమాటంగా, నిజాయితీగా, మాట్లాడే ఆయన వ్యక్తిత్వం వల్ల కూడా ప్రభుత్వోద్యోగంలో ఇమడలేకపోయి ఉంటాడు. పదోన్నతి

పొందలేకపోయి ఉంటాడు.

ఒంగోలు నూనెవర్తకుల "పబ్లిక్ న్యూసెన్సు" మీద రాసిన తర్వాత, పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ డైరెక్టరుతో అభిప్రాయ భేదం ఏర్పడి నరసయ్య ఉద్యోగం మానుకొన్నట్లు ఆయన మనుమడు కృష్ణమూర్తి చెప్పాడు. కానీ ఆ రోజుల్లో ప్రభుత్వోద్యోగాలు చేస్తూ, ఆర్. రఘునాథరావు, కొక్కొండ వెంకటరత్నం, వీరేశలింగం మొదలయినవారు ప్రజాశ్రేయస్సు అభిలషిస్తూ, పత్రికలలో రాశారు. వీరేశలింగం, వకీళ్ళ అక్రమార్జనమీద, న్యాయస్థానాల పనితీరుమీద తీవ్రంగా దాడిచేశాడు. 'పబ్లిక్ న్యూసెన్సు' మీద రాసినంత మాత్రం చేత, పై అధికారుల ఆగ్రహానికి బలై ఉంటాడని నమ్మలేము. కుటుంబ పరిస్థితులు, ఉద్యోగంలో అసంతృప్తి, పత్రిక నడపాలనే బలమైన కాంక్ష ఆయనను నిలవనిచ్చి ఉండవు. ఇటువంటి కారణాలవల్లే ఆయన ప్రభుత్వోద్యోగం మానుకొని ఉంటాడు.

## 'ఎ నేటివ్ ఆన్ న్యూసెన్సెస్' (A native on nuisances)

'ఎ నేటివ్ ఆన్ న్యూసెన్సెస్' శీర్షికతో నరసయ్య రాసిన ఒక సంపాదకీయ లేఖ మెయిల్ (The Madras Mail) దినపత్రికలో ప్రచురించబడింది. "ఆయన మనుమడు శ్రీ భట్టారం కృష్ణమూర్తిగారు ఈ లేఖకుడికి ఇచ్చిందల్లా 1906లో నరసయ్యగారు తన సొంత అక్షరాలతో రోజువారి వ్రాసుకున్న డైరి, 1875 ప్రాంతంలో మద్రాసు మెయిల్ పత్రికలో పడిన "A native on nuisances" అనే సుదీర్ఘమైన లేఖ" అని బంగోరె వివరించాడుకాని లేఖ ప్రచురించబడిన తారీకు, నెల పేర్కొనలేదు[30]. మెయిల్ పత్రిక పుటలు ఏమయ్యాయోకానీ, బంగోరె ఆ లేఖను టైపు చేయించి, దానిమీద "Dampuru Narasaiah 1875 Madras Mail" అని సొంతదస్తూరితో రాసి పెట్టిన కాపీమాత్రం ఈ రచయిత సంపాదించగలిగాడు. నరసయ్య రాసిన లేఖలో అవసరమైన భాగాలను అనువదించి ఇక్కడ ఇవ్వడం జరిగింది.

*మెయిల్ పత్రిక సంపాదకులకు,*

ఈ లేఖను మెయిల్ పత్రికలో ప్రచురించమని ప్రార్థిస్తున్నాను. ఇందులో అంతా వివరంగా ఉంది. నేను కాపురం ఉంటున్న ప్రదేశానికి సమీపంలో నివసిస్తూ, మేజిస్ట్రేటు (Magistrate) గా పనిచేస్తున్న నా దేశీయ మిత్రుడికి ఈ లేఖను పంపాను. నేనూ దేశీయుణ్ణే. అయినా, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న దేశీయ మేజిస్ట్రేట్లమీద నాకు రవంత కూడా విశ్వాసం లేదు. వ్యక్తిగత స్వార్థంవల్ల, పౌరపాలన విషయంలో వారిఅభిప్రాయాలు గందరగోళంగా ఉంటాయి. ఒక కేసులో వారికి ఆసక్తి లేకపోతే, పట్టించుకోరు. చట్టాన్ని పరిశీలించి న్యాయం చెయ్యరు. ఇక్కడి స్థానిక మేజిస్ట్రేటు నా ఉత్తరం అందుకొని కొన్ని వారాల తర్వాత, చర్య తీసుకోడానికి సిద్ధపడ్డాడు. ఆయన

ఏంచేశాడో తెలుసా? డివిజనల్ మేజిస్ట్రేటు (Divisional Magistrate) ఆర్డరుకోసం నా లేఖలోని విషయాలను నివేదించాడు. ఆ డివిజనల్ మేజిస్ట్రేటు చేసిన తీర్మానం ఏమిటనుకొన్నారు? నేను నివసిస్తున్న ఇంటికన్నా, ఇంకాస్త సౌకర్యంగా ఉండే ఇంటికి మారమని సలహా ఇచ్చాడు. ఆ పనేదో నేను చేయలేనట్లు ! గ్రామీణప్రాంతాలలో పౌరస్పందన ఈ విధంగా కాపాడబడుతూ ఉంది. ప్రజల అసౌకర్యాన్ని నివారించమని నేను కోరాను. మేజిస్ట్రేటు 'మహా తెలివిగా' మమ్మల్ని మాట్లాడవద్దని చెప్పాడు.

మీ విశ్వాసపాత్రుడు, D..

నరసయ్య మేజిస్ట్రేటుకు రాసిన జాబు కాపీని తన సంపాదకీయ లేఖతోపాటు జతచేసి మెయిల్ పత్రికకు పంపాడు. ఆయన మేజిస్ట్రేటుకు ఉత్తరం ఏ సందర్భంలో రాశాడో వివరిస్తాను. ఒంగోలులో నరసయ్య కాపురంఉన్న ఇంటిపొరుగున ఒక 'కోమటి' వేపనూనె తీసేవాడు. ఇందుకోసం విధివిరామం లేకుండా, రాత్రి పగలు అనే భేదం లేకుండా రోళ్ళలో వేప విత్తనాలు పోసి దంచుతూ ఉంటారు. ఆ విధంగా దంచగా వచ్చిన పిండి ముద్దను ఉడికించి, వేపనూనె తీస్తారు. నూనె వండిన తర్వాత మిగిలిన వ్యర్థపదార్థాన్ని ఇంధనంగా వాడుతారు. దీనివల్ల గాలి కంపు కొడుతుంది. వాతావరణం దుర్భరంగా తయారవుతుంది. జనసమ్మర్దమైన నివాస ప్రాంతాలలో వేపనూనెతీసే కార్యక్రమం కొనసాగించడంవల్ల ప్రజల ఆరోగ్యానికి చేటు కలిగే పరిస్థితి ఏర్పడుతుంది.

దుర్భరమైన ఈ పరిస్థితి నుంచి విముక్తి కోరుతూ నరసయ్య పోలీసు రిపోర్టు ఇస్తాడు. పోలీసులు విచారించి, నరసయ్య రిపోర్టు చేసిన విధంగానే పరిస్థితి ఉందని 'అక్కరెన్సు' (occurrence) రిపోర్టు మేజిస్ట్రేటుకు పంపుతారు. ఆ రిపోర్టును మేజిస్ట్రేటు 'బుట్ట దాఖలు' చేస్తాడు. పోలీసులు పంపిన రిపోర్టు మీద చర్య తీసుకోబడలేదని గ్రహించిన నరసయ్య మేజిస్ట్రేటుకు ఉత్తరం రాస్తాడు. "పోలీసులు పంపిన రిపోర్టు మీద చర్య తీసుకోలేదని విని ఆశ్చర్యపోయాను. అన్నిరకాల 'న్యూసెన్స్‌లను' నిర్మూలించడంలో మీరు అసాధారణమైన చొరవ చూపుతున్నారని విన్నప్పుడు నా ఆనందానికి, ఆశ్చర్యానికి హద్దు లేకుండా పోయింది" అని మేజిస్ట్రేటుకు రాసిన ఉత్తరంలో అంటాడు. పీనల్‌కోడ్ (Penal Code) 278 సెక్షన్ కింద ఈ న్యూసెన్సు శిక్షార్హమైనదని పేర్కొంటూ, తన వాదనకు బలాన్నిచ్చే ఒక సంఘటన వివరిస్తాడు.

మద్రాసు సముద్రతీరంలో మునిగిపోయిన నౌకలోని బియ్యం తడిసిపోతుంది. ఈ సంఘటన సీనియర్ మేజిస్ట్రేటు దృష్టికి వెళ్తుంది. ఆయన తడిసిన బియ్యాన్ని సముద్రంలో కుమ్మరించమని ఆజ్ఞాపిస్తాడు. నౌక యజమానికి పెద్ద మొత్తం నష్టం కలిగినా నౌకను మందుగుండుతో పేల్చివేస్తారు. ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకొని చేసిన పని ఇది. ప్రజారోగ్యానికి నష్టంవాటిల్లే అసహ్యకర పరిస్థితి ఏర్పడితే, దయ, జాలి వంటి

భావావేశాలకు లోనుకాకుండా, వెంటనే నివారించే బాధ్యత మేజిస్ట్రేటు మీద ఉందని నరసయ్య తన ఉత్తరంలో హెచ్చరిస్తాడు. ఇది ప్రజలు తమ వృత్తి కొనసాగించే క్రమంలో ఏర్పడే అసౌకర్యం అని, ఇటువంటి అసౌకర్యాలు ఎంతో కాలంగా కొనసాగుతున్నాయనే భావనతో మేజిస్ట్రేట్లు చర్య తీసుకోకుండా ఉపేక్షించి ఉంటారని నరసయ్య వివరిస్తాడు. ఇటువంటి సందర్భాలలో చట్టం ఏమి చెప్తున్నదో వివరిస్తాడు.

"నీ వృత్తి కొనసాగించుకోడానికి చట్టం రక్షణ కల్పిస్తుంది. ఈ రక్షణ ప్రజలకు అసౌకర్యం కలిగించనంత వరకే. అసౌకర్యం కలిగిన మరుక్షణంలోనే నీ ప్రవర్తన సివిల్, క్రిమినల్ (Civil, Criminal) చర్యలకు అర్హమవుతుంది. ప్రజారోగ్యానికి నష్టం వాటిల్లుతున్న సందర్భాలలో నీకు చట్టపరమైన రక్షణ ఉండదు." అని వ్యక్తి స్వేచ్ఛకు, సమాజ భద్రతకూ మధ్య ఉన్న పల్చని సరిహద్దు రేఖను విశదీకరిస్తాడు.

ఇటువంటి సందర్భాలలో మేజిస్ట్రేట్లు మెతకగా వ్యవహరించడంవల్ల కలిగే నష్టాలను నరసయ్య ఈ ఉత్తరంలో విశదంచేస్తాడు. "మేజిస్ట్రేట్లు చర్య తీసుకోక పోవడంవల్ల, చట్టం తమకు అండగా ఉంటుందనే విశ్వాసం ప్రజలలో సన్నగిల్లుతుంది. చట్టాలను ఉల్లంఘించేవారికే అవి అనుకూలంగా ఉంటాయని తెలిస్తే, వాటిని ఎవరు గౌరవిస్తారు? ద్వేషించకుండా ఎందుకుంటారు? ప్రభుత్వోద్యోగులు చట్టప్రకారం వ్యవహరించకుండా, సంవేదనలను అనుసరించి నడుచుకొంటే, చట్టాన్ని ఉల్లంఘించేవారు ఇవి తమకు చాలామంచి రోజులని భావిస్తారు. చట్టాన్ని గౌరవించేవారు మాత్రం ఇది చాలా దురదృష్టకరమైన పరిస్థితి అని అనుకొంటారు అంటూ ఈ లేఖలో ఆయన వివరంగా రాస్తాడు.

ఈ సందర్భంలోనే నరసయ్య తన వాదనకు శక్తినిచ్చే మరొక ఉదంతాన్ని ఉదాహరిస్తాడు. మద్రాసు సముద్రతీరంలో ధాన్యం గిడ్డంగులున్న వీధి, పొద్దస్తమానం ధాన్యం వ్యాపారులతో కిటకిట లాడుతూ ఉంటుంది. అక్కడ అనాదిగా ఇటువంటి పరిస్థితి ఉంది. ఒకరోజు మునిసిపాలిటి ఇన్‌స్పెక్టరు ఆకస్మికంగా చాలామంది ధాన్యం వ్యాపారులను అదుపులోకి తీసుకొని మేజిస్ట్రేటు ముందు ప్రవేశపెట్టాడు. ఆ దారిలో వచ్చేపోయే వాహనాలకు ఈ వ్యాపారులు అంతరాయం కలిగిస్తున్నారనే కారణంతో మేజిస్ట్రేటు పెద్ద మొత్తం జుల్మానా విధిస్తాడు. ఈ తీర్పును విమర్శిస్తూ మద్రాసులో పత్రికలన్నీ గగ్గోలు పెడతాయి. ప్రజల తరపున ప్రభుత్వానికి ఎన్నో మహజరులు అందుతాయి. ఇంత జరిగినా ప్రభుత్వం మేజిస్ట్రేట్ చర్యనే బలపరుస్తుంది. చట్టం తన విధిని తాను నిర్వహించాలనడానికి నరసయ్య ఈ సంఘటనను ఉదాహరిస్తాడు.

వేపనూనె తయారుచెయ్యడం వంటి వృత్తులు ప్రమాదకరమైనవి (ఇరుగు పొరుగు ప్రజల ఆరోగ్యానికి). ఈ వృత్తులు కొనసాగించే వారి వద్ద లైసెన్సు ఫీజు (Licence

Fee) వసూలు చెయ్యాలని, టౌనుకు ఒకవైపు, దూరంగా, జనావాసాలు లేని చోటికి వీరిని తరలించాలని నరసయ్య సూచిస్తాడు. తన మాదిరి ఈ న్యూసెన్సువల్ల బాధపడుతున్న వారెవరైనా మేజిస్ట్రేటును చర్యతీసుకోమని కోరవచ్చునంటాడు. అవసరం అయితే, న్యాయస్థానంలో సాక్ష్యం చెప్పడనికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలియజేస్తాడు.

మేజిస్ట్రేటుకు రాసిన ఈ ఉత్తరంలో నరసయ్య ప్రజల హక్కులకు సంబంధించిన మౌలికాంశాలను ప్రస్తావిస్తాడు. వ్యక్తికి, సమాజానికి మధ్య వైరుధ్యం ఏర్పడినపుడు వ్యక్తి స్వేచ్ఛ హద్దులను వివరంగా చర్చిస్తాడు. సంప్రదాయ వృత్తులను నిర్వహించుకొనే క్రమంలో సమాజానికి ఇబ్బంది కలిగితే, తీసుకోవలసిన చర్యలను వివరిస్తాడు. బాధ్యతగల అధికారులు జాలి, దయ వంటి హృదయ దౌర్బల్యాలకు లొంగి, చట్టాన్ని అమలు పరచనప్పుడు, ప్రజలకు చట్టంమీద గౌరవం ఉండదని హెచ్చరిస్తాడు. డివిజనల్ మేజిస్ట్రేటు హోదాలో ఉన్న బాధ్యత గల ప్రభుత్వాధికారి నరసయ్య వంటి విద్యాధికునితో ప్రవర్తించిన తీరు ఈ ఉత్తరం రాయడానికి ప్రేరణ ఇచ్చి ఉంటుంది. అనాదిగా ప్రభుత్వాధికారులు చట్టాన్ని గౌరవించే సామాన్య ప్రజల విషయంలో నడుచుకొనే ధోరణికి ఈ వ్యవహారం ఒక మచ్చుతునకగా చెప్పుకోవచ్చు.

ఈ లేఖ ఒక తెలుగువాడు వాతావరణ కాలుష్యం మీద రాసిన మొదటి రచన అని బంగోరె అభిప్రాయపడ్డాడు.[31] ప్రజలకు అసౌకర్యం కలిగించే ఇటువంటి విషయాల మీద పత్రికలలో లేఖలు ప్రచురించే సంప్రదాయం ముందునుంచి ఉంది. ప్రజా సమస్యలమీద నరసయ్య స్పందించిన తీరుకు ఈ లేఖ ఒక ఉదాహరణ. పీపుల్స్ ఫ్రెండ్‌లో ఈ ధోరణినే ఆయన కొనసాగించాడు.

విశ్రాంతివేళల్లో, పుస్తకపఠనం నరసయ్య వ్యసనం. వేపనూనె తయారీలో వెలువడే దుర్వాసనతో పాటు, విధి విరామం లేకుండా వేప విత్తనాల దంపకంవల్ల, ఆయన ఏకాంత పఠనానికి భంగం కలిగి ఉంటుంది. ఆయన ఎంత ప్రశాంత వాతావరణాన్ని, ఏకాంతాన్ని కోరుకొంటాడో, దానికి భంగం కలిగితే, ఎంత చిరాకుపడతాడో దినచర్యలోని ఈ వాక్యాలు తెలియచేస్తాయి.

"Dinner cooked and eaten by 12 noon. Reading till 3 p.m. Three troublesome neighbours (women) set up a terrible gossip and made such a frightful noise that I gave up reading in despair. I went away to the temple porch and stayed there reading a little until 6-00 p.m." [32]

6

# పీపుల్స్ ఫ్రెండ్

## పీపుల్స్ ఫ్రెండ్ అవతరణ - నాటి మద్రాసు పత్రికల స్థితి

క్రీ.శ. 1785 లో మద్రాసు కొరియర్ (Madras Courier), మద్రాసు గెజిటు (Madras Gazette), మద్రాసు మేల్ అసైలం హెరాల్డు (Madras Male Asylum Herald) మొదలైన పత్రికలు ఆరంభించబడ్డాయి[1]. మూడూ వారపత్రికలే. ఈ పత్రికలు కొద్దికాలం మాత్రమే కొనసాగాయి. వీటి తర్వాత మద్రాస్ కన్సర్వేటివ్ (Madras Conservative) ఆరంభమయింది. 1832లో ఫోర్ట్ సెయింట్ జార్జి గెజిటు (Fort Saint George Gazette) ప్రారంభమయింది. ఇది ఈస్టిండియా కంపెనీ (East India Company) అధికార పత్రిక. పోస్టేజి అవసరం లేకుండా ప్రెసిడెన్సీకంతటికీ బట్వాడా అయ్యేది. ఇంగ్లీషుతోపాటు తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ భాషలలో ప్రకటనలుండేవి[2]. 1833లో కర్ణాటిక్ క్రానికల్ (Carnatic Cronicle) ఇంగ్లీషు, తమిళం, తెలుగు, త్రిభాషా పత్రికగా ఆరంభమైంది. ఈ పత్రిక మతవివాదాల జోలికి పోకుండా, స్థానికవిషయాలకు ప్రాధాన్యం ఇచ్చింది.[3] 1840లో సి. నారాయణస్వామినాయుడు నేటివ్ ఇంటర్‌ప్రిటర్ (Native Interpreter) పత్రికను ప్రారంభించాడు.

రెండేళ్ళపాటు హిందువుల అభివృద్ధికి ఈ పత్రిక కృషి చేసింది.[4] 1843లో మద్రాసు మిషనరీలు నేటివ్ హెరాల్డు (Native Herald) పత్రిక ప్రారంభించి మతప్రచారం సాగించారు.[5] 1844 లో గాజుల లక్ష్మీనరసుసెట్టి క్రెసెంట్ (Crescent) పత్రికను ప్రారంభించాడు. ప్రెసిడెన్సీలోని హిందువుల మనోభావాలు, ఆశలు ఈ పత్రిక పుటలలో వ్యక్తమయ్యేవి. పత్రిక ఆర్థికంగా నిలదొక్కుకోడానికి, లక్ష్మీనరసుసెట్టి మద్రాసు సంపన్నవర్గాల ప్రముఖులను భాగస్వాములుగా తీసుకొన్నాడు. ఈ పత్రిక షుమారు ఇరవై సంవత్సరాలు సమాజానికి ఉపయోగకరంగా కొనసాగి, మూతపడింది.[6] క్రెసెంట్ నిలిచిపోయిన తర్వాత, దాని ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్ళడానికి హిందూ క్రానికల్ (Hindu Cronicle) ప్రారంభమైంది.[7] కోమలేశ్వరపురం శ్రీనివాసపిళ్ళె, ఆయనమిత్రులు, అనుచరులు సంఘసంస్కరణ కోసం, స్త్రీ విద్యకోసం కృషిచేశారు. ఎం. వెంకటరాయులునాయుడు 1853లో రైసింగ్ సన్ (Rising Sun) పత్రిక స్థాపించి, పదేళ్ళు నడిపాడు. ఈ పత్రిక నిలిచిపోయిన తర్వాత, 1860 దశాబ్దంలో నేటివ్ అడ్వొకేట్ ఆరంభమైందని, సుందరలింగం రాశాడు.[8] 1845 లో ఎథీనియం అండ్ డెయిలీ న్యూస్ (Athenaeum and Daily News) పత్రిక ప్రారంభమైంది. "The barrister's father was a partner of Pharoah and Co., who are also Publishers of the Athenaeum when it flourished under Mr. John Bruce Norton's editorship" అని నరసయ్య ఈ పత్రికను గురించి రాశాడు.[9] ఈ పత్రిక యాజమాన్యం యూరోపియన్లదే అయినా, మద్రాసు ప్రజల జీవితాన్ని గురించి, హిందువుల సాంఘికసమస్యలను గురించి రాసింది. 1875 ప్రాంతాలలో ఈ పత్రిక కొనసాగుతున్నట్లు సూర్యాలోకం తెలియచేసింది.[10]

1858లో మద్రాస్ టైమ్స్ (Madras Times) ప్రారంభమైంది. ఇది యూరోపియన్లలో దిగువ వర్గాలవారి పత్రిక. చిన్న వ్యాపారులు, టీతోటల యజమానుల సమస్యలు ఇందులో చర్చించబడేవి.[11] 1865 ప్రాంతాలలో మద్రాస్ స్టాండర్డ్ (Madras Standard) పత్రిక వెలువడుతూంది. 1868 డిసంబరులో మద్రాస్ మెయిల్ (Madras Mail) తొలిసంచిక విడుదలైంది. యూరోపియన్లలో ఉన్నతవర్గాలవారి అభిరుచులకు, ఆలోచనలకు అనుగుణంగా ఈ పత్రిక సాగింది. ఇది ఛేంబర్ ఆఫ్ కామర్సు (Chamber of Commerce), యూరోపియన్ క్లబ్బులకు సంబంధించిన ఎగువతరగతి వర్గాలకు చెందిన పత్రిక. ఇంగ్లాండులో ముద్రించబడే మంచి పత్రికల బాణీలో నడిచింది. మద్రాస్ ప్రెసిడెన్సీలో ఈ పత్రికకు ఉన్నంతమంది చందాదారులు ఇంకే పత్రికకూ లేరు. స్పెక్టేటర్ (Spectator), మద్రాస్ టైమ్స్ ఇందులో లీనమయ్యాయి.[12] 1870 దశాబ్దిలో టి. మాధవరావు, ఆర్. రఘునాథరావు నేటివ్ పబ్లిక్ ఒపీనియన్ (Native Public Opinion), ఎ. రామచంద్రఅయ్యరు మదరాసీ (Madrassee) పత్రికలను ప్రారంభించారు. ఈ ముగ్గురు పాశ్చాత్య విద్యావిధానంలో విద్యార్జనచేసిన తొలితరం

వ్యక్తులు. మద్రాసు ప్రెసిడెన్సీ ప్రజాభిప్రాయాలను ఈ పత్రికలు తెలియజేస్తూ వచ్చాయి. కొంతకాలం తర్వాత ఈ రెండు పత్రికలు కలిసి, మద్రాస్ నేటివ్ ఒపీనియన్ (Madras Native Opinion) ఆవిర్భవించింది. ప్రభుత్వం దేశభాషాపత్రికల చట్టం అమలుచేసినపుడు, ఆ చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాయడానికి దేశీయుల చేతుల్లో ఇంగ్లీషు పత్రికలు లేకుండాపోయాయి.[13]

## హిందూ ఆవిర్భావం

ఎం. వీరరాఘవాచారి, జి. సుబ్రహ్మణ్యఅయ్యరు పచ్చయ్యప్ప విద్యాసంస్థలో అధ్యాపకులు. వీరి అధ్వర్యంలో ట్రిప్లికేన్ లిటరరీ సొసైటి (Triplicane Literary Society) మద్రాసు పౌరుల అభిప్రాయ వేదికగా పనిచేసింది. ముత్తుస్వామిఅయ్యరు హైకోర్టు జడ్జి నియామకాన్ని, యూరోపియన్ పత్రికలతో పాటు, దేశీయుల యాజమాన్యంలో నడుస్తున్న "మద్రాస్ నేటివ్ పబ్లిక్ ఒపీనియన్" పత్రిక కూడా వ్యతిరేకించింది. కొన్ని భాషాపత్రికలు అయ్యరు నియామకాన్ని సమర్థిస్తూ రాసినా, వాటి ప్రభావం చాలా తక్కువ.[14] 1877లో మద్రాసు ప్రెసిడెన్సీ మొత్తం మీద పదమూడు దేశభాషాపత్రికలు మాత్రమే ఉన్నాయి. వాటి సర్క్యులేషను (circulation) నాలుగువేలకు మించదు.[15] ఆంగ్లో ఇండియన్ పత్రికల విమర్శ ఎదుర్కొనడానికి, స్థానికుల అభిప్రాయాలు తెలియపరచడానికి, ఒక ఇంగ్లీషు పత్రిక కావాలనే తీవ్రమైన కాంక్ష నుంచి హిందూ జన్మించింది.

1878 సెప్టెంబరు 20న 'హిందూ' వారపత్రికగా ఆరంభమైంది. ఎం. వీరరాఘవాచారి, జి. సుబ్రహ్మణ్యఅయ్యరు, వారి నలుగురు మిత్రులు ఈ పత్రికను ప్రారంభించారు. దీనికి సుబ్రహ్మణ్యఅయ్యరు సంపాదకుడుగా, వీరరాఘవాచారి ప్రచురణకర్తగా వ్యవహరించారు. హిందూ 1883లో ట్రైవీక్లీ అయింది, 1889లో దినపత్రికగా ఆవిర్భవించింది.[16]

1881 లో భాష్యంఅయ్యంగారి అధ్యక్షతన మద్రాస్ నేటివ్ అసోసియేషను కొంతకాలం క్రియాశీలంగా పనిచేసింది. ప్రభుత్వం ఈ సమాజ వ్యవహారాలను అనుమానించడంతో చాలామంది అందులో సభ్యత్వం తీసుకోడానికి వెనుకంజ వేశారు. 1884లో మద్రాసు మహాజనసభ ఏర్పడేదాకా, మద్రాసు మేధావుల వాణిని వినిపించడానికి హిందూ ఒక వేదిక అయింది.[17] హిందూ యాజమాన్యం 1881 నుంచి 'స్వదేశమిత్రన్' తమిళ వారపత్రికను ప్రచురించడం మొదలుపెట్టింది. ఇది 1889లో దినపత్రికగా పరిణమించింది. దక్షిణ భారతదేశంలో ఒక దేశభాషలో వెలువడిన తొలి దినపత్రిక ఇదే.[18] హిందూను ప్రారంభించిన కొన్ని సంవత్సరాల వరకు వీరరాఘవాచారి, సుబ్రహ్మణ్య అయ్యరు, పచ్చయ్యప్ప సంస్థలో అధ్యాపకులుగా కొనసాగారు. ఇది సంధికాలం. దేశీయుల యాజమాన్యంలోని పత్రికలు ఔత్సాహిక దశను దాటి నిర్వాహకులు

పూర్తికాలం వినియోగించవలసిన స్థితికి చేరుకొంటున్న సమయం. దేశీయపత్రికలు అనేక సమస్యలతో సతమతమవుతున్నకాలం. పాఠకులు చందాలు సక్రమంగా చెల్లించకపోవడం, ప్రభుత్వం నుంచి ఏ విధమైన సహాయ సహకారాలు అందకపోవడం, ఇంగ్లీషువారు నడిపే పత్రికలతో పోటీపడవలసి రావడం, దేశీయ వ్యాపార వర్గాలు, స్థానికులు ఈ పత్రికలలో పెట్టుబడులు పెట్టకపోవడం, పత్రికా నిర్వాహకులు పూర్తికాలాన్ని పత్రికకోసం వినియోగించలేకపోవడం వంటి పరిస్థితులు దేశీయపత్రికలు నిలదొక్కుకోలేక పోవడానికి కారణాలుగా చెప్పుకోవచ్చు. ఇందుకు భిన్నంగా యూరోపియన్ యాజమాన్యాలు పత్రికలను సమర్థవంతంగా నిర్వహించేవి. యూరోపియన్‌లకు పత్రికా నిర్వహణ ఒక వృత్తి, వ్యాపారం. ప్రభుత్వం అండదండలు ఉండనే ఉన్నాయి. ఈ పరిస్థితులలో ఇంగ్లీషు విద్య అభ్యసించినవారిని పత్రికారంగం ఆకర్షించలేకపోయింది. కొందరు విద్యావంతులు పత్రికలు ప్రారంభించి, ఉద్యోగ పర్వంలో పదోన్నతి సాధించడానికి నిచ్చెనమెట్లుగా వాడుకొన్నారు.[19] కొంతమంది యువకులు మాత్రం ఉద్యోగాలు, వృత్తులు మానుకొని, దేశభక్తితో, గొప్ప ఆదర్శాలతో పత్రికలు నడపడానికి ఉద్యమించారు. అధ్యాపకులు, వకీళ్ళు, ప్రభుత్వోద్యోగులు పత్రికారంగంలో ప్రవేశించారు.

హిందూ ప్రారంభమైన తర్వాత, 1880 దశాబ్దంలో భారతీయుల యాజమాన్యంలో ఇంగ్లీషు, తమిళం, తెలుగు మొదలైన దేశభాషల్లో పత్రికాప్రచురణ ఊపందుకుంది. కొన్ని పత్రికలు ఇంగ్లీషు - దేశభాష రెండింటిలో వెలువడుతూ వచ్చాయి. ఇదే సమయంలో మతపరమైన పత్రికలు పుట్టుకొచ్చాయి. జిల్లాలలో దేశభాషలలో పత్రికాప్రచురణ ప్రారంభం అయింది. ఆ కాలంలో జర్నలిజం సామాజిక రాజకీయాంశాలతో ముడిపడి ఉంది. ఇంగ్లీషు విద్య అభ్యసించిన తొలితరం విద్యావంతులు బ్రాహ్మణులు, పై వర్గాలవారు కావడంవల్ల, తొలితరం పత్రికా నిర్వాహకులు కూడా ఆ వర్గాలనుంచి వచ్చారు.[20] సరిగ్గా ఇటువంటి పరిస్థితుల్లోనే నరసయ్య మద్రాసులో అడుగుపెట్టాడు. ఆయనలో అణగి ఉన్న కాంక్ష ఊరుకోనివ్వలేదు. నిక్షేపమైన డెప్యూటీ స్కూల్ ఇన్‌స్పెక్టరు ఉద్యోగం విడిచిపెట్టి మద్రాసు దారిపట్టాడు. పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక ప్రచురణ, పీపుల్స్ ఫ్రెండ్ ప్రెస్ నిర్వహణ వృత్తిగా స్వీకరించాడు.

## పీపుల్స్ ఫ్రెండ్

అచ్చాఫీసు ప్రారంభించడం మాటలు కాదు. 1840 ప్రాంతాలలో ఒక్క తెలుగుభాషలో పత్రిక నిర్వహించడానికి కనీసం రెండువేల రూపాయల పెట్టుబడి అవసరం అయ్యేదని ఒక అంచనా.[21] మూడు భాషల్లో అచ్చుపనులు నిర్వహించడానికి, ఇంగ్లీషులో వారపత్రిక నడపడానికి అనువైన ప్రెస్ సమకూర్చుకోడానికి పెద్ద మొత్తంలో పెట్టుబడి అవసరం

అయి ఉంటుంది. ఆ రోజుల్లో దేశీయుల యాజమాన్యంలో సాగే పత్రికావ్యాపారాల్లో పెద్ద లాభాలు ఉండేవికావు. యజమానులకు, సంపాదకులకు కొద్దిమొత్తం ప్రతిఫలంగా మిగిలేది. మంచి సర్క్యులేషను ఉన్న పత్రికలలో కూడా మూడంకెలకు మించి ఆదాయం ఉండేది కాదు.[22] నరసయ్య ప్రభుత్వోద్యోగం చేసిన కాలంలో కూడబెట్టిన డబ్బంతా ప్రెస్సు కోసం వెచ్చించి ఉంటాడు.

"I was the Editor of People's Friend at Madras from April 1881 to 1897 July" అని నరసయ్య నెల్లూరుజిల్లా మునిసిఫ్ కోర్టు (Nellore District Munsif Court) లో ఇచ్చిన వాఙ్మూలంలో పేర్కొన్నాడు. *"People's Friend order book from April Ist 1881 to 30th September 1883"* అని నరసయ్య సొంతదస్తూరితో రాసిపెట్టిన ఆఫీసు ఆర్డరు బుక్కు లభ్యమయింది. 1883 డిసంబరు 1వ తారీకు పీపుల్స్ ఫ్రెండ్ సంచిక మీద సంపుటం **III** సంచిక 18 అని, 1886 జనవరి 30 సంచిక మీద సంపుటం **VI** సంచిక 5 అని, 1888 ఫిబ్రవరి 25 సంచికమీద సంపుటం **VIII** సంచిక 8 అని ఉంది.[23]

నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్ ప్రజల పత్రికని, అతి సామాన్యులైన గుమాస్తాలకు సైతం అందుబాటులో ఉండాలని భావించాడు. పత్రిక నుదుటి మీద *"A Cheap Journal published every Saturday evening"* అని ప్రకటించుకొన్నాడు. 1883 డిసంబరు 1 సంచికలో నెలచందా ఆరణాలని, ముందుగా చందాపంపిన వారికి సంవత్సరం చందా నాలుగున్నర రూపాయలని, సంవత్సరం అంతా పత్రిక స్వీకరించి, చివర చందాపంపేవారికి ఆరురూపాయలని ఉంది. 1886 జనవరి 30 సంచిక ముఖపత్రంమీద దళసరి కాగితంమీద ముద్రించిన పత్రిక సంవత్సరం చందా ఆరురూపాయలని, పల్చని కాగితంమీద ముద్రించిన పత్రికచందా నాలుగున్నర రూపాయలని ఉంది.

ఆ రోజుల్లో మద్రాసు ఫోర్ట్ సెంట్ జార్జి గెజిటు మంగళవారం సాయంకాలం విడుదలయ్యేది. అందులోని వార్తలు సేకరించుకొని, ముద్రించుకోడానికి అనువుగా పీపుల్స్ ఫ్రెండ్ శనివారం సాయంత్రం రాయల్ సైజులో నాలుగుఫారాలు అంటే ఎనిమిది పుటలతో వెలువడేది.[24] తొలి మలి పుటలు, చివరిపుట నిండుగా ఇంగ్లీషు, తెలుగు, తమిళ భాషల్లో ప్రకటనలుండేవి. *"ది థింకర్ ఏన్ ఆంగ్లో తమిళ్ జర్నల్ ఆఫ్ ది ఫ్రీథాట్"* పత్రిక ప్రకటన 1883 డిసంబరు 1 తొలిపుటలో ఉంది. ఆనాటి ఇతర పత్రికలలో ఇదే విధంగా ప్రకటనలుండేవి. 1950 వరకూ 'హిందూ' తొలి పుట నిండుగా ప్రకటనలుండేవి.

నరసయ్య పత్రిక తీసుకొనిరావడంతో పాటు పుస్తకప్రచురణ, విక్రయం కూడా సాగించాడు. ఇంగ్లీషు, తమిళం, గ్రంథ లిపులలో పుస్తకప్రచురణ, జాబ్‌వర్కు, 'పీపుల్స్

ఫ్రెండ్ లైబ్రరి' పేర పుస్తక విక్రయం కొనసాగించాడు. ప్రభుత్వ చట్టాలు, రెగ్యులేషన్స్‌కు సంబంధించిన పుస్తకాలు, తెలుగు తమిళ ప్రాచీనకావ్యాలు, సాహిత్యగ్రంథాలు, బ్రహ్మసమాజ గ్రంథాలు, పాఠ్యపుస్తకాలు, గైడ్లు, పాత పాఠ్యపుస్తకాలు, రఘునాథరావు ఇతర సంస్కరణవాదుల గ్రంథాలు, పీపుల్స్ ఫ్రెండ్ లైబ్రరీ ద్వారా విక్రయంఅయ్యేవి. నరసయ్య రచించిన "ఎసన్షియల్స్ ఆర్ ఫస్ట్ బుక్ ఆఫ్ ఇంగ్లీష్ గ్రామర్ ఇన్ ఈజీ తెలుగు *(Essentials or a First book of English Grammar in Easy Telugu)* ఈ సంస్థ విక్రయించే పుస్తకాల జాబితాలో ఉంది. ఇది వ్యావహారికభాషలో రాయబడిన తొలి తెలుగు పాఠ్యపుస్తకాలలో ఒకటి కావచ్చు.

టైమ్స్ ఆఫ్ ఇండియా (Times of India), స్టేట్స్‌మన్ (Statesman), హిందూ (Hindu) మొదలైన పత్రికలలో ప్రచురించబడిన వార్తలు పీపుల్స్ ఫ్రెండ్‌లో ధారాళంగా పునర్ముద్రణ పొందాయి. ఆనాటి భారతీయ పత్రికలు, ముఖ్యంగా చిన్నపత్రికలు సోదర పత్రికల నుంచి, విదేశీపత్రికల నుంచి వార్తలు సేకరించి ప్రచురించేవి. ఆంగ్లో ఇండియన్ పత్రికలు కూడా ఈ పద్ధతినే అనుసరించేవి. ఒక్క మెయిల్ పత్రికకు తప్ప మద్రాసు నుంచి వెలువడే ఇతర పత్రికలకు వేటికి న్యూస్ సర్వీసు (News Service) సౌకర్యం ఉండేది కాదు. విద్యావంతులైన స్థానికులు రాసిన వార్తలు, వ్యాసాలు, లేఖలు అన్ని పత్రికలూ ప్రచురించేవి. ఈ పత్రికలకు ప్రత్యేకంగా విలేకరులు ఉండేవారు కాదు.

పీపుల్స్ ఫ్రెండ్ మూడోపుటలో అక్నాలెడ్జిమెంటు (Acknowledgement) శీర్షికలో ఆ వారం కొత్తగా చందాదారులైన వారి పేర్లు కనిపిస్తాయి. 1883 డిసెంబరు 1 సంచికలో షుమారు 32 మంది కొత్తగా చందారులైనవారి పేర్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, కోయిలకుంట్ల, పుంగనూరు నుంచి ముగ్గురు చందాదారులయ్యారు. వారిలో ఒకరు ముస్లిం. మిగిలిన చందాదారులు దాదాపుగా తమిళదేశానికి సంబంధించినవారు. ఒకరో ఇద్దరో కేరళవాసులు.

1888 ఫిబ్రవరి 25 సంచికలో 15మంది గ్రామీణ ప్రాంతాల నుంచి చందాలు పంపిన వారి పేర్లున్నాయి. నెల్లూరుజిల్లా ఇందుకూరుపేటనుంచి ఒకరు, ఒంగోలు, అనంతపురం, భద్రాచలం, సికిందరాబాదు, ఒరిస్సా, కేరళ ప్రాంతాలనుంచి ఒక్కొక్కరు ఉన్నారు. మిగతావారు తమిళ గ్రామీణ ప్రాంతాలవారు. వీళ్ళలో కొద్దిమంది ముస్లిమ్‌లు, క్రైస్తవులు కూడా ఉన్నారు.

## 1883 డిసంబరు 1 సంచిక

పీపుల్స్ ఫ్రెండ్స్ ప్రతిపుట నాలుగు 'కాలా'లుగా విభజించబడింది. మూడోపుట మొదటికాలంలో ప్రకటనలున్నాయి. ఆపుటలోనే చందాదారులను ఉద్దేశించి నరసయ్య చేసిన సుదీర్ఘమైన విన్నపం సంగ్రహానువాదం :-

"సహృదయ పాఠకులారా ! పీపుల్స్ ఫ్రెండ్ మూడు సంవత్సరాలు పూర్తి చేసుకోబోతూంది. ఈ పత్రిక యజమాని, సంపాదకుడు పాఠకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చెయ్యగలిగినంత చేశాడు. దక్షిణ భారతదేశంలో పత్రికా నిర్వాహకులు చాలా సమర్థవంతంగా పనిచేస్తేనేతప్ప, పాఠకుల్లో ఉత్సుకతను మేల్కొల్పడం సాధ్యం కాదు. దళసరి కాగితంమీద పత్రికను అచ్చువేయాలనే అభిప్రాయంతో సంవత్సరానికి రెండణాలు అదనంగా చందా చెల్లించమని విన్నవించుకొన్నాము. ఇందుకు మా చందాదారులు ముందుకు రాలేదని చెప్పడానికి విచారిస్తున్నాము. దళసరి కాగితంమీద ముద్రిస్తే పత్రిక ఎంత ముచ్చటగా ఉంటుందో మా పాఠకులు గ్రహించినట్లు లేదు. మాకు పెద్ద సర్క్యులేషను ఉంది. అది రోజు రోజుకు వృద్ధి చెందుతున్నందుకు మేము ఆనందిస్తున్నాము. పాఠకులు మా పత్రికను ఇష్టపడుతున్నారని ఇందువల్ల స్పష్టంగా తెలుస్తూంది. ఎన్నో కష్టనష్టాలను భరించి పాఠకుల అభిప్రాయాలకు అనుగుణంగా పత్రిక సాహిత్య స్వరూపాన్ని (Literary get up) తీర్చిదిద్దుతున్నాము. మేము పెట్టే కర్చులో వ్యాసాలకోసం నెలనెల చెల్లించే మొత్తం కూడా తక్కువేమీ కాదు. అందించగలిగినంత సహాయం అందచేయవలసినదిగా మా మిత్రులను ప్రార్థిస్తున్నాము."

మూడో పుట సంపాదకీయం కోసం కేటాయించబడింది. ఈ పుటలో రెండు, మూడు 'కాలా'లలో "టూ పిక్చర్స్" (Two Pictures) శీర్షికతో ప్రధాన సంపాదకీయం ఉంది. సంపాదకీయం పై భాగంలో ఆ నెల కేలెండరు, సూర్యోదయ సూర్యాస్తమయ సమయాలు ప్రచురించబడ్డాయి. ఇదే పుటలో నాలుగో 'కాలం' గతవారం 'లీడర్' (సంపాదకీయం) తరువాయి భాగం *"ది బెంగాల్ టెనెన్సీ బిల్ (The Bengal Tenancy Bill) ప్రచురించబడింది. రచయిత పేరు 'F' అని మాత్రం ఇవ్వబడింది. ఈ సంచికలోనే "సర్ విలియం హేమిల్టన్స్ వ్యూ ఆఫ్ ది థియరీస్ ఆన్ ది బిలీఫ్ ఆన్ ఎక్స్టర్నల్ వరల్డ్" ("Sir William Hamilton's view of the theories on the belief on external world")* వ్యాసం ఉంది. వ్యాసరచయిత సి.పి. దొరస్వామిచెట్టి బి.ఏ. ఇది తత్త్వశాస్త్ర సంబంధమైన వ్యాసం. ఈ సంచికలోనే కనాట్ డ్యూక్ (*Duke*), డచెస్ (Duchess of Connaught) భారతదేశ పర్యటనకు సంబంధించిన సుదీర్ఘమైన రిపోర్టు, టైమ్స్ ఆఫ్ ఇండియా నుంచి పునర్ముద్రించబడింది. ఈ సంచికలో "పాళియంకోట ఇన్ 1810-1827" అనే ధారావాహిక కూడా ప్రచురించబడింది. ఈ ధారావాహిక పీపుల్స్ ఫ్రెండ్‌లో చాలాకాలంగా ప్రచురించ బడుతున్నట్లుంది. ఈ సంచికలో 1826 సంఘటనలు వివరించబడ్డాయి. తిన్నెల్వేలి జిల్లాలోని పాళియంకోట కేంద్రంగా క్రైస్తవ మిషనరీల అనుభవాలు, మతప్రచారం ఉత్తమపురుషలో వివరించబడ్డాయి. ఈ సంచికలోనే కడలూరు ప్రభుత్వకళాశాల బహుమతి ప్రదానోత్సవం మీద సుదీర్ఘమైన నివేదిక ప్రచురించబడింది.

రెండో పుటలో "అవర్ కరస్పాండెన్సు" (Our correspondence) శీర్షికలో రెండు

సంపాదకీయ లేఖలు ప్రచురించబడ్డాయి. ఉత్సవదినాల్లో పుణ్యక్షేత్రాలు దర్శించే యాత్రికులకు ఎస్.ఐ.ఆర్ రైల్వేవారు తిరుగు టిక్కెట్లు ముందుగా ఇవ్వాలని కోరుతూ రాసిన లేఖ ఒకటి. రెండోది తంజావూరు దేవస్థానం ఆదాయవ్యయాలకు సంబంధించిన వివాదంలో ఒక వర్గం వారి లేఖ. ఈ వివాదంలో ఉభయపక్షాలు కొన్ని నెలలుగా పీపుల్స్ ఫ్రెండ్‌కు సంపాదకీయ లేఖలు రాస్తున్నట్లు తోస్తుంది. మూడో పుటలో "టెలిగ్రామ్స్ ఫ్రమ్ డెయిలీ పేపర్సు" (Telegrams from Daily Papers) శీర్షికలో ప్రపంచ దేశాల వార్తలున్నాయి. ఈ వార్తలన్నీ విదేశీ పత్రికల నుంచి పునర్ముద్రించినవే. బ్రహ్మసమాజ నాయకుడు కేశవచంద్రసేన్ ఆరోగ్యాన్ని గురించి స్టేట్స్‌మన్ ప్రచురించిన వార్తను ఈ శీర్షికలోనే ఇట్లా ప్రచురించాడు. "*ఈ వార్త విని చాలామంది సంతోషిస్తారు. మహానుభావుడు, బ్రహ్మసమాజ నాయకుడు కేశవచంద్రసేన్ ఆరోగ్యం కాస్త కుదుటపడింది. అయినా ఆయన పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉన్నట్లు స్టేట్స్‌మన్ రాస్తూంది.*" లండన్‌లో జర్మన్ కార్యాలయాన్ని పేల్చివేయడానికి ప్రయత్నిస్తున్నాడనే అనుమానంతో పోలీసులు ఒక జర్మన్ జాతీయుణ్ణి అరెస్టు చేస్తారు. అతడు సోషలిస్టని ఆ వార్తలో ఉంది. ఇటువంటి అనేక జాతీయ, అంతర్జాతీయ ఆసక్తికరమైన వార్తలు ఈ శీర్షికలో ప్రచురించబడ్డాయి. కొత్తగా ఉన్నతోద్యోగాలలో చేరడానికి ఇంగ్లాండు నుంచి భారతదేశం వస్తున్న వారి వివరాలు, పదవీవిరమణ చేసిన పెద్ద ఉద్యోగుల వివరాలు ఈ శీర్షికలోనే ఇవ్వబడ్డాయి.

"నోట్స్ అండ్ న్యూస్" (Notes and News) శీర్షికలో భారతదేశ వార్తలు, పండిత రమాబాయి సంక్షిప్త జీవితచరిత్ర ఇవ్వబడ్డాయి. ఇందులో కొన్ని వార్తలు సోదరపత్రికల నుంచి స్వీకరించి ప్రచురించినవి కూడా ఉన్నాయి. ఫోర్ట్ సెంట్ జార్జి గెజిటు నవంబరు 27 మంగళవారం సంచికలోని అనేకవిషయాలు ఈ శీర్షికలో పునర్ముద్రణ పొందాయి. "సెలెక్టు టెలిగ్రామ్స్" (Select Telegrams) శీర్షికలో ఆయా పత్రికల నుంచి ఎంపిక చేసిన వార్తాకదంబం కనిపిస్తుంది. లభించిన ఒకటి రెండు సంచికలను బట్టి పత్రికను అంచనా వెయ్యడం సాహసమే అయినా, సాంఘిక, సామాజిక విషయాలమీద, జాతీయ అంతర్జాతీయ సంఘటనలమీద ఆసక్తి, అవగాహన ఉన్న విద్యాధికులైన సంస్కారులీపత్రికకు పాఠకులని అనిపిస్తూంది.

## పీపుల్స్ ఫ్రెండ్ ఉద్యోగులు

పీపుల్స్ ఫ్రెండ్ ప్రెస్ మొదట మద్రాసు వడమాలవీధిలో, 253 నంబరు ఇంట్లో, ప్రారంభించబడింది. రెండేళ్ళ తర్వాత ఆఫీసు నంబరు 355, మింట్ స్ట్రీటుకు మార్చబడింది. [25] తొలినాళ్ళలో పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక పనితీరు, ఉద్యోగుల వివరాలు తెలియజేసే "ఆఫీస్ ఆర్డర్ బుక్"లో నరసయ్య స్వదస్తూరితో వేసిన 37 ఆఫీసు ఆర్డర్లు

ఉన్నాయి. ఆ పుస్తకంలో ఉద్యోగుల నియామకాలు, జీతబత్యాలు, విధులు, ఇంక్రిమెంట్లు, మెచ్చుకోళ్ళు, జుల్మానాలు అన్నీ రాసి ఉంచాడు. ఆఫీసులో పనిచేసే ఉద్యోగులు, ప్రెస్‌కార్మికులు అని రెండురకాలుగా ఉండేవారు. ఆఫీసు అజమాయిషీ హెడ్‌క్లర్కు బాధ్యత. అతని కింద మొదటి గుమాస్తా, రెండవ గుమాస్తా అని వరుసగా ఐదుమంది గుమాస్తాలుండేవారు. అందరి విధులు ఆఫీసు ఆర్డరు పుస్తకంలో స్పష్టంగా నిర్వచించబడ్డాయి. పత్రిక శనివారం సాయంత్రం విడుదలౌతుంది కనుక ఐదుగురు కంపాజిటర్లు శుక్రవారం రాత్రంతా పనిచేసేవారు. శనివారం ఉదయం పదిగంటలకల్లా నాలుగోఫారం అచ్చుపూర్తయి, పత్రిక విడుదలకు సిద్ధమవుతుంది. ఉద్యోగులందరూ కలిసి సాయంత్రంలోపల డిస్పాచ్ పూర్తిచేసి ఇళ్ళకు వెళ్తారు.

పీపుల్స్ ఫ్రెండ్ ప్రెస్‌కు అనుబంధంగా ఒక లైబ్రరి, దాని వ్యవహారాలు చూచుకోడానికి లైబ్రేరియన్ ఉండేవాడు. పుస్తకాలకు కేటలాగులు తయారుచేయడంతో పాటుగా, పీపుల్స్ ఫ్రెండ్ లైబ్రరీ పేరుతో నరసయ్య నిర్వహించిన పుస్తక విక్రయసంస్థ పనులు కూడా ఈ లైబ్రేరియన్ చూచుకొనేవాడు. ప్రెస్ డిపార్ట్‌మెంట్‌లో ఒక సూపర్నెంటు ఉండేవాడు. ఇతనికి ప్రూఫులు చూడడం మొదలైన బాధ్యతలుండేవి. ఇతనికి సాయంగా ప్రూఫురీడర్లు ఉండేవారు. కంపాజిటర్ల పనులు అజమాయిషీ చెయ్యడం, ప్రూఫులుచూడడం వంటి పనులు వీరు చూచుకొనేవారు. ఎన్.సి. శ్రీనివాసాచారి కొంతకాలం సూపర్నెంటుగా పనిచేశాడు. ఇతణ్ణి గురించి నరసయ్య ఆర్డరుబుక్‌లో ఈ విధంగా రాశాడు. "N.C. Srinivasachari, who in consideration of his possessing some knowledge of 4 languages viz. English, Telugu, Tamil and Sanskrit appears to be much better fitted to supervise the printing business of various kinds in this office, whose salary will ( at ) present be Rs 9 (Nine) a month". (office order 12 dated 8-1-1882) తెలుగు, తమిళ, గ్రంథ వెర్నాక్యులర్ ఫోర్మన్ (Vernacular Foreman) రాజగోపాల్ నెలజీతం 9 రూపాయలు. ఇతని పేదరికాన్ని దృష్టిలో ఉంచుకొని, నరసయ్య రోజూ 5 1/2 అణాల జీతం ఏర్పాటు చేశాడు. పేపర్‌బాయిస్, చందా వసూలు చేసే ఉద్యోగులు వగైరా చిల్లరఉద్యోగులు కొందరు. వీరిలో 'బుల్లర్' (Buller) అనే ఒక చిన్న ఉద్యోగి ఉండేవాడు. ఇతని జీతం నెలకు మూడు రూపాయలు. పనివారు చేసే తప్పులను నరసయ్య ఆఫీసు ఆర్డరు ద్వారా వారి దృష్టికి తీసుకొని వచ్చేవాడు. వారిని మందలించి సరిదిద్దడానికి ప్రయత్నించడం, జరిమానా విధించడం, ఒకపూట జీతం కోతపెట్టడం, చివరకు మారడని తోచినప్పుడు విధులనుంచి తొలగించడం, ఉద్యోగి ప్రాధేయపడితే క్షమించి మళ్ళీ పనిలో చేర్చుకోడం ఆయన అనుసరించిన ఆఫీసు పరిపాలనా పద్ధతి. క్రమశిక్షణతో పనిచేసే ఉద్యోగులను ప్రోత్సహిస్తూ ఆఫీసుఆర్డర్లు రాశాడు. అటువంటి వారికి జీతం వృద్ధిచేయడం కనిపిస్తుంది. విశ్వనాథయ్య ఎఫ్.ఏ పాసైన సంగతి తెలిసి,

ఆఫీసు ఆర్డరు ఈ విధంగా రాశాడు. *"Viswanathaiah having passed the F.A. exam and that somewhere in the middle of the list, the undersigned is willing and thinks it just to encourage him by giving a slight increase not in ( ............ ) of the services he has already done, but with a view to attach a pay somewhat more suitable to one of his educational attainments. He will draw accordingly Rs 12 (Twelve) with effect from 1st February 1882". (office order no.2 dated 2-2-1882)*

ఆఫీసు ఆర్డర్లలో సబ్‌ఎడిటరు ప్రస్తావన లేదు. పత్రికంతా ఒంటి చేతిమీదుగా నడిచే సంప్రదాయం కొనసాగిన రోజులవి. నరసయ్య ప్రభుత్వాధికారులకు పంపిన లేఖలలో చేవ్రాలు చేసి, కింద "ప్రొప్రైటర్, పీపుల్స్ ఫ్రెండ్" అని రాసేవాడు. 1883 డిసంబరు 6వ తారీకు రాసిన ఉత్తరంలో మాత్రమే చేవ్రాలు కింద "ఎడిటర్ అండ్ ప్రొప్రైటర్" అని రాశాడు.[26] ఆఫీసు ఆర్డర్లలో మేనేజరు ప్రస్తావన లేదు. 1884లో ప్రెస్ మేనేజరుగా ఐ. వెంకటరావు, 1888లో ఎం.ఆర్. తిరువేంగడం మొదలియారు వ్యవహరించారు.[27]

పత్రికల కట్టలు కూలీద్వారా సీపోర్టు ఆఫీసుకు పంపినట్లు ఆఫీసు ఆర్డర్లలో ఉండడంవల్ల, కొన్ని కాపీలు నౌకలో రవాణా అయ్యేవని తెలుస్తోంది. పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక నాలుగు కాపీలు ఫైల్లోవేసి జాగ్రత్తచేస్తున్నట్లు కూడా ఆఫీసు ఆర్డర్ల వల్ల తెలుస్తుంది.

మెయిల్ తర్వాత తనదే ప్రజాదరణ పొందిన పత్రిక అని, వారం వారం 1200 కాపీలు అచ్చవుతున్నాయని తెలియజేస్తూ మద్రాసు ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీకి నరసయ్య ఒక ఉత్తరంలో తెలియజేశాడు.[28]

The People's Friend Office,
Madras,
6th December, 1883

To
The Chief Secretary, Fort St. George.

Sir,

I have the honour to bring to your notice that as already intimated in the office letter No. 2451, dt.15th October 1883, we issue nearly 1200 copies of our popular weekly. The circulation of the "People's Friend" of which I have to enclose a copy is therefore, to the best of my information and belief, larger than that of any other Madras newspaper with the sole exception of the "Mail".

I request accordingly that (the) Government will be pleased to draw

the attention of the Heads of Departments to the "People's Friend" as an English medium for the advertisements.

*I have the honour to be Sir,*
*Yours most obedient servant,*
D. Narasaiah,
Editor & Proprietor.

ఆయా ప్రభుత్వ శాఖలు అవసరం అనుకొంటే పీపుల్స్ ఫ్రెండ్‌కు ప్రకటనలు ఇవ్వవచ్చునని, ఉత్తరం మీద అధికారి రాసిన నోట్‌లో ఉంది.

1888 ఫిబ్రవరి 25 సంచిక సంపాదకీయంలో "ఈ ప్రెసిడెన్సీలో ఒక స్థానిక పత్రికగా హిందూ తర్వాత స్థానం మాదే. హిందూ అచ్చు వేసే ప్రతి మూడు సంచికలకు మేము ఒక సంచికను అందించ గలుగుతున్నాము" అని పత్రికా లోకంలో పీపుల్స్ ఫ్రెండ్ స్థానాన్ని నరసయ్య పేర్కొన్నాడు.

## మద్రాసులో సంస్కార భోజనం

1882 నాటికి మద్రాసు పత్రికలు నరసయ్యను సంస్కర్తగా గుర్తించాయి. జూలైలో మద్రాసులో ఏర్పాటయిన ఒక సంస్కార భోజనంలో ఆయన పాల్గొన్నాడు. రాజమండ్రిలో తొలి వితంతు వివాహం జరిపించి, ఆ దంపతులను వెంటబెట్టుకొని, వీరేశలింగం మద్రాసు వచ్చాడు. వీరేశలింగం బృందంతో కలిసి భోజనం చేయడమే సంస్కార భోజనం. ఈ సంఘటనకు పూర్వం మద్రాసులో కొన్ని సంగతులు జరిగాయి.

వీరేశలింగం పట్టుదల, కృషి వల్ల 1881 డిసెంబరు 11వ తేదీ రాజమండ్రిలో తొలి స్త్రీ పునర్వివాహం జరిగింది. ఈ పెళ్ళికి ముందే దక్షిణ భారతదేశంలో రెండు స్త్రీ పునర్వివాహాలు జరిగాయి. 1867లో బెంగుళూరులో ఒక వివాహం జరిగింది. వధువు తండ్రి మహారాష్ట్ర బ్రాహ్మణుడు. సంఘ బహిష్కరణకు వెరవకుండా తన కుమార్తె పునర్వివాహం జరిపించాడు. నాగర్‌కోయిల్‌లో శేషయ్యంగారు అనే న్యాయవాది తన కుమార్తెకు పునర్వివాహం చేశాడు. ఈ పెళ్ళి జరిగిన తర్వాత ఆ కుటుంబం బహిష్కరణకు గురి అయింది. రజకులు, క్షురకులు, పురోహితుల సేవలు అందకుండా చేశారు. కుటుంబ సభ్యులకు ఆలయ ప్రవేశం నిరాకరించబడింది. చివరకు బావుల్లో నీళ్ళు తోడుకోనీకుండా కట్టడి చేశారు. ఈ సంగతులన్నీ 'ఎథీనియం' పత్రిక తెలియజేసింది. ఈ సాంఘిక బహిష్కరణ ఒత్తిడిని ఎదుర్కొనడానికి శేషయ్యంగారు స్త్రీ పునర్వివాహ సంఘాన్ని స్థాపించి, వితంతు బాలికలకు వివాహం జరిపించేవారికి ఆర్థికసహాయం, సలహాలు అందించడానికి కృషి చేశాడు. నాగర్‌కోయిల్ బ్రాహ్మణ సమాజంవల్ల ఎదురవుతున్న ఇబ్బందులను తట్టుకోడానికి అవసరమైన సహాయ సహకారాలు అర్థిస్తూ

మద్రాసు సంస్కరణోద్యమ నాయకులకు విజ్ఞప్తి చేశాడు. శేషయ్యంగారి కృషి మద్రాసులో మార్పును కోరుతున్న విద్యావంతుల హృదయాలను కదిలించినట్లుంది.[29]

## హిందూ విడో మ్యారేజ్ అసోసియేషన్

1874 ఏప్రిల్‌లో మద్రాసు హిందూ విడో మ్యారేజ్ అసోసియేషన్ స్థాపించడం కోసం ఒక సమావేశం ఏర్పాటైంది. ఈ సమాజాన్ని స్థాపించడంలో రామయ్యంగారు, ముత్తుస్వామి అయ్యరు కృషి చాలా ఉంది. వాళ్ళిద్దరూ సమాజ కార్యవర్గ సభ్యులుగా, పళ్ళె చెంచలరావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. స్త్రీ పునర్వివాహాలు ప్రోత్సహించడం ఈ సమాజ ప్రధాన లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. విధవా వివాహాలకు శాస్త్రగ్రంథాల ఆమోదం ఏ మేరకు ఉందని పరిశీలించడం వరకే ఈ సమాజ కార్యక్రమాలు పరిమితం కావాలని పనప్పాకం అనంతాచార్యులు, ఆర్. రఘునాథరావు వాదించారు. వారికి సంప్రదాయ హిందువుల మనోభావాలను గాయపరచడం ఇష్టం లేదు. సభ్యులలో అధిక సంఖ్యాకులు ఈ ప్రతిపాదనలను తిరస్కరించడం వల్ల వీరిద్దరూ ఈ సమాజంలో సభ్యులుగా చేరనే లేదు. మద్రాస్ హిందూ విడో మ్యారేజ్ అసోసియేషన్ సభ్యులు వితంతు వివాహాలు శాస్త్ర సమ్మతం అయితేనే విజయవంతం అవుతాయని విశ్వసించారు. ఈ దిశలో వితంతు వివాహాలకు అనుకూలంగా ఉన్న శాస్త్ర గ్రంథాలలోని విషయాలను ముందుగా ప్రచురించడానికి పూనుకొన్నారు. అప్పటికి ఈ సంస్కరణవాదులు కులవ్యవస్థను వ్యతిరేకించలేదు. వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించలేదు. హిందూ విడో మ్యారేజ్ అసోసియేషన్ ఈ పరిమిత లక్ష్యాలు కూడా కార్యరూపం ధరించలేదు. హిందూ సమాజం నుంచి వీరికి ఎటువంటి ప్రోత్సాహం లభించక పోవడంవల్ల, ఈ సంస్థ కార్యక్రమాలు వెనకబడిపోయాయి.[30]

మద్రాస్ విడో మ్యారేజ్ అసోసియేషన్ సభ్యులకు పట్టుదల లేదని, ఇంగ్లీషు అధికారుల మెప్పుకోసమే ఈ సమాజాన్ని స్థాపించారనే విమర్శలు వచ్చాయి. ఈ సమాజ సభ్యులు బహిరంగసభల్లో, పత్రికల్లో వ్యక్తపరచిన ఆశయాలను ఆచరణలో పెట్టలేని పిరికివాళ్ళనే మాటలు పుట్టాయి. అసలు సంగతి, ఈ సంస్థ సభ్యులు సంప్రదాయవాదులతో ముఖాముఖి తలపడడానికి ఇష్టపడలేదు. మద్రాసు బ్రాహ్మణుల్లో ఎక్కువమంది బాల్యవివాహాలను నిరసించే వారే అయినా, ఆచరణలో సంప్రదాయాన్ని ఉల్లంఘించిన వారిని ఉపేక్షించకుండా, నిర్దాక్షిణ్యంగా శిక్షించారు.రంగనాథశాస్త్రి, ముత్తుస్వామి అయ్యరు, రామయ్యంగారు వంటి విద్యాధికులు, గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా మూఢ నమ్మకాలను, దుష్ట సంప్రదాయాలను ఎదిరించడానికి జంకుతున్నారని, బాధ్యతలనుంచి తప్పుకొంటున్నారని పత్రికలలో విమర్శలు వచ్చాయి. వీరు సంస్కరణలకు అనుకూలమే అయినా సంప్రదాయవాదులను నొప్పించకుండా మార్పు తీసుకొని రావాలని ప్రయత్నించారు.[31]

1875లో మద్రాస్ విడో మ్యారేజ్ అసోసియేషన్ వితంతు వివాహాలమీద ఒక సభ నిర్వహించింది. పరవస్తు వెంకటరంగాచార్యులు విశాఖపట్నంనుంచి సభకు రావడమే కాక, స్త్రీ పునర్వివాహం శాస్త్ర సమ్మతమని సమర్థిస్తూ పుస్తకం రాసి ప్రకటించాడు.[32] అంతకంటే ముందే బందరు పత్రిక 'పురుషార్థ ప్రదాయిని' లో వితంతు వివాహాలను సమర్థిస్తూ వ్యాసాలు వెలువడ్డాయి. వేద సమాజపత్రిక 'తత్త్వబోధిని' లోను కొన్ని వ్యాసాలు వచ్చాయి. వీరేశలింగం స్త్రీ పునర్వివాహాలను సమర్థిస్తూ అనేక వ్యాసాలు రాసి, ప్రజాభిప్రాయాన్ని అనుకూలంగా మలచడానికి ప్రయత్నించాడు.

పాతతరం సంస్కరణవాదుల్లో రంగనాథశాస్త్రి చనిపోయాడు. రామయ్యంగారు తిరువాన్కూరు దివాను పదవిని అంగీకరించి మద్రాసు విడిచిపెట్టాడు. ఆ సమయంలోనే ఆర్. రఘునాథరావు డెప్యూటీ కలెక్టరుగా మద్రాసు తిరిగి వచ్చాడు. ఆయనకు ప్రభుత్వ పాలనలో విశేషానుభవం ఉంది. మద్రాసులో అడుగు పెట్టగానే సంస్కరణోద్యమంలో మనస్ఫూర్తిగా నిమగ్నమయ్యాడు. ధర్మశాస్త్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయడంతో ఆయనలో సంస్కరణ మీద ఆసక్తి మొదలైంది. హిందువులు స్వచ్ఛమైన వైదికాచారాలను వదిలిపెట్టి మూఢనమ్మకాలవైపు ఆకర్షించబడ్డారని ఆయన పరిశీలనలో తేలింది. శాస్త్రాచారాలకు దూరం కావడంవల్ల స్త్రీలను అణచివేసే దురాచారాలు హిందూ సమాజంలో తలఎత్తాయని, బాల్య వివాహాలు, నిర్బంధ వైధవ్యం మొదలైన అంధ విశ్వాసాలకు హిందూ శాస్త్రాల ఆమోదంలేదని గ్రహించాడు. వేద యుగానంతరం వెలువడిన వ్యాఖ్యానాలు, విమర్శలు అనేక అపార్థాలకు తావిచ్చాయని, దక్షిణ భారతదేశంలో మూర్ఖంగా సంప్రదాయాన్ని నమ్మేవారివల్లే సంస్కరణ పురోగమించడం లేదనే నిశ్చయానికి వచ్చాడు. రఘునాథరావుకు ఇంగ్లీషు విద్యావంతుల మీద గూడా భ్రమ తొలగిపోయింది. మొదట్లో ఇంగ్లీషు విద్యావ్యాప్తి వల్ల సంస్కరణోద్యమం బలపడుతుందని ఆయన భావించాడు. ఇంగ్లీషు నేర్చిన యువకులు పాశ్చాత్య సంస్కృతి మోజులో తమ మతాన్ని, జీవనవిధానాన్ని చులకన చేసి తృణీకరిస్తున్నారని, విగ్రహారాధనను నిరాకరించి నాస్తికులుగా మారుతున్నారని అభిప్రాయపడ్డాడు. ఈ యువకులు అభిలషిస్తున్న తీవ్రమైన మార్పులు హిందూ సమాజానికి చెడుపు చేస్తాయని, శాస్త్ర గ్రంథాల ఆధారంగా నిర్మాణాత్మకమైన మార్పులు తీసుకొని రావచ్చునని విశ్వసించాడు. ఆయన సంస్కరణ అనే మాటను కూడా వాడడానికి ఇష్టపడలేదు. దానికి బదులు "మన జీవితానికి సంబంధించిన ప్రాచీన సూత్రాలు" అని వాడుక చేశాడు. శాస్త్రం ఆమోదం లేకుండా హిందూ సమాజాన్ని మార్చడం సాధ్యంకాదని, సంప్రదాయ వాదులను నొప్పించకుండానే సంస్కరణ, మార్పు నిదానంగా రావాలనే నిర్ణయానికి వచ్చాడు. పళ్ళె చెంచలరావు, మద్రాసు హైకోర్టు వకీలు సుబ్రహ్మణ్యంఅయ్యరు మొదలైన ఈయన మిత్రులు ఈ అభిప్రాయాలను సమర్థించారు. వీరి ఆలోచనలతో ఏకీభవించనివారు

"హేతువాదులు" గా ముద్రపడ్డారు. ఈ వర్గంవారు మార్పుకు తర్కం, ఇంగితజ్ఞానం పునాది కావాలని భావించారు. నరసయ్య ఈ భావజాలానికి చెందినవాడని అనిపిస్తుంది.[33]

రఘునాథరావు మద్రాసుకు రావడంతో హిందూ మ్యారేజ్ అసోసియేషన్ పునరుద్ధరించబడింది. ఆయన అభిప్రాయాలతో ఏకీభవించేవారే సంస్థలో ప్రధాన కార్యకర్తలు అయ్యారు. రఘునాథరావు అధ్యక్ష పదవి చేపట్టాడు. పదేళ్ళ కన్నా తక్కువ వయసు బాలికలకు వివాహం చేయడాన్ని ఈ సంస్థ అంగీకరించలేదు. వివాహమై కొంతకాలం సంసారం చేసిన స్త్రీలకు వేదమంత్రాలు పునర్వివాహం అంగీకరించలేదని, కన్యలైన వితంతువులకు మాత్రమే శాస్త్రం వివాహ విధిని అంగీకరించినట్లు ఈ సంస్థ అభిప్రాయపడింది. వితంతువులు పునర్వివాహం చేసుకొంటే తొలి భర్త ఆస్తిమీద హక్కు పోతుందనే కారణంతో, వితంతు బాలికల పునర్వివాహాలకు కన్నవారే అడ్డుపడుతున్నారని, అందువల్ల 1856 హిందూ వివాహ చట్టాన్ని సవరించవలసి ఉందని ఈ సంస్థ భావించింది. ఉత్తర సర్కారు జిల్లాలలో వీరేశలింగం ప్రారంభించిన వితంతు పునర్వివాహ కార్యక్రమంతో ప్రేరణపొంది, వితంతు వివాహాలు కుదిర్చినవారికి, అర్హులైన కన్యల వివరాలు తెలియజేసినవారికి ఆర్థికసహాయం అందించేందుకు ఈ సంస్థ ముందుకు వచ్చింది. ప్రజాభిప్రాయాన్ని సంస్కరణకు అనుకూలంగా మలచడంలో రఘునాథరావు, ఆయన మిత్రులు ఈ సంస్థ ద్వారా కృషి చేశారు.[34]

వీరేశలింగం తొలి వితంతు వివాహం జరిపించిన నాలుగో రోజే రెండో వితంతు వివాహం జరిపించాడు. దాంతో రాజమండ్రి సంప్రదాయ బ్రాహ్మణ వర్గం వీరేశలింగంమీద చర్య తీసుకొన్నది. ఈ వివాహాలతో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ వెలివేసింది. స్థానిక పీఠాధిపతి సంస్కరణవాదులను వెలివేస్తూ పత్రికలు పంపాడు. వీటిని ఎదుర్కొనే శక్తి లేక కొందరు ప్రాయశ్చిత్తం చేసుకొన్నారు. వీరేశలింగం ఆయన అనుచరులు కొద్దిమంది మాత్రమే ఈ కష్టాలు సహించి నిలబడగలిగారు.[35]

రాజమండ్రిలో జరిగిన పునర్వివాహ వార్తలు విని మద్రాసు సంస్కరణవాదులు ఎంతో సంతోషించారు. వీరేశలింగాన్ని అభినందిస్తూ లేఖలు రాశారు. చెన్నపట్నం వచ్చి ఈ వేడి చల్లారక మునుపే కొన్ని ఉపన్యాసాలు చేయవలసిందని వీరేశలింగాన్ని ఆహ్వానించారు. ఆయన ఉపన్యాసాల ప్రభావంతో మద్రాసులో కూడా కొన్ని వితంతు వివాహాలు జరగవచ్చునని రఘునాథరావు, ఆయన మిత్రులు భావించారు.[36]

వీరేశలింగాన్ని మద్రాసుకు పిలిపించడానికి పళ్ళె చెంచలరావు కృషిచేశాడు. "మాతో సహ భోజనమున కేర్పాటుచేసి మాకు ప్రోత్సాహము కలిగించుటకయి చెంచలరావు పంతులుగారు మమ్మచటకు రమ్మని యాహ్వానము చేసిరి" అని వీరేశలింగం స్వీయచరిత్రలో

రాశాడు. వీరేశలింగం మద్రాసు రాకవల్ల అక్కడ పునర్వివాహ ఉద్యమం బలపడడమేకాక, ఆయనతో సహపంక్తి భోజనం చేసి, ఆయనను బ్రాహ్మణుడుగా అంగీకరించడం కూడా "మద్రాస్ విడో మ్యారేజ్ అసోసియేషన్" వారి ఆలోచనలో ఉంది.[37]

## సాంఘిక సంస్కారాభిమాన షట్చక్రవర్తులు

ఆ యేడు మే నెలలో తొలి వితంతు వివాహ దంపతులను వెంటబెట్టుకొని సతీసమేతంగా వీరేశలింగం మద్రాసు చేరాడు. మద్రాసులో వీరికి గొప్ప అతిథి మర్యాదలు జరిగాయి. వీరేశలింగం క్రిస్టియన్ కాలేజి ఆండర్సన్ హాలులో, ఇతర సమావేశాల్లో స్త్రీ పునర్వివాహ సమస్య మీద ఉపన్యసించాడు. ఆ రోజుల్లోనే కొక్కొండ వెంకటరత్నం, వేదం వేంకటరాయశాస్త్రి సంస్కరణను వ్యతిరేకిస్తూ ఉపన్యాసాలు చేశారు. తెలుగు బ్రాహ్మణులు వీరేశలింగం పాల్గొన్న సభల్లో సంస్కరణను వ్యతిరేకిస్తూ మాట్లాడేవారు.[38]

వీరేశలింగం మద్రాసుకు రాకముందే స్త్రీ పునర్వివాహాన్ని బలపరచేవారెవరో తెలుసుకోడానికి చెంచలరావు, రఘునాథరావు సహపంక్తి భోజన వివరాలను పత్రికలలో ప్రకటించారు. ఈ సందర్భంలో 'హిందూ' పత్రికలో రోజూ రెండు మూడు ఉత్తరాలు ప్రచురింపబడుతూ వచ్చాయి. అవి సంస్కరణ వాదులకు ప్రోత్సాహం ఇచ్చేవి కాదని వీరేశలింగం స్వీయచరిత్రలో రాశాడు. 'పేరుగల'వారు ఇరవై ముప్పైమంది ఆహ్వానాన్ని అంగీకరిస్తూ ఉత్తరాలు రాశారు. చివరకు అంత విశాలమైన మద్రాసు మహానగరంలో సహపంక్తి భోజనంలో పాల్గొన్నవారు అయిదుగురు మాత్రమే.[39] ఈ సంఘటన గురించి వీరేశలింగం స్వీయచరిత్రలో ఈ విధంగా రాశాడు. "దేశాభిమానులయిన సంస్కార ప్రియులందరకును నిర్ణీత దినమున సంస్కార భోజనమునకు దయచేయ వలసినదని బహు దినములకు ముందుగానే ఆహ్వాన పత్రికలు పంపిరి. వానికి బదులు వ్రాయుటకే కొందరు సంస్కార ప్రియులకు తీరిక కాలేదు. పలువురు కార్యాంతర భారములచేత తాము రాలేక పోయినందుకు విచారములు తెలుపుచూ క్షమాపణలు చేసిరి. సబుజడ్జిగా నుండిన గణపతయ్య గారొక్కరు మాత్రమాహ్వాన మంగీకరించి రాఁగలిగిరి. అప్పుడు... ఆ విందుకు వచ్చినవారు వివాహదంపతులుగాక, రఘునాథరావుగారును, చెంచలరావు పంతులుగారును, గణపతయ్యగారును, దంపూరు నరసయ్యగారును, మన్నవ బుచ్చయ్యపంతులుగారును, నేనును గలసి సాంఘిక సంస్కారాభిమాన షట్చక్రవర్తులు. ఈ యాఱుగురితోను విందు జయప్రదముగా ముగిసిన తర్వాత ......"[40]

"సబుజడ్జిగా నుండిన గణపతయ్య గారొక్కరు మాత్రమే ఆహ్వానమంగీకరించి రాగలిగిరి" అని వీరేశలింగం రాయడంచేత, సంస్కారభోజనానికి వచ్చిన అతిథి ఆయన ఒక్కరే అని తెలుతుంది. నరసయ్యతో సహా మిగిలిన నలుగురు సంస్కార భోజనం

ఏర్పాటు చేసిన కార్యకర్తలని స్పష్టమవుతుంది. ఆనాటి మద్రాసు పత్రికలు ఈ సంఘటలను గురించి రాస్తూ "Six Reformers" అని తరచుగా పేర్కొన్నాయి. వీరేశలింగం ఈ పత్రికల నుంచి స్ఫూర్తిని పొంది స్వీయచరిత్రలో “సాంఘిక సంస్కారాభిమాన షట్చక్రవర్తులు” అని వర్ణించి ఉంటాడు.

నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్ ప్రారంభించి సంవత్సరం అయింది. ఈ కాలంలోనే మన్నవ బుచ్చయ్యతో స్నేహం బలపడి ఉండాలి. మొత్తం మద్రాసు మహానగరంలో విద్యావంతులెవరూ ధైర్యంగా ముందుకురాని ఈ సంస్కార భోజనంలో నరసయ్య పాల్గొన్నాడు. బ్రహ్మ సమాజ సంబంధాలు, సంస్కరణపట్ల గాఢమైన నిబద్ధత ఆయన సహపంక్తి భోజనంలో పాల్గొనేటట్లు చేసి ఉంటాయి.

మద్రాసు సంస్కార భోజనంలో పాల్గొన్న వారి కష్టాలు తర్వాత కొద్దికాలానికే మొదలయ్యాయి. రఘునాథరావు, గణపతయ్యరు, చెంచలరావు అందరూ పెద్ద ప్రభుత్వోద్యోగులు గనుక వెంటనే స్వకులంవారి నుంచి అంతగా వ్యతిరేకత ఎదురై ఉండదు.[41] సంస్కార భోజనంలో పాల్గొన్న రెండు మూడు నెలలకే రఘునాథరావు, చెంచలరావు మెత్తబడి ఒక అడుగు వెనక్కువేసి సంప్రదాయ వాదుల మెప్పు పొందడానికి ప్రయత్నించారు. రాజమండ్రిలో శంకరాచార్యులు వీరేశలింగంతోబాటు ఆత్మూరి లక్ష్మీనరసింహాన్నీ వెలివేశాడు. నరసింహం శంకరాచార్యులమీద రాజమండ్రి న్యాయస్థానంలో కేసువేశాడు. కేసు శంకరాచార్యులకు అనుకూలం అయింది. తర్వాత నరసింహం మద్రాసు హైకోర్టులో అపీలు చేశాడు. రఘునాథరావు, చెంచలరావు శంకరాచార్యుల మీద హైకోర్టులో అపీలు చేయడాన్ని ఖండించి సంప్రదాయవాదుల ఆగ్రహాన్ని చల్లబరచడానికి ప్రయత్నించారు.[42] మన్నవ బుచ్చయ్య, నరసయ్య ఇద్దరు తెలుగు స్మార్తబ్రాహ్మణులు. వీరి మీద చర్య తీసుకోవడానికి కంచి పీఠాధిపతికి అవకాశం ఉంది. బుచ్చయ్య అప్పటికే 'బ్రాహ్మో' గా పరివర్తన చెందినట్లుంది. “ఆ రోజుల్లో బ్రహ్మసమాజంతో ఎటువంటి సంబంధం పెట్టుకున్నా సనాతన హిందువులు హీనంగా చూసేవారు”.[43] బహుశా వీరిద్దరూ అప్రకటిత వెలికి గురి అయ్యారేమో తెలియదు.

## బహిష్కరణ

సంస్కార భోజనంలో పాల్గొన్న ఏడాది తర్వాత ఈ “ఆరుగురు సంస్కర్తలను” పీఠాధిపతులు వెలివేసినట్లు 'మద్రాస్ టైమ్స్' రాసింది.[44] ఈ బహిష్కరణ వెనుక ఒక సంఘటన, ఒక తక్షణ కారణం ఉంది. చెంచలరావు, రఘునాథరావుల ఆహ్వానం అంగీకరించి వీరేశలింగం ఎనిమిదవ వితంతు వివాహం మద్రాసులో జరపడానికి నిశ్చయించాడు. అయితే చివరి నిమిషంలో ఇద్దరూ వెనుకంజ వేశారు. మద్రాసు వితంతు పునర్వివాహ సమాజ సమావేశాన్ని ఏర్పాటుచేసి చర్చించామని, సమావేశానికి హాజరైన

సభ్యులలో బ్రాహ్మణులు వివాహానికి వచ్చినా, పెళ్ళిభోజనం చేయడానికి సిద్ధంగా లేనందువల్ల మద్రాసులో ఈ వివాహం చేయడం 'అవివేకచర్య' గా భావిస్తున్నట్లు రఘునాథరావు వీరేశలింగానికి తెలియజేశాడు. వివాహం మదరాసులోనే చేయాలనే పట్టుదలతో పెళ్ళిబృందాన్ని వెంటబెట్టుకొని వీరేశలింగం మద్రాసు వచ్చాడు. అయిష్టంగానే రఘునాథరావు పెళ్ళి ఏర్పాట్లు చేశాడు. మద్రాసులో జరుగుతున్న తొలి పునర్వివాహం గనుక వందమందిపైగా పెళ్ళికి వచ్చారు. వీరిలో మద్రాసు వితంతు పునర్వివాహ సంఘసభ్యులు, విద్యార్థులు ఉన్నారు. వేడుక చూడవచ్చినవారిలో కొద్దిమంది మాత్రమే వధూవరులతో కలిసి పెళ్ళిభోజనం చేశారు. పెళ్ళిభోజనానికి "రఘునాథరావు మొదలైన ప్రముఖులు" రాని సంగతి పత్రికలలో ప్రకటించమని కొందరు యువకులు పట్టుపట్టినా, తానాపని చెయ్యలేదని వీరేశలింగం స్వీయచరిత్రలో పేర్కొన్నాడు.[45]

ఆనాటి మద్రాసు పత్రికలు ఈ పెళ్ళిముచ్చట్లను గురించి వివరంగా రాశాయి. పెళ్ళి ఆడంబరంగా జరిగినట్లు, పెళ్ళి ఊరేగింపు మైలాపూరు బ్రాహ్మణవీధి గుండా సాగినట్లు వర్ణించాయి.[46]

"This stirred the ire of the religious heads who promptly excommunicated six reformers who had participated in a dinner given to the married couple. An attempt to settle the differences amicably at a conference in September 1884 failed, owing to the insistence of the Head Priest of Triplicane to be the sole judge of the discussion" అని సుందరలింగం పేర్కొన్నాడు. ఈ విషయాలను ఆయన మద్రాస్ టైమ్స్ 1883 జూన్11, 1884 సెప్టెంబరు 9 సంచికల నుంచి కోట్ చేశాడు.[47]

"ఈ బహిష్కరణ తర్వాత చెంచలరావు, రఘునాథరావుగారును పెండ్లి భోజనములు చేయకపోయినను, కులమువారైన మాధ్వులు చెన్నపురిలోని ఎనిమిదవ వివాహానంతరము వారిని కొంత బాధింపసాగిరి. వారి యాచార్యుడైన యుత్తరాదిస్వామి చెన్నపురికి వచ్చి కొంత కాలమచ్చట వాసమేర్పరుచుకొనిరి" అని పేర్కొనడమేకాక, రఘునాథరావు, చెంచలరావు ప్రాయశ్చిత్తం చేసుకొన్నసంగతి వీరేశలింగం స్వీయచరిత్రలో పేర్కొన్నాడు.[48] వితంతు వివాహాలను ప్రోత్సహించవద్దని పీఠాధిపతి చేసిన ఆదేశాన్ని అంగీకరించి, రఘునాథరావు, చెంచలరావు పీఠాధిపతితో రాజీపడినట్లు ఆనాటి పత్రికల రాతలవల్ల తెలుస్తుంది.[49]

## రఘుపతి వెంకటరత్నం

1885 జనవరి లో వీరేశలింగం మద్రాసులో వితంతు వివాహాల మీద

ఉపన్యసించాడు. ఈ సందర్భంలో ఆయనకు ఇద్దరు బాల వితంతువులకు వివాహం చేసే అవకాశం లభించింది. మద్రాసులో పెళ్ళిళ్ళు జరిపిస్తే తాము హాజరు కావలసివస్తుందని, పెళ్ళిళ్ళు వేరొకచోట జరిపిస్తే పెళ్ళిళ్ళకు వెళ్ళలేదనే అపవాదు తప్పుతుందని, తాము సంస్కరణ పక్షం నుంచి వైదొలగినట్లు తెలిస్తే, ఉద్యమానికి నష్టం వాటిల్లవచ్చని రఘునాథరావు, చెంచలరావు వీరేశలింగానికి నచ్చచెప్పి, పెళ్ళిళ్ళు బళ్ళారిలో జరిగించేటట్లు ఒప్పించారు. ఈ ఏర్పాటులో మన్నవ బుచ్చయ్య, రఘుపతి వెంకటరత్నం వీరేశలింగానికి అండగా ఉన్నారు.[50]

నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక ప్రారంభించడం, రఘుపతి వెంకటరత్నం కళాశాల విద్యకోసం మద్రాసులో అడుగు పెట్టడం ఒకేసారి జరిగాయి. అప్పుడు రఘుపతి వెంకటరత్నం వయసు ఇరవై సంవత్సరాలు. ఆయన 1881-85 మధ్య ఉన్నతవిద్య అభ్యసిస్తూ మద్రాసులో ఉన్నాడు. 1881లో ఎఫ్.ఏ చదువుతూ, పండిత శివనాథశాస్త్రి ఉపన్యాసాలు విని బ్రహ్మసమాజంవైపు ఆకర్షించబడినట్లు, బ్రహ్మసమాజ కార్యకర్తగా పరివర్తన చెందడంలో మన్నవ బుచ్చయ్య ప్రోత్సాహం ఉన్నట్లు ఆయన ఆత్మకథలో వివరించాడు.[51] వెంకటరత్నం కళాశాలవిద్య కొనసాగిస్తూనే బ్రహ్మసమాజ ఆశయాలను ప్రచారంచేశాడు. బ్రహ్మసమాజ భవన నిర్మాణానికి కృషి చేశాడు. సాంఘిక స్వచ్ఛతా ఉద్యమం ప్రారంభించి, ముందుకు తీసుకొని వెళ్ళాడు. వ్యక్తిగత జీవితంలో నిర్మలమైన నడవడిక, మద్యపానానికి దూరంగా ఉండడం, కళావంతుల వ్యవస్థ రద్దుకు కృషిచేయడం ఈ స్వచ్ఛతా ఉద్యమం ప్రధాన ఆశయాలు. ఈ ఉద్యమం బలపడి ప్రెసిడెన్సీలోని ఇతర పట్టణాలకు వ్యాపించింది. వెంకటరత్నం మద్రాసు క్రిస్టియన్ కాలేజీ నుంచి పట్టాపుచ్చుకున్న తర్వాత, "సంవత్సరంపాటు ది పీపుల్స్ ఫ్రెండ్, బ్రహ్మ ప్రకాశిక, దిఫెలో వర్కర్‌లలో" తన పత్రికావ్యాసంగం కొనసాగించాడని ఏభై ఏళ్ళ క్రితమే డాక్టర్ వి.రామకృష్ణారావు రికార్డు చేశాడు.[52] వెంకటరత్నం పీపుల్స్ ఫ్రెండ్ సంపాదక వర్గంతో సన్నిహితంగా ఉండి రచనలు చేసినట్లు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ పేర్కొన్నాడు.[53] నరసయ్య బ్రహ్మసమాజ కార్యకర్త, సంస్కరణోద్యమ కార్యకర్త కాబట్టే వెంకటరత్నం సాంఘిక స్వచ్ఛతా ఉద్యమానికి పీపుల్స్ ఫ్రెండ్‌లో చోటు కల్పించాడు. బ్రహ్మసమాజంతో, సంఘ సంస్కరణ ఉద్యమంతో ఉన్న సంబంధాలే నరసయ్యను, మన్నవ బుచ్చయ్యను, వెంకటరత్నాన్ని కలిపాయి. బ్రహ్మసమాజ సంబంధాలవల్లే నరసయ్యకు బెంగాలులోని మేధావులతో పరిచయాలు ఏర్పడ్డాయి.[54] వెంకటరత్నం జర్నలిజం తొలి పాఠాలు నరసయ్య వద్ద నేర్చుకున్నట్లు అనిపిస్తుంది. నరసయ్య, వీరేశలింగం మధ్య జరిగిన 'కరస్పాండెన్సు' తాను చదివినట్లు, వెంకటరత్నం పీపుల్స్ ఫ్రెండ్‌లో పనిచేసినట్లు నరసయ్య మనుమడు కృష్ణమూర్తి చెప్పడం కూడా ఈ అభిప్రాయానికి బలం చేకూరుస్తోంది.

## నూతన సమాజ నిర్మాణం కోసం నరసయ్య

నరసయ్య బ్రహ్మ సమాజ వార్తలను, సంస్కరణోద్యమ వార్తలను, మహిళాభ్యుదయానికి సంబంధించిన వార్తలను పీపుల్స్ ఫ్రెండ్‌లో తరచుగా ప్రచురించినట్లు నిరూపించడానికి ఆధారాలున్నాయి. 1883 డిసెంబరు 1వ తారీకు సంచికలో ఇటువంటి విషయాలు కనిపించాయి. కేశవచంద్రసేన్ ఆరోగ్యం మీద ఒక వార్త ఉంది. ఇదే సంచికలో నరసయ్యా పండిత రమాబాయి మీద రెండు కథనాలు ప్రచురించాడు. మాక్స్‌ముల్లరు ఆహ్వానాన్ని పురస్కరించుకొని రమాబాయి ఆక్స్‌ఫర్డ్ వెళ్తుంది. అక్కడ కవి సమ్మేళనాల్లో పాల్గొని ఆశువుగా కవిత్వం చెపుతుంది. ఆమె అసాధారణ ధారణాశక్తి, నిర్దుష్టమైన సంస్కృత భాష ఉచ్చారణకు ఆక్స్‌ఫర్డ్ మేధావులు అబ్బురపాటు చెందుతారు. క్లిష్టమైన ఛందస్సుల్లో ఆశువుగా కవితలల్లడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ఆమె సముద్రయానం చేసిన తొలి భారతీయ మహిళ అని నరసయ్య ప్రశంసిస్తాడు. పండిత రమాబాయిని గురించిన మరొక కథనం కూడా ఇదే సంచికలో కన్పిస్తుంది. ఇంగ్లాండులో ఉన్నప్పుడు అక్కడి పత్రిక ప్రచురించిన ఆమె ఆత్మకథను నరసయ్య ఇదే సంచికలో పునర్ముద్రించాడు. రమాబాయి తండ్రి స్త్రీ విద్యాభివృద్ధికోసం కృషి చేస్తాడు. ఆయన తన భార్యకు సంస్కృతం నేర్పుతాడు. కుమార్తె రమాబాయి విదుషీమణి అవుతుంది. బాల్యవివాహాలు విద్యాభ్యాసానికి ఆటంకమనే కారణంతో తల్లిదండ్రులు తనకు బాల్యవివాహం చెయ్యలేదని ఆమె వివరిస్తుంది. రమాబాయి అక్కకు సంప్రదాయ పద్ధతిలో బాల్యవివాహం జరుపుతారు. ఆ వివాహం విఫలమవుతుంది. రమాబాయి కథ చివర, ఈ అంశాలను ప్రస్తావిస్తూ నరసయ్య పాఠకులకు ఈ విధంగా విజ్ఞప్తి చేశాడు. "We hope this will have the effect of stipulating and encouraging the majority of Hindu fathers to stamp out the system of early marriages from this country. The case of Ramabaye's sister was only a typical one." ఆ రోజుల్లో దేశీయుల యాజమాన్యాలలోని పత్రికల్లో రమాబాయికి అనుకూలంగానో, ద్వేషపూరితంగానో మాత్రమే వార్తలు ఉండేవి.[55]

1886 జనవరి 30 పీపుల్స్ ఫ్రెండ్ సంచికలో ఆర్. రఘునాథరావు, పనప్పాకం అనంతాచార్యులు హిందూ వివాహచట్టం మీద రాసిన చిన్నపుస్తకాలు, వీరేశలింగం రచనలు "పీపుల్స్ ఫ్రెండ్ లైబ్రరి" ద్వారా అమ్ముతున్నట్లు ఒక ప్రకటన ఉంది. "పేపర్స్ ఫర్ అవర్ ఎడ్యుకేటెడ్ కంట్రీమెన్ (Papers for our educated countrymen) శీర్షిక కింద "విడో రీ మేరేజస్", "సీతా అండ్ రామా - ఎ టేల్ ఆఫ్ ది ఇండియన్ ఫేమిన్" (Sita and Rama... a Tale of the Indian famine) అనే ఇంగ్లీషు దీర్ఘ కవిత, ఇతర పుస్తకాలు విక్రయిస్తున్నట్లు ఉంది. ఇందులో మొదటిది సంస్కరణకు, రెండవది దేశ పరిస్థితికి సంబంధించింది. పీపుల్స్ ఫ్రెండ్ పుటలన్ని ఇటువంటి వార్తలతో, వ్యాసాలతో నిండినట్లు

అనిపిస్తుంది.

"మహారాజ రాజశ్రీ కందుకూరు వీరేశలింగంపంతులుగారు ధైర్యసాహసములతో అనేక హిందూ స్త్రీ పునర్వివాహములను చేయుచున్నారు గనుక సి.యస్.ఐ. బిరుదుకు తగుదురని పీపుల్స్ ఫ్రెండ్ పత్రికాధిపతులు వ్రాయుచున్నారు." అని వీరేశలింగం సేవలను ప్రశంసిస్తూ నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్‌లో ప్రకటించిన అభిప్రాయాన్ని 1889 మార్చి ఒకటవ తారీకు హిందూ జనసంస్కారిణి పునర్ముద్రించింది. ఈ ప్రశంస వల్ల కూడా నరసయ్య వీరేశలింగం వెంట, సంస్కరణవాదుల జట్టులో ఉన్నట్లు తెలుస్తుంది. "వీరేశలింగంగారి మార్గంలోనే వెంకటగిరిలో కొన్ని వితంతు వివాహాలను నరసయ్యగారు జరిపించార"ని బంగోరె పేర్కొన్నాడు.[56] "He is a member-Veeresalingam Pantulu Saranalaya" అని బంగోరె తన నోట్సులో రాసి, పక్కన 'రాధమ్మ' అనే పేరు గుర్తు రాశాడు. "నరసయ్య వెంకటగిరి అరవవీధిలో ఉండే పురాణం వెంకటసుబ్బయ్య మరదలు రాధమ్మకు వీరేశలింగంగారి వద్ద పునర్వివాహం జరిపించారు" అని కమలమ్మ (నరసయ్య మనుమడు శేషయ్య భార్య) చెప్పింది. "నరసయ్య మద్రాసులో జరిగిన వితంతు వివాహాల్లో పాల్గొన్నారు. వెంకటగిరిలోనో, మద్రాసులోనో, మా ద్రావిడుల అమ్మాయికి పునర్వివాహం జరిపించారు. ఆమె సంతతి ఇప్పుడు నాగపూరులో ఉంటున్నారు" అని నరసయ్య మనుమడు కృష్ణమూర్తి వివరించాడు.

ఏజ్ ఆఫ్ కన్‌సెంట్ బిల్లు ( Age of Consent Bill ) ను ఎంతోమంది సంస్కరణవాదులు సమర్థించినా, తొలితరం నాయకులు టి. మాధవరావు, ఎస్. సుబ్రహ్మణ్యఅయ్యరు, చెంచలరావు మొదలైనవారు సమర్థించలేదు. వీరిలో కొందరికి అప్పటికే దివ్యజ్ఞాన సమాజంతో సంబంధాలు ఏర్పడ్డాయి. కొందరి మీద ఆ సమాజ ప్రభావం ఉంది. మద్రాసు బ్రాహ్మణులు తమ కుర్రవాళ్ళను సంస్కరణోద్యమ ప్రభావం నుంచి కాపాడుకోడానికి దివ్యజ్ఞాన సమాజాన్ని అడ్డుపెట్టుకున్నారు.[57] వీరేశలింగం, నరసయ్య దివ్యజ్ఞాన సమాజాన్ని ఎద్దేవా చేశారు. "Avoid the absurd claims of the Theosophist and other shams" అని పరిహాసం చేస్తూ రాసిన వాక్యాలను నరసయ్య 1886లో పీపుల్స్ ఫ్రెండ్‌లో ప్రచురించాడు.[58] థియోసఫిస్టు దివ్యజ్ఞాన సమాజం వారి పత్రిక. నిజమైన సంస్కరణవాదులకు దివ్యజ్ఞానసమాజం బలమైన ప్రత్యర్థి, బద్ధ శత్రువు. 1897లో నరసయ్య చేసిన కన్యాశుల్క సమీక్షలో తాను ఎవరి వెంట ఉన్నది స్పష్టం చేశాడు. ఆయన అభిప్రాయాలు కుండబద్దలు కొట్టినట్లు ఆ వ్యాసంలో వెల్లడి అయ్యాయి.

నరసయ్య సంఘ సంస్కరణ నిబద్ధతను నిరూపించడానికి లభించిన ఆధారాలు చాలా పరిమితమైనవి. ఆయన సంస్కరణవాదుల వెంట ఉన్నాడని చెప్పడానికి ఈ రుజువులు చాలు. పీఠాధిపతుల బెదిరింపులు, బహిష్కరణలకు నరసయ్య భయపడి

ఉంటే, పత్రికను సంస్కరణకు సంబంధించిన వార్తలతో నింపడంగాని, వెంకటరత్నం రాసిన వ్యాసాలు ప్రచురించడంగాని, వీరేశలింగాన్ని సి.ఎస్.ఐ. బిరుదంతో సత్కరించమని ప్రభుత్వాన్ని అర్థించడంగాని చేసి ఉండడు.

## పీపుల్స్ ఫ్రెండ్ సంపాదకీయాలు

### 1. టూ పిక్చర్స్ సంపాదకీయం

1876లో సురేంద్రనాథబెనర్జీ "ఇండియన్ అసోసియేషన్" (Indian Association) స్థాపించాడు. విద్యావంతులైన కలకత్తా మధ్యతరగతి ప్రజలకు ఇది ఒక వేదిక అయింది. ఈ సంస్థద్వారా బ్రిటిష్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చట్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని వచ్చారు. ప్రజాభిప్రాయాన్ని సమీకరించారు. లార్డ్ రిప్పన్ (Lord Ripon) వైస్రాయిగా ఉన్నకాలంలో 1883లో ఇల్‌బర్ట్ బిల్లు తయారు చేశారు. వైస్రాయి సలహా మండలిలో 'లా మెంబరయిన' (law member) కోర్ట్నీ ఇల్‌బర్ట్ ("Sir Courtney Illbert") క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (Criminal Procedure Code) కు సవరణ ప్రతిపాదించాడు. చట్టంముందు అందరూ సమానులే అని చెప్పడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. బ్రిటిష్ పౌరులైన యూరోపియన్లు అంతవరకూ అనుభవిస్తూ వచ్చిన ప్రత్యేక సౌకర్యాలను తొలగించడానికి ఈ బిల్లు ఉద్దేశించబడింది. సివిల్ సర్వీసుల్లో ఉన్న యూరోపియన్ మేజిస్ట్రేట్లకు (European Magistrates) భారతీయులను క్రిమినలు చట్టాల ప్రకారం విచారించే హక్కు ఉన్నట్లే, సివిల్ సర్వీసుల్లో ఉన్న భారతీయ జిల్లా మేజిస్ట్రేట్లకు యూరోపియన్లను విచారించే అధికారం లేదు. ఇల్బర్ట్ బిల్లు చట్టం అయితే వారికి ఈ అధికారం లభిస్తుంది. ఈ చట్టం అమలులోకి వచ్చినా దాని పరిధి ఒక్క బెంగాల్ పరగణాకు మాత్రమే పరిమిత మవుతుంది. ఆ రోజుల్లో ఐ.సి.ఎస్. పరీక్ష పాసై, జిల్లా మేజిస్ట్రేట్లుగా పనిచేస్తున్న కొద్దిమంది భారతీయులు ఆ పరగణాలో మాత్రమే ఉన్నారు. లార్డ్ రిప్పన్ ఇల్‌బర్ట్ బిల్లు ద్వారా న్యాయవ్యవస్థలో ఉన్న అసంబద్ధతను తొలగించడానికి పూనుకొన్నాడు.

బెంగాల్ పరగణాలో టీతోటల యజమానులందరూ యూరోపియన్లు. వారు భారతీయ కూలీలను హీనాతిహీనంగా చూచేవారు. దేశీయులపట్ల జాత్యహంకారంతో ప్రవర్తించి, అనేక రకాల వివక్షలు ప్రదర్శించేవారు. ఆయుధచట్టం ప్రకారం దేశీయులు ఆయుధాలు కలిగి ఉండడం శిక్షార్హమైన నేరం. యూరోపియన్లకు ఈ చట్టం వర్తించదు. యూరోపియన్ టీతోటల యజమానులు, చిన్న పెద్ద వ్యాపారులు, అడ్వకేట్లు, యూరోపియన్ పత్రికా సంపాదకులు, ఇల్‌బర్ట్ బిల్లుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బిల్లు పాసైతే భారతీయ మేజిస్ట్రేట్లు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తారు, యూరోపియన్లు ఈ దేశంలో ఉండడం అసాధ్యమౌతుందని పసలేని వాదన లేవదీశారు.

భారతదేశంలోని యూరోపియన్ సమాజం కలిసి కట్టుగా ఉద్యమం కొనసాగించి, బ్రిటిష్ సామ్రాజ్యం ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి వచ్చినట్టు ఒక అభిప్రాయాన్ని కలిగించింది.

భారతీయ పత్రికలు, మేధావులు, విద్యావంతులు ఇల్‌బర్ట్ బిల్లును స్వాగతించారు. ఈ బిల్లును మార్పులేకుండా యథాతథంగా ఆమోదించాలంటూ ప్రజాభిప్రాయాన్ని సమీకరించారు. బిల్లులో ప్రతిపాదించిన మంచి విషయాలను గుర్తించి, భారతీయ పత్రికలు ఈ బిల్లు చట్టం కావాలని రాశాయి. పార్లమెంటులో మంత్రివర్గంమీద బిల్లు ఉపసంహరించుకోవాలని శ్వేతజాతీయులు తమ పలుకుబడినంతా ఉపయోగించారు. చివరకు కొన్ని సవరణలతో ప్రభుత్వం బిల్లు పాసుచేసింది. ఇందులో భారతీయ నేరస్థులకు లేని కొన్ని ప్రత్యేక సౌకర్యాలు యూరోపియన్ నేరస్థులకు కలిగించారు. బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమం సాగించిన యూరోపియన్ వర్గాలు ఈ విధంగా తమ జాత్యహంకార స్వభావాన్ని నిలబెట్టుకోగలిగాయి. దీంతో భారతీయులకు బ్రిటిష్ ప్రభుత్వం మీద ఉన్న భ్రమలు తొలగిపోయాయి. వారి ఆత్మగౌరవం మేలుకొన్నది. ఇల్‌బర్టు బిల్లుకు వ్యతిరేకంగా యూరోపియన్ వర్గాలు ఉద్యమం సాగిస్తున్న రోజుల్లో, బిల్లు సవరణలతో చట్టం కాబోతున్న సమయంలో 1883 డిసంబరు 1వ తేది పీపుల్స్ ఫ్రెండ్‌లో నరసయ్య "టూ పిక్చర్స్" (Two Pictures) పేరుతో ఒక సంపాదకీయం రాశాడు.

## కలకత్తా టౌన్‌హాలు సభ

1883 ఫిబ్రవరి 28న కలకత్తా టౌన్‌హాల్లో శ్వేతజాతీయులు పెద్దఎత్తున ఒక సమావేశం ఏర్పాటు చేశారు. టీతోటల యజమానులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలు అసంఖ్యాకంగా ఈ సమావేశానికి తరలివచ్చారు. ఆంగ్లో ఇండియన్లు, (Anglo Indians) అర్మీనియన్లు (Armenians) గూడా పెద్దసంఖ్యలో హాజరయ్యారు. టౌన్‌హాలు జనంతో కిటకిట లాడింది. వక్తలు ఆవేశంతో ఊగిపోతూ జాత్యహంకారాన్ని రెచ్చగొడుతూ ఉపన్యాసాలు చేశారు. కలకత్తా హైకోర్టులో బారిస్టరు ప్రాక్టీసు (Barrister practice) చేస్తున్న ఫరంగీ బ్రాన్‌సన్ (Feringhee Branson) భారతీయ న్యాయాధిపతులను, మేజిస్ట్రేట్లను దూషిస్తూ అసహ్యంగా, అనాగరికంగా పొగరుబోతుతనం ఉట్టిపడేటట్లు మాట్లాడాడు. ఆ సభ జరిగిన తరువాత భారతీయ వకీళ్ళు, అడ్వొకేట్లు అతనితో కలిసి పనిచేయడానికి నిరాకరించారు. భారతీయ పత్రికలు ఆయన ఉపన్యాసం మీద తీవ్రంగా స్పందించాయి. బ్రాన్సన్ తను వాడిన భాష సరియైనది కానందుకు క్షమాపణ చెప్పాడుగాని, మాట్లాడిన విషయాలకు పశ్చాత్తాపం ప్రకటించలేదు.[59] ఇతను ఇంగ్లాండు వెళ్ళినప్పుడు బర్మింగ్‌హేం (Birmingham) లో మర్యాద తొణికిసలాడే కంఠస్వరంతో ఎంతో సంస్కారిలాగా ప్రసంగించాడు. నరసయ్య "టూ పిక్చర్స్" లో బ్రాన్సన్ వికృత నిజస్వరూపాన్ని బట్టబయలు చేశాడు. హిందువులకు, యూరోపియన్లకు మధ్య

నెలకొనిఉన్న స్నేహభావాన్ని దురాగ్రహంతో భంగపరుస్తున్నాడని అతణ్ణి నిందించాడు. ఈ సంపాదకీయం తెలుగు అనువాదం :-

## రెండు చిత్రాలు

"కొన్ని నెలల క్రితం జరిగిన సంగతి. ఈ ఉపన్యాసకుడు కలకత్తా టౌన్‌హాల్లో మాట్లాడుతూ బెంగాలీ బాబులను పట్టి చాడీకోరులని, నీచులని, దుష్టులని హేళన చేశాడు. వారు పట్టి అవినీతిపరులైన మాయగాళ్ళని, అసమర్థులైనా మహా నైపుణ్యం ఉన్న వారిలాగా నటిస్తారని నిందించాడు. ఈ ఉపన్యాసకుడే బర్మింగ్‌హాంలో వేదికమీద తెలివిగా ఇంకో యుక్తిని ప్రదర్శించాడు. ఈసారి టోకున తిట్లకు దిగలేదు. మోతాదు మించకుండా అపహాస్యం చేశాడు. అసూయాపరుడైన కవి అలెగ్జాండర్ పోప్ తన మిత్రుడు ఎడిసన్‌ను చాటుమాటు మాటలతో వ్యంగ్యంగా ప్రస్తావించినట్లు, అస్పష్టంగా పొగడుతున్నట్లే నిందకు పూనుకొన్నాడు. మాకు "ఈ రెండు చిత్రాలు" వినోదం కలిగిస్తున్నాయి. పోలికల్లో బర్మింగ్‌హేం బ్రాన్సన్‌కు, కలకత్తా బ్రాన్సన్‌కు పొంతనే లేదు. కలకత్తా బ్రాన్సన్ చాలా కీతాగా కనిపిస్తాడు. మొక్కట్లు ఒకటేగాఉన్నా ధోరణి వేరుగా ఉంది. బిగిసిన పిడికిళ్ళతో, భయం కొలిపే హావభావాలతో, ఉద్రేకం, అపహాస్యం కలగలిసిన కంఠస్వరంతో, నిగ్రహంలేని తీవ్ర పదజాలంతో, నింద తొంగిచూచే విశేషణాలతో కలకత్తా టౌన్‌హాలు బ్రాన్సన్ ఫోటోగ్రాఫ్ మన ముందు నిలుస్తుంది. సుతిమెత్తని పొగడ్తలతో "మాగ్నాకార్టా" *(Magnacharta)* సహకారంతో, వ్యక్తిత్వానికి, స్వేచ్ఛకు సంబంధించిన ప్రాచీన ఆలోచనలతో సంయమనం, ఆత్మవిశ్వాసం ప్రదర్శిస్తూ, నెమ్మదితనం తొణికిసలాడే భాషలో, కలకత్తా ఉపన్యాసంలోని డాంబిక పదజాలం లేకుండా మాట్లాడే వ్యక్తిగా బర్మింగ్‌హాం చిత్రంలో కనిపిస్తాడు !

ఇంతకూ అసలీ బ్రాన్సన్ ఎవరు? ఇతగాడు కలకత్తా బార్లో (Calcutta Bar) సభ్యుడు. ఆ హోదా ఇతనికి ఎంతో గౌరవం కలిగించింది. ఇతను మద్రాసు వాడు. ఇక్కడే పుట్టి ఇక్కడే చదువు సంధ్యలు నేర్చాడు. మొదట వెపేరీ గ్రామర్ స్కూలు (Vepery Grammar School) లో చదివాడు. హాలీ (Mr.Halley) కాలంలో డోవిటన్‌కాలేజి (Doveton College) విద్యార్థి. తర్వాత ఇంగ్లాండు వెళ్ళాడు. తన సంగతి మద్రాసులో అందరికీ తెలుసు గనుక, తెలివిగా కలకత్తా వెళ్ళి అక్కడ బార్లో సభ్యుడయ్యాడు. హుగ్లీ పెద్దమనుషులు ప్రసిద్ధికెక్కిన ఇతని ఉపన్యాసం విని పెద్దగా కేకలువేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తపరచారు. సర్ ఛార్లెస్ ట్రెవిలియన్ (Sir Charles Trevelyan) కు ఎంతో "గౌరవప్రదమైన" కూవంనది ప్రవహించే చెన్నపట్నంలో అయితే ఈ ఉపన్యాసాన్ని అసలు సహించి ఉండరు. ఇతని తండ్రి ఫారో అండ్ కో (Pharoah & Co.,) లో భాగస్వామి. జాన్ బ్రూస్ నార్టన్ (John Bruce Norton) సంపాదకత్వంలో ఎథీనియం

పత్రిక వెలువడుతున్న రోజుల్లో ఫారో అండ్ కో ఆ పత్రికను ప్రచురించేది. ఘనత వహించిన ఈ టౌన్‌హాలు సిసిరో (Cicero) బర్మింగ్‌హేంలో అశ్లీలభాగాలు తొలగించబడి, నిర్దుష్టంగా రూపొందించబడిన ప్రచురణ వంటి సిసిరో - ఇంతా చేస్తే మదరాసీ. తానిప్పుడున్న స్థితికి ఈ పట్నం నుంచే ఎదిగినందుకు మేము ఎంతగానో గర్విస్తున్నట్లు ప్రకటిస్తున్నాము. తన గంభీరమైన వాక్కులతో మాగ్నాకార్టా గురించి, ప్రాచీనమైన హక్కుల గురించి ఉపన్యసించి కలకత్తా యూరేషియన్లను (Eurasians) యూరోపియన్లను, ఒక మదరాసీగా మంత్రముగ్ధులను చెయ్యలేదని తెలుసుకొన్నపుడు పశ్చాత్తాపం వంటి భావం ఒకటి మాకు కలిగింది. స్థిమితంగా ఆలోచించి ముసాయిదా బిల్లు మంచి చెడ్డలను అర్థం చేసుకోలేని మానసిక స్థితిలో ఉన్న శ్రోతలను ఉద్దేశించి, జాతి ద్వేషం హృదయాల్లో నాటుకొని పోయి ఉద్విగ్న స్థితిలో ఉన్న శ్రోతలను ఉద్దేశించి, తీవ్రమైన భాషలో ఈ బార్ సభ్యుడు చేసిన ఉపన్యాసం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.

బ్రాన్సన్ స్వల్ప విషయాలకు లేనిపోని ఆర్భాటంచేసి, అనాగరికంగా ప్రవర్తించడానికి ఎటువంటి కారణంలేదని స్పష్టంగా తెలుస్తూంది. తనలాగే ఈ దేశంలో జన్మించి, ఇక్కడే విద్యాబుద్ధులు నేర్చి, ఇంగ్లాండులో వృత్తిపరమైన అర్హతలు సంపాదించుకొన్నవారు, అవినీతిపరులైన బాబులను గురించి కలవరపాటు చెందనవసరం లేదని ఇప్పటిదాకా తెలుసుకొని ఉండకపోతే ఇప్పుడైనా గ్రహించాలి. టౌన్‌హాల్లో ఇతని ప్రవర్తన తాము ఉత్తమ జాతివారమని ప్రదర్శించుకొనే గర్వంగా మేము భావిస్తున్నాము. ఇతనికున్న నేపథ్యం వంటి నేపథ్యం నుంచి వచ్చి ఇతని మాదిరే విద్యాధికులై, ఇతని మాదిరే అదృష్టవంతులైన వ్యక్తుల్లో పొడసూపే గర్వంగా దీన్ని మేము భావిస్తున్నాము. అందువల్ల బ్రాన్సన్ దురాగ్రహాన్ని ఆయన శ్రోతల ఆగ్రహం కంటే భిన్నమైనదిగా మేము పరిగణిస్తున్నాము. ఇతను పుట్టినప్పటినుంచి ఇప్పటిదాకా తాను పొందిన ప్రతి అవకాశానికి, ఈ దేశానికి రుణపడి ఉన్నాడు. ఈ దేశ ప్రజలతో కలసిమెలసి జీవించాడు. ఈ దేశప్రజల డబ్బే ఇప్పటికి ఇతని జేబిలోకి పోతూంది. ఇటువంటి వ్యక్తి కృతఘ్నుతతో నిండిన, దుస్సహమైన ప్రవర్తనను మేము నిస్సంకోచంగా ఖండిస్తున్నాము. సరేలేండి, ప్రజలు "బ్రూటస్ నువ్వు కూడానా?" (et tu Brute) అని ఆశ్చర్యపోవచ్చు. ఇతని ప్రసంగంగానీ, ఇతని సోదరుడు అట్కిన్ (Atkin) ఉపన్యాసంగానీ, ఇల్బర్ట్‌బిల్లు రూపంలో ఉన్న సర్పాన్ని గాయ పరచాయేగానీ చంపలేకపోయాయి. ఈ విషయంలో హోంశాఖ (Home Authorities) వైస్రాయిని బలపరచడానికి నిశ్చయించుకొన్నట్లు తాజా వార్తలవల్ల తెలుస్తూంది. ప్రభుత్వ నిర్ణయానికి ఈ కోపోన్మాదమే కారణమయింది. వివేకం కోల్పోయి, న్యాయమైన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, అమానుషమైన ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వెర్రి అపోహల వల్లే అన్ని వర్గాలకూ అనుకూలమైన పరిష్కారాన్ని నిరాకరిస్తున్నట్లు ఈ సంఘటన సూచిస్తూంది. కాసేపు బ్రాన్సన్‌ను అట్లా ఉంచుదాం. ప్రతి రంగంలోను

ఇతని కన్న మిన్న అయినవారు భారతదేశాన్ని గురించి ఏమనుకుంటున్నారో పరిశీలిద్దాం. భారతీయులను గూర్చి ఎట్లా అభిప్రాయపడుతున్నారో తెలుసుకుందాం. ముందుగా ఇటీవల మన గవర్నరుగా పనిచేసిన ఛార్లెస్ ట్రెవెలియన్‌తో ప్రారంభిద్దాం. ఆయన మాటలు గుర్తించుకోదగినవి. "ఇంగ్లాండులో పోటీ పరీక్షలలో నెగ్గలేని నానారకాల యువకులు, ఆ పరీక్షలు రాయడానికి గూడా సాహసించలేనివారు, సిఫారసులు చేతబట్టుకొని భారతదేశానికి వెళుతున్నారు. వీరు పోలీసుశాఖలో నియమించబడుతున్నారు. రెవెన్యూశాఖలో డెప్యూటీ కలెక్టర్లుగా నియమించబడుతున్నారు. ఈ విధానం అన్యాయమైనది."

పరీక్షలు పాసైన భారతీయ యువకులను ఈ పద్ధతిలోనే నియమిస్తున్నారా? లార్డ్ ట్రెవిలియన్ పేర్కొన్న ఈ పెద్దమనుషులు దేశీయ ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉద్యమం సాగించినపుడు వారు ఈ దేశ అవసరాలను ఇంతకన్న మెరుగైన రీతిలో పట్టించుకుంటారని భావించడం దురాశే అవుతుంది. ఈ విషయంలో లార్డ్ లారెన్సు (Lord Lawrence) ఏమంటున్నారో చూడండి.

"ఇంతకన్న విశ్వసించదగిన పదవుల్లో, ఇంకాపెద్ద జీతబత్యాలున్న విధుల్లో *భారతీయులు నియమించ దగిన వారని నేను భావిస్తున్నాను. వారు ముఖ్యంగా న్యాయశాఖలో నియమించ దగిన వారు. భారతీయులు మంచి న్యాయాధిపతులుగా తయారు కాగలరని భావిస్తున్నాను.*" (ఈ అక్షరాలను ఇటాలిక్స్‌లో మేమే ఉంచాము.) స్థానికులు న్యాయాధిపతులుగా నియమించబడడానికి అన్ని అర్హతలు కలిగి ఉన్నారని భారతదేశంలో విస్తృతానుభవం ఉన్న ఒక గవర్నర్ జనరలు అన్న మాటలివి. బ్రాన్‌సన్ ఆయన సభలో పాల్గొన్నవారు భారతీయులను చొరవలేని మందమతులనీ, పరిశుభ్రత లేనివారనీ భావిస్తారు. సర్ ఛార్లెస్ ట్రెవిలియన్, సర్ లారెన్స్‌ల కంటే చాలా తెలివిగలవారమని వీరు అనుకొంటారు. ఒకప్పుడు భారతదేశ ఆర్థిక వ్యవహారాలు నిర్వహించిన గౌరవనీయులైన డబ్ల్యు. ఎన్. మాసీ (W.N.,Massey) ఎస్. బార్టిల్ ఫ్రెరర్ (S.Bartle Frere) మొదలైన సమర్థుల ముందు, ఉన్నత పదవులు నిర్వహించిన అధికారుల నిశ్చితాభిప్రాయం ముందు బ్రాన్‌సన్, అతని అభిమానుల నిరాధారమైన అభిప్రాయాలు అల్పమైనవిగా, తృణప్రాయంగా కనిపిస్తాయి. వేదికలమీద, పత్రికల్లో రెచ్చగొట్టే ఇటువంటి భావాలను గురించి జాన్ స్టూవర్ట్ మిల్ (John Stuart Mill) చాలాకాలం కిందటే రాశాడు. ఈ వాక్యాలు తరచుగా ఉల్లేఖించబడుతూనే ఉన్నాయి. మళ్ళీ ఇక్కడ చెప్పడంవల్ల ఈ మాటలు తమశక్తిని కోల్పోవు. ఈ రోజుల్లో భారతీయులందరూ ఈ మాటల్లో అర్థాన్ని జీర్ణంచేసుకోవలసిన అవసరం ఉంది. "ఒక దేశాన్ని మరొక దేశం జయించి తన స్వాధీనంలో ఉంచుకొన్నప్పుడు, ఆ దేశసంపదను కొల్లగొట్టి సంపదలు మూటలు కట్టకుండా అందరికంటే ముందు పాలకులకు

సంబంధించిన వ్యక్తులను గట్టిగా అదుపులో ఉంచాలి. ప్రధానంగా వీరివల్లే ప్రభుత్వానికి తలనొప్పి కలుగుతుంది. ఇది అనుభవం ధ్రువీకరిస్తున్న సత్యం." ఈ మాటలు అక్షరాలా సత్యాలని ఇటీవల జరిగిన ఆందోళనలు నిరూపించడంలేదా? ఇంత తీవ్రంగా విదేశీయుడు తప్ప ఎవరు మాట్లాడారు? లార్డ్ రిప్పన్ వివేకవంతమైన విధానాలను ఎవరు నిరోధిస్తున్నారు? విదేశీయుడు తప్ప. వైస్రాయి సొంత దేశంవారు తప్ప ఎవరు అవిధేయతను రెచ్చగొడుతున్నారు? "భారత ప్రభుత్వానికి ప్రధానంగా అడ్డునిలుస్తున్నవారు విదేశీయులే" అని మహామనీషి అయిన "రెప్రజెంటేటివ్ గవర్నమెంట్" (Representative Government) గ్రంథ రచయిత అనలేదా? అందరికంటే ముందు తమవారినే అదుపులో ఉంచాలని ఈ రచయిత చెబుతున్నాడు కాదా? క్రమశిక్షణా రాహిత్యాన్ని వారే సృష్టించారు. వారే హానికరమైన వ్యక్తులు. వారి ప్రతిపాదనలను, అభిప్రాయాలను ప్రభుత్వం అంగీకరించకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిధేయతను రెచ్చగొడ్తారు. వారు చేస్తున్నదే ఈ అలజడంతా. ఈ దేశీయులకు హక్కులివ్వడం వారిదృష్టిలో అమానుషచర్య. వారు ఉద్యోగాలు చేస్తూ అధికారం చెలాయిస్తారు. వారి జీతబత్యాలు విస్తుపోయేంత పెద్ద మొత్తంలో ఉంటాయి. తాము విజేతలమనే భావనతో శ్రేష్ఠమైనదంతా తమకే కావాలి అంటారు. అంతా తామే ఆరగించి ఎంగిలి మెతుకులు దేశీయులకు విడిచిపెడతారు. తమ పూర్వుల ధైర్యసాహసాల తాలూకు గర్వం తలకెక్కించుకొని ఈ దేశ ప్రజలను ఏవగించుకొంటారు. ఈ ప్రజలను "ఛీ, హీనులు" (Damn, Niggers) అని అనడం న్యాయంగానే ఉందని భావిస్తారు.

ప్రజలముందు మా వాదన బలంగా ఉంచామని భావిస్తున్నాము. మా వాదనలో సత్యం ఉంది. మా వాదన విశ్వసనీయమైనది. ఈ ఆందోళన తగ్గు ముఖం పట్టినపుడుగానీ తాముసాగించిన హింస ఎంత అవివేకమైనదో ఆందోళనకారుల తలకెక్కదు. భావాల్లో, భాషలో ఈ హింసా ప్రవృత్తివల్లే ఆందోళనకారులు లక్ష్యాన్ని, ప్రయోజనాన్ని కోల్పోయారు. బ్రాన్‌సన్ తన కలకత్తా ఉపన్యాసంలో వాడిన తీవ్రమైన భాషవల్ల క్షమాపణ చెప్పవలసి వచ్చింది. ఈ పరిస్థితి ఎంతో దయనీయమైనదిగా మేము భావిస్తున్నాము. అతడు ఇంగ్లాండులో ఆందోళనలో పాల్గొనవలసింది; కాస్త ఆవేశం తగ్గి మనసు కుదుటపడడానికి సమయం చిక్కేది. అక్కడి వాతావరణం చల్లగా అనుకూలించేది గదా ! తాను ఎక్కడికి వెళ్ళినా తన ప్రవర్తనలో రవ్వంత ఔదార్యాన్ని చూపలేదు. అవకాశం దొరికినప్పుడల్లా ఐరిష్ జాతీయులు "స్వీట్ బ్లార్నీ" (Sweet Blarney) అని పిలిచే తన ఉపన్యాస ధోరణిని కొనసాగిస్తూ, చికాకు పుట్టించే ఈ పెద్ద మనిషిని మేము క్షమించలేము."

ఇల్‌బర్ట్ బిల్లుకు వ్యతిరేకంగా యూరోపియన్లు, యూరేషియన్లు ఆందోళన చేసినపుడు దేశీయ పత్రికలు ఈ బిల్లుకు స్వాగతం పలుకుతూ ప్రజాభిప్రాయాన్ని పెద్దయెత్తున

సమీకరించాయి. ఆంగ్లో ఇండియన్ ప్రెస్‌తో పోరాడి తమ కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించాయి. కలకత్తా టౌన్‌హాలు సభ తర్వాత భారతీయ పత్రికలు తీవ్రంగా స్పందించాయి. తెల్లవారి జాత్యహంకార ధోరణిని నిరసిస్తూ సంపాదకీయాలు రాశాయి. బ్రాన్సన్ ఇంగ్లండులో గొప్ప సంస్కారిలాగా నటిస్తూ అక్కడి సభలో ఉపన్యసించిన తర్వాత నరసయ్య "టూ పిక్చర్స్" సంపాదకీయం రాశాడు. ఈ సంపాదకీయం రాసేనాటికి నరసయ్య పత్రిక ప్రారంభించి మూడేళ్ళు. భారతీయ, యూరోపియన్ జాతులు సామరస్యంగా కలిసిమెలిసి జీవించే అవకాశం జారిపోతున్నదనే ఆవేదన ఈ సంపాదకీయంలో ఉంది. ఆవేశానికి లోనుగాకుండా వివేచించే శక్తి, వాదం వినిపించే నేర్పు, పరిణతి చెందిన రాజకీయ అభిప్రాయాలు, వైదుష్యం, వ్యంగ్యం కలబోసిన పరిహాసం ఈ సంపాదకీయానికి గొప్పశక్తి నిచ్చాయి.

## 1886 జనవరి 30 పీపుల్స్ ఫ్రెండ్ సంచిక

తమిళనాడు ఆర్కైవ్స్‌లో ఈ సంచిక భద్రపరచబడి ఉండేది. దురదృష్టవశాత్తు, ఆ ఫైలు ఇప్పుడు కనిపించకుండా పోయింది. ఈ సంచిక తాలూకు కొన్ని ఫోటోలు (ఆర్కైవ్స్ అధికారికంగా సప్లై చేసినవి) బంగోరె పేపర్లలో లభించాయి.

పత్రిక తొలిపుటలో కలకత్తా నగల వర్తకులు కె.సి.ఆర్.దాస్ అండ్ కో వారి ప్రకటన, కలకత్తా నుంచి వెలువడే ఇంగ్లీషు వారపత్రిక "న్యూ ఇండియా" ప్రకటన, ఓరియంటల్ బాం వంటి మందుల ప్రకటనలు ఉన్నాయి. మూడవపుటలో "Do they deserve it", "Mrs. Grant Duff's advice to Europian and Eurasian lads", "Royal speech" అనే మూడు సంపాదకీయాలు ఉన్నాయి. ఈ సంచికలోనే కల్నల్ ఆల్కాట్ వ్యవసాయం మీద రాసిన వ్యాసం (Coln., Olcott on Agriculture), న్యూస్ అండ్ నోట్సు శీర్షికలో "Cost of Education in Madras" అనే వ్యాసం ఉన్నాయి.

ఈ సంచికలోనే Western Star పత్రిక నుంచి "Some Indian Newspapers" అనే కథనం పునర్ముద్రించబడింది. పత్రికలపేర్లతో ఈ కథనం సాగుతుంది. "In these *Times of India* great *Progress* is being made" అని మొదలయి "..... avoid the absurd claims of the *Theosophist* and other shams. A *Muslim Herald* is required to call the attention of his class to the want of ambition of the *Musalman* అని సాగి ".....The Argus eyed press has been a great factor in educating the people; and in these days, life would actually be a blank, if the *Madras Mail* miscarries for a single day. The press is undoubtedly the *People's Friend* and is the *Mirror* of *Native Public Opinion"* అనే వాక్యాలతో ముగుస్తుంది. అనేక సమకాలిక పత్రికలపేర్లు ఇందులో

ప్రస్తావనకు వచ్చాయి.

## 2. వారికి అర్హత ఉందా : సంపాదకీయం

పందొమ్మిదో శతాబ్దంలో ప్రజాభిప్రాయాన్ని రగుల్కొల్పి, కూడగట్టడంలో పత్రికలు గొప్ప పాత్ర నిర్వహించాయి. దేశీయులు నడిపే పత్రికలు ఆదాయంపన్ను చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రభుత్వం 1860లో మొదటిసారి ఆదాయంపన్ను విధించినా, అయిదేళ్ళ లోపలే దాన్ని తొలగించింది. మళ్ళీ 1886లో వ్యవసాయేతర ఆదాయంమీద పన్ను విధించింది. ఈ చట్టం పరిధిలోకి కొద్దిమంది భారతీయులే వచ్చినా, పన్ను వసూళ్ళపేరుతో అధికారులు సామాన్య ప్రజలను వేధించారు. ఆఫ్ఘనిస్థాన్ మీద రష్యన్ దాడి భయాన్ని ఎదుర్కొనడానికి, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కాపాడుకోడానికి, కొత్తగా సైనిక దళాల ఏర్పాటు చేసుకోడానికి ఆదాయంపన్ను విధించక తప్పదని ప్రభుత్వం తీర్మానించింది. తన సామ్రాజ్య రక్షణకోసం, క్షేమంకోసం ఈ నిధులను స్వయంగా ప్రభుత్వం సమకూర్చుకోవాలని భారతీయ యాజమాన్యాలలోని పత్రికలు వాదించాయి. వేయి రూపాయలకు మించి నెలజీతం అందుకొనే ఉద్యోగుల జీతంలో పదిశాతం పన్ను విధించాలని, వేసవిలో ప్రభుత్వపాలనను శీతల ప్రాంతాలకు మార్చడం వంటి కార్యక్రమాలు మానుకొని, ప్రభుత్వ దుర్వ్యయాన్ని నిరోధించాలని ప్రత్యామ్నాయ మార్గాలను పత్రికలు సూచించాయి. 1887 మద్రాసు కాంగ్రెసు సభలలో నెలసరి ఆదాయం వేయిరూపాయలకు మించిఉన్న వారిమీద మాత్రమే ఆదాయంపన్ను విధించాలని తీర్మానం చేయబడింది. ప్రజాందోళనకు తలఒగ్గి ఆదాయం పన్ను చట్టాన్ని సవరించినా, ఈ వ్యవహారంలో ప్రభుత్వం అపఖ్యాతిపాలైంది.

భారతీయులు నడిపే పత్రికలు బ్రిటిష్ ప్రభుత్వంతోనేకాక, ఆనాటి ఆంగ్లో ఇండియన్ పత్రికలతోను పోరాడవలసి వచ్చేది. మెయిల్ పత్రికో, మరొక ఆంగ్లో ఇండియన్ పత్రికో ఆదాయం పన్ను మీద వ్యక్తపరచిన అభిప్రాయాలను వ్యతిరేకిస్తూ నరసయ్య "వారికి నిజంగా అర్హత ఉందా !" అనే ఈ సంపాదకీయం రాశాడు. దీని తెలుగు అనువాదం :-

"క్షమించండి ! మేము ఎంతో గౌరవించే మా సహపత్రిక అభిప్రాయాలతో ఏకీభవించలేము. ప్రభుత్వ పరిశీలనలో ఉన్న ఆదాయంపన్ను చట్టం విషయంలో స్థానికపత్రికలు నిష్కారణంగా వ్యతిరేకించి, అనవసరంగా స్పందిస్తున్నట్లు ఆ పత్రిక ఆరోపించింది. ఆ అభిప్రాయాలను మేము ఆమోదించలేము. పన్నుభారం కేవలం యూరోపియన్ల మీద మాత్రమే పడుతుందని మేము భావించడం లేదు. ఈ కొత్తపన్ను విధించడంవల్ల అధికసంఖ్యలో ఈ దేశప్రజలు బాధించబడరనే నెపంతో సత్యంకోసం, న్యాయంకోసం పోరాటం చెయ్యకుండా మౌనంగా ఉండలేము. ఆదాయం పన్నుకు వ్యతిరేకంగా స్థానిక పత్రికలు గళంవిప్పకుండా ఉండి ఉంటే అవి తమ బాధ్యతను,

కర్తవ్యాన్ని విస్మరించినట్లు అయ్యేది. వినయంగా మేము వినిపిస్తున్న వాదనలో స్థానికుల ప్రయోజనాలు, యూరోపియన్ల ఆసక్తులు సమప్రాముఖ్యం కలిగి ఉంటాయి. ఈ దేశ ప్రజల సమస్యలను వివేకంతో మా పత్రికలో చర్చించాము. ఎంతో సమర్థవంతంగా, గౌరవప్రదంగా నిర్వహించబడుతున్న మా సోదర పత్రిక అభిప్రాయపడినట్లు ఆదాయంపన్ను యూరోపియన్ల ప్రత్యేక సమస్య కాదు. ఈ దేశంలో 40 రూపాయల అతితక్కువ సంవత్సరాదాయంతో బతుకులీడుస్తున్న వారు ఎంతోమంది ఉన్నారు. సెలెక్ట్ కమిటీ (Select Committee) ప్రవేశపెడుతున్న సవరణల దృష్ట్యా ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ పన్నువడ్డన రుచి చూడబోతారు. ఈ పన్ను మూలంగా ఎన్నో కుటుంబాలు కలవరపాటు చెందుతాయి. మరెన్నో కుటుంబాలు తిండికి బట్టకు కటకటలాడవలసి వస్తుంది. ఈ విషయం అస్పష్టమైన, న్యాయసంబంధమైన సమస్య అని భావించినా, యూరోపియన్ సమాజంమీద మాత్రమే భారంమోపడం అని అనుకొన్నా, మనదేశ ప్రజల కష్టాలకు, ఇబ్బందులకు కారణం అయినా ప్రభుత్వం తలపెట్టిన ఈ పన్ను వ్యవహారాన్ని ప్రశ్నించే హక్కు మాకుంది. తన హక్కుగా భావిస్తూ, ఈ దేశ ప్రజలను ఆదాయంపన్ను చెల్లించమని కోరడానికి ప్రభుత్వానికి యోగ్యత ఉందా ?

ప్రజలందరు దేశరక్షణను బలపరచడం కోసం, శాంతిని కాపాడుకోడం కోసం యథాశక్తి పన్ను చెల్లించాలని కోరడం ఒక్కటే ఈ కొత్త పన్నును సమర్థించే అంశం. ప్రభుత్వం పిలుపిస్తే, ప్రతి పౌరుడు ప్రభుత్వకోశానికి కొంత మొత్తం జమ చేయవలసినదే. దేశ రక్షణకోసం మన ఆదాయంలో కొంతభాగాన్ని ఇవ్వమని కోరేవారు తమ ప్రవర్తనతో మన విశ్వాసాన్ని చూరగొనాలి. ఉత్తమాటలతోకాదు; గట్టిచేతలతో, సత్ప్రవర్తనతో తమ మీద ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని వమ్ముచేయకుండా, ప్రజాధనంలో ఒక్కపైసా కూడా వృథా కాకుండా చూస్తారనే నమ్మకం కలుగజేయాలి. ప్రభుత్వాన్ని నడిపే పెద్దలు విశ్వాసం కలుగజేసే విధంగా ప్రవర్తించారా? ప్రజలు తమ మీద ఉంచిన విశ్వాసాన్ని నిరూపించుకొన్నారా? మనదేశప్రజలు బ్రిటిష్ ప్రభుత్వం ఏలుబడిలో ఎంతో విధేయతతో ప్రవర్తిస్తారు. మన విధేయత వాస్తవాలు గ్రహించడంలో అడ్డం రాకూడదు. దేశ అవసరాలను గమనించుకొంటూ, ప్రజలను కాపాడుతూ, ప్రభుత్వాన్ని నడిపే వదాన్యులైన మన పాలకులు ప్రభుత్వవ్యయం రోజురోజుకు పెరిగిపోతున్నదని సాధారణంగా వినిపించే ఆరోపణను చాలా తేలికగా తీసుకొంటారు. మనపాలకుల అంతరాత్మకు బాగా సర్దుకుపోయే గుణం ఉంది. అనంతమైన కష్టనష్టాలను ఎదుర్కొంటున్న ఈ నిరుపేద దేశాన్ని విడుపు లేకుండా దుర్వ్యయంలోకి నెట్టివేస్తున్న అనేక ఉదంతాలు మనకు కనిపిస్తాయి. గడిచిన రెండేళ్ళ కాలాన్ని పరిశీలిస్తే, బాధ్యతారహితంగా, విచ్చలవిడిగా విలాసాలకోసం, ప్రభుత్వం ఢిల్లీ రాయల్ దర్బారు నిర్వహించిన తీరు ఒక ఉదాహరణ. ఈ పరిస్థితికి నొచ్చుకొంటూ ఒక్క ప్రభుత్వ అధికారి అయినా తన పదవికి రాజీనామా చేశాడా? ఇంత దర్పం, ఆడంబరం

ప్రదర్శించడానికి నిజంగా కారణం ఉందా? ఏ విజయాన్ని, పురస్కరించుకొని ఈ దర్బారు ఉత్సవాలు నిర్వహించారు? వీరు విధించ తలపెట్టిన ఆదాయం పన్ను ద్వారా కొన్ని సంవత్సరాలపాటు జమఅయ్యే మొత్తాన్ని ఆ దర్బారు ఒక్క గంటలో కబళించింది. సంవత్సరాదాయం 300 రూపాయలున్న పౌరుల మీద ఈ పన్ను విధించినా, ఇరవై కోట్ల దేశ ప్రజలనుంచి 7000 పౌన్లకు మించి వసూలు కాదు. ఈ దేశ దుర్భర దారిద్ర్యాన్ని నిరూపించడానికి ఈ ఒక్క విషయం చాలు. విజ్ఞులైన మన పాలకులకు ఇదంతా ఏంపడుతుంది? అధికార పీఠంమీద కూర్చొని అత్యున్నత పదవుల్లో ఉన్న అధికారులను ఏ బలమైన కారణాలు కదిలిస్తాయో సామాన్యుల ఊహకు అందదు.

ఈ కర్చంతా చాలనట్లు ఇటీవల ఒక అద్భుతమైన 'కేంపు' ఏర్పాటు చేశారు. అవును! "యుద్ధంలో అపఖ్యాతి తెచ్చిన విజయాలు" లేక అపజయాలు నిజంగానే అద్భుతమైనవి. (.................) ఇటువంటి నకిలీలను సహాయంగా తెచ్చుకున్న ప్రభుత్వం లార్డు డఫ్రిన్ (Dufferin), లార్డు (.................) దారిలోనే నడుస్తూంది. ఈ కేంపు 1877 ఢిల్లీ దర్బారుకు సరిజోడు కావచ్చు.

ముందుగా ఇండియా సైన్యాలను దూరదేశాల్లో దించమని ఆజ్ఞాపిస్తారు. ఆ తర్వాత ఇరవై, ముప్పై లక్షల కర్చుతో అదనపు సైన్యాలను సమకూర్చమంటారు. బాధ్యత విస్మరించి వృధాగా కర్చుచేస్తే ఈ ప్రభుత్వం దేశప్రజల హృదయపూర్వక విశ్వాసాన్ని, సహాయాన్ని ఏ విధంగా ఆజ్ఞాపించి, రాబట్టుకోగలుగుతుంది? మితిమీరిన ప్రభుత్వ వ్యయాన్ని స్థానిక పత్రికలు విమర్శించడం నేరమే, అవిధేయత ప్రకటించడమే. ఆదాయం పన్ను విధించడానికి ఏ పరిస్థితులు కారణమయ్యాయి?"

## 3. మద్రాసులో విద్య ఖరీదు – వ్యాసం

ఈ వ్యాసం సమగ్రంగా లభించలేదు. అందరికి ఆధునిక విద్య అందుబాటులో ఉండాలని నరసయ్య ఈ వ్యాసంలో గట్టిగా వాదించాడు. ఈ వ్యాసం అనువాదం :–

"గెజిటు ప్రకటన చదివి మేము ఆశ్చర్యపడక తప్పలేదు. 1886 డిసంబరులో నిర్వహించనున్న పరీక్షలకు, ఆ వచ్చే సంవత్సరాలలో నిర్వహించనున్న పరీక్షలకు ఫీజులు పెంచారు (...............) పరీక్షల నిర్వహణ అధికారులకు ఫీజులు పెంచాలనే దుర్మార్గపు ఆలోచన ఉన్నట్లుండి పుట్టుకొచ్చినట్లుంది. ఇది విద్యాభివృద్ధిని మొగ్గలో తుంచి వేయడమే. విద్య ప్రతి పౌరుడి జన్మహక్కు. పౌరులు తమ విధులను చక్కగా నిర్వహించడానికి విద్య సన్నద్ధం చేస్తుంది. ఇంగ్లాండులో, యూరపులోని ఇతర దేశాల్లో నిర్బంధ విద్యను అమలు చేశారు. విద్యలేని వ్యక్తి గనిలో ముడిఖనిజం వంటివాడు. సుగంధం వృధా చేసుకొంటూ ఎడారిలో వికసించిన గులాబి వంటివాడు. ఇప్పుడు సమస్త నాగరిక ప్రపంచం ప్రజల విద్యాభివృద్ధికి మార్గాలను అన్వేషిస్తూంది. అభివృద్ధి చెందిన దేశాల కొలమానం ప్రకారం

ఏనాటికైనా భారతదేశం పైకి రావాలంటే, ఈ దేశ ప్రజలు కనీసం ప్రాథమిక విద్య అయినా ఆర్జించాలి. ఈ గెజిటు ప్రకటనల వంటివి విద్యాభివృద్ధికి అవరోధాలు కాకమానవు.

మద్రాసులో ఒక విద్యార్థి చదువుకొని, పైకి రావడానికి వెయ్యిన్నొక్క కష్టాలు పడవలసి ఉందని మా అనుభవం చెప్తూంది. యూరపులో, అమెరికాలో ఉన్నట్లుగా మద్రాసు స్థానికులకు ఉచిత విద్య అందించే పాఠశాల కాని, మాతృభాషలో విద్య నేర్పించే పాఠశాలకాని, ప్రారంభం కాలేదు. అనాదిగా కొనసాగుతున్న వీధిబళ్ళు పిల్లలు ఇంట్లో అల్లరి చెయ్యకుండా చూడడానికి తప్ప, అక్కడ నేర్పించేదేమీ లేదు.

వీలున్నంతలో ఎంతమంది విద్యార్థులకు మంచి ఇంగ్లీషువిద్య చెప్పించడానికి కుదురుతుందో అంతమందికి అవకాశం కల్పించాలి. మంచి ఇంగ్లీషు విద్యను సముపార్జించడమే అసలు సమస్య. ఒక తాలూకాఫీసు గుమాస్తా సంగతే తీసుకొందాం. అతను పదిహేను రూపాయల జీతంతో పెద్ద కుటుంబాన్ని పోషించవలసి ఉంటుంది. పిల్లల్ని చదివించాలని ఎంత తపనపడ్డా ఏ విధంగా చదివించగలడని ప్రశ్నిస్తున్నాము. ఈ ప్రెసిడెన్సీలో అతితక్కువ ఫీజులు వసూలు చేసే ప్రభుత్వ, ఎయిడెడు పాఠశాలల ఫీజులు కూడా సామాన్యులకు అందుబాటులో లేనంత అధికంగా ఉన్నాయి. ఇక జీతాలుకాక, పుస్తకాలు, ఇతర ఖర్చులు ఉండనే ఉన్నాయి. ఈ ప్రెసిడెన్సీలో ఎంతోమంది తల్లితండ్రులకు సంతృప్తికరంగా తమ పిల్లలకు చదువు చెప్పించుకోడానికి అవకాశంలేదు. ఈ ఇబ్బందులకు తోడుగా ప్రభుత్వం కొత్తగా టర్మ్‌ఫీజు విధానం ప్రవేశపెట్టింది. ఇప్పుడు పాఠశాలల్లో నెలనెల జీతాలు కట్టించుకోడం లేదు. ఒక్కసారిగా మూడునెల్ల జీతమో, ఆరునెల్ల జీతమో ముందుగా చెల్లించమంటున్నారు. మద్రాసులో ఉద్యోగులకు నెలకొకసారి వేతనం అందుతుంది. నిత్యం డబ్బుకు ఇబ్బంది పడేవారు అంతమొత్తం ఒక్కసారిగా చెల్లించమంటే ఎక్కడ నుంచి తెస్తారు? పూర్వం భారత ప్రభుత్వ చట్టసభలో మంత్రిగా పనిచేసిన సర్ ఆక్‌లాండ్ కాల్విన్ (Sir Auckland Calvin) ఆదాయం పన్నుమీద చేసిన ప్రకటన ఈ దేశంలో పేదరికాన్ని గురించి తెలుసుకోడానికి పనికి వస్తుంది. మధ్యతరగతి వారికి అందుబాటులో ఉండేవిధంగా ఫీజులు వసూలు చెయ్యాలి. పేద విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చెయ్యకూడదు. ఇతర పరగణాలలో మాదిరి కాకుండా ఈ ప్రెసిడెన్సీ పాఠశాలల్లో ఒకటి రెండు వాయిదాలలో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇక్కడ కొన్ని సంవత్సరాల క్రితం ఆధునికవిద్య పేదలకు, సంపన్నులకు అందరికీ సమానంగా అందుబాటులో ఉండేది. పచ్చయ్యప్ప విద్యాసంస్థలు, మిషనరీ పాఠశాలలు విద్యార్థులవద్ద నెలజీతం రూపాయి కట్టించుకొని మెట్రిక్యులేషను పరీక్షకు సన్నద్ధం చేసేవి. సంపన్నులు మాత్రమే జీతాలు కట్టేవారు. పేదవిద్యార్థులు ఏమీ చెల్లించకుండానే ఈ పాఠశాలల్లో చదువుకొనేవారు.

ఈ పాఠశాలల్లో సంపన్నుల పిల్లలు అనుభవించే సమస్త సౌకర్యాలు పేదవిద్యార్థులకు అందుబాటులో ఉండేవి. జీతాలు చెల్లించిన విద్యార్థులకు ఇచ్చినట్లే పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇచ్చేవారు. బొంబాయి నగరంలోనూ ఇదే పద్ధతి ఉండేది. అక్కడి విశిష్ట పౌరులు అనేకులు ఈ విధంగా ఉన్నతవిద్య అభ్యసించి పైకి వచ్చినవారే."

## పీపుల్స్ ఫ్రెండ్‌కు ప్రభుత్వ వ్యతిరేకత

"The Hindu came to head on collision with the British Administration and its bureaucrats almost from its birth...... and waged a grinding and relentless debate"[60]

ఈ మాటలు హిందూ పత్రికను గురించి రాసినవే అయినా, స్వాభిమానంతో మనుగడ సాగించిన ఆనాటి పత్రికల కన్నిటికీ అన్వయిస్తాయి. పీపుల్స్ ఫ్రెండ్ ప్రారంభమైన కొత్తల్లోనే ప్రభుత్వం చిన్నచూపుకు, ఆగ్రహానికి గురిఅయింది. తమిళనాడు ఆర్కైవ్స్‌లో నరసయ్య 1886 ఫిబ్రవరి 24వ తారీకున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖ భద్రపరచబడి ఉంది. 1886 ఫిబ్రవరి 22 తారీకుతో విడుదలైన జి.ఓ 397కు సమాధానంగా నరసయ్య ఈ లేఖ రాసినట్లు స్పష్టంగా ఉంది.[61] ఈ లేఖ అనువాదం.

మద్రాసు,
24-2-1886

అయ్యా,

397 జి.ఓ సంబంధించి ఈ లేఖ రాస్తున్నాను. ప్రభుత్వం ఉపయోగం కోసం మీకు ఇప్పటి నుంచి పీపుల్స్ ఫ్రెండ్ వారపత్రిక ఉచితంగా పంపేందుకు అనుజ్ఞ దయచేయమని అర్థిస్తున్నాను. పత్రిక క్రమంతప్పకుండా వెలువడుతూ ఉంది. పెద్ద సంఖ్యలో పాఠకులున్నారు. నా దేశప్రజల ఇబ్బందులను, ఆకాంక్షలను గురించి రాసే ఈపత్రికను ప్రభుత్వఅధికారులు అప్పుడప్పుడు చదవడానికి తప్పక అవకాశం కలుగ జేయాలి. గౌరవపూర్వకంగా పంపబడుతున్న ఈ పత్రికను తిరస్కరించరనే భావిస్తున్నాను.

ఉంటాను
తమ విధేయుడైన సేవకుడు
డి. నరసయ్య
"పీపుల్స్ ఫ్రెండ్" యజమాని

ఇట్లా మొదలైన అధికారుల అసహనం, ద్వేషం 1888 కల్లా పరాకాష్ఠకు చేరుకుంది.

### 1888 ఫిబ్రవరి 25 పీపుల్స్ ఫ్రెండ్ సంచిక

పీపుల్స్ ఫ్రెండ్ ప్రారంభించిన అయిదారు సంవత్సరాల లోపలే, నరసయ్యకు

ప్రభుత్వాధికారులతో సంబంధాలు చెడిపోయాయి. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఆయన తన పత్రికాముఖంగా తీవ్రంగా వ్యతిరేకించినట్లుంది. నరసయ్య ప్రభుత్వానికి రాసిన లేఖలో పీపుల్స్ ఫ్రెండ్ పత్రికను ఉచితంగా పంపుతున్నట్లు, స్వీకరించమని కోరాడు. 1887లో ప్రభుత్వం పీపుల్స్ ఫ్రెండ్‌కు మొదటిసారి చందా చెల్లించి, పత్రికను తెప్పించుకోడం ఆరంభించింది.[62] తర్వాత కొన్ని నెలలకే పీపుల్స్ ఫ్రెండ్ మీద కన్నెర్రజేసిన ప్రభుత్వం తన ప్రచురణలను పీపుల్స్ ఫ్రెండ్‌కు ఉచితంగా ఇవ్వడం నిలిపివేసింది. ఈ పరిస్థితిని వివరిస్తూ నరసయ్య సంపాదకీయాన్ని రాశాడు. పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక మేనేజరు ఈ సంపాదకీయాన్ని గవర్నరు కనమరా దృష్టికి తీసుకొని రమ్మని కోరుతూ ప్రభుత్వ ఛీఫ్ సెక్రెటరీకి ఈ ఉత్తరం రాశాడు.[63]

The People's Friend Office, Madras
Date 13th March, 1888

No. 448
From the Manager, The People's Friend, Madras.
To the Chief Secretary to the Madras Govt., Fort St. George.

Sir,

By desire of the Editor, I have the honour to request that you will be good enough to lay the accompanying copy of the People's Friend dated 25th February 1888, before His Excellency, the Governor in Council and draw His Lordship's attention to the leading article headed "The Madras Govt. and the Press". The Govt. has it in its Power to do whatever it pleases in matters like this. But I would respectfully invite the Govt. to examine the whole case in view of the grounds urged in the article, alluded to and cancel the orders recently passed in the matter discussed in the said article.

2. The orders referred to are the following :--
G.O. No. 7006, dt. 17th Nov. 1887; G.O. No. 7204, dt 24th Nov. 1887, G.O. No. 7284, dt 10th Feb. 1888.

3. We also beg to draw your attention and that of the Govt. to the following facts. The Govt. in their order No. 534, dt. 16th April 1881, Public Dept. were pleased to say, "The People's Friend will be included in the list of the newspapers to which Govt. Proceedings and Publica-

tions are supplied". And we have been accordingly ever since supplied regularly with the Tanjore, Salem, Kistna and other District Manuals. Dr. Caldwell's History of Tinnavelly, the Public Instruction reports from year to year and various other important publications as they issued from the Govt. Press from time to time.

4. Under the above circumstances I trust that Govt. will see fit to continue to supply the People's Friend with their publications as hitherto and order the issue to this office of the recently published Manuals of Malabor, Kurnool and Coimbatore as well as of the report of Public Instruction for 1886-87, all which have not yet been supplied to us.

I have the honour to be Sir, Your most obedient servant,

(Sd) xxx

M.R. Thiruvengada Mudr.

Manager, People's Friend

ఈ ఉత్తరం మీద అధికారులు నోట్ ఈ విధంగా రాశారు.

## FOR ORDERS

NOTE -1

C-No. 2/5

The Manager, People's Friend, 13th March 1888.

In this letter the Manager of the People's Friend by the desire of the Editor, forwards a copy of the paper of the 13th March, 1888 and invites attention to a leader entitled "The Madras Govt. and the Press". He goes on to suggest that certain orders of Govt. should be cancelled and the People's Friend supplied with all Govt. publications and certain specified ones.

The question of the supply of Govt. publications to the Press is some what difficult. Orders of Govt. - as distinguished from reports, books, etc., are easily and conveniently given to any newspaper that wants them, but the case is different with regard to expensive books, such as Maclean's Manual of admn. or the Manual of Malabar of Mr. Logan. G.O. 11th

April 83 No. 748. Public para-2 ruled that "the practice of issuing such reports gratis on application will be discontinued in future"; but this order has not been observed. In the first place certain newspapers, have continued to receive Govt. reports and publications and further more certain other papers have been since given the same privileges. Thus, the Christian College Magazine "Public" of sectarian character which hardly falls within the meaning of the term "the press has been given all Govt. publications and a comparison of the distribution list Maclean's and Mr. Logan's Manuals shows that several newspapers receive publications while others do not. If it were practicable - yet it is not - it would seem the proper course to cease all gratuitous supply of publications. It is a mere question of money not publishing information, and there is no reason why newspapers should not pay for their books like any other private tax payer. But the Govt. would hardly care to see the pens of all the newspapers in Madras and elsewhere at work to celebrate their disregard for "the firmament of the Fourth Estate". So long as this is the case the paper like the People's Friend seems to have some amount of genuine grievance - if they are refused publications while another paper next door gets. It would not cost much more to give Govt. publications to all bonafide newspapers and would remove what is to a certain extent a grievance. It is only necessary to look at a Distribution list like that of Maclean's Manual to see that it is not easy to draw a line of distinction.

The calm impudence of the present applicant who whilst asking for a favour forwards an article abusing the Govt. and its orders is (sic) amusing.

NOTE - 2

I submit that this is a very good issue for making a difference between newspapers. We cannot supply Govt. publications to all newspapers, but we may (..............) to the leading news. The People's Friend certainly not a leading one. I submit that there is no reason to change

the order.
చివరకు పీపుల్స్ ఫ్రెండ్‌కు ప్రభుత్వ ప్రచురణలు ఉచితంగా పంపనవసరం లేదంటూ ఈ ఆర్డరు జారీచేయబడింది.

NOTE-3 - FINAL ORDER

"The People's Friend", will, as already ordered, be supplied with such Govt. publications as are placed on the Editors' Table as regards reports and such publications; the general rule is that these are only given on payment, the government see no reason for making an exception in the case of the journal in question.

## 4. మద్రాసు ప్రభుత్వం - పత్రికలు

పీపుల్స్ ఫ్రెండ్ సంపాదకీయానికి ప్రభుత్వం ఈ సమాధానంతో స్పందించింది. ప్రజాభిప్రాయాన్ని, పత్రికల అభిప్రాయాన్ని లెక్కపెట్టమని నిస్సిగ్గుగా చెప్పిన సమాధానం ఇది. ప్రభుత్వంలోని ఉన్నతోద్యోగుల పొగరు బోతుతనం, దాష్టీకం, ప్రజాపక్షం వహించిన పత్రికలమీద వారికున్న చిన్నచూపు అన్నీ ఈ ఉదంతంవల్ల స్పష్టమవుతున్నాయి.

భారతీయ ఇంగ్లీషు పత్రికలు బ్రిటిష్ అధికారులతో తరచు పోరాడవలసి వచ్చింది. ప్రభుత్వ పక్షపాత చర్యలను నిర్భయంగా, నిర్మొహమాటంగా నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్ సంపాదకీయాల్లో విమర్శించేవాడు. పత్రికారచనలో ఆయన పాటించిన ప్రమాణాలకు, ప్రదర్శించిన ఆత్మాభిమానానికి ఈ సంపాదకీయం నిదర్శనంగా నిలుస్తుంది. ఆ రోజుల్లో పెద్ద పెద్ద ప్రభుత్వాధికారులు అల్పబుద్ధితో ఎంత విచక్షణారహితంగా ప్రవర్తించేవారో ఈ వ్యాసం తెలియజేస్తుంది. సర్ గ్రాంట్ డఫ్ (Sir Grant Duff) మద్రాసు గవర్నరు అయిన తర్వాత పత్రికల విషయంలో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిన తీరును ఈ సంపాదకీయం బట్టబయలు చేస్తోంది. అధికారులకు ఇంత కోపం తెప్పించిన సంపాదకీయానికి అనువాదం :-

"షుమారు ముప్పై ఏళ్ళ క్రితం ఈ ప్రెసిడెన్సీ గవర్నరుగా ఉండిన సర్ ఛార్లెస్ ట్రెవిలియన్ తన సహజ రాజకీయ కౌశలంతో మొదటిసారిగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాడు. గోప్యంగా ఉంచనవసరం లేని సమాచారాన్ని, 'రహస్యం' పేరుతో ప్రభుత్వ కార్యాలయాల్లో నిగూఢంగా ఉంచుతున్న సమాచారాన్ని, 'ఎడిటర్స్ టేబుల్' ముందు ఉంచి స్థానిక పత్రికలకు అందుబాటులో ఉండేటట్లు చేశాడు. దీనివల్ల బహిరంగచర్చ కొనసాగుతుంది. తమ ఏలుబడిలో ఉన్న దేశాభివృద్ధికి అవసరమైన సలహాలు,

పరిష్కారాలు, ప్రభుత్వానికి అందుతాయి. ట్రెవిలియన్ గవర్నరు పదవి చేపట్టకముందు నుంచి కొనసాగుతున్న లంచగొండి విధానానికి, మూస ఆలోచనలకు సరిపడని కొత్తదనం ఈ పద్ధతి ద్వారా ప్రవేశపెట్టబడింది. మొదట్లో ట్రెవిలియన్ సలహాదార్లు, మార్గదర్శకులు ఈ నూతన విధానాన్ని సానుకూలంగా గ్రహించలేదు. ఛార్లెస్ ట్రెవిలియన్ గవర్నరు పదవి చేపట్టకముందే ఒక అనుభవజ్ఞుడైన పౌరుడుగా, న్యాయశాఖలో ఉదార స్వభావంతో బాధ్యతాయుతంగా మెసలుతూ సమకాలికుల కంటే ఎంతో ముందున్నాడు. ఆయన తర్వాత అధికారం చేపట్టిన వారందరూ గ్రాంట్ డఫ్ పరిపాలనలో ఒంటెత్తు పోకడలు రహస్యంగా ప్రవేశించే వరకు, ఆయన నెలకొల్పిన పద్ధతినే ఎంతోకాలం అనుసరిస్తూ వచ్చారు. ఎడిటర్స్ టేబుల్‌కు అందించే సమాచారంలో విషయమేమీ ఉండేదికాదని గ్రాంట్ డఫ్ పరిపాలన మీద అభియోగం ఉండేది. అరుదుగా మాత్రమే ఆసక్తి గలిగించే సమాచారం ఉండేది. ఏవో కొన్ని పరిపాలనా నివేదికలు తప్ప, రహస్యంగా సేకరించిన వార్తలో, క్లబ్ ముచ్చట్లలో చెవినబడినవో, బజారు వీధుల్లో అనుకొనేవో తప్ప పత్రికలకు రాయడానికి విషయమేమీ ఉండేది కాదు. రహస్యంగా ఉంచాల్సిన అవసరంలేని పరిపాలనా సంబంధమైన సమస్త నివేదికలు జిల్లా మాన్యువళ్ళు, ఉపయోగకరమైన సమాచారం స్థానిక పత్రికలకు అందించాలనేది మొదట ఏర్పరచిన నిబంధన. ఈ సమాచారం ఏఏ పత్రికలకు అందజేయాలో ఆ పత్రికల జాబితా గూడా తయారు చేయబడింది. ఈ విధంగా గుర్తింపు పొందిన పత్రికలలో పీపుల్స్ ఫ్రెండ్ ఉంది. ఆ పత్రికలతో బాటు పీపుల్స్ ఫ్రెండ్ కూడా సౌకర్యాలన్నీ అనుభవిస్తూ వచ్చింది. ఈ నిబంధనవల్ల స్థానిక పత్రికా రచనకు అన్ని రిపోర్టులూ అందుబాటులో ఉండేవి. విమర్శించడానికి, సలహాలివ్వడానికి, అవసరమైన భోగట్టా పత్రికలకందేది.

ఇప్పుడు ప్రధాన సెక్రెటేరియట్ (Chief Secretariat) ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. ఏఏ పత్రికలకు ఈ నివేదికలు, మాన్యువళ్ళు ఉచితంగా ఇవ్వాలో, ఏ పత్రికలు వాటికి ధర చెల్లించి తీసుకోవాలో తీర్మానించడానికి తానే న్యాయ నిర్ణేత అయింది. ప్రతిఫలాపేక్ష లేకుండా, వివక్ష లేకుండా అన్ని పత్రికలకూ అందజేయాలని ట్రెవిలియన్ ప్రవేశపెట్టిన ఈ పద్ధతి నుంచి వైదొలగడానికి కారణం కనిపించదు. పైన పేర్కొన్న విస్తృతమైన నివేదికలను ప్రభుత్వం తన ముద్రణాలయంలో అచ్చు వేస్తుంది. ఈ సంపుటాలను అమ్మి డబ్బు చేసుకోవడం ప్రభుత్వ ధ్యేయం కాదు. ప్రెసిడెన్సీలో ఏ కార్యక్రమం చేపట్టిందీ, ఏమి చేయబోతున్నది ప్రజలకు తెలియజేయడానికీ, ప్రజలకు ఉపయోగపడే ఆసక్తికరమైన సమాచారం అందరికీ వివరించడానికి ఈ విధానం ప్రవేశపెట్టబడింది. ఛార్లెస్ ట్రెవిలియన్ ఉద్దేశించినట్లు కొన్ని పత్రికలకు రిపోర్టులు అందుతున్నాయి. ఇతర పత్రికలు కాపీ కావాలని కోరితే డబ్బు పెట్టి కొనుక్కోమని ఆర్డరు జారీ చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వానికీ, పీపుల్స్ ఫ్రెండ్‌కూ మధ్య సంబంధాలనుబట్టే

మేము ఇటువంటి వ్యాఖ్యలు చేయవలసి వస్తూంది. ఈ పత్రికా సంపాదకుడు "మలబారు మాన్యువలు" కోసం అభ్యర్థన పంపుకొన్నాడు. "ఆ కాపీ ఉచితంగా ఇవ్వలేము" అని అభ్యర్థనను తిరస్కరిస్తూ ప్రభుత్వ అండర్ సెక్రెటరీ (Under Secretary) ఆర్. డబ్ల్యు, బెన్‌సన్ (R.W. Benson) చేవ్రాలుతో జీ.ఓ జారీ చేశారు. అదే నెలలో మరలా "కర్నూలు జిల్లా మాన్యువలు" కోసం విజ్ఞప్తి పంపుకొన్నాము. సెక్రెటరీ జె. ఫ్రెడరిక్ ప్రైస్ (J.Frederick Price) ఫేసిమిలి (Facsimile) స్టాంపుతో జి.ఓ. మాకు అందింది. ఈ నెలలో విద్యాపరిపాలన నివేదిక కోసం అడిగాము. "ప్రభుత్వ ముద్రణాలయం సూపర్నెంటు వద్దకు డబ్బు తీసుకొని వెళ్ళండి" అని అండర్ సెక్రెటరీ ఏ.సి. కార్ద్యూ (A.C. Cardew) సమాధానం రాశాడు.

ఇట్లా నిరాకరించడం నిలకడలేని విధానం. ద్వేషపూరితమైన చర్య. ఈ పరగణాను పాలించే ప్రభుత్వంమీద విశ్వాసం పోగొట్టే చర్య. ఈ జి.ఓలలో వ్యక్తమవుతున్న అల్పత్వం ప్రభుత్వ గౌరవాన్ని దిగజారుస్తుందని మేము కుండబద్దలు కొట్టినట్లు చెప్పక తప్పడం లేదు. మెసర్స్ ప్రైస్, బెన్సన్, కార్ద్యూ అండ్‌కో వారు డబ్బు ఆదా చేయడానికి ఇటువంటి చర్యలు చేపడుతున్నట్లయితే ఈ నివేదికలను కొన్ని పత్రికలకు ఉచితంగా ఎందుకు ఇస్తున్నట్లు? ఈ ఉపకారం పీపుల్స్ ఫ్రెండ్‌కు దక్కకుండా పక్షపాత వైఖరి ఎందుకు ప్రదర్శిస్తున్నారు? సెక్రెటేరియట్‌కు ప్రభుత్వ పత్రాలను పత్రికల వారికి పంపిణీ చేసే విధానమంటూ ఏదీ లేదు. సెక్రెటేరియట్‌లోని అధికార త్రయం చిత్తంవచ్చినట్లు ఆజ్ఞలు జారీచెయ్యకుండా విచక్షణతో పరిశీలిస్తే, విద్యా వివేకం లేని ఒక చిరుద్యోగి తమను ఎటువంటి అసందర్భస్థితికి నెట్టాడో గమనించ గలుగుతారు. మా సోదర పత్రికలకు ఉచితంగా పంపిణీ చేసిన సంపుటాలనే మమ్మల్ని డబ్బు చెల్లించి తీసుకోమని ఆర్డరు వెయ్యడాన్ని మేము ఆక్షేపిస్తున్నాము.

ఈ సంద్భరంలో కాస్తంత స్వోత్కర్ష కలగలిసిన నమ్మకంతో ఈ మాటలు చెపుతున్నాము. ప్రజలదృష్టిలో మాకొక స్థానం ఉంది. అందుకు మేము గర్విస్తున్నాము. పత్రికా లోకంలో మా ప్రజ్ఞనుబట్టి మేము బృహస్పతులమనో, శుక్రాచార్యులమనో చెప్పుకోడంలేదు. పత్రికా గగనంలో మా స్థానం ఎంత చిన్నదైనాకావచ్చు. మా విశ్వాసాలకు అనుగుణంగా మేము నడుచుకొంటాము. ప్రయోజనం అనే వెలుగును మా చుట్టూ వెదజల్లుతాము. ప్రజా సంబంధమైన ప్రభుత్వ చర్యలను మా పత్రిక న్యాయంగానే విమర్శిస్తూ వచ్చింది. ఈ ధర్మం నిర్వర్తించడం కోసం స్థానిక పత్రికలకు కల్పించిన సౌకర్యాలనే మేము కోరాము. ప్రభుత్వం మా సోదర పత్రికా రచయితల విషయంలో ప్రవర్తించిన నాగరిక పద్ధతిలో పీపుల్స్ ఫ్రెండ్‌తో వ్యవహరించలేదని ఎక్కువగానే చెప్పాము. ఈ విమర్శ లార్డు కనమరా దృష్టికి వస్తుందని, గౌరవనీయులైన కనమరా

గౌరవప్రదమైన మా సోదర పత్రికలకు కల్పించిన సౌకర్యాన్ని మా పత్రికకు కూడా కలుగజేస్తారని భావిస్తాము. బహుశా మాది వారపత్రిక అని, నిరుపేద అయిన ఒక గుమాస్తాకు కూడా అందుబాటులో ఉండేంత తక్కువగా మా చందా రేటు ఉందని, అందువల్ల మా సర్క్యులేషను చాలా తక్కువ అని, మా పత్రిక ప్రభావం ఏమీ లేదని ప్రభుత్వం అభిప్రాయ పడినట్లుంది. వాదం కోసం దీన్ని నిజమనే అంగీకరించినా, ప్రభుత్వం మా విషయంలో మరింత ఉదారంగా వ్యవహరించాలి. ప్రభుత్వ విధానాలను సమదృష్టితో విమర్శించి, ప్రచుర పరచడానికి అవకాశం ఇవ్వాలి.

ఈ ప్రెసిడెన్సీలో ఒక స్థానిక పత్రికగా హిందూ తర్వాత స్థానం మాదే. హిందూ అచ్చు వేసే ప్రతి మూడు సంచికలకు మేము ఒక సంచికను అందించ గలుగుతున్నాము. ప్రజాహిత సమస్యలను చర్చించే సందర్భాలలో, స్వేచ్ఛగా మా అభిప్రాయాలను వ్యక్తం చేయడంలో, మితిమీరకుండా వ్యవహరించడంలో, జాగ్రత్త విషయంలో, నిజాయితీగా, ధైర్యంగా రాయడంలో, ప్రజల హక్కులకోసం పోరాడడంలో మా కృషిని హిందూ కూడా గుర్తిస్తుందని భావిస్తాము."

## 5. మద్రాసు చట్టసభ – సంపాదకీయం

1888 ఫిబ్రవరి 25 పీపుల్స్ ఫ్రెండ్ సంచికలో ఎడిటోరియల్ నోట్సు శీర్షికలో నరసయ్య తన పేరు మీద ఈ వ్యాసాన్ని ప్రచురించాడు. ప్రభుత్వం మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిలుకు వెంకటగిరి జమీందారు వెలుగోటి రాజగోపాలకృష్ణ యాచేంద్రను నియమించింది. ఈ నియామకాన్ని హర్షిస్తూ నరసయ్య వ్యాసం రాశాడు. నరసయ్య కొంతకాలం ఈ జమీందారుకు ట్యూటరుగా పనిచేసినా, ఎంత ఆబ్జెక్టివ్‌గా ఈ సంపాదకీయం రాశాడో పాఠకులకు సులభంగా బోధపడుతుంది. నరసయ్య వెంకటగిరి జమీందారి రైతుల సంక్షేమాన్ని గురించి ప్రత్యేకంగా ఈ వ్యాసంలో ప్రస్తావించడం గమనార్హమైనది. ఈ వ్యాసానికి సంగ్రహానువాదం :-

"కొంతకాలం క్రితం విజయనగరం మహారాజా వైస్ రీగల్ కౌన్సిలు (Vice Regal Council) కు నియమించబడడం వల్ల, మద్రాసు ప్రెసిడెన్సీ కౌన్సిల్లో ఏర్పడిన ఖాళీని పూరించడానికి స్థానిక పత్రికల్లో కొన్ని పేర్లు సూచించబడ్డాయి. ఈ గౌరవానికి వెంకటగిరి జమీందారు రాజా రాజగోపాలకృష్ణ యాచేంద్ర పాత్రుడయ్యాడని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. సంస్కారవంతుడైన ఈ 32 ఏళ్ళ యువకునితో మాకు చాలాకాలంగా పరిచయం ఉంది. ఈయన మద్రాసులో ఎక్కువ రోజులు ఉండకపోయినా, తనతమ్ముడు బొబ్బిలి జమీందారులాగా తనకు మార్ష వంటి గొప్ప ఇంగ్లీషు ట్యూటర్లవద్ద విద్యాభ్యాసం చేసే అవకాశం లేకపోయినా, ఇంగ్లీషు చక్కగా అర్థంచేసుకొని, యూస లేకుండా మాట్లాడగలడు. ఇది చాలా గొప్ప విషయం. ఇంగ్లీషువారి పరిపాలనలో, ఇంగ్లీషు

విద్యావిధానంలో ఆయన వ్యక్తిత్వం రూపొందింది. దక్షిణ భారతదేశంలో జమీందార్లు గర్వించదగిన వ్యక్తి, మంచి సాహిత్యాభిరుచి ఉన్నవాడు. తెలుగులో మహాకావ్యాలన్నీ చదివిన పాండిత్యం వృథాకాకుండా, ఆయన కొన్ని తెలుగు గ్రంథాలు ప్రచురించాడు. పదేళ్ళ క్రితం జమీందారీ పాలన చేపట్టిన తర్వాత, తన జమీందారీ రైతుల సంక్షేమం కోసం ప్రయత్నం చేశాడు కాని, అనేక కారణాలవల్ల ఆ ప్రయత్నం సఫలం కాలేదు.

చట్టసభలకు యోగ్యులయిన వారిని నియమిస్తున్నందుకు ప్రభుత్వాన్ని, మద్రాసు పౌరులను అభినందించక తప్పదు. ఒక లెజిస్లేటరుగా చెంచలరావు, సుబ్రహ్మణ్యఅయ్యరు వలె ఉపయోగకరంగా ఉంటాడని భావించలేముకాని, దక్షిణ భారతదేశ జమీందార్ల వ్యవహారాలను, ఆసక్తులను యువకుడైన ఈయన చక్కగా కాపాడగల సమర్థుడు.

ఉత్తముడైన రాజా జి.ఎన్. గజపతిరావుకు కౌన్సిల్లో స్థానం లభించకపోవడం విచారకరం. కౌన్సిల్లో ఖాళీలు ఏర్పడినపుడు గజపతిరావు నియామకం జరుగుతుందని ఆశిద్దాం. అవకాశం లభించినపుడు మద్రాసు స్థానిక వ్యాపారవర్గాల ప్రతినిధిని కూడా కౌన్సిలుకు నియమించాలి."

## 6. ఉప్పు పన్ను వ్యాసం

1888 ఆరంభంలోనే ప్రభుత్వం దేశరక్షణ సాకుగాచూపి ఉప్పుమీద అదనంగా మణుగుకు ఎనిమిది అణాలు పన్ను విధించింది. ఈ సమస్యమీద చర్చించడానికి మద్రాసు పురప్రముఖులు ఫిబ్రవరి 14 తారీకు ప్రెసిడెన్సీ కళాశాలలో నార్టన్ అధ్యక్షతన సమావేశ మయ్యారు. నార్టన్ ప్రభుత్వ విధానాన్ని ఖండించి, ఉపన్యాసాలకు పరిమితం కాకుండా ఏదైనా చెయ్యాలని, అందుకు సంఘీభావం, ఆచరణ ముఖ్యమని ఉపన్యసించాడు. జి. సుబ్రహ్మణ్యఅయ్యరు మాట్లాడుతూ ఉప్పుపన్ను చరిత్రను వివరించాడు. ఆ సమావేశంలో భవిష్యత్కార్యాచరణకు ఒక కమిటీ ఏర్పాటు చేశారు. హిందూ రిపోర్టు చేసిన సభాకార్యక్రమాన్ని పీపుల్స్ ఫ్రెండ్ ఫిబ్రవరి 25 సంచికలో పునర్ముద్రించింది. ఇదే సంచికలో ఉప్పుపన్ను మీద వ్యాసం ప్రచురించబడింది. ఈ వ్యాసం అనువాదం :-

"ఉప్పు పన్ను ఎక్కువ చెయ్యడం మీద ఇంగ్లీషు పత్రికలు మౌనం వహించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. లండన్ టైమ్స్, ఇతర రేడికల్ పత్రికలు ఉప్పు పన్ను పెంచిన వార్తకు సంబంధించిన టెలిగ్రాములు ప్రచురించడం తప్ప మరేమీ రాయలేదు. జీవించడానికి అవసరం కాబట్టి, ఉప్పుమీద పన్ను పెంచరాదని ఇప్పటికీ మేము భావిస్తున్నాము. ఈ చర్యవల్ల పెద్ద సంఖ్యలో నిరుపేద వర్గాలు కష్టాలపాలవుతాయి. ఉప్పు మనిషికి, పశువుకు అవసరం కనుక వ్యవసాయదారులు విపరీతమైన ఇబ్బందులు పడతారు. సరిహద్దురక్షణ, బ్రిటిషు సామ్రాజ్య రక్షణ అవసరంలేదని మేమనడంలేదు.

నిధులు సమకూర్చుకోడానికి ఇదొక్కటే మార్గంకాదు, ఇతర మార్గాలూ ఉన్నాయి. రాష్ట్రాలకు కేటాయించే నిధులు ఎందుకు తగ్గించ కూడదు? పెద్దమొత్తంలో జీతాలు తీసుకొనే ప్రభుత్వోద్యోగుల వేతనాల్లో ఎందుకు కోత విధించకూడదు? కొరగాని ఆడంబరాలకోసం ఎంతధనం దండుగ చేస్తున్నారు? నిధుల లోటు గురించిన పెడబొబ్బల మధ్య, ప్రతిదానికీ అడ్డుపడే ఆ నిరర్థక గవర్నరు (పదవీ విరమణ చేసిన) తన అనుచరగణం విలాసాలకోసం ఊటీలో ఎన్ని లక్షలు కర్చుచేశాడు? కనీసం ఆయనను మందలించారా? వెర్రి ఆడంబరాలకోసం కర్చుపెట్టిన ధనాన్ని తిరిగి చెల్లించమని నిర్బంధ పెట్టారా? అదేమీ లేదు (.....) మీలో సేవా దృక్పథం, దేశభక్తి ఉంటే ఏటా నూరో ఇన్నూరో చందా వేసుకొని దేశ ఆర్థిక వనరులకు ఎందుకు తోడ్పడకూడదు? నిరుపేదలు జీవించడానికి అవసరమైన ఆహారపదార్థం మీద, జంతువులు బ్రతకడానికి అత్యవసరమైన దినుసుమీద పన్ను విధించడం అవసరమంటారా? ఇందుకు "ప్రభుత్వ అవసరాలను" సాకుగా చూపుతున్నారు. పెద్దమొత్తంలో జీతాలు తీసుకొనే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో ఎందుకు తాత్కాలికంగా కోతపెట్టకూడదు?"

నరసయ్య ప్రజల సమస్యలమీద ఎంత తీవ్రంగా రాసేవాడో, లభించిన ఈ అయిదారు సంపాదకీయాలవల్ల స్పష్టమవుతూంది. "ఒక మద్రాసు గవర్నరుకు ఇంగ్లీషు రాదని" నరసయ్య తన పత్రికలో వివాదం లేవదీసినట్లు తెలుస్తూంది. ఆయన రాతలలో కనిపించే తీవ్రత, చురుకు వల్ల ప్రభుత్వోద్యోగులు, పెద్దపెద్ద అధికారులు పత్రికమీద ద్వేషాన్ని పెంచుకొని ఉంటారు. ఈ సంపాదకీయాలు చదివే, బంగోరె నార్లకు రాసిన ఉత్తరంలో "...ఈ రోజు అనుకోకుండా మద్రాసు ఆర్కైవ్స్‌లో పర్మిషన్ లభించింది. ఎన్నాళ్ళనుంచో నేను తపిస్తూ వచ్చిన మా నెల్లూరు జర్నలిజం జనకుడు దంపూరు నరసయ్య edit చేసిన People's Friend పత్రిక సంచికలు రెండింటిని కళ్ళారా చూచేభాగ్యం లభించింది. వాటిలో కొన్ని ముఖ్య Editorial items చదివిన మీదట దంపూరు నరసయ్య నిస్సందేహంగా గొప్ప జర్నలిస్టనే అభిప్రాయం సాక్ష్యాధారాలతో సహా నేడు మరింత ధృవపడిందే తప్ప, అదితగ్గలేదు" అని అభిప్రాయ పడ్డాడు.

## 1888 ఫిబ్రవరి 25 పీపుల్స్ ఫ్రెండ్ - కొన్ని విశేషాలు

ఈ సంచికలో ఆంధ్ర ప్రకాశిక వారపత్రిక మీద ఒక సమీక్ష ఉంది. మద్రాసు ప్రెసిడెన్సీలో సక్రమంగా వెలువడుతున్న తెలుగు వారపత్రిక అని, ఇంగ్లీషు వారపత్రికల పద్ధతిలో దీన్ని ప్రచురిస్తున్నారని ప్రశంస ఉంది. సమర్థతతో రాయబడ్డ రచనలతో, పత్రిక పాఠకాదరణ పొందిందని, ఇంగ్లీషు రాని పాఠకులు ఈ పత్రిక ద్వారా దేశపరిస్థితులను, రాజకీయాలను చక్కగా గ్రహించవచ్చని, పాఠకులకు ఆసక్తి కలిగించే ఎన్నో విశేషాలు ఈ పత్రికలో ఉన్నాయని ఇందులో ఉంది. ఆంధ్ర ప్రకాశిక ప్రకాశకుడు ఏ.సి.

పార్థసారథి నాయుడుతో నరసయ్య స్నేహం చిరకాలం కొనసాగింది.

పీపుల్స్ ఫ్రెండ్ ఆరంభించిన నాటినుంచి "ఎడిటోరియల్ నోట్సు" శీర్షిక నిర్వహించబడుతూ వచ్చినట్లు అనిపిస్తుంది. ఈ శీర్షికలో సమకాలిక సంఘటనలను వ్యాఖ్యానిస్తూ రచనలు ప్రచురించబడ్డాయి. ఇందులో అంశాలన్నీ పత్రిక సంపాదకవర్గం రాసినవే. కొన్ని అంశాల చివర "D.N." అని ప్రత్యేకంగా నరసయ్య పేరు కనిపిస్తుంది. ఎడిటోరియల్ నోట్సు వంటిదే 'Scraps' అనే మరొక శీర్షిక. 1883 సంచికలో ఈ శీర్షిక లేదు. పాఠకులకు ఆసక్తి కలిగించే చిన్నచిన్న వార్తలు అనేకం ఇందులో ఇవ్వబడ్డాయి. ఈ శీర్షికలో ప్రచురించిన కొన్ని వార్తా వ్యాఖ్యలను ఇతర పత్రికల నుంచి స్వీకరించి, ఆధారాలను పేర్కొనడం జరిగింది. కొన్ని వార్తలను పీపుల్స్ ఫ్రెండ్ స్వతంత్రంగా ప్రచురించింది. "The Week (original and selected) అని మరొక శీర్షిక ఉంది. ఈ శీర్షికలో ఫిబ్రవరి 18 శనివారం నుంచి వరసగా, రోజువారి జరిగిన ముఖ్య సంఘటనలు ప్రచురించబడ్డాయి. ఈ శీర్షికలోనూ ఇతర పత్రికలనుంచి వార్తలు స్వీకరించినపుడు ఆయా పత్రికల పేర్లు వార్తల కింద ఇవ్వబడ్డాయి. 'గెజిటు' శీర్షికలో ఫోర్టుసెంట్ జార్జి గెజిటు నుంచి అనేక విషయాలు యథాతథంగా ప్రచురించబడ్డాయి. "Telegrams selected from daily papers" శీర్షికలో ప్రపంచ వార్తలు ఆయా పత్రికల నుంచి పునర్ముద్రించబడ్డాయి. ఈ శీర్షికలో కొన్ని వార్తల చివర ఆకరాలు కనిపించవు.

## హోల్కరు వ్యవహారం

ఎడిటోరియల్ నోట్సు శీర్షికలో అప్రతిష్ఠపాలైన హోల్కరు మహారాజు వ్యవహారం నరసయ్యే స్వయంగా రాశాడు. ఈ సంస్థానాధిపతి దుర్వ్యసనాలకు, దుష్ట సహవాసాలకు అలవాటు పడినట్లు, అతని ప్రవర్తనకు 'గ్రహచారం' కారణమని జోస్యులు చెప్పిన కారణాన్ని నరసయ్య తిరస్కరించాడు. "We fear the astrology of women's starry eyes is doing much mischief to his moral, mental, spiritual and political state" అని వ్యంగ్యంగా రాశాడు. మహారాజుకు జాతకాలమీద, జోస్యులమీద విశ్వాసం ఉందని, అందుకు అతనిని ఏమీ అనలేమని, "సూర్యచంద్ర నక్షత్రాల ప్రభావం మనుషుల హృదయాలమీద ఉండదని మేము సంపూర్ణంగా నమ్ముతున్నాము" అని ఈ సందర్భంలో వ్యాఖ్యానించాడు. "Was it from experience that there is a devil in the moon for mischief" అనే బైరన్‌కవి చరణాలను ఉదాహరించి, "If so why not in the stars? There is doubtless a great deal of naughtiness, especially under bright Italian starry skys, and perhaps under Indian starry skies too" అని పరిహసించాడు. "Thousands are guided by Zodiacal Almanac, and that less pretty closely predicted events, at least some. The Maharajah only

follows suit. When Doctor Johnson believed in the Cock lane Ghost what harm if a Maharajah who never composed a Dictionary or the "Wanity of human wishes" should place faith in astrologers! We trust that the Stars will be generous to Holker and remove the disfavour against him." అని నరసయ్య ఈ వ్యాఖ్యను ముగించాడు. మూఢనమ్మకాలను తొలగించడానికి, శాస్త్రీయ దృక్పథాన్ని వ్యాపింప చెయ్యడానికి, ఏరాయయినా పనికివస్తుందని ఆయన భావించినట్లు ఇందువల్ల తెలుస్తుంది. 'స్క్రాప్స్' శీర్షికలో ట్రావెన్కూరు మహారాజా దేశాటనలో కాలం వెళ్ళబుచ్చుతున్నాడని, ఈ సంస్థానం పరిపాలన పట్టించుకొనే నాథుడే లేడని, ఈ సంస్థానం గురించి ఎవరూ ఒక్క మంచిమాట చెప్పడంలేదని, ప్రభుత్వం పరిస్థితి గమనిస్తూ ఉందని వివరించబడింది. ఈ సంచికలోనే "The illegitimacy of Maharajah Duleep Singh" అనే వ్యాసం ట్రిబ్యూన్ (Tribune) పత్రిక నుంచి పునర్ముద్రించబడింది. నరసయ్యకు స్వదేశీ సంస్థానాధిపతుల మీద, జమీందారుల మీద అప్పటికే సదభిప్రాయం లేనట్లు అనిపిస్తుంది.

ఈ సంచికలో "Suit in connection with municipal law, Physical training in India, The Agricultural college at Delhi, The races of India, A Royal romance, Railway train telegraphs" మొదలైన వ్యాసాలు ఇతర పత్రికల నుంచి పునర్ముద్రణ పొందాయి.

ఎడిటోరియల్ నోట్సు శీర్షికలో పిచ్చికుక్క కాటుకు వైద్యంలేదని, ఈ రోగ నివారణకు మందు కనిపెట్టి మానవాళిని కాపాడాలని ఒక వార్త ఉంది. రైల్వే ట్రైన్ టెలిగ్రాఫ్స్ వ్యాసంలో నూతన శాస్త్ర ఆవిష్కరణలు రైలు ప్రమాదాలను నివారించగలవనే ఆశాభావం వ్యక్తమవుతుంది. ఈ శీర్షికలోనే బెంగాల్ పరగణాలో ఉప్పు ధర పెరిగినట్లు ఒక వార్త కనిపిస్తుంది.

## రెండు కవితలు

ఈ సంచికలో ఈగల, దోమల బాధను వివరిస్తూ హాస్యకవిత ఒకటి ప్రచురించబడింది. వార్తలు స్పష్టంగా, సంగ్రహంగా, ఆసక్తికరంగా రాసే పద్ధతులు ఒక కవితారూపంలో వివరించబడ్డాయి.

Whatever you have to say my friend
Whether witty, or grave or gay
Condense as much as ever you can,
And whether you write on rural affairs

అని మొదలై

For editors do not like to print

An article lazily long, and the general reader do not care

For a couple of yards of song,

So gather your wits in the smallest place.

If you win the author's crown,

And every time you write, my friend - boil it down! చరణాలతో ఈ కవిత ముగుస్తుంది.

స్క్రాప్స్ శీర్షికలోనే నేపాల్ మహారాజు మరణించిన అయిదు నెలల తర్వాత, ప్రధానమంత్రి బలవంతంవల్ల విధవలైన రాణులు సతి ఆచరించినట్లు ఒక విషాదవార్త కనిపిస్తుంది. ఇదే శీర్షికలో ఫ్రెంచి భాషలో వెలువడే "The Journal des Mendicants" అనే వింత పత్రికను గురించిన వివరాలున్నాయి. డాక్టరు కె.ఎస్. బహదూర్జి లండన్‌లో వైద్యవిద్య అభ్యసించి, బొంబాయికి తిరిగివస్తున్న వార్త 'ది వీక్' శీర్షికలో ఇవ్వబడింది. ఈయన పశ్చిమ భారతదేశం నుంచి ఎం.డి. పట్టా సాధించిన తొలి వ్యక్తి అనే ప్రశంస కూడా ఉంది. ఈ సంచికలోనే రాయ్‌బరేలీలో ఆర్యసమాజం కులమతాలకు అతీతంగా నిర్వహిస్తున్న అనాథ శరణాలయానికి సంబంధించిన వార్త ఉంది. పత్రికంతా ఇటువంటి వార్తలతోనే నిండి ఉందని చెప్పడంలేదుగాని, సాధారణ పాఠకులు ఇష్టపడే "ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం, నగరానికి సర్కస్ ఆగమనం" వంటి సాదావార్తలు కూడా ఈ సంచికలో ఉన్నాయి.

## ఛారిటీ స్కూలు

ఈ వార్తల మధ్య నరసయ్య మద్రాసులో నడిపిన "ఛారిటీ స్కూలు" (Charity school) ప్రస్తావన వస్తుంది. మద్రాసు షరీఫ్ (Shariff) సివాలై రామసామి మొదలియారు ఈ స్కూలుకు విరాళం ఇచ్చిన వివరం ఈ విధంగా ఉంది. "..... A cheque for one hundred rupees was forwarded to us on the other day by Sir Sivali Ramasami Mudaliar for the support of our paper and charity school....." ఈ రామసామి మొదలియారు మోనేగారి సత్రానికి 16000 రూపాయల విరాళం, "Going to school" అనే స్వచ్ఛంద సేవా కార్యక్రమానికి 30000 రూపాయల విరాళం ఇవ్వడం, రాజా జి.ఎన్.గజపతిరావు మోనేగారి సత్రానికి 1000 రూపాయల విరాళం ఇవ్వడానికి సంబంధించిన వార్తలు ఈ సంచికలోనే ప్రచురించబడ్డాయి.

ఈ సంచికలో మద్రాసు ప్రభుత్వం – పత్రికలు, మద్రాసు చట్టసభ, కోయంబత్తూరు జిల్లా అనే మూడు సంపాదకీయ వ్యాసాలు ఉన్నాయి. వీటితోపాటు "మద్రాసు

మునిసిపాలిటీలు" అనే వ్యాసం కూడా ఉంది. కోయంబత్తూరు జిల్లా అనే సంపాదకీయంలో ఆ జిల్లా భౌగోళిక, చారిత్రక విషయాలు వివరంగా చర్చించబడ్డాయి. ఈ వ్యాసం చివర, ట్రావెన్కూరు సంస్థాన వ్యవహారాల మీద రాసిన వ్యాసం చివర 'F' అని రచయిత సంగ్రహనామం ప్రచురించబడింది. 1883 డిసంబరు 1 సంచికలో "బెంగాల్ టెనెన్సీ బిల్లు" వ్యాస రచయిత కూడా ఈయనే. నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్ ప్రారంభించిన నాటి నుంచి ఒకరిద్దరు మిత్రులైనా రచనలు పంపి సహకరించినట్లు ఇందువల్ల స్పష్టమవుతూంది. నరసయ్య తన పాఠకులకు చేసిన ఒక విజ్ఞాపనలో "Monthly payment for articles in the People's Friend forms no inconsiderable item of our total expenditure" అని పేర్కొన్నాడు. ఈ ఒక్క సంచికలోనే హిందు, మద్రాస్ మెయిల్, ట్రిబ్యూన్,ది డెయిలి టెలిగ్రాఫ్, టైమ్ మేగజైన్, ఛేంబర్స్ జర్నల్ వంటి అనేక జాతీయ అంతర్జాతీయ పత్రికలనుంచి వార్తలు, వ్యాసాలు పునర్ముద్రించాడు. వీటిలో కొన్ని పత్రికలకైనా చందాలు చెల్లించడం పత్రికా నిర్వహణలో భాగమే. రచయితలకిచ్చే పారితోషికంలో ఈ కర్చు కూడా చేరి ఉంటుంది.

## అంజుమన్ ముఫ్ది ఇస్లాం

నరసయ్య ఉదారభావాలు, విద్యాభిమానం తెలియజేసే మరొక వార్త ఈ సంచికలో ఉంది. ఏటా 200 మంది ముస్లిం విద్యార్థులకు అంజుమన్ ముఫ్ది ఇస్లాం సంస్థ సాంకేతిక విద్యలో శిక్షణ ఇచ్చేది. ఈ సంస్థ 600 రూపాయల వార్షిక గ్రాంటు మంజూరు చేయమని మద్రాసు మునిసిపాలిటిని అర్థించింది. ఇదే విధంగా ఇతర సంస్థలు కూడా సహాయం కోరవచ్చనే నెపంతో మునిసిపాలిటి ఈ అభ్యర్థనను తిరస్కరించింది. ఈ విషయం మీద వ్యాఖ్యానిస్తూ ఇస్లాం మతస్థులు చదువుల్లో వెనకబడి ఉన్నారని, ఇంతమంది విద్యార్థులకు చదువుకొనే అవకాశం కలిగిస్తున్న ఈ సంస్థకు ప్రత్యేకంగా గ్రాంటు మంజూరుచేసి, ప్రోత్సహించి ఉండవలసిందని, ఇదేమీ పెద్ద మొత్తంకాదని పీపుల్స్ ఫ్రెండ్ అభిప్రాయపడింది.

## పీపుల్స్ ఫ్రెండ్ విజ్ఞాపన

ఈ సంచికలోనే నరసయ్య చందాదారులకు, పాఠకులకు చేసిన ఒక విజ్ఞాపన ఉంది. ఏడేళ్ళ పత్రికా నిర్వహణలో చందాదారుల నుంచి నాలుగువేల రూపాయలు బాకీ ఉన్నట్లు అందులో ఉంది. ఈ విజ్ఞాపన అనువాదం :-

"సహృదయులారా! పాత కొత్త చందాదారుల నుంచి నాలుగువేల రూపాయల బకాయిలు ఉన్నాయి. అందులో సగం మొత్తం ఇప్పుడు చందాదారులుగా కొనసాగుతున్న వారి నుంచే రావాల్సి ఉంది. మీలో ప్రతి ఒక్కరు రేపటిరోజు చందా బాకీ చెల్లించగలిగితే, వెంటనే కొత్త అచ్చులు కొని పత్రికను ఆకర్షణీయంగా వెలువరించగలను. ఈ పరిస్థితిలో

మీ బాధ్యతను గుర్తించి సక్రమంగా నిర్వర్తించి సహకరించమని అర్థించే మీ సేవకుడు, డి. నరసయ్య, ప్రొప్రైటర్, పీపుల్స్ ఫ్రెండ్."

## సుబ్రహ్మణ్యఅయ్యరుకు వీడ్కోలు

నరసయ్య రాజకీయ అభిప్రాయాలను వివరంగా తెలుసుకోడానికి అవకాశం లేదు. మద్రాసు మహాజనసభ, భారత జాతీయకాంగ్రెసు స్థాపన వంటి ముఖ్య సంఘటనలు జరిగినపుడు ఆయన ఎంత సంతోషంగా స్వాగతం పలికి ఉంటాడో ఊహించుకోవాల్సిందే. నరసయ్య మద్రాసు మహాజనసభ అభిప్రాయాలను అభిమానించాడు. ఆ సంస్థ కార్యక్రమాలను ఆమోదించాడు. హిందూ పత్రికాధిపతులతో ఆయనకు ఆత్మీయమైన స్నేహమే తప్ప స్పర్థలేదు.

1896-97 సంవత్సరంలో దేశంలో పెద్ద కాటకం సంభవించింది. ప్రభుత్వం సామాన్య ప్రజలచేత బండరాళ్ళు కొట్టి కంకర చేయడం వంటి అతికఠినమైన కరవు పనులు చేయించి ఉపాధి కల్పించింది. ఈ శ్రమకు ప్రతిఫలం చాలా స్వల్పంగా ఉండేది. ఒక్క మధ్య పరగణాలలోనే లక్షాయాభైవేల ఆకలి చావులు సంభవించాయని హిందూ పత్రిక అంచనా వేసింది. హిందూదేశంలో ప్రభుత్వవ్యయం విషయంలో విచారణ జరపడంకోసం ఇంగ్లాండులో "రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ ఎక్స్పెండిచర్" (Royal Commission on Indian Expenditure) పేర ఒక విచారణాసంఘం ఏర్పాటయింది. లార్డ్ వెల్‌బీ (Lord Welby) కమిషన్ అధ్యక్షుడు. దాదాబాయి నౌరోజీ కమిషన్ సభ్యుడు. మద్రాసు మహాజనసభ సుబ్రహ్మణ్యఅయ్యరును తన ప్రతినిధిగా కమిషన్ ముందు సాక్ష్యం చెప్పడానికి పంపుతున్నట్లు తీర్మానించింది. లండన్ వచ్చే ముందు హిందూ దేశంలో ప్రభుత్వ కర్చులను గురించి సమగ్రంగా వివరాలు సేకరించుకొని, సన్నద్ధుడై రావాలని నౌరోజీ సుబ్రహ్మణ్యఅయ్యరుకు సూచించాడు. సుబ్రహ్మణ్యఅయ్యరు లండన్‌కు బయలుదేరే ముందు కమిషన్ ఎదుట తాను ఏయే విషయాలు ప్రస్తావించ దలచినది క్లుప్తంగా రాసిపంపాడు. 1897 ఏప్రిల్ 10వ తేది ఆయన బొంబాయి నుంచి ఓడలో బయల్దేరివెళ్ళి మే నెలలో కమిషన్ ముందు రెండు సార్లు సాక్ష్యం ఇచ్చాడు.

సుబ్రహ్మణ్యఅయ్యరు లండన్‌కు బయలుదేరే సందర్భంలో ఆయనను అభినందిస్తూ నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్‌లో రాసినవ్యాసం నుంచి కొన్ని వాక్యాలు "ఎ హండ్రడ్ ఇయర్స్ ఆఫ్ ది హిందూ" సంపుటంలో ప్రచురించబడ్డాయి.[64]

The People's Friend of Madras welcomed Subramania Aiyer's trip to England. "It affords us no little pleasure to learn", it wrote, "that our brother, Mr. G. Subramania Aiyer, of The Hindu has been selected by

the Mahajana Sabha to give evidence before Lord Welby's Commission on Indian Expenditure as its own and the people's representative from this part of the country. Mr. Subramania Aiyer, though a young man is very studious and conscientious and thoroughly masters all its details before he ventures to speak or write upon any subject and he has moreover the courage of his convictions as all Southern India knows. He is by no means an impracticable man and does not allow his patriotic zeal to run away either with his discretion or common sense. So his journey to England on this public duty will, we are sure, prove beneficial to one and all in many ways".

నరసయ్య ఒక పత్రికాధిపతిగా సాటి జర్నలిస్టు సుగుణాలను హృదయపూర్వకంగా ఈ మాటల్లో వ్యక్తీకరించాడు. అయ్యరు దక్షిణ భారతదేశం నుంచి ప్రతినిధిగా వెళ్ళడం హర్షదాయకమంటూ అందుకు ఆయన అర్హతలేమిటో వివరించాడు. నరసయ్య రాజకీయ భావాలు అప్పటి దేశప్రధాన రాజకీయ స్రవంతితోనే సాగుతున్నట్లు ఈ వీడ్కోలు వ్యాసం వల్ల స్ఫురిస్తుంది. సుబ్రహ్మణ్యఅయ్యరు మద్రాసు తిరిగి వచ్చిన తర్వాత కొద్దిరోజులకే పీపుల్స్ ఫ్రెండ్ ప్రచురణ నిలిచిపోయింది.

## పీపుల్స్ ఫ్రెండ్‌లో నరసయ్య కన్యాశుల్క నాటక సమీక్ష

గురజాడ కన్యాశుల్క నాటకం 1897 జనవరిలో అచ్చయింది. ఈ నాటకాన్ని జనవరి 21 పీపుల్స్ ఫ్రెండ్ సంచికలో నరసయ్య సమీక్షించాడు. కన్యాశుల్క నాటకం మీద వెలువడిన తొలి సమీక్ష ఇది. సమకాలిక పత్రికలలో ఈ నాటకం మీద చాలా సమీక్షలు వెలువడ్డాయి. ఇంగ్లీషు భాష రానివారిలో కన్యాశుల్క దురాచారం కొనసాగుతూంది కనుక, అటువంటి పాఠకులకోసం ఈ నాటకం ఉద్దేశించబడిందని అముద్రిత గ్రంథ చింతామణి సంపాదకుడు పూండ్ల రామకృష్ణయ్య భావించాడు. అందువల్ల నాటకంలో వాడుక చేయబడ్డ 'గ్రామ్యోక్తుల'ను తాను ఆమోదిస్తున్నట్లు ఆయన ప్రకటించాడు. శశిలేఖ కన్యాశుల్క నాటకాన్ని గ్రాంథిక భాషలో రాయనందుకు గర్హించింది. చింతామణి దీన్ని హాస్యరస ప్రధాన నాటకమని, "ఈ గ్రంథము నాటకరూపమున వ్రాయబడుటచే జదువరులకు హృదయ రంజకముగానే యుండ వచ్చును." అని అభిప్రాయపడింది. గురజాడ సమకాలిక సమస్యలను స్వీకరించి, చమత్కారం, హాస్యం నింపి నాటకాన్ని రచించాడని ధీమణి భావించింది. ఇతివృత్త నిర్వహణలో నేర్పు, సహజమైన అభివ్యక్తి కన్యాశుల్క నాటకంలోని గొప్ప అంశాలని, ఈ నాటకం ప్రకృతికి అద్దం పడుతుందని వీక్లీ రెవ్యూ (Weekly Review) గుర్తించింది. హాస్యం పొంగులు వారే ఈ కథ నీతిదాయకమైనదని బాలిక ప్రశంసించింది. ప్రాచీన రూపకాలలో కన్పించని పాత్ర

చిత్రణ ఈ నాటకంలో ఉందని, హాస్యం ఉట్టిపడే నాటకమని, తెలుగు హార్పు (Telugu Harp) పేర్కొన్నది. పాత్ర చిత్రణలో నూతనత్వం, సహజత్వానికి దగ్గరగా ఉన్న పాత్రలు, ఇతివృత్త నిర్వహణలో నేర్పు అనే అంశాలను ఒకటిరెండు సమీక్షలు ప్రస్తావించాయి.

ఈ సమీక్షల్లో "ఎక్కువ భాగం భాషను గురించి తమ అనుమానాలు వ్యక్తం చేశాయి." "1897-1915 మధ్య కాలంలో వచ్చిన కన్యాశుల్క విమర్శలను 'సమీక్షదశ' అనవచ్చు" అని, "భాషా విషయకమైన సుదీర్ఘచర్చలు, సలహాలు సందేహాలు - వీటిని గమనిస్తే ఈ సమీక్షదశ మొదట్లో - 1897లో - అముద్రిత గ్రంథ చింతామణి చేసిన విమర్శకు, కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు 1915వ సంవత్సరం చేసిన విమర్శ పొడిగింపు అనే అనవలసి వస్తుంది." అని 1999లో "కన్యాశుల్కం నూరేళ్ళ సమాలోచనం" గ్రంథ సంపాదకులు భావించారేతప్ప, "అప్పారావు హృదయాన్ని సాకల్యంగా ఆవిష్కరించిన సమీక్ష మద్రాసు నుంచి దంపూరు నరసయ్య వెలువరిస్తూ వచ్చిన పీపుల్స్ ఫ్రెండ్‌లో 1897 జనవరిలో అచ్చు పడింది." అని ఈ విమర్శకులకంటే ఎంతో ముందుగా కె.వి. రమణారెడ్డి వ్యక్తీకరించిన అభిప్రాయాన్ని పట్టించుకోలేదు. రమణారెడ్డి మాటలను శ్రద్ధగా చదివి ఉంటే, నరసయ్య కన్యాశుల్క సమీక్షను, ఆనాటి ఇతర పత్రికలలో వచ్చిన సమీక్షలను ఒకేగాట కట్టి ఉండరు. రమణారెడ్డి అభిప్రాయమే కాదు, నరసయ్య సమీక్ష గురజాడకు కూడా ఎంతగానో నచ్చింది. 1909 కన్యాశుల్క నాటకం ప్రతిలో ఆయన తొలి ముద్రణ మీద వచ్చిన సమీక్షలను చేర్చాడు. అన్నిటికన్నా ముందు పీపుల్స్ ఫ్రెండ్ సమీక్షను వేసుకొని, నరసయ్యపై తనకున్న గౌరవాన్ని వ్యక్తపరచాడు. నరసయ్య ప్రతిభా పాండిత్యాలమీద, శేముషిమీద గురజాడకు గౌరవం ఉంది. ఒంగోలు ముని సుబ్రహ్మణ్యానికి రాసిన లేఖలో "ఆంగ్లభాషలో ఆయన గొప్ప పండితుడు" అని ప్రస్తుతించాడు. తెలుగుదేశంలో ఒక పుస్తకాన్ని సమీక్ష చేయగలసత్తా ఉన్నవారెవరూ లేరని రాస్తూ, ఆ సందర్భంలో నరసయ్య పేరు గుర్తు తెచ్చుకొని, "ఆయన జీవించి ఉన్నారా? ఉంటే ఆయన చిరునామా తెలియచేయి. ఆయనను కలుసుకో" అని రాశాడు. కొత్తగా అచ్చయిన కన్యాశుల్క నాటకం ప్రతిని (1909 ముద్రణ) నరసయ్యకు పంపాలనే కోరికతోనే, గురజాడ ఆయన చిరునామా వాకబు చేసినట్లు తోస్తుంది. నరసయ్య కన్యాశుల్క సమీక్ష గురజాడ హృదయంలో శాశ్వతంగా గుర్తుండి పోయిందని చెప్పడానికి ఈ ఉత్తరమే సాక్ష్యం.

కన్యాశుల్క నాటకంలోని మౌలికాంశాలను తరచి చూచిన సద్విమర్శకుడు నరసయ్య. ఆయన గురజాడ నాటక రచన లక్ష్యాలను, అనుసరించిన నూతన మార్గాలను గుర్తించాడు. చిరకాలంగా వాడుకలో ఉన్న నాటక రచనా సంప్రదాయాలను గురజాడ తృణీకరించాడని గ్రహించాడు. మొత్తం తెలుగు గ్రంథ రచనలోనే ఈ నాటకం కొత్త పుంతలు తొక్కిందని ప్రస్తుతించాడు. కన్యాశుల్కం ఇతివృత్తం అపూర్వమైనదని, ఆ నాటక పాత్రలు యథార్థ

జీవిత ప్రతిబింబాలని కనుగొన్నాడు. కన్యాశుల్క నాటకాన్ని రంగస్థలంమీద ప్రదర్శనగానే కాక, సహృదయులు పఠించికూడా ఆనందిస్తారని భవిష్యద్వాణిని వినిపించాడు. పండితులకు ప్రీతిపాత్రమైన కృతక గ్రాంథిక భాషను విడిచి పెట్టి, జీవద్భాషలో నాటకరచన చేసినందుకు హృదయపూర్వకంగా అభినందించాడు.

నరసయ్య, గురజాడ ఇద్దరూ ఉదార పాశ్చాత్య విద్యావిధానం ప్రభావంలో వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకొన్నారు. నరసయ్య విద్యార్థిదశనుంచి ఇంగ్లీషు సాహిత్యంతోపాటు రాజకీయ, ఆర్థిక శాస్త్రాలను, చరిత్రను నిశితంగా అధ్యయనం చేశాడు. తనకు పాశ్చాత్య రూపక సంప్రదాయాలతో గాఢపరిచయం ఉంది. అందుచేతనే కన్యాశుల్క నాటకాన్ని అంతగా అభిమానించి ఆహ్వానించాడు. గురజాడ కన్యాశుల్క నాటక రచనలో వాడిన భాషను ఆమోదించాడు. నరసయ్య వ్యావహారికభాష ప్రాముఖ్యాన్ని, ప్రయోజనాన్ని 1870 ప్రాంతాలకే గుర్తించాడు. నెల్లూరు కలెక్టరాఫీసులో అనువాదకుడుగా ఉన్న రోజులలోనే భాషా విషయంలో, ఆయన అభిప్రాయాలలో మార్పు వచ్చి ఉంటుంది. వెంకటగిరి జమీందారు సర్వజ్ఞకుమార యాచేంద్ర సాన్నిహిత్యంగూడా ఇందుకు కారణం. కొక్కొండ మొదలైనవారు వీరగ్రాంథిక భాషలో పత్రికలు వెలువరిస్తున్న కాలంలో నరసయ్య ప్రజల భాషలో తెలుగు పత్రిక తీసుకొని రావడానికి ప్రయత్నించాడు. పత్రికల భాషమీద ఆయనకు స్పష్టమైన అవగాహన ఉంది. 1883 డిసెంబరు 1వ తేది పీపుల్స్ ఫ్రెండ్ సంచికలో ఈ ప్రకటన వేశాడు :-

"నయమైన తెలుగు న్యూసు పేపరు

ఇంగ్లీషులో ప్రకృత మందు ప్రచుర పరుస్తూ వుండే "పీపుల్స్ ఫ్రెండ్" వలెనే లోకులకు కావలసినటువంటిన్ని వారికి హితములయినట్టిన్ని అన్ని విషయములు కలిగి తెలుగు దేశస్థులు యేలాగున మాట్లాడుదురో ఆలాగే సులభ శైలిగా వ్రాయబడి నయమైన ప్రతి వారపత్రిక కోరే వారందరు ఆలస్యములేక తమ పేరు, విలాసములు మాత్రము మాకు పంపించవలెను. పేపరు చందా పోస్టేజీతో సం॥కు 3 రూపాయలు. మాసమునకు 4 అణాలు. పేపరు వారమునకు ఒక తూరి (2) రాయల్ ఫారములు అనగా " పీపుల్స్ ఫ్రెండ్"లో వుండే మాదిరి ఒక కాగితము అచ్చు వేయబడును.

1882 నవంబరు నెల 1 తేది

చెన్నపట్టణం దంపూరి నరసయ్య"

సామినేని ముద్దు నరసింహం, సర్వజ్ఞకుమార యాచేంద్ర, వాడుక భాషకు ఉన్న శక్తిని గ్రహించి తమ వచన రచనల్లో ఉపయోగించారు. తొలి తెలుగు పత్రికలు వాడుకభాషలో వెలువడ్డాయి. 1842-58 మధ్య వెలువడిన వర్తమాన తరంగిణి వాడుక భాషలోనే వెలువడింది. ఈ సంప్రదాయం నరసయ్యకు పరిచయమైనదే. ఆయన ఎంతో

ముందుగా పత్రికలు ప్రజల భాషలో ఉండాలని గ్రహించిన క్రాంతదర్శి. తాను నడిపిన తెలుగు పత్రిక ఆంధ్రభాషా గ్రామవర్తమానిని వాడుక భాషలోనే తీసుకొని వచ్చాడు. సాంఘిక, భాషా విషయాలలో నరసయ్యకు నిర్దుష్టమైన అభిప్రాయాలున్నాయి. ఆయన తన సమకాలికులకంటే ఎంతో ముందుగా మార్పును పసికట్టి ఆహ్వానించాడు. నరసయ్య కన్యాశుల్క నాటకం మీద రాసిన సమీక్షకు అనువాదం :-

"సాహిత్య విషయాలలో శ్రీ అప్పారావు మౌలిక భావాలు కలిగిన ప్రతిభావంతుడని అనిపిస్తాడు. తన హాస్యరస నాటకం కోసం తెలుగు పండితులకు ఎంతో ప్రీతిపాత్రమైన భాషను, కృతకంగా ఉండి పాండిత్యాడంబరాన్ని ప్రదర్శించే భాషను, ఛాందస సాహిత్యభాషను విడిచిపెట్టాడు. పండితులు నిష్కారణంగా ప్రశస్తమైనదని భావించే భాషను, వారు గ్రంథాల్లో వాడుక చేస్తున్న భాషను విడిచిపెట్టాడు. ఈ భాషకు బదులు ఇప్పుడు ప్రెసిడెన్సీ ఉత్తర జిల్లాలలో అన్ని వర్గాల ప్రజల నిత్యజీవితంలో వాడుకలో ఉన్న సరళ సామాన్య భాషను ఉపయోగించాడు. నాటక రచనలో ఈ పుస్తకం తెగువ ప్రదర్శిస్తూ కొత్త పుంతలు తొక్కింది. ఇంకా చెప్పాలంటే, తెలుగు గ్రంథరచనలో కొత్తదిశను నిర్దేశించింది. మార్పు లేకుండా, విసుగు పుట్టిస్తూ ఒకే ఇరుకు గాడిలో సాహిత్య ధోరణులు సాగుతున్న ఈ కాలంలో నాటక రచయిత గర్వించదగిన, సాహిత్యపరమైన సాహసోపేతమైన ధైర్యాన్ని ఈ రూపకం ప్రదర్శిస్తున్నదని మేము భావిస్తున్నాము. పూర్వపు ఔన్నత్యం కోల్పోయి, దిగజారిపోయిన ఈ నిస్సారమైన క్షీణయుగంలో, హాస్యాస్పదంగా పరిణమించిన వ్యాకరణ సాహిత్య శాస్త్రాలను రచయిత లెక్కపెట్టలేదు. తెలుగు రచనలో వ్యవహారంలో ఉన్న వ్యాకరణ సాహిత్య సంబంధమైన అంధ విశ్వాసాల నుంచి బయటపడ్డాడు. పూర్వ రచయితల వాడుకవల్ల లభించే సమర్థన లేకపోయినా, ఈ నాటకకర్త కొత్త సాహిత్యభాషను ధైర్యంగా వాడుక చేశాడు. ఈ భాష విశ్వజనీనమైన వాడుక వల్ల ప్రజామోదాన్ని పొందింది. ఈ నాటక రచయిత అపూర్వము, ఆసక్తికరమూ అయిన ఇతివృత్తాన్ని ఎన్నుకొని నిస్సందేహంగా తన ఉపజ్ఞను ప్రదర్శించాడు. రంగస్థలంపై ఈ నాటకాన్ని ప్రదర్శిస్తే, ఏ తెలుగు ప్రేక్షకులనైనా సంతోషపెట్టగల వాస్తవ జీవితాన్ని ప్రతిబింబించే వైవిధ్యంగల పాత్రలను సృష్టించాడని మేము నమ్మకంగా చెప్పగలం. పఠనాసక్తి గల చదువరులు విశ్రాంతిగా తమ గదిలోనో, గ్రంథాలయాల్లోనో కూర్చొని చదివినా, కన్యాశుల్క నాటకాన్ని ఆనందించగలరు. అందువల్ల ఈ నాటకాన్ని చదవమని మా తెలుగు పాఠకులందరికీ సంతోషంగా సిఫార్సు చేస్తున్నాము. ...............రచయిత పాత్రలన్నింటినీ సాహసంతో చిత్రీకరిస్తూ, అసామాన్యమైన సృజనాత్మకతనూ, రూపకశిల్పాన్ని ప్రదర్శించి, నాటకాన్ని సమగ్రంగా, కళాత్మకంగా నిర్మించాడు. (ది పీపుల్స్ ఫ్రెండ్, జనవరి 21, 1897).[65]

7

# చివరి మజిలీ
# ఆంధ్రభాషా గ్రామవర్తమాని

నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్ పత్రికను ఎంతో 'కీర్తిప్రదం' గా నిర్వహించినట్లు ఒంగోలు వెంకటరంగయ్య పేర్కొన్నాడు. పత్రిక నిలిచిపోయిన పుష్కరకాలం తర్వాత కూడా గురజాడ వంటి బుద్ధిజీవులు "Bright English Weekly" అని ప్రశంసించడం, పీపుల్స్ ఫ్రెండ్ నుంచి నూరేళ్ళ హిందూ సంపుటం కోట్‌చెయ్యడం ఇందుకు నిదర్శనాలు.

1897 జూలై వరకు పీపుల్స్ ఫ్రెండ్ కొనసాగించి, ఆగస్టులో నెల్లూరు కాపురం వచ్చినట్లు నరసయ్య స్వయంగా పేర్కొన్నాడు.[1] తను ఎంత గుండె బరువుతో నెల్లూరు ప్రయాణమై ఉంటాడో ఎవరి ఊహకైనా తట్టకపోదు. పదిహేడేళ్ళ క్రితం, ముప్పై రెండేళ్ళ వయసులో, నిక్షేపంలాంటి ప్రభుత్వోద్యోగం మానుకొని, ఎన్నో కలలు మూటగట్టుకొని మద్రాసు దారి పట్టాడు. జీవితం ఇంత నిష్ఠురంగా ఉంటుందని తనకు ముందే తెలుసు. తను ఎన్నుకొన్న మార్గం ఇతరులు నడవడానికి సాహసించనిది. చదువు, ఉద్యోగం, భద్రజీవితం ఈ వరుసలో తాను నడుచుకోలేదు. తన దారి వేరు.

అడుగడుగునా ఎదురయిన కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు అధిగమించి, సమకాలికుల కంటే విలక్షణమైన ఆలోచనలతో, ఆశయసాధనకోసం పత్రికా రచయితగా, సంపాదకుడుగా జీవితం ఆరంభించాడు. ఈ క్రమంలో ఎన్నో వ్యతిరేక శక్తులతో సంఘర్షించవలసి వచ్చింది. తన సర్వస్వం ఒడ్డి పోరాడినా, పత్రిక కొనసాగించడం తన శక్తికి మించినపనే అయింది. ఆనాటి ఏ పత్రిక చరిత్ర చూచినా దాదాపుగా ఇదే కథ. పత్రిక కొనసాగించడానికి చివరకు నరసయ్య ఇల్లాలి నగలు కూడా తాకట్టు పెట్టవలసి వచ్చింది.[2] తలకుమించిన రుణభారం తప్ప తనకు మిగిలిందేమీ లేదు. తొమ్మిదేళ్ళు కూడా నిండని పసివాణ్ణి, అనారోగ్య పీడితురాలైన భార్యను వెంటపెట్టుకొని నెల్లూరు చేరాడు. "How many wicked men and women have worried my path. God thy hand I trust in all events..."[3] అని దినచర్యలో రాసుకున్న వాక్యం ఈ నిస్పృహను సూచిస్తుంది.

నరసయ్య నెల్లూరు రావడానికి మరొక కారణం ఉంది. నాలుగేళ్ళ వయసున్న ఒకే ఒక కుమారుణ్ణి అక్క మీనాక్షమ్మకు దత్తత ఇచ్చాడు. ఆమెకు నెల్లూరు సమీపంలో కోడూరు గ్రామ పరిసరాల్లో పెద్దభూస్థితి ఉంది. ఆమె అమాయకత్వం వల్ల, అశక్తతవల్ల ఆ భూములన్నీ తాకట్టుపడ్డాయి. బాకీ తీర్చకపోవడం వల్ల పొలాలు రుణదాతల స్వాధీనమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ ఆస్తి వ్యవహారాలు చక్కపెట్టాల్సిరావడం వల్ల కూడా నరసయ్య నెల్లూరులో ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు తనకు వ్యవసాయమే జీవనాధారమైంది.

కోడూరు వ్యవసాయంతో నరసయ్య అనుబంధం ఈనాటిది కాదు. ఇరవై ఏళ్ళుగా ఆ పొలాల మీద అజమాయిషి తనదే. పనులకాలంలో కోడూరులో ఉండి వ్యవసాయం మంచి చెడ్డలు చూచేవాడు. ఫలసాయంలో అక్కకు పదిపుట్లిచ్చి, మిగిలింది తాను తీసుకొనేవాడు.[4] ఈ అయివోజుతోనే మద్రాసులో ఉన్నన్ని రోజులు నెట్టుకొచ్చినట్లుంది. కోడూరు, భట్టారంవారి కండ్రిగ, పొగడదొరువు కండ్రిగ, విలుకానిపల్లె మొదలయిన ఊళ్ళన్నీ తనకు పరిచయమే. అక్కడి ప్రజల కష్టసుఖాలు తనకు తెలుసు. ఈ పల్లెటూళ్ళలో మసలడంవల్ల అక్కడి పేదల కడగళ్ళు, భూస్వాముల ఆగడాలు, పెత్తందార్ల అక్రమాలు, గ్రామాధికారుల మాయలు, మోసాలు, ఏవీ ఆయన దృష్టినుంచి తప్పిపోలేదు. నిత్యం ఆ గ్రామాలకు రాకపోకలు సాగించడం వల్ల కొత్త సంగతులు తెలిశాయి. అక్కడి ప్రజల దయనీయ పరిస్థితులను ప్రభుత్వం ముందుంచడానికి, దేశప్రజల దృష్టికి తీసుకొని రావడానికి తనకొక పత్రిక అవసరం. పత్రిక తన ఆయుధం. అచ్చాఫీసు నడపడం తన ప్రవృత్తి. ఎన్ని సమస్యలు ఎదురైనా పత్రిక నడపాలనే పిపాస నరసయ్యలో తీరనేలేదు.

నరసయ్యకు జర్నలిజంతో ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ "ఆ రోజుల్లో Tale of Two Cities లాగా జర్నలిజంపై ఇంత పిచ్చి కనపరచినవాడు అపురూపం" అని బంగోరె నార్లకు ఒక ఉత్తరంలో రాశాడు.[5] మద్రాసు మహానగరంలో ప్రారంభమైన నరసయ్య జర్నలిజం ప్రస్థానం నెల్లూరుజిల్లాలోని కోడూరు గ్రామంవరకు సాగి సమాప్తమయింది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో 'ఆంధ్రభాషా గ్రామవర్తమాని' చివరి మజిలీ. మూడు ఇంగ్లీషు పత్రికలు ప్రచురించిన పాతికేళ్ళ జర్నలిజం అనుభవంతో తెలుగు పత్రికా సంపాదకుడుగా కొత్తపాత్రలో ప్రవేశించాడు.

తన కళ్ళముందే ఆంధ్రభాషా గ్రామవర్తమాని ప్రారంభమూ, ముగింపు జరిగిన కథ ఒంగోలు వెంకటరంగయ్య ఇట్లా వివరించాడు. "దంపూరు నరసయ్యగారు 1897-98 ప్రాంతములలోఁ జెన్నపట్నము నుండి నెల్లూరికిఁ దిరుగ వచ్చి, ఇచ్చట స్థావరము కుదుర్చుకొని 1900 సంవత్సరమున ఆంధ్రభాషా గ్రామవర్తమాని యనునొక చిన్న వారపత్రికను ప్రారంభించిరి.... పాఠకాదరణము చాలమిని, ప్రవర్తకుని వార్ధక్యము వలనను నియ్యది శైశవముననే యంతరించినది." ఈ పత్రిక వెలువరించే నాటికి నరసయ్య వార్ధక్యంలో ఉన్నట్లు వెంకటరంగయ్య అభిప్రాయపడ్డాడు.[6] "వార్ధక్యం అంటే ఎన్నేళ్ళనోకాని అప్పటికి నరసయ్యగారి వయస్సు 51" అని పెన్నేపల్లి గోపాలకృష్ణ వ్యాఖ్యానించాడు.[7] ఈ పత్రిక నడుపుతున్న కాలంలో నరసయ్య కోర్టు పనులమీద తరచుగా వెంకటరంగయ్యను కలుసుకొంటూనే ఉన్నాడు. ఈ సంగతి ఆయన తన దినచర్యలో పలుమార్లు ప్రస్తావించాడు. అప్పటి నరసయ్య స్వరూపం, పరిస్థితి ఆయన వార్ధక్యదశలో ఉన్నట్లు అభిప్రాయం కలిగించి ఉండాలి. ఆనాటి భారతీయుల సగటు ఆయుర్దాయం 30 సంవత్సరాలో, అంతకన్న తక్కువో! పైగా నరసయ్య ఆర్థికంగా చితికిపోయి, జీవిత పోరాటంలో ఓడి నెల్లూరు చేరిన సందర్భం.[8]

1856లో 'దినవర్తమాని' పేరుతో ఒక తెలుగు వారపత్రిక వెలువడింది. కొక్కొండ వెంకటరత్నం 'ఆంధ్రభాషా సంజీవని' పత్రికను తర్వాత 1871లో ప్రారంభించాడు. వీటి స్ఫూర్తితో నరసయ్య తన పత్రికకు "ఆంధ్రభాషా గ్రామవర్తమాని" అని పేరుపెట్టినట్లుంది. ఆంధ్ర భాషలో గ్రామవర్తమానం తెలిపే పత్రిక అని అర్థం స్ఫురించేటట్లు ఈ పేరు ఎంపిక చేసినట్లుంది. ఆంధ్ర భాషమీద తనకున్న ప్రీతిని, అభిమానాన్ని వ్యక్తంచేయడానికీ, తన పత్రిక భాషా సాహిత్య విషయాలనూ ఆదరిస్తుందని ధ్వనించేందుకు 'ఆంధ్ర' పదం చేర్చి ఉంటాడు. ఆయన పీపుల్స్ ఫ్రెండ్ ప్రారంభించిన రెండేళ్ళకే, తెలుగులో వారపత్రికను వెలువరించేందుకు ప్రయత్నం చేసినా, ఇంతకాలానికి ఆ అభిలాష ఆకృతి ధరించింది.

భాషకు సంబంధించి నరసయ్యకు కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. 1883 నాటికే ఆయన వ్యావహారిక భాషావాది. ఆయన కన్యాశుల్క నాటక సమీక్షలో పండిత భాషను తిరస్కరించి, ప్రజల భాషను ఆహ్వానించిన సంగతి తెలిసినదే. ఇప్పుడు గ్రామస్థాయిలో ప్రజల సమస్యలపై దృష్టి నిలిపి పత్రిక ఆరంభిస్తున్నాడు. ఆయన కార్యరంగం కోడూరు చుట్టుపట్ల ఉన్న పల్లెటూళ్ళు. ఆయన పాఠకులు గ్రామీణ ప్రజలు. వారి కోసం తనకిష్టమైన ఇంగ్లీషు పత్రికా రచన విడిచిపెట్టి, తెలుగు జర్నలిజంలోకి మారాడు. చెన్నపట్నంలో ఉండి, రెండు దశాబ్దాలు జాతీయ అంతర్జాతీయ వ్యవహారాలపై వ్యాఖ్యానిస్తూ పత్రిక కొనసాగించి, కోడూరు వంటి కుగ్రామాల స్థానిక సమస్యలను విశ్లేషించి పరిష్కారాలు సూచించడానికి ఒక పత్రిక స్థాపించడం నరసయ్యకే చెల్లింది. యవ్వనావేశంలో 'నెల్లూరు పయొనీర్' పత్రికను ఇంగ్లీషులో తీసుకొని వచ్చాడుకాని, ఇప్పుడైతే ఆ పత్రికను తెలుగులోనే వెలువరించి ఉండేవాడు. ఆంధ్రభాషా గ్రామవర్తమానికి ముందూ వెనుక ఎన్నో పత్రికలు పుట్టిగిట్టినా, తెలుగు పత్రికల చరిత్రలో గ్రామీణ ప్రజలకోసం, అదీ నిరుపేద రైతుల ప్రయోజనాలకోసం ప్రత్యేకంగా పత్రిక నడిపిన ఉదంతం కన్పించదు. పత్రికా నిర్వహణలో ఇది అపూర్వ ప్రయోగం. "ఇది ముఖ్యముగా పల్లెటూళ్ళకును, నచ్చుటి జనమునకు నుద్దేశింపఁబడినది. పల్లెటూళ్ళ రైతు లనేకురు తమ కష్టముల నీ పత్రికా ముఖమునఁ దెలుపుచుండిరి...... జీవించియుండిన కొలది కాలమును జనోపయోగములగు పలు విషయము లిందుఁ జర్చింపఁ బడుచుండెను. ఇది ముఖ్యముగా నెల్లూరు తాలుకా కోడూరు గ్రామము కొఱకు పుట్టినది" అని ఒంగోలు వెంకటరంగయ్య వివరించాడు.[9]

తను నిర్దేశించుకొన్న లక్ష్యాలవల్ల సాధారణ పాఠకులు, చందాదారులు ఆంధ్రభాషా గ్రామవర్తమాని మీద ఆసక్తి కోల్పోతారనే సంకోచం నరసయ్య మనసులో లేకపోలేదు. తనది చిన్న వార్తాపత్రిక అని, గ్రామ సమస్యలమీద, ప్రత్యేకంగా కోడూరు గ్రామ సమస్యల మీద దృష్టి పెట్టడంవల్ల, తరచుగా గ్రామీణుల స్థితి గతులమీద రాయవలసి వస్తూందని, పాఠకులు తన పత్రిక పరిమితులు దృష్టిలో ఉంచుకొని, విముఖత చూపకుండా ఆదరించాలని పలుమార్లు విజ్ఞప్తి చేశాడు. "ఇది చిన్న పత్రిక. ఇందులో అప్పుడప్పుడూ నెల్లూరుజిల్లా వార్తలను ప్రచురిస్తూ ఉంటాము. ఆయా విలేకరులు పంపిన వార్తలను, రచనలను కూడా ప్రచురిస్తాము. ప్రభుత్వాధికారులను, కొత్తగా జిల్లాకు వచ్చిన కలెక్టరును ఈ పత్రికలో ప్రచురించబడుతున్న వార్తలను శ్రద్ధగా చదవమని కోరుతున్నాం" అని విన్నవించుకొన్నాడు.[10] 1901 మార్చి, ఏప్రిల్ కళావతి మాసపత్రికలో ప్రచురించిన ప్రకటనలో "ఇది తెలుగు పల్లెటూళ్ళ జనులకుగాను సులభశైలిలో నెల్లూరు నుండి దంపూరు నరసయ్యగారిచే ప్రతి శనివారమును ప్రకటించబడు వార్తాపత్రిక" అని వివరణ వంటి వాక్యం ఉంది.[11] పత్రిక ప్రారంభమైన ఏడాది తర్వాత, బహుశా

తన పత్రిక పరిధి తెలుగుజిల్లాల పల్లెటూళ్ళకు విస్తరించాలని నరసయ్య భావించినట్లు ఈ ప్రకటనవల్ల బోధపడుతూంది.

## నేటివ్ న్యూస్‌పేపర్ రిపోర్టులు

ఆంధ్రభాషా గ్రామవర్తమాని సంచికలు ఇప్పుడు లభించకపోయినా, ఆ పత్రికలోని కొన్ని వార్తలు, వ్యాసాలు, సంపాదకలేఖలు ఇంగ్లీషు అనువాదరూపంలో మనకు మిగిలాయి. బ్రిటిష్ ప్రభుత్వం 1876 ప్రాంతాలకే దేశభాషా పత్రికలమీద నిఘా ఏర్పాటు చేసింది. ప్రభుత్వ అనువాదకులు దేశభాషలలో వెలువడే పత్రికలను పరిశీలించి, అవసరమైన విషయాలను అధికారులకు నివేదించేవారు. ఆ నివేదికలలో పత్రికలకు సంబంధించిన వివరాలు కూడా పొందు పరచేవారు. పత్రిక ఏ ప్రదేశం నుంచి ప్రచురించబడుతున్నది, ఎన్నిరోజులకు ఒకసారి వెలువడేది, ప్రచురణతేది, ఏ తారీకున ప్రభుత్వ కార్యాలయానికి అందింది, ఎన్ని ప్రతులు ముద్రించబడుతున్నది మొదలైన వివరాలు నమోదు చేసేవారు. ఈ రహస్య నివేదికలవల్లే ఇప్పుడు లభించని అనేక పత్రికల వివరాలు, స్వరూప స్వభావాలు గ్రహించడానికి వీలుపడింది. ఇవి "నేటివ్ న్యూస్‌పేపర్ రిపోర్టులు" (Native Newspaper reports) "కాన్ఫిడెన్షియల్ న్యూస్ పేపర్ రిపోర్టులు" (Confidential Newspaper reports) మొదలైన పేర్లతో చెన్నైలోని తమిళనాడు ఆర్కైవ్స్‌లో భద్రపరచబడి ఉన్నాయి.[12]

## ప్రారంభ సంచిక

ఒంగోలు వెంకటరంగయ్య ఆంధ్రభాషా గ్రామవర్తమాని 1900లో ప్రారంభమైనట్లు పేర్కొన్నాడు. ఆ పత్రిక ఎప్పుడు ప్రారంభమైందో మరింత నిర్దుష్టంగా చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు లభించాయి. నెల్లూరు సాహిత్య మాసపత్రిక అముద్రిత గ్రంథ చింతామణి అధిపతి పూండ్ల రామకృష్ణయ్య తన మిత్రుడు వేదం వేంకటరాయశాస్త్రికి 1900 మే 22న రాసిన ఉత్తరంలో నరసయ్య పత్రికను ప్రస్తావించాడు."..... దంపూరు నరసయ్యగారు ప్రతాప గురించి వారు నూతనముగా ప్రకటించుచున్న ఆంధ్ర గ్రామవర్తమాని అను పత్రిక యొక్క 3 సంచికలో విమర్శించినారు. అందులో మన విమతులందరికి బుద్ధి చెప్పినారు" అని పేర్కొనడంవల్ల ఆంధ్రభాషా గ్రామవర్తమాని 3వ సంచిక అంతకుముందు కొద్దిరోజులక్రితమే విడుదలైందనే అభిప్రాయం వ్యక్తమవుతూంది. నేటివ్ న్యూస్‌పేపర్ రిపోర్టులలో ఏప్రిల్ 28వ తారీకు సంచిక ప్రస్తావన మొదటిసారి వస్తుంది. తొలిసంచిక ఈ తేదీన ప్రచురించబడి ఉంటే, మూడో సంచిక మే 12వ తేది నాటిది అవుతుంది.

నరసయ్య ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో ఏయే విషయాల మీద రాశాడో సాకల్యంగా పరిశీలించి రాయడానికి అవకాశం లేదు. ప్రభుత్వ అనువాదకుడు తన నివేదికలలో చేర్చిన పరిమిత విషయాలు (షుమారు 160 అంశాలు) మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అనువాదకుడు తన సంకుచిత దృష్టికోణంనుంచి పరిశీలించి రిపోర్టు చేసిన సంగతులే - గ్రామ సమస్యల నుంచి, అంతర్జాతీయ వార్తల వరకు ఉన్నాయి. 1900లో 33 సంచికలలోని అంశాలు, 1901లో 43 సంచికలలోని విషయాలు ఈ రిపోర్టులలో పేర్కొనబడ్డాయి. ఈ రెండు సంవత్సరాలు పత్రిక సక్రమంగా వెలువడిందని చెప్పడానికి ఇంతకన్న బలమైన సాక్ష్యం ఏంకావాలి? ఈ రిపోర్టులలో పేర్కొనబడని కొన్ని సంచికల ప్రస్తావనలు ఇతర సాహిత్య ఆకరాల్లో, పత్రికల్లో వస్తాయి.[13]

వారంవారం ఆంధ్రభాషా గ్రామవర్తమాని 150 ప్రతులు అచ్చయ్యేవి. ఆ రోజుల్లో ఏ తెలుగుపత్రిక సర్క్యులేషనూ వేయి కాపీలకు మించలేదు. మద్రాసు నుంచి వెలువడే క్రైస్తవ మిషనరీల మాసపత్రిక "మెసెంజర్ ఆఫ్ ట్రూత్" (Messenger of Truth) ఒక్కటే 4800 ప్రతులు ముద్రించ బడుతున్న తెలుగు పత్రిక. ఆంధ్రప్రకాశిక (bi-weekly) 650 ప్రతులు, శశిలేఖ (bi-weekly) 550 ప్రతులు, హిందూజన సంస్కారిణి మాసపత్రిక 350 ప్రతులు, సత్య సంవర్ధని మాసపత్రిక, సూర్యాలోకం, దేశాభిమాని వారపత్రికలు 350 కాపీలు, రవి వారపత్రిక 250 కాపీలు, విడుదలవుతున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రభాషా గ్రామవర్తమాని పరిమిత లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తే, ఈ సంఖ్య సమంజసంగానే తోస్తుంది. ఇంత తక్కువగా సర్క్యులేషను ఉండడంవల్లే ఆనాటి పత్రికలు ఇప్పుడు లభించడంలేదని భావించడానికి అవకాశం ఉంది. అయితే, నెలనెలా 100 నుంచి 150 ప్రతులదాకా ముద్రించబడుతూ వచ్చిన అముద్రిత గ్రంథ చింతామణి పత్రిక ప్రచురణ ఆరంభమైన నూట ఇరవై సంవత్సరాల తర్వాత, ఇప్పుడు కూడా అనేక ప్రాచీన గ్రంథాలయాల్లో, వ్యక్తుల పుస్తక సంచయాల్లో భద్రంగా ఉండడం ఆశ్చర్యం కలిగించక మానదు. ఈ పత్రిక ఒక్కటేకాదు, ఆనాటి ఇతర సాహిత్య పత్రికలు ఒకటి రెండు కాపీలైనా ప్రాచీన గ్రంథాలయాల్లో జాగ్రత్త చేయబడి ఉన్నాయి.[14] వార్తాపత్రికలకన్నా, సాహిత్య పత్రికలను ప్రజలు పదిలపరచుకొన్నారని అనిపిస్తుంది. పత్రికల ఆకారం కూడా ఒక నిర్ణాయక అంశంగా మారినట్లుంది. పీపుల్స్ ఫ్రెండ్, ఆంధ్రభాషా గ్రామవర్తమాని 'రాయల్ ఫారం' మీద ముద్రించ బడడంవల్ల జాగ్రత్త చేయడం కష్టం అయి ఉంటుంది.

నరసయ్య దినచర్యలో ఆంధ్రభాషా గ్రామవర్తమాని ప్రచురణ ప్రస్తావన ఉంది. "Sunday - Monday and half of Tuesday engaged in writing leaders, picking up news and writing for the issues of 'గ్రామవర్తమాని' for 25th May and 1st June 1901... By Tuesday afternoon work of 'గ్రామవర్తమాని' of 25th May fully

set up" (1901 June 25th)[15] పత్రిక నిర్వహణలో సంపాదకుడు, విలేకరి, ప్రూఫ్‌రీడరు అన్నీ తానే అయి వ్యవహరించినట్లుంది. అనాటి చిన్న పత్రికలన్నీ ఇదే పద్ధతిలో కొనసాగాయి. నెలరోజులక్రితం విడుదల కావలసిన సంచికను ఇంత ఆలస్యంగా సిద్ధం చేశాడంటే, పత్రికను తీసుకొని రావడంలో ఆయన ఎన్ని ఇబ్బందులు పడ్డాడో అర్థమవుతుంది.

## పత్రికల దృక్పథంలో వచ్చిన మార్పు

చరిత్రకారులు స్వాతంత్ర్యోద్యమాన్ని స్థూలంగా మూడు దశలుగా గుర్తించారు. 1885 నుంచి 1905 వరకు మొదటిదశ. ఈ తొలిదశలో ఇంగ్లీషు విద్యాధికులైన మేధావులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించలేదు. పరిపాలనలోని లోపాలు సరిదిద్దితే చాలని భావించారు. ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పి ప్రభుత్వాన్ని సక్రమ మార్గంలో నడపడానికి కృషి చేశారు. 1884లో మద్రాసు మహాజనసభ ఆవిర్భావం, భారత జాతీయ కాంగ్రెసు ఏర్పడడం, జిల్లాసభలు ఏటేటా జరగడంతో మద్రాసు ప్రెసిడెన్సీలో రాజకీయ చైతన్యం రగులుకొన్నది. ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్దడంలో పత్రికలు తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాయి.

కాంగ్రెసు దేశ ఆర్థిక విషయాల మీద దృష్టి నిలిపింది. దేశసంపద వృథా కాకుండా అడ్డుకోవాలని, ప్రభుత్వవ్యయం తగ్గించుకోవాలని, ప్రజల ఆర్థిక పరిస్థితిమీద విచారణ జరపాలని కోరింది. అడవిచట్టాలు, ఉప్పుపన్ను, స్థానిక స్వపరిపాలన, బీళ్ళు, పచ్చికబయళ్ళు, నీటి వనరులు, అబ్కారి పన్ను మొదలైన సమస్యలమీద కాంగ్రెసు సమావేశాల్లో చర్చలు జరిగేవి. కరవుకాటకాల నుంచి విముక్తికోసం అనుసరించవలసిన వ్యూహం, రైతుల పేదరికం, వారి దయనీయస్థితి ఇరవయ్యో శతాబ్దం ఆరంభమయ్యేసరికి కాంగ్రెసు సభలలో ప్రముఖంగా నిలిచాయి.

దాదాపు పై అంశాలే ఆనాటి భారతీయ పత్రికలలో ప్రధానంగా చర్చకు వచ్చాయి. ఉన్నత పదవుల్లో భారతీయులకు అవకాశాలు లేకపోవడం, జాతివివక్ష, గ్రామీణ పేదరికం, ప్రభుత్వోద్యోగుల అవినీతి, పోలీసుశాఖ వైఫల్యం, ఆయుధచట్టం, న్యాయవ్యవస్థలో లోపాలు, కొత్తగా ఏర్పడిన స్థానిక సంస్థలలో ప్రభుత్వాధికారుల పెత్తనం, లెజిస్లేటివ్ కౌన్సిళ్ళ పనితీరు, న్యాయవ్యవస్థను పరిపాలనావ్యవస్థ నుంచి విడదీయాలనికోరడం, న్యాయస్థానాల్లో మితిమీరిన జాప్యం, క్రైస్తవ మత ప్రచారకులకు ప్రభుత్వ ప్రోత్సాహం, మతమార్పిడి, భారతీయుల పేదరికం పట్ల ప్రభుత్వ ఉదాసీనత, ఆదాయంపన్ను విధానంలో లొసుగులు మొదలైన విషయాలు ఆనాటి పత్రికలలో ప్రముఖంగా చర్చించబడ్డాయి. పందొమ్మిదో శతాబ్ది ముగింపుకు వచ్చేసరికి విద్యావంతుల

దృష్టి సామాజిక, సంస్కరణ విషయాల మీద నుంచి దేశ ఆర్థిక రాజకీయ పరిస్థితుల వైపు మరలింది. వందేమాతరం ఉద్యమంతో ప్రజల రాజకీయ చైతన్యం జాగృతమైంది.

ఆ కాలంలో ఆంధ్రప్రకాశిక, వివేకవర్ధని, దేశాభిమాని, సూర్యాలోకం, రసికజనోల్లాసిని, శశిలేఖ వంటి పత్రికలు ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్దడంలో ముందు నిలిచాయి. నెల్లూరు నుంచి వార్తాదర్శిని, ఆంధ్రదేశోపకారి, ఆంధ్రభాషా గ్రామవర్తమాని వంటి రాజకీయ వార్తాపత్రికలు వెలువడ్డాయి. బుచ్చిరెడ్డిపాళెంనుంచి శ్రీ వర్తమాన తరంగిణి మాసపత్రిక సాహిత్యానికి, వార్తలకు సమప్రాధాన్యాన్నిస్తూ వెలువడింది.[16]

## ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో చర్చించబడిన విషయాలు

### దారిడొంకలు లేని ఊళ్ళు

కోడూరు గ్రామాభివృద్ధికోసం, ఆ గ్రామసమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి పత్రిక ప్రారంభించినట్లు నరసయ్య పదే పదే చెప్పాడు. నరసయ్య ఊహలో ప్రతి ఊరికి ప్రధాన మార్గాన్ని కలుపుతూ మంచిరోడ్డు, చుట్టుపట్ల ఊళ్లను కలుపుతూ చక్కని బాటలు, ఊరూరా ఒక పాఠశాల, గ్రంథాలయం, పోస్టాఫీసు, పశువులకు, మనుషులకు వైద్య సౌకర్యం, గ్రామీణుల చిన్న చిన్న తగాదాలను తీర్చడానికి గ్రామ న్యాయస్థానం, బందెలదొడ్డి తప్పనిసరిగా ఉండాలి. గ్రామీణుల సౌకర్యాలను పట్టించుకోక పోవడం ఇంగ్లీషువారి పరిపాలనలో పెద్దలోపమని ఆయన భావించాడు.

గ్రామాలలో రోడ్లను గురించి నరసయ్య వివరంగా రాశాడు. “వేసవిలో తప్ప పల్లెటూళ్ళకు బండిలో ప్రయాణం చెయ్యడానికి బాటలు లేవు. రోడ్లు వెయ్యకుండానే ప్రభుత్వం రైతులవద్ద ‘రోడ్డుసెస్సు’ వసూలుచేస్తూంది. ఈ సెస్సులో పాతికోభాగం రైతులకిస్తే, వారే గ్రామాలకు రోడ్లు వేసుకొంటారు. గ్రామాలను ప్రధాన మార్గాలతో కలిపినప్పుడే అభివృద్ధి చెందుతాయి. గ్రామాలలో భూస్వాములు రైతులకు సహకరించడంలేదు. ప్రభుత్వం రైతులగోడు పట్టించుకోకపోతే, ప్రభుత్వానికీ భూస్వాములకూ తేడా ఉండదు” అని ఒక వ్యాసంలో హెచ్చరించాడు.[17] వర్షాకాలంలో కోడూరుకు రాకపోకలు సాగించడానికి వీలుగా, ఊరుముంగిట ప్రవహించే వాగుమీద వంతెన నిర్మించాలని జిల్లా కలెక్టరును అభ్యర్థించాడు.

### శ్రోత్రియం గ్రామాలు

నెల్లూరు జిల్లా శ్రోత్రియం గ్రామాల సమస్యలను విశ్లేషించి శ్రోత్రియం భూములను, మాన్యాలను ఆక్రమించుకొని అనుభవిస్తున్న భూస్వాములకు వ్యతిరేకంగా రాశాడు. సమర్థులైన అధికారులచేత శ్రోత్రియం గ్రామాలను తిరిగి సర్వేచేయించి, లెక్కలు తేల్చాలని,

అందువల్ల ప్రభుత్వాదాయం పెరుగుతుందని సూచించాడు. "జిల్లా కలెక్టరుకు విలుకానిపల్లె ఎక్కడుందో తెలుసా? తెలియకపోతే, మేము వివరిస్తాము. నెల్లూరుకు పదిమైళ్ళ దూరంలో ఈ పల్లె ఉంది. కోదూరు రోడ్డు ఈ పల్లె మధ్యగా వెళ్తుంది. రోడ్డుపక్కనే ఉన్న ఈ పల్లె అభివృద్ధిని గురించి పట్టించుకోకుండా, ప్రభుత్వం ఉదాసీనంగా ఉండడం దురదృష్టం. ఊరికి రోడ్డుకు మధ్య పొలాలున్నాయి. పైరు పెట్టిన తర్వాత మనుషులు, పశువులు ఊళ్ళోకి వెళ్ళడం సాధ్యంకాదు. ఈ ఊరి ప్రజలవద్ద ఎంతమొత్తం రోడ్డుసెస్సు వసూలు చేస్తున్నారు? ఇక్కడి ఇనాందార్లు తమ శ్రోత్రియాలను, మాన్యాలను అనుభవిస్తున్నారా? వారి పొలాలను ఎవరు ఆక్రమించుకొని సొంతం చేసుకొన్నారు? ప్రభుత్వం ఎన్నడైనా ఈ విషయాలు పరిశీలించిందా? ఇటీవలి సర్వేలో ఈ భూములను కొలిచి సక్రమంగా నంబర్లు ఇచ్చారా? సర్వేలో ఎంతభూమి మిగులు తేలింది? ఈ భూములను ఆక్రమించుకొని అనుభవిస్తున్న వారికున్న హక్కులేమిటి? ఈ వివరాలన్ని పరిశీలించి నిగ్గు తేల్చవలసిన అవసరంలేదా? ప్రభుత్వానికి నష్టం కలిగితే, ప్రజలకు నష్టంకాదా? మేము జిల్లా కలెక్టరును, తాసిల్దారును ఈ ప్రశ్నలు అడుగుతున్నాము. ప్రజాశ్రేయస్సు, దేశహితం తప్ప, ఈ విషయాలు ప్రస్తావించడంలో మాకు వేరే ఉద్దేశాలు లేవు" అని విలుకానిపల్లె సమస్యలను వివరించాడు.[18]

"గ్రామాలలో దురలవాట్లు అధికం. గ్రామీణులు పశువులను ఇతరుల పొలాలలోకి, దొడ్లలోకి విడిచిపెడతారు. పశువులు పంటపొలాలను నాశనం చేస్తాయి. నీటి వసతి ఉన్నా వేసవిలో పైరు పెట్టుకొనే అవకాశం లేదు. ప్రతి గ్రామానికి ఒక బందెలదొడ్డి ఉండాలని" దాన్ని నిర్వహించే ఏర్పాట్లను కూడా నరసయ్య ఒక వ్యాసంలో చర్చించాడు. పశువుల వైద్యం కోసం అన్ని తాలుకాలకు వెటర్నరీ ఇన్‌స్పెక్టరులను నియమించాలని మరొక వ్యాసంలో సూచించాడు. రోగాలవల్ల పశుసంపద నశిస్తుందని, అందువల్ల వ్యవసాయాభివృద్ధి మందగిస్తుందని ఆ వ్యాసంలో వివరించాడు.[19]

## గ్రామీణ పాఠశాలలు

నరసయ్య విద్యావేత్త. స్కూళ్ళ ఇన్‌స్పెక్టరుగా పనిచేసిన అనుభవం ఉంది. పల్లెటూళ్ళ చదువులను గురించి తన పత్రికలో తరచుగా చర్చించాడు. 500 పైబడిన జనాభా ఉన్న ప్రతి ఊరిలో ప్రభుత్వ పాఠశాల నెలకొల్పాలని, చిన్న చిన్న ఊళ్ళలో గ్రాంటు స్కూళ్ళు ప్రారంభించాలని, స్కూలు సెస్సు (school cess) వసూలుచేసి బళ్ళు నిర్వహించాలని సూచించాడు. కొన్ని వేలమంది విద్యార్థులు ఇంగ్లీషు నేర్చుకొని, పాండిత్యం సంపాదిస్తున్నారని ఒకవైపు సంతోషపడుతూ జనాభాలో అత్యధిక సంఖ్యాకులు చదువుకోడంలేదని విచారం వ్యక్తం చేస్తాడు. బడికి వెళ్ళి చదువుకోవలసిన మగపిల్లలలో

ఇరవై అయిదు శాతం కూడా స్కూళ్ళకు పోవడంలేదని నిట్టూరుస్తాడు. "ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న ప్రయత్నం వృథా అవుతూంది. ఇప్పుడు అమలులో ఉన్న "సాధారణ గ్రాంటు స్కూళ్ళ విద్యా విధానం" విద్యను ప్రోత్సహించడం లేదు. సామాన్య ప్రజలకు విద్యమీద ఆసక్తిలేదు. వారిదృష్టి చదువుమీద నిలిపే ప్రయత్నం కొనసాగడం లేదు. ఈ పరిస్థితికి ఎవరిని తప్పుపట్టాలి? చిన్నపిల్లలనా? తల్లిదండ్రులనా? ప్రభుత్వాన్నా?" అని ప్రశ్నిస్తాడు.

పల్లెటూళ్ళలో కాస్త తెలివితేటలున్న వారిని ఉపాధ్యాయులుగా నియమించి వారికి జీతబత్యాలు ఏర్పాటు చెయ్యాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల దగ్గర 'ఫీజు' వసూలు చేసుకొనే అవకాశం ఇవ్వాలని సూచిస్తాడు. ఏడాదికొకసారి ఇన్‌స్పెక్షను జరిపి అసమర్థులైన ఉపాధ్యాయులను తొలగించాలని స్కూళ్ళ సంస్కరణను సూచిస్తాడు.[20] సూళ్ళలో ఇంగ్లీషు బోధన సక్రమంగాలేదని, తరచుగా పాఠ్యపుస్తకాలను మార్చడం మంచిపద్ధతి కాదని, నరసయ్య అభిప్రాయం. "Nesfield's Grammar" లోపాలను వివరించి, ఇంగ్లీషు వ్యాకరణ బోధనలో అనుసరించవలసిన పద్ధతులను సూచిస్తాడు.[21] 1898–99 మద్రాసు అడ్మినిస్ట్రేషను రిపోర్టు (Madras Administration Report) ను ఉదాహరించి, ప్రెసిడెన్సీలోని 53 శాతం పెద్ద ఊళ్ళలో, 94 శాతం చిన్న ఊళ్ళలో స్కూళ్ళులేవని, ఈ అన్యాయమైన పరిస్థితిని చక్కదిద్దవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నాడు. "ప్రతి గ్రామంలో ఒక చిన్నబడి ప్రభుత్వం ఎందుకు ప్రారంభించకూడదు? విద్యలేని ప్రజలు అజ్ఞానులతో సమానమైనవారు" అని చెప్తూ స్కూలు సెస్సు వసూలుచేసి ప్రతి ఊళ్ళో బడి జరపవచ్చని సలహా ఇస్తాడు. పట్టణాలలో ప్రజలకు ఎన్నో వసతులు ఏర్పాటు చేస్తున్నారని, గ్రామాలలో సక్రమంగా ఉత్తరాలు బట్వాడా చేసే ఏర్పాటు కూడా లేదని పల్లెటూళ్ళపట్ల ప్రభుత్వ వివక్షను ప్రశ్నిస్తాడు.[22]

## గ్రామ న్యాయస్థానాలు (Village Courts)

గ్రామ న్యాయస్థానాలమీద ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో నరసయ్య తరచుగా రాశాడు. 1889 ఒకటవ యాక్టు (Act I of 1889) ప్రకారం విలేజి కోర్టులు ఏర్పాటయ్యాయి. ఈ చట్టం పరిధిలో గ్రామాల్లో చిన్న చిన్న సివిల్ క్రిమినల్ కేసులను విచారించి, పరిష్కరించే బాధ్యత, అధికారం గ్రామాధికారులకు, విలేజి మున్సిఫులకు అప్పగించబడింది. ఈ గ్రామ న్యాయస్థానాల వ్యవస్థ నెల్లూరు జిల్లాలో చక్కగా అమలు కాలేదు. విలేజి కోర్టులు చక్కగా పనిచేస్తే, గ్రామాలలో తగాదాలు తగ్గి శాంతి నెలకొంటుందని, 'లిటిగేషన్' (litigation) సమసిపోతుందని నరసయ్య అభిప్రాయపడ్డాడు. ప్రతి పెద్ద గ్రామంలో విలేజి కోర్టు ఏర్పాటు చెయ్యాలని, కొన్ని చిన్న

చిన్న గ్రామాలను కలిపి ఒక కోర్టు నిర్వహించాలని, గౌరవప్రదమైన జీతంతో ఈ కోర్టు నిర్వహణను ఆయా గ్రామ మున్సిఫులకు అప్పచెప్పాలని, మెట్రిక్యులేషను పాసయినవారినే గ్రామ మునిసిఫులుగా నియమించి వారికి సివిలు, క్రిమినలు, రెవెన్యూ పరిపాలన బాధ్యతలను అప్పగించాలని ఆయన తన పత్రిక ద్వారా ఒక ఉద్యమం నడిపాడు. అవసరమైనపుడు 'గౌరవ' విలేజి మున్సిఫులను నియమించి, వారికి ఈ కోర్టుల బాధ్యత అప్పగించవచ్చని సూచించాడు. గ్రామ న్యాయస్థానాల చట్టం పాసయి ఎన్నేళ్ళయినా అమలులోకి రాలేదని, "ఈ చట్టం అసలు అమలులో ఉందా? లేదా? సమర్థులైన మున్సిఫులను ఎక్కడ నియమించారు? ప్రభుత్వానికి శిస్తు వసూలైతే చాలు. ఇంకేమీ పట్టదు" అని తీవ్రంగా రాశాడు. చివరకు తన కృషి ఫలించి, కోడూరు గ్రామ మునిసిపు విలేజికోర్టును చక్కగా నిర్వహించి, సంతృప్తికరంగా తీర్పు చెబుతున్నట్లు ఒక వార్త రాశాడు.[23]

## రైతుపక్షపాతం

నరసయ్య నిరుపేద రైతుల కష్టాలను తన పత్రిక ద్వారా వెల్లడిచేశాడు. గ్రామీణ పేదరికాన్ని గురించి రాస్తూ, "తరచుగా కరవు కాటకాలు పలకరిస్తున్నాయి. రోజురోజుకూ గ్రామీణులు నిరుపేదలుగా మారుతున్నారు. గవర్నరులు వస్తారు పోతారు. పేద రైతుల పరిస్థితులు పైన ఉన్న దేవుడికి, ప్రభుత్వ అధికారులకు మాత్రమే తెలుసు" అని వ్యాఖ్యానిస్తాడు.[24] రైతుల మధ్య గ్రామంలో ఉండి సొంత సేద్యం చేయడంవల్ల ఆయనకు రైతుల సమస్యలు క్షుణ్ణంగా తెలుసు. నీటిపారుదలశాఖ అధికారుల అవినీతి, నిరుపేద రైతులచేత ప్రభుత్వం బలవంతపు కుడిమరమ్మత్తు పనులు చేయించడం, గ్రామాధికారుల మోసాలు, పిలవని పేరంటంగా వచ్చి తొంగిచూచే కరవు కాటకాలవల్ల రైతులు నాదారయిపోవడం – దేనినీ నరసయ్య విడిచిపెట్టలేదు. "జమాబంది దగ్గరపడుతున్న కొద్దీ రైతులు నానా హైరానా పడుతున్నారు. ధాన్యం ధరపడిపోతూంది." అంటూ రైతులు శిస్తుచెల్లించే విధానంలో మార్పులుతెచ్చి, వెసులుబాటు కలిగించాలని ప్రభుత్వాన్ని అర్థిస్తాడు. ఏ సంవత్సరం అసెస్‌మెంటు (assessment) ఆ సంవత్సరమే వసూలుచెయ్యకుండా,వచ్చే ఫసలీలో వసూలు చెయ్యాలని రైతులపక్షాన ప్రార్థించాడు. శిస్తుమొత్తం ఒక్కసారి కాకుండా, వాయిదాల పద్ధతిలో వసూలు చెయ్యాలని సూచించాడు. గిట్టుబాటు ధర వచ్చేవరకు ధాన్యం అమ్మవద్దని, శిస్తు చెల్లించడానికి అవసరమైన ధాన్యంమాత్రమే అమ్మమని రైతులకు హితవు చెప్తాడు. "ప్రభుత్వం రైతులను కన్నబిడ్డలవలె చూచుకోవాలి. రైతునాశనమైతే, దేశం నష్టపోతుంది, ప్రభుత్వం నష్టపోతుంది." అని హెచ్చరిస్తాడు.[25]

## రెవెన్యూ వ్యవస్థ

రెవెన్యూ వ్యవస్థలోని లోపాలను నరసయ్య నిర్దాక్షిణ్యంగా విమర్శించాడు. ఈ వ్యవస్థలోని అమానుషత్వాన్ని ఎండగట్టాడు. "మద్రాసు పరగణాలోని రైతులు నిరుపేదలు. ఈ పరగణాలో రైత్వారీవిధానం మహాసంక్లిష్టమైనది. ఈ వ్యవస్థ భూకామందులకు, కరణాలకు, రెవెన్యూ అధికారులకు దోచుకోడానికి అనుకూలమైనది. బొంబాయి పరగణాలో భూమి సర్వేచేయించినట్లు ఇక్కడ కూడా తిరిగి సర్వేచేయించి రైత్వారివిధానంలో సంస్కరణలు ప్రవేశపెట్టాలి. పేదరైతుల దారుణ జీవన స్థితిగతులను పత్రికల ద్వారా తెలుసుకొని ప్రభుత్వం అనుకూలంగా స్పందించాలి" అని పేదరైతుల తరఫున వకాల్తా తీసుకొంటాడు.[26]

## జమాబంది

"రెవెన్యూ అధికారులూ, గ్రామాధికారులూ కలిసికట్టుగా రైతులను కొల్లగొట్టేవిధానం జమాబంది" అని, జమాబంది పేరుతో సాగే నాటకాన్ని బయట పెట్టాడు. "రెవెన్యూ అధికారుల దండుగమారి చాకిరి జమాబంది" అని కూడా ఎగతాళి చేస్తాడు. "ఇది కొరగాని కార్యక్రమం. ప్రజలకు జమాబంది అధికారులెవరో తెలియదు. గ్రామాధికారులు, తాలుకా హుజూరు అధికారులు వృథాగా శ్రమిస్తారు. జమాబంది కర్చంతా రైతులనెత్తిన రుద్దుతారు. జమాబందిలో మంజూరుచేసిన పట్టాలను రైతులకు ఇవ్వరు" అని జమాబంది పేరుతో సాగే తంతును పేర్కొంటాడు.[27] "రైత్వారీ విధానంలో ప్రతి రైతుకు ఏటా భూమిపట్టాలు ఇస్తారు. రైతులు చెల్లించవలసిన శిస్తులు, సెస్సులు మొదలైన వివరాలు ఈ పట్టాలలో పేర్కొంటారు. ఈ పట్టాలు జారీచేసే కార్యక్రమానికి మరోపేరు 'జమాబంది'. జమాబంది నిర్వహించిన అధికారి రైతుల విన్నపాలు ఓపికగా వింటున్నాడా? మా ఎరుకలో అటువంటి అధికారులు లేరు. జమాబంది చాలా సంక్లిష్టమైన కార్యక్రమం. దీన్ని నిర్వహించే అధికారిలో ఎంతో ఓర్పు, సుగుణాలు ఉండాలి. ఈ లక్షణాలు ఉన్నవారు ఈ రోజుల్లో అరుదు. అందువల్ల మేము శాశ్వత పట్టాలిమ్మని ప్రభుత్వాన్ని అర్థిస్తున్నాము" అని రాశాడు. అంతేకాదు "రైత్వారీ విధానంలో రైతు ఏటా ఎన్నో ఇబ్బందులు పడవలసి వస్తుంది. జమాబందిలో గ్రామాధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, హుజూరు సేవకులు, గుమాస్తాలు లాభపడతారు. శిరస్తదార్లు, తాసిల్దార్లు, ఇతర జమాబంది అధికారులు రైతులవద్ద బత్తాలు పుచ్చుకొంటారు. వారికి అనేకరూపాల్లో సప్లైలు అందుతాయి. రైతులు తెలివిమీరి నడుచుకొంటే తప్ప, వారికి ఏదీ జరగదు. జమాబందిలో మంజూరు చేసిన పట్టాలు చేతికిరావు. కోడూరు గ్రామాధికారి ఈ పత్రికా సంపాదకుడికి పట్టాలు అందచేసిన పాపాన పోలేదు." అంటూ

జమాబంది పేరుతో నడిచే మోసాలను వివరిస్తాడు.[28]

## గ్రామాధికారులు

ప్రభుత్వ యంత్రాంగంలోని దోపిడి పద్ధతులను నరసయ్య క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. ఆయన గ్రామాధికారుల వ్యవస్థను వ్యతిరేకించాడు. "గ్రామాధికారులు మహాబలవంతులు, వారే సర్వాధికారులు. పంట పొలాలను పరిశీలించకుండానే చిత్తం వచ్చినట్లు సెస్సులు ప్రతిపాదిస్తారు. వారు ఎంత అంటే అంత మొత్తం రైతు చెల్లించాల్సిందే. వారు రాసే లెక్కలు కాకిలెక్కలు. రికార్డులో నమోదుచేసిన మొత్తంకంటే అదనంగా వసూలు చేసిన డబ్బును గ్రామాధికారులు, రెవెన్యూ అధికారులు తలా ఇంత పంచుకొంటారు" అని వారి వ్యవహారాన్ని బయటపెడతాడు.[29] రెవెన్యూశాఖలో అక్రమార్జన గురించి తెలుసుకోడానికి సి. రంగాచారి రాసిన "రెవెన్యూ బ్రైబరి" (Revenue bribery) గ్రంథాన్ని పరిశీలించమని పై అధికారులకు సూచిస్తాడు. ప్రభుత్వానికి ఆమోదయోగ్యమైన ఏ దివాన్ బహదూరు రఘునాథరావునో, పళ్ళె చెంచలరావునో అన్ని జిల్లాలకు పంపి, రెవెన్యూశాఖ అవినీతిపై విచారణ జరిపించాలని కోరుతాడు.[30]

"పరిపాలనలో లోపాలున్నాయని రాస్తే మీకు కోపం వస్తుంది. మేము రాసే ప్రతి అంశానికి సాక్ష్యం తెమ్మంటే పేదవాళ్ళు ఎక్కడ నుంచి సాక్ష్యం తెస్తారు? సత్యమైన సంగతే అయినా ప్రతిదీ నిరూపించడం సాధ్యంకాదు. ప్రభుత్వమే విచారించుకోవాలి" అని రెవెన్యూశాఖ అవినీతిని గురించి వ్యాఖ్యానిస్తాడు. ఆ రోజుల్లో లంచగొండి అధికారులు నరసయ్య పేరుచెప్తేనే హడలి చచ్చేవారని సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకుడు డాక్టరు నేలటూరు వెంకటరమణయ్య ద్వారా తెలసింది.[31]

## గ్రామకరణాలు

"తప్పుడు లెక్కలు రాయడంలో గ్రామకరణాలు అసాధ్యులు. వీరి దొంగలెక్కల వల్ల రైతు ప్రాణాలకు వస్తుంది. కరణాలు పొలాలకు వెళ్ళి పరిశీలించరు. ఇష్టంవచ్చినట్లు పంటల వివరాలు నమోదుచేస్తారు. వీరు నమోదుచేసిన రకరకాల శిస్తులను, సెస్సులను పైఅధికారులు ఆమోదిస్తారు. కరణాల మోసాలు పసిగట్ట గలిగిన అధికారులెవరూ ఉండరు. ఈ మోసాలను జమాబంది అధికారికూడా కనిపెట్టలేదు. రెవెన్యూశాఖ నిబంధనలమూలంగానే అధికారులు అవినీతి పరులవుతున్నారు. గంజాం, నెల్లూరు, కడప కరణాలు పెద్ద అవినీతి పరులని ప్రభుత్వానికి తెలుసు" అని 1897-99 అడ్మినిస్ట్రేషన్ రిపోర్టు (Administration Report) నుంచి వివరాలు వెలికితీసి చూపాడు.[32]

విద్యా గంధంలేనివారిని, ఒకే కుటుంబానికి చెందినవారిని, అన్నదమ్ములను పక్కపక్క పల్లెల్లో గ్రామ మునిసిఫులుగా నియమించడాన్ని నరసయ్య వ్యతిరేకించాడు.[33] స్థానికులను గ్రామాధికారులుగా నియమించే విధానాన్ని మాని, విద్యావంతులు, సమర్థులైనవారిని గ్రామాధికారులుగా నియమించాలని, రైతుల కష్టాలు కడతేరడానికి ఇదొకటే మార్గమని ఆయన అభిప్రాయపడ్డాడు. గ్రామాధికారులు విధులు నిర్వహించే గ్రామాలలో వారికి భూములుండకూడదని అలహాబాదు హైకోర్టు ఇచ్చిన తీర్పును మద్రాసు పరగణాలో కూడా అమలుచెయ్యాలని ప్రభుత్వాన్ని అర్థిస్తాడు.[34] పెద్ద భూస్వామ్య కుటుంబానికి చెందిన కోడూరు మునిసిఫు అక్రమాలను పత్రిక ద్వారా వెలికితెచ్చి, ప్రభుత్వం అతణ్ణి ఉద్యోగం నుంచి తొలగించేవరకు ఆయన నిద్రపోలేదు.[35]

గ్రామాధికారులకు వ్యతిరేకంగా ఇంతరాసినా, వారి కష్టాలు నరసయ్యకు తెలియకపోలేదు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పత్రికలో చర్చించాడు. గ్రామాధికారుల వేతనాలు చాలా తక్కువని, వారి వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. పై అధికారులకు 'సప్లై'లు చెయ్యలేక, కొందరు గ్రామాధికారులుగా కొనసాగడానికి విముఖత చూపుతున్నారని, ఇటువంటి అవసరాలకే గ్రామాధికారులు రైతుల వద్ద అదనంగా వసూళ్ళు చేస్తారని వివరిస్తూ వారి స్థితిగతులను సానుభూతితో చర్చించాడు.[36]

## గ్రామ సేవకులు

వెట్టిచాకిరి గురించి, వెట్టి వారి జీతబత్యాలను గురించి, విధి నిర్వహణలో వారు ఎదుర్కొనే కఠిన పరిస్థితులను గురించి నరసయ్య ఎంతో సానుభూతితో రాశాడు. "గ్రామాధికారులు గ్రామ సేవకులకు, కావలివారికి నెలనెలా చెల్లించవలసిన వేతనంలో కొంతభాగం దిగమింగకుండా సక్రమంగా చెల్లిస్తున్నారా? ప్రతి ఫలం ఇవ్వకుండా తమ పొలాల్లో గ్రామ సేవకులచేత వెట్టిచాకిరి చేయించుకోడం లేదా?" అని సూటిగా ప్రశ్నిస్తాడు.[37]

## కుడి మరమ్మత్తు పనులు

"రైతులకు ఇబ్బంది కలిగించే నిబంధనలు విధించరాదనే సంగతి అందరికీ తెలిసినదే. ఆచరణలో అట్లా జరగడం లేదు. రెవెన్యూ అధికారులు పేద రైతులను కుడి మరమ్మత్తు పనులకు రమ్మని వేధిస్తున్నారు. బలవంతంగా పనులకు మళ్ళించుకొని పోతున్నారు. పనులకు వెళ్ళకుండా ముఖంచాటు చేసిన రైతులను అనేక విధాలుగా పీడించి జుల్మానాలు వసూలు చేస్తున్నారు. ఈ విధమైన జుల్మానాలను భూమిశిస్తు బకాయి మాదిరే వసూలు

చెయ్యడానికి 1856 చట్టంలోని 6వ సెక్షను అధికారం కల్పిస్తున్నది." ఈ చట్టాన్ని పురస్కరించుకొని మరమ్మత్తుశాఖ అధికారులు చేసే బలవంతపు వసూళ్ళను, సప్లైల కోసం చేసే దాష్టీకాన్ని నరసయ్య పత్రికాముఖంగా బహిర్గతం చేశాడు.

లార్డ్ స్టాన్‌లీ ఆల్డర్‌లీ (Lord Stanely Alderley) భారతదేశంలో అమలులో ఉన్న నిర్బంధ వసూళ్ళు చట్టవిరుద్ధమైనవని లార్డ్స్ సభ (House of Lords) లో చేసిన ఉపన్యాసాన్ని లా టైమ్స్ (Law Times) పత్రిక నుంచి ఉదాహరించి, "ఈ దేశంలో నిజంగానే అటువంటి చట్టం అమలులో ఉందా?" అని నరసయ్య నెల్లూరు కలెక్టరును నిలదీస్తాడు. "అటువంటి చట్టం అమల్లో ఉంటే, 'కుడిమరమ్మత్తు' పనులకు రమ్మని రైతులను బలవంతపెట్టే అధికారం ఎవరికి ఉంది?" అని అక్రమ నిర్బంధ శ్రమను వ్యతిరేకిస్తాడు.[38]

"అధికారులకు లంచం చేతిలో పడకపోతే, రైతులకు ఏదీ సవ్యంగా జరగదు. డెల్టా అధికారులు రెవెన్యూ అధికారుల మాదిరే ప్రవర్తిస్తున్నారు. గ్రామాలకు నీరు సక్రమంగా పంపిణీ చెయ్యడం లేదు. నిష్పక్షపాతంగా నడుచుకోడం లేదు. సేద్యాలు దెబ్బతింటున్నాయి. రైతులు చందాలు వేసుకొని గ్రామాధికారుల ద్వారా నీటిపారుదలశాఖ అధికారులకు లంచాలు ముట్టచెప్పి పనులు జరుపుకొంటారు. ఈ అక్రమాలను విచారించే నాథుడే లేడు. నీళ్ళు సక్రమంగా ఇస్తే, ఎంతసెస్సు విధించినా రైతులు చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు" అని సాగునీటి ఇబ్బందులను గురించి వివరిస్తాడు. పంటకాలువలు తవ్వి బీళ్ళు సాగులోకి తెస్తే ప్రభుత్వాదాయం పెరుగుతుందని సూచిస్తాడు.[39]

## టెనెన్సీ బిల్లు (Tenancy Bill)

ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో నరసయ్య రాసిన వ్యాసాలలో పాలికాపుల తరఫున, టెనెన్సీ బిల్లుమీద రాసిన వ్యాసం ముఖ్యమైనది. ఈ వ్యాసంలో ఆయన వర్గదృక్పథం వ్యక్తమవుతుంది. తాను చిన్నపాటి భూస్వామి అయి ఉండీ, పేదకౌలుదార్ల తరఫున వకాల్తా పుచ్చుకొంటాడు. "కౌలుదారిబిల్లు గతి ఏమయిందని" ప్రశ్నిస్తాడు. "ప్రభుత్వానికి నిరుపేద రైతులమీద రవంతయినా దయలేదా? భూస్వాముల కబంధహస్తాల్లో కౌలుదార్లు ఎంతకాలం నలిగిపోవాలి?" అని తీవ్రంగా నిరసిస్తాడు. "భూస్వాములు పేదరైతుల కష్టాలు పట్టించుకోడం లేదు. ఎన్నో ఏళ్ళుగా సాగుచేసుకొంటున్న రైతులను క్షణంలో తొలగించి భూములు స్వాధీనం చేసుకొంటున్నారు. రైతులు దుక్కులు దున్ని రెండో కారుపెట్టడానికి పొలాలను సన్నద్ధం చేసుకొంటున్న తరుణంలో, కౌలుదార్లను తొలగించి, కొత్తవారికి కౌలుకిస్తున్నారు. టెనెన్సీ బిల్లు వస్తేకాని పేదరైతుల బాధలు పోవు" అని మరొక వ్యాసంలో రాస్తాడు.[40] కౌలుదారులను తొలగించి భూస్వాములు కొత్తవారికి

కౌలుకిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే కౌలుదారీ చట్టంతేవాలని ఒక రైతు రాసిన ఉత్తరాన్ని కూడా నరసయ్య తన పత్రికలో ప్రచురించాడు.[41]

## జమీందార్లకు వ్యతిరేకం

1888లోనే నరసయ్య వెంకటగిరి జమీందారీ రైతుల సమస్యలను గురించి పీపుల్స్ ఫ్రెండ్‌లో ప్రస్తావించాడు.[42] పత్రికాధిపతులు జమీందార్ల ప్రాపకంకోసం, పోషణకోసం పడిగాపులు కాస్తున్న రోజుల్లో ఇంపార్షియబుల్ ఎస్టేట్ యాక్టు (Impartiable Estate Act) ను నరసయ్య తీవ్రంగా వ్యతిరేకించాడు. ఆనాటి పత్రికలేవైనా ఈ బిల్లును వ్యతిరేకిస్తూ రాశాయా అని పరిశోధించవలసిన సందర్భంలో ఆయన ఎంత ముందుచూపుతో ఈ వ్యాసం రాశాడా అని విస్మయపడక తప్పదు.

ఎంత ప్రాచీన చరిత్ర కలిగిన ఎస్టేట్లనైనా జమీందార్లు తమ చిత్తం వచ్చినట్లు అన్యాక్రాంతం చెయ్యడం చెల్లుబాటవుతుందని పిఠాపురం ఎస్టేటు కేసులో ప్రీవీ కౌన్సిలు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు విజయనగరం, వెంకటగిరి, బొబ్బిలి వగైరా పెద్ద జమీందార్లను కలవరపెట్టింది. తమ ఎస్టేట్లు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోడానికి ప్రభుత్వాన్ని ఆశ్రయించి "ఇంపార్షియబుల్ ఎస్టేట్ యాక్టు" చట్టం చేయించుకొన్నారు.[43] బొబ్బిలి, వెంకటగిరి తదితర జమీందార్లు ఈ బిల్లు పాసు కావడానికి తమ పలుకుబడినంతా ఉపయోగించారు. "ప్రభుత్వం పేదరైతుల గోడు పట్టించుకొని వారి బాధలు నివారించడం కోసం ఒక్కచట్టమైనా తీసుకొని రాలేదు గాని, జమీందార్ల సంక్షేమంకోసం, వారికి అనుకూలమైన చట్టాలు తీసుకొని వస్తూంది. ఇంపార్షియబుల్ ఎస్టేట్ యాక్టు 'రెట్రాస్పెక్టివ్' గా అమలయ్యేటట్లు చట్టం తెస్తున్నారని వింటున్నాము. ఈ విధంగా చట్టం తేవడం న్యాయంకాదు. అనాదిగా అవిభక్తంగా ఉన్న జమీందారీలకు మాత్రమే ఈ చట్టం వర్తింపచెయ్యాలి. ఈ జమీందార్లు ప్రభుత్వానికి, ప్రజలకు ఏమి ఉపకారం చేశారు?. భవిష్యత్తులో ఏమి మంచి చెయ్యబోతారు? వీరి ఎస్టేట్లు సాధారణమైన ఎస్టేట్లమాదిరే అవసరం ఏర్పడినపుడు విభజించుకోడానికి వీలుగా ఉండడమే న్యాయం. జమీందార్ల ఎస్టేట్లు అవిభాజ్యంగా ఉండేటట్లు చట్టం చేసేటట్లయితే, శ్రోత్రియందార్ల శ్రోత్రియాలు, ఇనాందార్ల ఇనాములు, సాధారణ పట్టాపొలాలు అన్నీ అవిభాజ్యంగా ఉండేటట్లు చట్టంచెయ్యాలి" అని బిల్లును వ్యతిరేకిస్తూ వ్యంగ్యం, పరిహాసం ఉట్టిపడేటట్లు రాశాడు.[44]

## జమీందారీ భూముల సర్వే

నరసయ్య తన పత్రికద్వారా జమీందార్లకు వ్యతిరేకంగా ఒక ఉద్యమం సాగించినట్లు తోస్తూంది. 1801 లో పర్మినెంటు సెటిల్మెంట్లు జరిగినప్పుడు, జమీందారీ గ్రామాలలో గ్రామకరణాల నియామకం, వారి జీతబత్యాలు, వారిమీద అధికారం అన్నీ జమీందార్ల

అజమాయిషీకే విడిచిపెట్టబడ్డాయి. దాంతో రైతులను పీడించి, తమ చిత్తం వచ్చినట్లు శిస్తులు, పుల్లరులు వసూలుచేయడానికి జమీందారులకు అవకాశం ఏర్పడింది. నరసయ్య ఒక వ్యాసంలో ఈ సంగతులు వివరించాడు. జమీందార్లు దొంగలెక్కలు తయారుచేయించి, సక్రమంగా శిస్తు చెల్లించకుండా ప్రభుత్వాన్ని వంచిస్తున్నారని ఆరోపించాడు. ఇటువంటి మోసాలను అరికట్టడానికి జమీందారీ గ్రామాలను సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి, ఆయా గ్రామకరణాలను ప్రభుత్వమే నియమించాలని ప్రతిపాదించాడు. గ్రామకరణాలను నియమించే అధికారం జమీందార్ల చేతిలో ఉన్నంతవరకు వారు ఇటు రైతులను, అటు ప్రభుత్వాన్ని వంచిస్తూనే ఉంటారని, ప్రభుత్వం చర్యతీసుకోకుండా ఎందుకు ఊరకుందని ప్రశ్నిస్తాడు. ఈ అంశంమీదనే మరొక వ్యాసంలో జమీందారీ, శ్రోత్రియం గ్రామోద్యోగులకు ప్రభుత్వమే జీతబత్యాలు చెల్లించే చర్య చేపట్టాలి. అందువల్ల రైతులకు, ప్రభుత్వానికి లాభం చేకూరుతుంది. ఈ చర్యవల్ల దుఃఖించేవారు జమీందార్లు, శ్రోత్రియందార్లు మాత్రమే అని రాస్తాడు.[45]

జమీందారీ పరిపాలనమీద రాస్తూ, వెంకటగిరి సంస్థానం దివాను సామర్థ్యంమీద నరసయ్య సందేహం వెలిబుచ్చాడు. పై అధికారులంతా ఇంగ్లీషువారే అయినపుడు ఇంగ్లీషు రాని దివాను ఏ విధంగా తన విధులు నిర్వహించగలడని ఒక వార్త రాశాడు.[46] వెంకటగిరి జమీందారుకు ఆయన సోదరులకు ఆస్తి వ్యవహారంలో మనస్పర్థలు కలిగి కోర్టుకెక్కారు. తర్వాత రాజీ కుదిరినా అన్నదమ్ముల మధ్య విరోధాలు చాలాకాలం సమసిపోలేదు. తమ్ముడు ముద్దుకృష్ణయ్య ప్రతి విషయంలో అన్నతో పోటీపడి అతిశయం చూపాడు. ఈ పరిస్థితులను వివరిస్తూ నరసయ్య ఒక వార్త ప్రచురించాడు. "సంస్థాన సేవకులు, ఆశ్రితులు ప్రత్యర్థి వర్గంతో ఎటువంటి సంబంధాలు పెట్టుకోకూడదని ఇటీవల జమీందారు ఒక పనికిమాలిన ఆజ్ఞ జారీచేశాడు. దాంతో క్షురకులు, రజకులు కూడా స్వేచ్ఛగా తమ వృత్తి చేసుకోడానికి అవకాశం లేకుండా పోయింది. వెంకటగిరి ఊరు ఊరంతా రెండు వర్గాలుగా చీలిపోయింది. ప్రజలు శుభాశుభాలకు బంధువుల ఇళ్ళకు వెళ్ళడం మానుకొన్నారు. వెంకటగిరిలో పార్టీ వాతావరణం నెలకొని ఉంది. ఇంగ్లీషువారి పరిపాలనలోనే ఇటువంటి దారుణపరిస్థితి ఏర్పడింది" అని తీవ్రంగా రాశాడు.[47]

శార్దూలశతకకర్త విక్రాల రంగాచార్యులు వెంకటగిరి జమీందారు రాజగోపాలకృష్ణతో ఘర్షణపడి, తన సర్వస్వం కోల్పోయిన ఉదంతం నరసయ్య కళ్ళముందే జరిగింది.[48] అయినా ధైర్యంగా వెంకటగిరి జమీందారీ రైతులకష్టాలు మొట్టమొదట పత్రిక ద్వారా లోకానికి తెలియచేసిన ఘనత నరసయ్యకు చెందుతుంది. ఇరవయ్యో శతాబ్ది ఆరంభంలో జమీందారీ రైతుల బాధలు ఒక స్థానిక పత్రిక ప్రచురించడం సామాన్యమైన విషయం కాదు. "వెంకటగిరి జమిందారీ రైతులు" శీర్షికతో ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో

వెలువడిన వ్యాసంలో "తగినంత సాగునీరు అందక, పంటలు పండక ఎన్నో బాధలు పడుతున్నాము. పరిస్థితులు ఇంత దుర్భరంగా ఉన్నా వెంకటగిరి రాజా మా కష్టాలు పట్టించుకోడంలేదు. నీరు అవసరమైన సమయంలో, పొలాలకు నీరు అందక పంటలు ఎండుతున్నా, సాగుచెయ్యకుండా బీడుపెట్టిన పొలాలను పరిశీలించడానికి అధికారులెవరూ రారు. శిస్తు రెమిషను ఇవ్వరు. శిస్తులు కట్టమని దౌర్జన్యం చేస్తారు. సివిల్‌కోర్టుల్లో, సమ్మరీ దావాలు (summary suits) తెచ్చి వేధిస్తారు. కఠినంగా నిబంధనలు అమలుచేసి శిస్తులు రాబట్టారు." ఇదీ వ్యాసం సారాంశం. మరొక వ్యాసంలో నరసయ్య వెంకటగిరి ప్రాంతంలో కరవు పరిస్థితిని వివరించాడు. ఒక రైతు కరవు పరిస్థితిని వివరిస్తూ రాసిన రిపోర్టు ప్రచురించాడు.[49] ఈ రైతుల అసంతృప్తి రగిలి, రాజుకొని ముప్పై ఏళ్ళ తర్వాత జమీందారీ వ్యతిరేక ఉద్యమంగా జ్వలించింది. ఈ ఉద్యమం అగ్నిగుండం నుంచి జమీన్‌రైతు పత్రిక ఆవిర్భవించింది. వెంకటగిరి జమీందారీ రైతులకు వెన్నుదన్నుగా నిలబడి వారి కడగళ్ళను లోకానికి చాటిన తొలిపత్రిక ఆంధ్రభాషా గ్రామవర్తమాని అని, వెంకటగిరి జమీందారీ రైతు ఉద్యమానికి ఈ వ్యాసమే అంకురార్పణ చేసిందని ఈ రచయిత గట్టిగా నమ్ముతున్నాడు.

## కోర్టాఫ్ వార్డ్సు బిల్లు (Court of Wards Bill)

తనకు జమీందారీ వ్యవస్థమీద రవ్వంత నమ్మకం లేకపోయినా, ప్రభుత్వం అపరిమిత అధికారాలను తన గుప్పిట్లో ఉంచుకొని నిరంకుశంగా వ్యవహరించడాన్ని నరసయ్య అంగీకరించలేదు. కోర్టాఫ్ వార్డ్సు బిల్లును ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు. ఆయన జమీందార్ల మీద సానుభూతితో రాసిన వ్యాసం ఇదొక్కటే. ఈ వ్యాసంలో చట్టసభ పరిశీలనలో ఉన్న ముసాయిదా బిల్లులోని లోపాలను బహిర్గతం చేశాడు. శారీరక, మానసిక వైకల్యం వల్ల తమ ఎస్టేట్లను పరిపాలించుకొనే సామర్థ్యంలేని జమీందార్ల ఎస్టేట్లను ప్రభుత్వం తన అజమాయిషీలోకి తెచ్చుకోడానికి ఈ బిల్లు వీలు కలిగిస్తుంది. "ఇంతటి నిరంకుశాధికారం ప్రభుత్వానికి ఉండకూడదు. ఇటువంటి పరిస్థితులు ఏర్పడినపుడు జమీందారీ భవితవ్యాన్ని తీర్మానించడానికి హైకోర్టు ఫుల్‌బెంచికి నివేదించాలి. ఒక జమీందారీ ఎన్నిచిక్కుల్లో ఉన్నా కోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వం నడుచుకోవాలి" అని తన అభిప్రాయం తెలియచేశాడు.[50] ఆయన రాగద్వేషాలకు అతీతంగా సమస్యలను పరిశీలించేవాడని చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

జమీందార్లకు, భూకామందులకు వ్యతిరేకంగా రాయడంవల్ల సంపన్న భూస్వామ్యవర్గాలు నరసయ్య పత్రికలకు సహకరించి ఉండవు. సామాజిక విషయాలలో, భాషా విషయాలలో నరసయ్య వైఖరి చాలామంది జమీందార్లకు, సామాన్య పాఠకులకు

కూడా మింగుడు పడి ఉండదు. పీపుల్స్ ఫ్రెండ్, ఆంధ్రభాషా గ్రామవర్తమాని నిలబడలేక పోవడానికి ఇవికూడా కారణాలు కావచ్చు.

## స్థానిక సమస్యలు

నరసయ్య అనేక స్థానిక సమస్యలను తన పత్రికలో చర్చించాడు. వ్యవసాయదారులు పశుసంపద మీద ఆధారపడి జీవిస్తారని, పశువుల ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపకపోవడం వల్ల వ్యవసాయాభివృద్ధి మందగిస్తూందని రాశాడు. ఆయనకు శాస్త్రీయ వ్యవసాయంమీద గొప్ప అవగాహన ఉంది. కల్నల్ ఆల్కాట్ వ్యవసాయంమీద రాసిన వ్యాసాన్ని పీపుల్స్ ఫ్రెండ్‌లో ప్రచురించాడు.[51] ఇంగ్లీషువారు కృషివిజ్ఞానాన్ని నిర్దుష్టమైన కళగా అభివృద్ధి పరచి, అనేక నూతన వ్యవసాయ విధానాలను అమలుచేస్తున్నారని ఒక వ్యాసంలో మెచ్చుకొంటాడు.[52] గ్రామాలలో వ్యాపించిన కలరా, మలేరియా జబ్బుల గురించి, క్వినైన్ గ్రామీణులకు అందుబాటులో లేకపోవడాన్ని గురించి రాశాడు. అనుభవజ్ఞులైన సంచారవైద్య సిబ్బందిని నియమించి, గ్రామాలలో వైద్య సౌకర్యాలు కలిగించాలని సూచించాడు.[53] నెల్లూరు జిల్లా వైద్యశాలలో వైద్యపరికరాలు, మందులకొరత తీర్చి పేదలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, జిల్లా బోర్డు ప్రతి తాలూకాలో ఒక ఆయుర్వేద కళాశాలను ప్రారంభించి అర్హతగల వైద్యులను తయారు చెయ్యాలని, నకిలీ వైద్యులను నిషేధించాలని ఒక విలేకరి రాసిన వ్యాసాన్ని ప్రచురించాడు.[54]

నెల్లూరు మునిసిపాలిటీ ఆరోగ్యకరమైన ప్రదేశంగా అభివృద్ధి చెందడానికి నరసయ్య అనేక సూచనలు చేశాడు. పూర్తి సమయం కేటాయించగల 'పెయిడ్ ఛేర్మన్' ను నియమించాలని, ఎప్పుడో తీరిక వేళల్లో ఆఫీసు విధులకు హాజరయ్యే వ్యక్తి తన బాధ్యతలకు న్యాయం చెయ్యలేడని వాదిస్తాడు. పౌరులు చట్టపరిజ్ఞానం కలిగి ఉంటేనే ప్రజాసౌకర్యాలు మెరుగవుతాయని, అసమర్థులను, చట్టం తెలియని వారిని కౌన్సిలర్లుగా నియమించిన జిల్లాకలెక్టరును, ఎన్నుకొన్న పౌరులను తప్పుపడ్తాడు. సమర్థులైనవారు కౌన్సిలర్లుగా ఉన్నప్పుడే మునిసిపాలిటీ బాగుపడుతుందని రాశాడు.[55]

నరసయ్య పోలీసు, తపాలాశాఖలలో సంస్కరణలను సూచిస్తూ సలహాలిచ్చాడు. పోలీసుశాఖల అవినీతిని గురించి, అసమర్థపాలన గురించి రాశాడు. విలేజి పోస్టుమాస్టర్ల జీతబత్యాలను పెంచాలని రాశాడు. ఆస్ట్రేలియాలో తపాలాశాఖ పత్రికలను ఉచితంగా బట్వాడాచేస్తుందని, ఆ చిన్న సదుపాయం ఇక్కడి పత్రికలకు ఎందుకు కలుగజేయగూడదని ప్రశ్నిస్తాడు.[56] విశాఖ ఓడరేవును అభివృద్ధి చెయ్యకపోవడంవల్ల ఆ ప్రాంతపు మాంగనీసు ఖనిజం రైలుమార్గంగుండా, కలకత్తా ఓడరేవు ద్వారా ఎగుమతి అవుతున్నదని, విశాఖరేవు

ఆదాయాన్ని కోల్పోతున్నదని 'రవి' పత్రిక ప్రచురించిన వార్తను తన పత్రికలో పునర్ముద్రించాడు. ఫీడర్ రైలు (Feeder rail) మార్గాలు నిర్మించాలని, కృష్ణాపట్నం నెల్లూరు రైలుమార్గం నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించాడు. న్యాయస్థానాల్లో జరిగే జాప్యాన్ని, అవినీతిని ప్రస్తావించి, "జిల్లా మునిసిఫులకున్న అధికారాలు గొప్పవి. వారి జీతాలు మాత్రం చాలా తక్కువ" అని, ఇందువల్లే జిల్లా న్యాయస్థానాల్లో అవినీతి ప్రబలిందని విశ్లేషించాడు.[57]

నెల్లూరులో కల్లుఅంగడి యజమాని పొద్దస్తమానం కల్లుతాగమని చాటింపువేయడాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకొని వస్తాడు. "పాదచారులను మద్యపానానికి పురికొల్పడాన్ని చట్టం అంగీకరిస్తుందా? ప్రజలు తాగుబోతులు కావాలని ప్రభుత్వం కోరుకొంటున్నదా?" అని ప్రశ్నించి, చట్టవిరుద్ధమైన ప్రచారాన్ని నిరోధించమని జిల్లా అధికారులను కోరుతాడు.[58]

గంగిరెద్దులవాళ్ళు, పాములవాళ్ళు, విప్రవినోదులు మొదలైన సంచార యాచకులంటే నరసయ్యకు అసహ్యం. సోమరులన్నా, యాచకులన్నా ఆయనకు పడదు. యాచకవృత్తిని నిషేధించాలని తరచుగా పత్రికలో రాశాడు. "భారతదేశాన్ని బిచ్చగాళ్ళదేశం అని అనవచ్చు. లక్షలాది ప్రజలు యాచకవృత్తిలో జీవిస్తున్నారు. యాచన అవమానకరమైనదని గానీ, తప్పని గానీ వారు భావించరు. యాచకులకు సంబంధించి ఒక చట్టం తీసుకొనిరావాలి. బిచ్చమెత్తుకొనేందుకు లైసెన్సుఫీజు విధించాలి. ఈ చట్టం కుంటి, గుడ్డి యాచకులకు కూడా వర్తింపచేయాలి" అని పలుమార్లు రాశాడు.[59] అన్నదానం వంటి వాటిమీద ఆయనకు నమ్మకం ఉంది. మహారాణి మరణించినపుడు భారతదేశ సంప్రదాయాన్ని అనుసరించి, నిరుపేదలకు ఒక రోజు అన్నదానం చెయ్యమని ప్రభుత్వానికి సూచిస్తాడు.[60]

నరసయ్య తన చిన్న స్థానిక వారపత్రికలో జాతీయ అంతర్జాతీయ విషయాలమీద రాశాడు. పోలీసుశాఖలో పైఅధికారులంతా తెల్లవారే అనీ, ఎంత తెలివితేటలున్నా స్థానికులకు ఉన్నత పదవులివ్వరని, మైసూరు సంస్థానంలో దేశీయులే పోలీసు ఉన్నతాధికారులుగా ఉన్నారని వివరిస్తాడు.[61] భారతీయులు ఇంగ్లాండు వెళ్ళి, క్లిష్టమైన పరీక్షల్లో కృతార్థులైతేనే తప్ప కలెక్టరు వంటి ఉన్నత పదవులు ఇవ్వరు. ఈ పద్ధతిలోనే యూరోపియన్లు స్థానిక భాషలు విధిగా నేర్చుకొని పరీక్షలు పాసైతేనే వారికి ఈ దేశంలో ఉద్యోగాలివ్వాలి. స్థానికభాషలు నేర్చుకొన్నందుకు ఇంగ్లీషు అధికారులకు ప్రోత్సాహక బహుమతులివ్వడం ఏం న్యాయం అంటాడు.[62]

మద్రాసు, బొంబాయి ప్రభుత్వాలలో గవర్నరు, ఇద్దరు సలహాదారులు ఉన్నారని,

ఇతర పరగణాలలో సలహాదారులు లేరని, సలహాదారుల నియామకం వల్ల ప్రజాధనం దుర్వినియోగం కావడం తప్ప ప్రజలకు ఒనగూడేదేమీ లేదని విమర్శిస్తాడు. పది, ఇరవై వేల జీతాలిచ్చి, గవర్నర్లను, గవర్నరుజనరల్‌ను నియమించడంకన్నా, నిజాయితీపరులైన ఆ దేశ సంపన్నులను ఆహ్వానించి, అయిదు, ఎనిమిదివేల జీతంతో సలహాదార్లుగా నియమించవచ్చని, అందువల్ల ప్రభుత్వ వ్యయం ఆదా అవుతుందని సూచిస్తాడు.[63]

లెజిస్లేటివ్ కౌన్సిలు సక్రమంగా జరగడంలేదని, నెలకొకపర్యాయమైనా సమావేశం కావడంలేదని, "గౌరవనీయులైన సభ్యులు" అనే మర్యాదా వాచకం తమ పేరు ముందు చేరినందుకే సభ్యులు సంతృప్తి చెందినట్లుందని, ఎద్దేవా చేస్తాడు. కౌన్సిలు సమావేశాలు కనీసం నెలకొకసారయినా జరగాలని, అనధికార సభ్యులకు గౌరవభృతి ఇవ్వాలని ప్రతిపాదిస్తాడు.[64]

## ఉప్పుపన్ను

నరసయ్య ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో ఒక నెలలోనే రెండుసార్లు ఉప్పుపన్నుమీద రాశాడు. "పాలకులు పేదలపట్ల కనికరం చూపడంలేదు. నిరుపేదలు గంజిలో వేసుకొనే ఉప్పును ఎక్కువ ఖరీదుకు అమ్మడం అన్యాయమని తోచకపోవడం ఆశ్చర్యంగా ఉంది" అని అంటాడు. "ఆహారపదార్థాల మీద పన్ను విధించడమే తప్పు. ఆహార పదార్థాలన్నిటిలో ఉప్పు ప్రధానమైనది. ఉప్పుమీద పన్ను విధించడం అన్యాయమైన చర్య. దీనికన్న పోల్‌టాక్సు (Poll tax) విధించడంమేలు. మనుషులకు, పశువులకు వినియోగించుకోడానికి, ఆరోగ్యం కాపాడుకోడానికి సరిపడేంత ఉప్పును దేవుడిచ్చాడు. చట్టాలు తయారుచేసి, పెద్ద అధికార గణాన్ని నియమించి, పన్నువసూళ్ళలో లోటు రాకుండా పేదలను బాధించడం మహానేరం. ఉప్పుపన్ను చట్టాలలో సవరణలు తెచ్చిన వ్యక్తిని ప్రజలు విముక్తి ప్రదాతగా, దేవతదూతగా భావిస్తారు'' అని ఆవేదనతో రాస్తాడు.[65]

## మద్రాసు మహాజనసభ – రైతు సంఘాలు

కాంగ్రెసు సంస్థను గురించి నరసయ్య అభిప్రాయాలు తెలుసుకొనే అవకాశం లేదు. మద్రాసులో జరిగిన కాంగ్రెసు సభలకైనా ఆయన హాజరయ్యాడో లేదో ఈ రచయిత నిగ్గు తేల్చలేక పోయాడు. ప్రభుత్వ అనువాదకుడు ఆంధ్రభాషా గ్రామవర్తమాని మీద తయారుచేసిన రహస్య నివేదికలలో కాంగ్రెసు ప్రస్తావనలు రాలేదు. ఈ పత్రిక నడిపే రోజులలో నరసయ్యకు మద్రాసు మహాజనసభమీద అపారమైన విశ్వాసం ఉంది.

మద్రాసు మహాజనసభ స్థాపనలో, ఆ సంస్థ కార్యక్రమాలలో ఆయన క్రియాశీల సభ్యుడుగా పాల్గొని ఉంటాడని తోచింది. ఏటా అఖిల భారత కాంగ్రెసు సభలు జరుగుతున్నా, తాను భావించిన గ్రామ సంఘాలు మద్రాసు మహాజనసభకు అనుబంధంగా పనిచెయ్యాలని అభిలషించడంవల్ల, ఆ సంస్థతో ఆయనకున్న అనుబంధం స్పష్టమవుతూంది.

ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి మద్రాసు మహాజనసభకు అనుబంధంగా గ్రామరైతు సంఘాలు ఏర్పడాలని నరసయ్య పిలుపిచ్చాడు. దేశాభివృద్ధి కోసం ప్రజలు గ్రామసంఘాలను, తాలూకా సంఘాలను, జిల్లా సంఘాలను నిర్మించాలని సలహా ఇచ్చాడు. ప్రతిరైతు గ్రామసంఘంలో సభ్యుడు కావాలి. ప్రభుత్వోద్యోగులు గ్రామసంఘాలలో సభ్యులుగా చేరడం ఆయనకు ఆక్షేపణ కాదుకాని, "ఈ గ్రామ సంఘాలకు ప్రభుత్వోద్యోగులు అధ్యక్షులుగా ఉండకూడదు" అని ఖండితంగా చెప్పాడు. గ్రామాధికారులు గ్రామ సంఘాల అధ్యక్షులై, ఆ సంఘాలను నిర్వీర్యం చేస్తారని, లేదా ప్రభుత్వ అనుకూల సంస్థలుగా తయారు చేస్తారని ఆయన అభిప్రాయమై ఉంటుంది. ప్రతి సభ్యుడు కనీసం ఒక అణా అయినా సంఘానికి సభ్యత్వరుసుం చెల్లించాలి. గ్రామ సంఘాలు వసూలుచేసిన చందా మొత్తంలో మూడో భాగాన్ని మద్రాసు మహాజనసభకు పంపాలని, ఈ సంఘాలకు సంబంధించిన ఒక విస్తృత ప్రణాళికను చర్చించాడు. దేశక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఈ గ్రామసంఘాలు చేపట్టాలని ఒక కార్యాచరణను ఊహించాడు. మద్రాసు ప్రెసిడెన్సీ అంతటికీ ఒక విశాల ప్రాతిపదికమీద, మద్రాసు మహాజనసభకు అనుబంధంగా గ్రామరైతు సంఘాలను ఏర్పాటు చెయ్యాలని అభిలషించాడు. రాజకీయ కార్యాచరణకు ఒక ప్రాతిపదికను ఏర్పరిచాడు.[66] రైతుసంఘాల ఏర్పాటును గురించి నరసయ్య ముందుచూపు ఈ వ్యాసంలో వ్యక్తమయింది.

ఆంధ్రభాషా గ్రామవర్తమాని ప్రచురిస్తున్న కాలంలో నరసయ్యకు బ్రిటిష్ ప్రభుత్వంపట్ల సదభిప్రాయం ఉంది. ఏవో కొన్ని లోపాలున్నా, మొత్తంమీద దేశప్రజలు ఇంగ్లీషు పాలనలో బాగుపడ్డారనే సంగతి గుర్తుంచుకొని తమసాధక బాధకాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని రావాలని ఒక వ్యాసంలో సలహా ఇస్తాడు. ప్రజాభిప్రాయాన్ని సమీకరించడానికి, వ్యక్తీకరించడానికి ప్రజాసంఘాల ఏర్పాటు, సభలు సమావేశాలు, మహజరులు, పత్రికలు సరియైన వాహికలని ఆయన విశ్వసించాడు. ఈ నాలుగు అంగాలు చక్కగా అభివృద్ధి చెందితే, ప్రజలు హాయిగా జీవించగలరని భావిస్తాడు. మేధావులు ఈ నాలుగు సాధనాలను విజ్ఞతతో, శ్రద్ధగా వాడుకోవాలని సూచిస్తాడు.[67] ఆనాటి దేశ నాయకుల ఆలోచనలకు,

నరసయ్య ఆలోచనలకు పెద్దగా అంతరం ఉన్నట్లు అనిపించదు.

వందేమాతరం ఉద్యమం మొదలు కావడంతో దేశరాజకీయాలలో, ప్రజల అభిప్రాయాలలో పెనుమార్పులు సంభవించాయి. ఈ ఉద్యమం ఆరంభమయ్యే నాటికి నరసయ్య పత్రిక నిలిచిపోయింది. ఈ ఉద్యమం గురించి ఆయన ఎట్లా స్పందించాడో నిరూపించడానికి ఆధారాలు లభించలేదుకాని, మిత్రులతో కలిసి, నెల్లూరులో స్వదేశీ స్కూలు స్థాపించడానికి మంతనాలు సాగించినట్లుంది. 1906 ఆగష్టు 8 దినచర్యలో "కొమాండూరు నర్సింహాచార్లు called and we had some talk about our proposed స్వదేశీ School" అని రాసుకొన్నాడు. ఆయన వందేమాతరం ఉద్యమాన్ని ఆమోదించి, ఉద్యమంతో ముందుకు సాగినట్లు సూచనప్రాయంగా దినచర్యలోని ఈ వాక్యంవల్ల తెలుస్తోంది.

## జైలు సంస్కరణ – మరణ శిక్షరద్దు

నరసయ్య పత్రికను సమకాలిక పత్రికలకంటె విశిష్టంగా నిలిపిన అంశాలు కొన్ని ఉన్నాయి. 1900–1901 రెండు సంవత్సరాల నేటివ్ న్యూస్‌పేపర్ రిపోర్టులలో ప్రభుత్వ అనువాదకుడు ఆంధ్రభాషా గ్రామవర్తమాని నుంచి అనువదించినన్ని విషయాలు మరే తెలుగు పత్రికనుంచి అనువదించలేదు. ఈ పత్రిక రాతలు ప్రభుత్వ అనువాదకుని దృష్టిని ఆకర్షించినంతగా మరే పత్రిక రాతలు ఆకర్షించలేదు.

నరసయ్య జాతీయ అంతర్జాతీయ సమస్యలను నిశితంగా పరిశీలించినట్లు, అమెరికాలో నల్లవారి విముక్తి పోరాటం నుంచి అనేక విషయాలమీద ఆయన దృష్టి నిలిపి ఆసక్తి కనపరచినట్లు ఆయన అధ్యయనం చేసిన గ్రంథాలవల్ల కూడా తెలుస్తోంది. జైలు సంస్కరణలమీద రాసిన వ్యాసం ఈ అంశాన్ని నిరూపిస్తోంది.

డార్టుమూర్ జైలు (Dartmoore prison) లో ఖైదీలు 1400 ఎకరాలు సాగుచేసి, పంటలు పండిస్తున్నారని, అటువంటి సంస్కరణలు భారతదేశం జైళ్ళలో ఎందుకు ప్రవేశపెట్టడం లేదని నరసయ్య ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తాడు. జీవితఖైదు విధించి, ద్వీపాంతర వాసశిక్ష అమలుచేయడంకన్నా, విశాలమైన బీళ్ళలో జైళ్ళు ఏర్పాటుచేసి, ఖైదీలచేత వ్యవసాయం చేయించి, ఆధునిక కృషి విధానాలను వాడుకలోనికి తేవాలని సలహా ఇస్తాడు.[68]

నరసయ్య మరణశిక్షను వ్యతిరేకించాడు. "హిందువులు అహింసావాదులు. సమస్త సుగుణాలలో అహింస ఉత్కృష్టమైనదని భావిస్తారు" అని మరణశిక్ష రద్దుకు కారణాలు

చూపుతాడు. "ప్రభుత్వం ఉరిశిక్ష అమలుచేసి ప్రాణంతీయగలదుకాని, మరణించిన వ్యక్తిని బ్రతికించలేదు. ఆలోచనాపరులెవరూ మరణశిక్షను ఆమోదించరు" అంటాడు. మరణశిక్షకు బదులు "కఠిన కారాగార శిక్ష, ద్వీపాంతరవాస శిక్ష విధిస్తేచాలని" ఈ వ్యాసంలో ప్రతిపాదిస్తాడు.[69] నూటఅయిదేళ్ళక్రితం, ఒక చిన్న స్థానిక పత్రికలో మరణశిక్ష రద్దుపరచమని ప్రభుత్వాన్ని అర్థించడాన్ని బట్టి నరసయ్య ఎంత గొప్ప మానవతావాదో బోధపడుతుంది. అట్టడుగు వర్గాల ప్రజలతో మమేకమై, వారి సమస్యలను సానుభూతితో అర్థంచేసుకొని, వారిపక్షాన నిలబడడంలో ఆయన ఎవరికీ తీసిపోడు.

## సాహిత్య విషయాలు

దేశభాషా పత్రికలమీద నివేదికలు సమర్పించిన ప్రభుత్వ అనువాదకులు పత్రికలలోని రాజకీయ అంశాలను స్పృశించారుకాని సాహిత్య విషయాల జోలికి పోలేదు. ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు, సాహిత్య లేఖలు ప్రచురించబడినట్లు కొన్ని నిదర్శనాలు కనిపించాయి. తన ప్రతాపరుద్రీయ నాటకాన్ని ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో సమీక్షించినదెవరో తెలుసుకోవాలనే కుతూహలంతో వేదం వేంకటరాయశాస్త్రి మిత్రుడు పూండ్ల రామకృష్ణయ్యకు లేఖ రాశాడు. అందుకు రామకృష్ణయ్య రాసిన సమాధానం.[70]

నెల్లూరు
28-5-1900

ఆర్యా, నమస్కారములు

తాము తేది 23 వ్రాసిన జాబుకు జవాబు. దంపూరు నరసయ్యగారికి పుస్తకము నేనిచ్చినాను. వారు నిక్కము మీయందు విశ్వాసముంచినారు. ప్రతాపరుద్రీయమును గురించి వారే వ్రాసినారు. ఉందూరు పత్రికగాన మన పక్షము వారెవరైన వ్రాసినచో ప్రకటించెదరు.

ఇట్లు, విధేయుడు
పూండ్ల రామకృష్ణయ్య

దీంతో వ్యావహారిక భాషలో రచించబడ్డ కన్యాశుల్క నాటకాన్ని, పరిమితంగా వ్యావహారిక భాషను పాత్రోచితభాష పేరుతో ప్రవేశపెట్టిన ప్రతాపరుద్రీయాన్ని నరసయ్య సమీక్ష చేసినట్లయింది.

సూర్యాలోకం, ఆంధ్రభాషా గ్రామవర్తమాని కంటె ఒక సంవత్సరం ముందు పుట్టింది. మొదట వేదం వేంకటరాయశాస్త్రి మిత్రబృందం ఈ పత్రికను ప్రోత్సహించింది. నరసయ్య

ప్రతాపరుద్రీయం మీద రాసిన సమీక్షను సూర్యాలోకంలో పునర్ముద్రణ అయ్యేట్లు చూడమని వేంకటరాయశాస్త్రిని కోరుతూ "..... అది సూర్యాలోకమువారికి వచ్చియున్నది. దానిని సూర్యాలోకములో మరల ముద్రింపవలయునని వారితో చెప్పవలయును..." అని పూండ్ల రామకృష్ణయ్య జాబు రాశాడు.[71] సూర్యాలోకం రెండేళ్ళు పూర్తిచేసుకొనేప్పటికి, ఆ పత్రిక యాజమాన్యానికి, వేదంవర్గానికి బెడిసింది. వేంకటరాయశాస్త్రి శాకుంతలానువాదం మీద విమర్శవ్యాసాలు ఆ పత్రికలో వచ్చాయి. వాటికి సమాధానాలు రాసి కాచుకోవలసిన అగత్యం వేదం వర్గానికి కలిగింది. అందుకు ఒక పత్రిక అవసరమైంది. వేంకటరాయశాస్త్రి శిష్యుడు గునుపాటి ఏనాదిరెడ్డి ఆయనకు రాసిన ఒక ఉత్తరంలో "సూర్యాలోకము సమాధానము ప్రకటించదు గాబట్టి, గ్రామవర్తమానిలో విషయము ప్రకటించుటకు నిశ్చయించుకొని యున్నాడను" అని తెలియజేశాడు.[72]

1901 మే 16 సూర్యాలోకం సంచికలో "విమర్శకులకు సలహా" అనే శీర్షికతో నెల్లూరు నుంచి నాయనశాస్త్రి ఒక సుదీర్ఘలేఖ రాశాడు. అందులో ఆంధ్రభాషా గ్రామవర్తమాని ప్రస్తావన ఉంది. "మీ పత్రికలో వ్రాయబడుతున్న విమర్శనములను చదివితిని. "My mind is principally distracted" అను ప్రొఫెసరు జోన్సు గారి ఇంగ్లీషునకు నామనస్సు ముఖ్యంగా కలవరపడుచున్నది అనెడు అర్థమేకాని, ఆంధ్రభాషా గ్రామవర్తమాని గడచిన మార్చి7వ తేది పత్రికలో వ్రాయబడిన ప్రకారము మనస్సు రెండు భాగములు అయినదను తాత్పర్యము 'distracted' అను ఇంగ్లీషు పదమునకు లేదు...."

సాహిత్యపరమైన వ్యాసాలేకాక,నాటక ప్రదర్శనలమీద, సమకాలిక పత్రికలమీద ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో సమీక్షలు ప్రచురించ బడినట్లు చెప్పడానికి ఆధారాలున్నాయి. వేదం వేంకటరాయశాస్త్రి శిష్యులు, అభిమానులు ఆంధ్రభాషాభిమాని సమాజాన్ని నెల్లూరులో స్థాపించుకొన్నారు. ఈ సంస్థ కార్యక్రమాలపై పత్రికలలో వెలువడిన సమీక్షలను ఒకచిన్న కరపత్రంగా 1900లో ప్రచురించారు. ఈ సంస్థ ప్రదర్శించిన వేంకటరాయశాస్త్రి శాకుంతల నాటక ప్రదర్శనమీద ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో వచ్చిన సమీక్షలో కొంతభాగాన్ని ఈ కరపత్రంలో చేర్చారు. వ్యావహారిక భాషలో రాయబడిన వ్యాసాన్ని గ్రాంథికభాషలోకి మార్చి శకటరేఫలు, అరసున్నలు చేర్చి పునర్ముద్రించారు. "ఈ నాటకమును తే17ది శనివారము నెల్లూరు ఆంధ్రభాషాభిమాని సమాజమువారు ఆడి, తమవిద్యను చమత్కారమును కనుపఱచినదేగాక నాటకమును చూడవచ్చిన వారి కందఱికిని అత్యంతానందము గలుగజేసిరి. శాస్త్రులవారి పాండిత్యము ఈ నాటకము వలనఁ బ్రకాశముగా నెల్లూరి పురవాసులందఱికిని విశదమాయెను.

ఇట్టిగ్రంథములు వ్రాయువారు పండితులుకాదని చెప్పెడువారు ఎంతమూఢులో, ఎంతమూర్ఖులో, ఎంత దుర్వాదపరులో, ఎంత అసూయాపరులో ఊహించవచ్చును ................. మొన్న నాటకమును ప్రదర్శించిన సమాజము మెంబరులందఱు ఒకరిని మించిన వారొకరుగా నుండిరి. అయినను వారిలో దుష్యంతమహారాజు వేషమును ధరించినవారు అందరికంటే మిక్కిలి సమర్థులు. అతడు బాల్యదశలో నింత విద్యానైపుణ్యమును ఈషణ్మాత్రమైన సభాకంపములేక కనపఱచినందులకు మేమును, ఆటచూడవచ్చిన సభ యావన్మందియును చాల సంతసించితిమి."

నరసయ్య తెలుగులో రాసినదేమీ మిగలలేదు. అముద్రిత గ్రంథ చింతామణి పత్రికను ప్రశంసిస్తూ ఆయన ఆంధ్రభాషా గ్రామవర్తమానిలో 'పేట్రియట్' పేరుతో ఒక సమీక్ష చేశాడు. అందులో రెండువాక్యాలను "ఇతరుల అభిప్రాయములు" అనే శీర్షికతో అముద్రిత గ్రంథ చింతామణి ప్రచురించింది. "పూండ్ల రామకృష్ణయ్యగారి అముద్రిత గ్రంథ చింతామణి దివ్యమైన పత్రిక యనుటకు నేలాటి యాక్షేపణ లేదు. సదరు అయ్యవారు మంచి పరిశోధకులు, బహు పాటుపడువారు."[73] అముద్రిత గ్రంథ చింతామణి ఇచ్చిన రెండు వాక్యాలు వాడుక భాషలోనే ఉన్నాయి. 1897లో కన్యాశుల్కభాషను అంతగా స్వాగతించిన వ్యక్తి మూడేళ్ళలో అభిప్రాయాలు మార్చుకొని ఉండడు. గ్రాంథిక భాషావాదులు పత్రికలలో వచ్చిన రిపోర్టులను కూడా వీరగ్రాంథిక భాషలోకి మార్చి ప్రకటించుకొనేవారని భావించవచ్చు.

# 8

# దినచర్య
# కొన్ని జీవితవిశేషాలు

దినచర్య రాయడం నరసయ్య నిత్యకృత్యంలో భాగం. ఆనాటి విద్యావంతులు - వీరేశలింగం, గురజాడ మొదలైనవారు దినచర్య రాశారు. నరసయ్య గంటగంటకు తాను చేసిన పనులన్నీ దినచర్యలో పేర్కొనేవాడు. చదివిన పుస్తకాలు, పత్రికలు గుర్తుగా రాసిపెట్టేవాడు. తనకు తారసపడిన ప్రతివ్యక్తి వివరాలు గుర్తుంచుకొని దినచర్యలోకి ఎక్కించేవాడు. విలేజి పోస్టుమాన్, బండివాడు, కూలీలు, అందరి వివరాలు దినచర్యలో రాసేవాడు. ప్రకృతిలో వచ్చేమార్పులు, రాత్రివర్షం కురిసిన సంగతి, అనారోగ్యంవల్ల నిద్రపట్టకపోవడం, భార్య 'పవిత్రస్నానం' అన్నీ ఆయన దినచర్యలో చోటు చేసుకొన్నాయి.

1896, 1901 నరసయ్య దినచర్యలను పెన్నేపల్లి గోపాలకృష్ణ తన వ్యాసాలలో ప్రస్తావించాడు. 1896లో పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక కొనసాగుతూనే ఉంది. 1901 దినచర్యలో ఆంధ్ర భాషా గ్రామవర్తమానికి సంబంధించిన ప్రస్తావన ఉన్న కొన్నివాక్యాలను ఆయన ఉదాహరించాడు. ఈ రెండు దినచర్యలు ఇప్పుడు లభించడంలేదు. ఆ విధంగా ఎంతో విలువైన సమాచారం కనుమరుగైంది.

1898 దినచర్యలో కొన్నిపుటలు మాత్రమే ఇప్పుడు లభిస్తున్నాయి. నెల్లూరు నవాబుపేటలో బడి నడుపుతున్న రామయ్య "మంచి తెలివితేటలున్న వ్యక్తి" అని ప్రశంసిస్తూ, ఎనిమిదిమంది విద్యార్థులకు చదువు చెప్పినందుకు అతనికి గోశాల్ రామానుజులునాయుడు నిధినుంచి ఆర్థికసహాయం ఇప్పించడానికి నిశ్చయించుకొన్నట్లు ఈ దినచర్యలో పేర్కొన్నాడు.[1]

1900 ఆరంభం అయ్యేసరికి, నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్ అచ్చాఫీసు నెల్లూరు నవాబుపేటలో ఏర్పాటుచేశాడు. ప్రెస్సు ఉన్న ఇంట్లోనే కాపురం ఉంటూ పత్రిక నడిపాడు. నరసయ్య 1901 అక్టోబరులో నెల్లూరు కోర్టులో ఇచ్చిన వాఙ్మూలంలో "My profession - press office and cultivation" అని, "My residence - Nellore village" అని చెప్పాడు. పత్రికవల్ల కర్చుతప్ప, రాబడిలేని పరిస్థితిలో పత్రికా నిర్వహణ తనవృత్తి అని చెప్పుకోడంవల్ల ఆ వృత్తిమీద ఆయనకున్న గౌరవభావం, అభిమానం వ్యక్తమవుతున్నాయి.

## 1905, 1906 దినచర్యలు

ఈ దినచర్యలు 12cm x 8cm సైజు చిన్న పుస్తకాలు. వారం మొదలైన వివరాలుదిద్ది, నరసయ్య 1904 డైరీలో 1905 దినచర్య, 1905 డైరీలో 1906 దినచర్య రాశాడు. గత సంవత్సరం డైరీలో కొత్త సంవత్సరం దినచర్య రాయడమే ఆయన దయనీయస్థితిని సూచిస్తూంది. ఇంత చిన్నసైజు పుస్తకాల్లో గంట గంటకు జరిగిన విషయాలు పేర్కొంటూ, కొన్ని పుటలు పెన్సిల్‌తో, కొన్ని పుటలు ఇంక్‌పెన్‌తో, కరక్కాయసిరా కలంతో రాశాడు. పేజీకి ఒకవైపు రాసిన సిరా ఊరి అవతలివైపు పుటలోని రాతతో కలగలసి పోయింది. ఇరికించి సన్న అక్షరాలు రాయడంవల్ల ఆయన దస్తూరి పోల్చుకోడం పూర్తిగా సాధ్యపడలేదు. ఈ దినచర్యల వల్ల ఆయన చదివిన పుస్తకాలపేర్లు, పత్రికలపేర్లు కొన్నైనా తెలుసుకోడానికి వీలుపడింది. ఆయన విశ్వాసాలు, ఆచరణ, ఇతర వివరాలు గ్రహించడానికి అవకాశం కలిగింది.

పందొమ్మిది వందలా ఐదుకల్లా నరసయ్య తన నివాసం నెల్లూరు నుంచి భట్టారంవారికండ్రిగకు మార్చి, అక్కడ తన అక్క మీనాక్షమ్మతో ఉంటూ వ్యవసాయం సాగించినట్లుంది. 1905 దినచర్య ఈ విధంగా ఆరంభమవుతుంది.

"శ్రీరామ - శుభమస్తు" Bhattaramvari Khandriga,

Sunday 1st January 1905 Codoor V., N.T., N. Dt.

Morning : Begin another year, with many fears, misgivings and prayers to my Almighty heavenly Father, may the Lord give us our daily bread and shield us from all evil throughout the year..."

నరసయ్య తన కుమారుడి ఆస్తి వ్యవహారంలో మద్రాసు హైకోర్టులో చేసుకొన్న అపీలు వీగిపోయింది. డిక్రీ బాకీ తీర్చడానికి ఆయన పడ్డకష్టాలు, ఇబ్బందులు, వ్యవసాయంలో ఆయన ఎదుర్కొన్న పరిస్థితులు ఈ దినచర్యల్లో వివరంగా ఉన్నాయి. ఆయన మద్రాసు వెళ్ళినపుడు, వీలుచేసుకొని హిందూ ఆఫీసుకు వెళ్ళాడు. ఈ సంగతి 1905 జనవరి 20 దినచర్యలో ఉంది.

"Went to the Hindu Office to see Mr. M. Veeraraghavachariar, but sorry to say he was not present at the office and I was told he had not been to the office for some days. I then went over to ఆంధ్ర - office where also A.C.P. too was not to be seen. Left a chit for the latter. Then went over to Higginbothams - purchased "Uncle John". Then walked over to Moore Market, seeing Sir T. Munro's statue, Rajah Ramaswami Chetty and H. Rest nut, etc., on the way."[2]

## నరసయ్య మిత్రులు, పరిచయస్థులు

నరసయ్య నెల్లూరు వచ్చిన తర్వాత కూడా ఎం.వీరరాఘవాచారితో, సి.కరుణాకర మీనన్‌తో, తరచుగా ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూ వచ్చాడు.[3] హిందూ వ్యవస్థాపకుడు వీరరాఘవాచారితో ఇంత గాఢమైన స్నేహంఉన్నా, దినచర్యలో హిందూ చదివినట్లు ఎన్నడూ రాయలేదు. ఆంధ్రప్రకాశిక అధిపతి ఏ.సి. పార్థసారథినాయుడితో నరసయ్య నెల్లూరు నుంచి ఉత్తరాల ద్వారా స్నేహం సాగించాడు.[4] క్రమం తప్పకుండా పోస్టులో నరసయ్యకు ఆంధ్రప్రకాశిక అందేది. దాదాపు రెండు దశాబ్దాలపాటు పత్రికలు నిర్వహిస్తూ, మద్రాసులో ఉండడంవల్ల నరసయ్యకు దేశంలోని వివిధ నగరాల్లో అభిమానులు, స్నేహితులు ఏర్పడి ఉంటారు. 1876 నాటికే పూనాలో పట్వర్ధన్ స్నేహితుడైనట్లు ఒక ఉత్తరంవల్ల తెలుస్తోంది. కలకత్తాలోని ఒక సంపన్న కాంగ్రెసువాది నరసయ్య కృషిని అభినందిస్తూ రాసిన ఉత్తరం లభించింది.[5] దినచర్యలో నరసయ్య మిత్రులపేర్లు, పరిచయస్థులపేర్లు వస్తాయి. మద్రాసు క్రిస్టియన్ కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ విలియం రెవరెండ్ మిల్లర్ (Dr. Reverend Miller William) ను "My friend" అని పలుమార్లు పేర్కొన్నాడు. ఇద్దరి మధ్య జాబులు, జవాబులు తరచుగా కొనసాగాయి. ఇంగ్లీషు, తెలుగు నిఘంటు కర్త. పి. శంకరనారాయణ "పీపుల్స్ ఫ్రెండ్స్ సంపాదకులు శ్రీ దంపూరు నరసయ్యపంతులుగారికి గౌరవ పురస్సరంగా" అని రాసి బహూకరించిన నిఘంటువు ఇప్పుడు కూడా ఆయన వారసుల వద్ద ఉంది. నరసయ్య మద్రాసు మిత్రులు పి.కృష్ణస్వామి బి.ఏ. బి.ఎల్., క్రైస్తవ మిషనరీ రెవరెండ్ ఏ. మోఫెట్ (?), గోపతి నారాయణచెట్టి, గోపతి వరదరాజులుచెట్టి. చివరి ఇద్దరు మద్రాసులో సంపన్నులైన

వడ్డీ వ్యాపారులు. వీరు ఋణదాతలు మాత్రమేకాక, నరసయ్యకు ఆత్మీయులు. మద్రాసు వెళ్ళినపుడల్లా వీరిని చూచి వచ్చేవాడు. నరసయ్య మరొక మద్రాసు పరిచయస్థుడు సి.వి.చారి. ఈయనకు ఉత్తరాలు రాశాడు. నరసయ్య పెద్దన్న 'పార్థసారథయ్య' కుమారుడు ఆదెన్న, చిన్నన్న కృష్ణయ్య మద్రాసులో స్థిరపడ్డారు. వీరితో నరసయ్యకు సత్సంబంధాలున్నాయి.[6]

వెంకటగిరి జమీందారు రాజగోపాలకృష్ణ యాచేంద్రకు నరసయ్య ఇంగ్లీషు ట్యూటరుగా వ్యవహరించినా, ఆయనతో సంబంధాలు కొనసాగించలేదు. ఆయన తమ్ముళ్ళు ముద్దుకృష్ణయ్య, వెంకటకృష్ణయ్య, వేణుగోపాలయ్యలను కలుసుకొన్నట్లు, వారికి ఉత్తరాలు రాసినట్లు దినచర్యలలో పేర్కొన్నాడు. వెంకటగిరిలో ముద్దుకృష్ణయ్య నిర్వహిస్తున్న హైస్కూల్లో ఉపన్యసించిన వైనం దినచర్యలో ఉంది.[7]

కొందరు నెల్లూరు రంగనాయకుల పేట వైష్ణవ యువకులు నరసయ్య అభిమానులు, మిత్రులు అయ్యారు. ఈ యువకులు మద్రాసు చదువులకు వెళ్ళినపుడు ఆయనకు పరిచయం అయి ఉండాలి. నెల్లూరులోని వెంకటగిరిరాజా హైస్కూలు ఉపాధ్యాయుడు ఆసూరి సరస్వతీ నరసింహాచార్యులు నరసయ్య సన్నిహిత మిత్రుడు. ఈయన నెల్లూరు పురప్రముఖుడు, అమెట్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ (Amateur dramatic association) సభ్యుడు, నెల్లూరు ప్రోగ్రెసివ్ యూనియన్ (Progressive Union, Nellore) వ్యవస్థాపక సభ్యుడు. ఈయనను "My old friend" అని దినచర్యలో వర్ణించాడు. "My friend కొమాండూరు నరసింహాచార్లు" అని దినచర్యలో మరొక నరసింహాచార్యులను ప్రస్తావించాడు. ఈయన జిల్లా బోర్డు హైస్కూలు ప్రధాన అధ్యాపకుడుగా పనిచేశాడు. చక్కిరాల వెంకటసుబ్బయ్యతో కలిసి నెల్లూరు ఉత్తరభాగంలో ఒక పాఠశాల నెలకొల్పడానికి కృషిచేసినట్లు కూడా దినచర్యలో ఉంది.[8]

నరసయ్య నెల్లూరు స్నేహితులలో రంగమన్నారు అయ్యంగారు, చిలకపాటి రామానుజాచార్యులు, వెంకటేశయ్యరు, ఒంగోలు వెంకటరంగయ్య మొదలైన వారున్నారు. నరసయ్య కోదూరు నుంచి నవాబుపేట ఇంటికి వచ్చినపుడల్లా మిత్రులు వచ్చి కలిసేవారు. నెల్లూరులోని వేదం వేంకటరాయశాస్త్రి శిష్యవర్గంతో నరసయ్యకు పరిచయాలున్నాయి. నెల్లూరు పర్మనెంట్ ఫండ్ ఆఫీసు స్థాపకులలో ఒకరైన టి. సుబ్బులాలా నరసయ్య చిరకాల మిత్రుడు.[9]

నరసయ్యను "పుస్తకాల పురుగు" అని వర్ణించవచ్చు. పుస్తకపఠనం ఆయన వ్యసనం, ఆయన ప్రవృత్తి. పుస్తకంచేత పట్టుకొని, సాయంత్రం దీపాలు పెట్టినా ఏకాగ్రంగా పఠనం సాగించినట్లు దినచర్యలో పేర్కొన్నాడు. తనతోపాటు కుమారుడు రామకృష్ణయ్య కూడా గంటల తరబడి కదలకుండా చదువుతూ కూర్చొన్నట్లు దినచర్యలో రాశాడు.[10]

ఆర్థికంగా చితికిపోయి, జీవితం సంక్షోభంలో ఊగిసలాడుతున్న పరిస్థితులలో కూడా ఆయన పుస్తకపఠనం నిరంతరాయంగా సాగించాడు. ఒకవైపు రుణదాతలను శాంతపరచడానికి టి.ఎం.ఓలు పంపుతూ, అదేచేత్తో పుస్తక ప్రచురణ సంస్థలకు టి.ఎం.ఓలు పంపి పుస్తకాలు తెప్పించుకొన్నాడు. మదరాసు వెళ్ళినపుడల్లా పుస్తకాలు కొనడం అలవాటు. కొత్తగా వచ్చిన పుస్తకాలకు కేటలాగు తయారుచేస్తున్నట్లు దినచర్యలో పేర్కొన్నాడు. ప్రతిరోజు పోస్టులో ఉత్తరాలు, పత్రికలు వి.పి.పార్సెళ్ళు వచ్చేవి. పోస్టుమాన్ రానిరోజు అసహనంతో "తపాలాశాఖ ఉండి ఏమి ప్రయోజనం" అని చిరాకు వ్యక్తంచేస్తూ పలుమార్లు దినచర్యలో రాశాడు. మద్రాస్ మెయిల్, ఆంధ్రప్రకాశిక, రీస్ అండ్ రయ్యత్ (Reis and Ryyet), ఇలస్ట్రేటెడ్ వీక్లీ (Illustrated Weekly) మొదలైన పత్రికలు క్రమం తప్పకుండా చదువుతున్నట్లు దినచర్యలవల్ల తెలుస్తుంది. "VPM చలమయ్య called and brought 1 paper, 1 magazine and 1 book- post from America" అని దినచర్యలో రాశాడు.[11] వారం రోజుల తర్వాత "The History of Slavery and Success Movement in US of America" గ్రంథం చదువుతున్నట్లు దినచర్యలో ఉంది. లండన్ నుంచి పుస్తకాలబంగీ అందుకొన్నట్లు 1905 అక్టోబరు 25 దినచర్యలో ఉంది. వీరేశలింగం రచనలు, అనిబిసెంటు రచనలు, జేమ్స్‌మిల్ రచనలు, స్కూల్ కమిషన్ రిపోర్ట్ ఆన్ మద్రాస్ ఇంగ్లీష్ ఎడ్యుకేషన్, జేనెట్ రిపోర్టులు, స్టరన్స్ రిపోర్టులు మొదలైన పరిపాలనా సంబంధమైన ప్రచురణలు చదువుతున్నట్లు దినచర్యలో పేర్కొన్నాడు. మూడు పైసల కరపత్రాలు – ఫెటర్స్ ఆఫ్ క్రిస్టియానిటీ ఇన్ ట్రేడింగ్ (The fetters of Christianity in Trading), హిస్టరీ ఆఫ్ క్రైస్ట్ (History of Christ), ది ఏజ్ అండ్ ఆరిజిన్ ఆఫ్ గీతా (The age and Origin of Geeta) చదివినట్లు దినచర్యలో రాశాడు.[12] ఇవి వందేమాతరం ఉద్యమనేపథ్యంలో వెలువడిన కరపత్రాలని అనిపిస్తుంది. ఈ కరపత్రాలు చదివినట్లు రాసుకొన్న కొన్ని గంటల తర్వాత "ది క్రిస్టియన్ ఇయర్" (The Christian Year) పుస్తకం చీకట్లు ముసురుకొనే వేళదాకా చదువుతూ కూర్చున్నాడు.[14] ఏ.ఎస్. రే ఇంగ్లాండ్ అండ్ ఇండియా, (A.S. Ray's England and India) అమృత్‌లాల్ రచన రెమినిసెన్స్, (Reminiscences) ఆర్.సి.దత్ హిస్టరీ ఆఫ్ బెంగాల్ అండ్ మద్రాస్ ప్రెసిడెన్సీ (History of Bengal and Madras Presidency), ఇండస్ట్రియల్ లైఫ్ (.............) అండ్ కండిషనింగ్ ఆఫ్ ఇండస్ట్రియల్ సక్సెస్ (Industrial Life (................) and Conditioning of Industrial Success) మొదలైన చరిత్ర, రాజకీయ, ఆర్థికశాస్త్ర గ్రంథాలు చదువుతున్నట్లు దినచర్యలో ఉంది.[14] 'వాల్టైర్' (Voltair), క్రామ్‌వెల్ (Cromwell) అబ్రహాం లింకన్ (Abraham Lincoln) మొదలైన వారి రచనలు చదివినట్లు దినచర్యలవల్ల తెలుస్తోంది. డికెన్సు అమెరికన్ నోట్సు (American Notes) తో సహా డికెన్సు సాహిత్యం సమగ్రంగా అధ్యయనం చేసినట్టు దినచర్యలవల్ల

బోధపడుతుంది. "Reading London (.............) magazine" అనే వాక్యం దినచర్య పుటల్లో తరచుగా కనపడుతుంది. సీరియస్ రచనలేకాక, కాలక్షేపంకోసం 'సిక్స్ పెన్నీ' (Six penney) నవలలు, కథలు చదివినట్లు దినచర్యల్లో రాసుకొన్నాడు. భర్తృహరి, భగవద్గీత ఇతర సంస్కృత గ్రంథాలు చదివినవైనం దినచర్యల్లో ఉంది. రచయితపేరు, పుస్తకంపేరు ఒకటి రెండు సన్న అక్షరాలలో పేర్కొన్నందువల్ల నరసయ్య చదివిన పుస్తకాల పేర్లు, పత్రికలపేర్లు వివరంగా తెలుసుకోడానికి సాధ్యపడలేదు. ఏ పుస్తకం చదివినా, దానిమీద ఒక వాక్యంలో తన అభిప్రాయం రాసుకోడం ఆయన అలవాటు. "Reading Uncle (John) and finished it by 6 p.m. The book is a beautiful story written in a very ( ) Not a dull line from beginning to end" "Reading Mrs. Besant's Lectures (8) 5th 1891. How clear and eloquent !" "Reading 'Gone' - A story of some years of memory through!" "Reading again "Tenant of Wild Fell Hall-" how clever the author Ani Bronti is !" ఇటువంటి వాక్యాలు దినచర్యలో తరచుగా కన్పిస్తాయి.[15] నరసయ్య చరమ సంధ్యలో కూడా సమకాలిక జాతీయ, అంతర్జాతీయ విషయాలను గమనిస్తూనే ఉన్నాడని, సాహిత్య గ్రంథాలను, ఉబుసుపోక పుస్తకాలను చదువుతున్నాడని చెప్పడానికి దినచర్య నుంచి వివరంగా ఉదాహరించవలసి వచ్చింది.

## మతవిశ్వాసాలు

1901 కోర్టు వాఙ్మూలంలో తాను స్మార్త బ్రాహ్మణుణ్ణని నరసయ్య చెప్పుకొన్నాడు. ఆచరణలో ఆయన బ్రహ్మసమాజ భావాలకు దగ్గరగా జరిగినట్లు తోస్తుంది. తల్లితండ్రుల తిథులు జరపడం, శ్రావణ పౌర్ణిమనాడు నూతన యజ్ఞోపవీతాలు ధరించడం - ఈ రెండు మతకర్మలను మాత్రమే ఆయన పాటించాడు. నరసయ్యకు శిఖ ఉండేదని ఆయన వంశీయులు తెలిపారు. క్షురకర్మ, స్నానపానాలు, భోజన భాజనాలు, వాహ్యాళి వంటి ప్రతి నిత్యకృత్యాన్ని దినచర్యలో ఆయన రాశాడు. మద్రాసు, నెల్లూరు, వెంకటగిరి ప్రయాణాలలో ఒకపర్యాయం కూడా గుడికి వెళ్ళినట్లు పేర్కొనలేదు. అనుష్ఠానపరులైన బ్రాహ్మణుల వలె సంధ్యావందనం, దేవతార్చన చేసినట్లు ఏ ఒక్కరోజూ ప్రస్తావించలేదు. దినచర్య మామూలుగా "Prayed and laid down" అనే వాక్యంతో ముగుస్తుంది. "Reading and meditating" వంటివాక్యాలు,"Remembering myself and family to the kind keeping and care and mercy of our Father at Heaven" వంటివాక్యాలు అప్పుడప్పుడూ కనిపిస్తాయిగాని, సగుణబ్రహ్మ ప్రస్తావన కనిపించదు. నూతనసంవత్సరం ఉదయం ప్రార్థనచేసినట్లు, కొన్ని సంస్కృత శ్లోకాలు పఠించినట్లు పేర్కొన్నాడు. 1905 దినచర్య తొలిపుటమీద 'శ్రీరామ' అని రాయడం తప్ప, మూడు

సంవత్సరాల దినచర్యలో ఏ దేవత ప్రస్తావన రాదు. “ఉపవాసం ఉంటే ఊరపందై పుడతార” ని పరిహాసంగా అనేవాడని ఆయన వంశీయుల వల్ల తెలిసింది. నరసయ్య మాదిరే ఆయన అన్న కృష్ణయ్య కూడా బ్రహ్మసమాజ ప్రభావంలో జీవించినట్లు అనిపిస్తుంది.

నరసయ్య మీద క్రైస్తవ ప్రభావం ఉంది. క్రిస్మసు సందర్భంగా దినచర్యలో రాసిన ప్రార్థనలు ఈ విషయాన్ని సూచిస్తాయి.

"Sunday 24th December 1905 భ॥వారి ఖండ్రిగ

May Xmas bring peace and rest for me and (.......) all."

"Monday 25th December 1905 భ॥వారి ఖండ్రిగ

Xmas Day. May the (........) and blessing of Christ rest upon this land, this village and all of us now in such a trouble! Rose at 6 A.M. and engaged in reading certain books of prayers in Sanskrit."

నరసయ్య 1906 ఏప్రిల్ 15 దినచర్య ముగిస్తూ, "Prayed to my Father in Heaven for his endeavour and protection" అని రాశాడు.

1884 సంవత్సరంలో మద్రాసు బ్రాహ్మణ సంఘం ప్రోత్సాహంతో పీఠాధిపతి వీరేశలింగాన్ని, నరసయ్యను మరికొంతమందిని (ఆరుగురు సంస్కర్తలు) సంఘ బహిష్కారం చేశాడు. 1905 నాటికి ఈ సంగతి పాతపడి పోయింది. మద్రాసు, నెల్లూరు, కోడూరు చుట్టుపట్ల గ్రామాల్లో బంధువుల ఇళ్ళలో శుభాశుభాలకు నరసయ్యను పిలుస్తూ వచ్చారు. నరసయ్య మిత్రుడు గండవరపు సుబ్బరామిరెడ్డి తమ కుటుంబసభ్యులు జరుపుకొంటున్న సమారాధనలో భోజనం చెయ్యమని కోరినట్లు, ఆ ఆహ్వానాన్ని మర్యాదాపూర్వకంగా తిరస్కరించి, 'మోయన' తీసుకోడానికి మాత్రం అంగీకరించినట్లు దినచర్యలో పేర్కొన్నాడు. వీరేశలింగంవంటి సంస్కర్త అనుష్ఠానిక బ్రాహ్మోగా మారింది 1906 తర్వాతనే అని గుర్తు చేసుకొంటే, నరసయ్య ఆచరణ ఆనాటి సంస్కర్తల ఆచరణకు దగ్గరగానే ఉన్నట్లు తెలుస్తూంది.

## జీవకారుణ్యం

నరసయ్యకు పెద్ద వ్యవసాయం, పశుసంపద, భట్టారంవారి కండ్రిగ ఇంటిపెరడులో పశువులదొడ్డి, పొలాల్లో పశువుల కొట్టాలు, పశువులు తిరిగి రావడానికి అనువైన బీడుపొలాలు ఉండేవి. కోడూరు, కండ్రిగలో దగ్గర ఉండి టెంకాయ మొక్కలు నాటిస్తాడు. అరటితోట వేయిస్తాడు. పెరడులో మామిడి, కిచిలి మొలకలు నాటి పెంచుతాడు. పాలేర్లు, కూలీలు భోజనాలు చేసిన సంగతి కూడా దినచర్యలో రాయడం ఆయన

విస్మరించడు. స్వయంగా తాను కాయకష్టం చేస్తాడు. 1905 జనవరి 7వ తారీకు దినచర్య ఇట్లా ఆరంభం అవుతుంది.

"I rose as usual and walked through our pasture lands and had there cattle droppings collected carefully till 10 a.m."

రాత్రి, పగలు, వర్షాగమనం, శీతాకాలం, వేసవి ప్రకృతిలో వచ్చే మార్పులు అన్నీ దినచర్యలో రాశాడు. పైరుపంటలన్నా, పశువులన్నా ఆయనకు ప్రాణం. పశువులకు పేర్లు పెట్టుకొని పిలిచేవాడు. "Calf born to our cow (పుల్లావు or పుల్లి) which we named "సూర్యనారాయణ" అని ఒక పుటలో రాశాడు. పిచ్చిరామయ్య, మంగ, రామస్వామి ఎద్దులపేర్లు. "పుల్లావు కూతురు గయ్యాళి గౌరి". రత్నమ్మ, అమ్మాయమ్మ పెయ్య దూడల పేర్లు, ఒక కోడె పేరు వెంకటేశ్వరులు. ఇంకో కోడెదూడ పేరు "లక్ష్మీనారాయణుడు". ఒక ఆవు ఈనితే ఆ దూడకు సీత అని నామకరణం చేశాడు.[16] తల్లిలేని దూడకు 'శంకరయ్య' అని పేరుపెట్టి సాకాడు. కుటుంబ సభ్యులు వెంట ఉండి రైల్లో శంకరయ్యను వెంకటగిరి తీసుకొని పోతారు. శంకరయ్యకు జబ్బు చేస్తుంది. ఈ వార్త తెలిసి నరసయ్య ఎంతగానో దుఃఖిస్తాడు. వెంకటగిరి వెళ్ళి శంకరయ్యను చూచి వస్తాడు. "Saw శంకరయ్య How miserable is the poor creature's present condition" అని దినచర్యలో రాసుకొన్నాడు. శంకరయ్య మరణ వార్త తెలుస్తుంది. "శంకరయ్య the orphan calf brought up by us (...............) died. God ! have mercy upon him (this) poor soul !" అని శోకిస్తూ రాశాడు.[17] 'లక్ష్మయ్య' అని పిలుచుకొనే ఎద్దుకు 'ముసర' వ్యాధి సోకుతుంది. అన్ని కష్టాల మధ్య నలిగిపోతున్న నరసయ్య ఈ విషయాన్ని దినచర్యలో రాయడం మరచిపోలేదు. "God is great and his decisions are mysterious and inscrutable, My bullock named లక్ష్మయ్య seems to have been suddenly taken ill last night. Only God (......................) may take care of this poor beast" అని రాశాడు.[18]

## కోర్టు వ్యవహారాలు

గురజాడ విలువైన కాలం జమీందారీ వారసత్వ దావాలతో వృథా అయినట్లు, నరసయ్య చివరి పదేళ్ళ జీవితం కోర్టు వ్యాజ్యాలతో సరిపోయింది. ఆంధ్రభాషా గ్రామవర్తమాని నడుపుతున్న రోజుల్లో ఆయన పేదలపక్షాన నిలబడి, భూస్వాములకు, గ్రామాధికారులకు వ్యతిరేకంగా ధ్వజమెత్తాడు. విద్యాధికుడు, పేరున్నవాడు కావడంవల్ల ప్రభుత్వ అధికారులు ఆయనను గౌరవంగా చూచినా, స్థానిక భూస్వాములు ఆయన మీద కసిపెంచుకొని అనేక ఇబ్బందులు పెట్టారు. వీటన్నిటికి తోడుగా గృహచ్ఛిద్రాలు ఆయనను కలవరపెట్టాయి. ఇన్ని వ్యక్తిగత సమస్యలతో సతమతమవుతున్నా, గ్రామీణుల

సమస్యల పరిష్కారానికి కృషిచేశాడు. గ్రామీణులను వెంటపెట్టుకొని పై అధికారులను కలిసి మహజరులు ఇచ్చాడు. వారి సమస్యలమీద పత్రికలకు రాశాడు.[19] తాసిల్దారు కోరిక ప్రకారం 1906 జనవరి నుంచి నాలుగైదు నెలలు నరసయ్య కోడూరు గ్రామాధికారిగా (Village Munsif) పనిచేశాడు. నరసయ్య కుమారుడికి మైనరు తీరగానే అతణ్ణి గ్రామాధికారిగా ప్రభుత్వం నియమించింది.[20] నరసయ్య వ్యక్తిత్వాన్ని అంచనా వెయ్యడానికి దినచర్యలో పేర్కొనబడిన ఈ సంఘటన ఉపకరిస్తుంది. ఎవరో ఒక దిక్కులేని ఆదివాసి స్త్రీని కొట్టారు. ఆయన, కుమారుడు ఆరేడు మైళ్ళు నడిచి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేస్తారు. ఈ విషయం దినచర్యలో రాశాడు.

"6 a.m. got up at 6 awakened by the noise created by a row between జంగం వెంకటసుబ్బుడు and యేనాది అంకి on account of some money due by latter to former. I advised former to collect the money in a legal and amicable manner. He, advised by his brother పిచ్చివాడు dragged the woman away forcefully. We (I and BRK) complained to S.H.O Indukurpet who advised the fellows not to do such things any further."[21]

నరసయ్య పీపుల్స్ ఫ్రెండ్ ప్రెస్సు చాలా పెద్దది. దాన్ని అమ్మి ఉంటే ఆయన బాకీలన్నీ క్షణంలో తీరిపోయేవి. ప్రెస్సు ఆయన బహిః ప్రాణం. "when will my Heavenly Father enable me to pay off commitment and pay the creditors and resume my printing work" అని భగవంతుణ్ణి వేడుకుంటాడు. "Mercy Heaven wish me to pay off my creditors and work my press, etc.," అని ప్రెస్సు పునరుద్ధరించే రోజు గురించి ఆశగా ఎదురు చూస్తాడు.[22]

ఈ దినచర్యలో నరసయ్య నిస్సహాయమైన పరిస్థితులు వెల్లడి అయ్యాయి. 1906 అక్టోబరు 23 దినచర్య పుటలో ఆయన రాసిన ఈ వాక్యాలతో విషయాన్ని ముగిస్తాను.

"In my wife's illness, sister's helplessness, debts, difficulties of cultivation, etc., I require God's help."

## చివరి రోజులు

1907లో తోడల్లుడు రాపూరు ఆదినారాయణయ్య అండదండలతో నరసయ్య వెంకటగిరిలో స్థిరపడ్డాడు.[23] అక్కడ ఆయన అచ్చాఫీసు వ్యాపారం ఏ పాటిగా జరిగిందో తెలియదు. అప్పటికి ఆర్థిక ఇబ్బందులన్నీ తొలగి పోయినట్లుంది. పది సంవత్సరాలు రుణబాధతో, కుటుంబ చిక్కులతో సతమతమయి పోయినందువల్ల అరవైఏళ్ళకే వృద్ధాప్యం ఆయనను లోగొంది. తనకు "మధుమేహవ్యాధి లేదని" ఒక మిత్రునికి రాసిన లేఖలో

పేర్కొన్నా, రెండు మూడుసార్లు అస్వస్థతకు గురిఅయిన విషయం దినచర్యలో ఉంది. 1908లో నెల్లూరులో జరిగిన తొలి జిల్లా రాజకీయ సభలకు కూడా ఆయన హాజరు కాలేదు. 1907-1909 మధ్య ఆయనకు సంబంధించిన సమాచారం ఏదీ లభించలేదు.

గురజాడ 1909 జూలై 7వ తేదీ ఒంగోలు మునిసుబ్రహ్మణ్యానికి రాసిన లేఖలో నరసయ్యను గురించి వాకబు చేస్తూ "ఆయన జీవించి ఉన్నారా?" అని విచారించాడు. నరసయ్య చివరిరోజులు ఎంత అజ్ఞాతంగా గడిచిపోయాయో దీనివల్ల అర్థమవుతుంది. గురజాడ ఉత్తరం రాసే సమయానికి నరసయ్య చనిపోయి తొమ్మిది దినాలు. నరసయ్య కుమారుడు రామకృష్ణయ్య తండ్రి మరణాన్ని "28-6-1909 (ఆషాఢ శు11-)" అని "ఫేమిలీ రిజిస్టరు" లో రాసిపెట్టాడు. వెంకటగిరి పంచాయితీ ఆఫీసు జనన మరణ రిజిస్టరులో ఇదే తారీకు నమోదయింది. "ఆకస్మిక మరణం" అని మరణ కారణాన్ని రికార్డు చేశారు.

నరసయ్యకు ఉదయం పదిగంటలకే భోజనంచేసే మద్రాసు అలవాటట. పొద్దున భోజనం ముగించి, వాలుకుర్చీలో పడుకొని, విశ్రాంతిగా పత్రిక చదువుతూ, అనాయాసంగా ప్రాణాలు విడిచినట్లు తెలుస్తూంది.

నరసయ్య జీవితం అంతా పోరాటమే. ఉద్యోగాలకోసం ప్రయత్నాలు, ఆస్తిపాస్తుల తగాదాలు, బంధువులతో సంబంధాలు - ఇవన్నీ ఆయన కాలాన్ని కొంతవరకు హరించి, సాంఘిక కార్యకలాపాలకు అవరోధాలయ్యాయి. ఇన్ని ప్రతికూల శక్తులమధ్య నూతన భారత నిర్మాణానికి కృషిచేశాడు. ఆయన లక్ష్యం - అజ్ఞానం, అవిద్య తొలగిపోయి కొత్త ప్రపంచం ఏర్పడడం. ఉన్నతమైన, న్యాయమైన సమాజంకోసం తన కాలాన్ని, శక్తిని వినియోగించాడు. ఆయనను ఒక సంఘసంస్కర్తగా గుర్తించవచ్చా? రాజకీయ ఉద్యమాలకు దన్నుగా పత్రికలు నిర్వహించాడా? పొట్టకూటికి పత్రికలు నడిపాడా? దేశభక్తుడా? ఆయనను ఏమని పిలవాలి? సంస్కరణ ఉద్యమంలో వీరేశలింగం, వెంకటరత్నం వంటి నాయకులపేర్లు లోకానికి తెలుసు. లోకం దృష్టికి రాని "Unsung Heros" ఎందరో? శ్రీధరనాయుడు, సి. సుబ్బరాయలుసెట్టి, మన్నవ బుచ్చయ్య, నరసయ్య, దేశిరాజు బాపయ్య, బసవరాజు, గవర్రాజు ఇట్లా ఎంతెంతమంది అజ్ఞాత వీరులకృషి ఈ మహోద్యమాల వెనక దాగుంది!

## శేష ప్రశ్నలు

నా కృషి చాలా అసమగ్రమైనదని తెలుసు. నాకున్న పరిమితులు తెలిసే ఈ పుస్తక రచనకు పూనుకొన్నాను. పీపుల్స్ ఫ్రెండ్ రెండు సంచికలు తప్ప నరసయ్య పత్రిక లేవీ ఇప్పుడు లభించడం లేదు. ఆనాటి పత్రికల పేర్లు వినడమేకాని ఒకటీ కనిపించదు. సజీవపత్రిక హిందూ మొదటి మూడేళ్ళ సంపుటాలే ఇప్పుడు లభించడంలేదు. నరసయ్య

పత్రికలు ఒకటి రెండు సంచికలైనా, ఏ విదేశీ గ్రంథాలయంలోనో, ఆర్కైవ్స్‌లోనో కనిపించినా ఆశ్చర్యపడ నక్కర లేదు. 19వ శతాబ్దిలో ఒక పత్రిక ప్రచురించిన వ్యాసాన్ని, వార్తను, మరొక పత్రిక పునర్ముద్రణ చేసుకొనే సంప్రదాయం ఉంది. ఇంగ్లీషు పత్రికలలో వెలువడిన వార్తలను, రచనలను దేశభాషా పత్రికల్లో అనువదించి ప్రచురించుకొనే సంప్రదాయమూ ఉంది. పీపుల్స్ ఫ్రెండ్ ప్రచురించిన రెండువార్తా ఖండికలు ఆ విధంగా లభించాయి. ఓపికగా అన్వేషిస్తే పీపుల్స్ ఫ్రెండ్‌లో అచ్చయిన విషయాలు ఇతర సమకాలిక పత్రికల్లో కనిపించే అవకాశం ఉంది.

హిందూకు సమాంతరంగా పీపుల్స్ ఫ్రెండ్ నడిచింది. 1909 వరకు హిందూ సంపుటాలు పరిశీలిస్తే, పీపుల్స్ ఫ్రెండ్ ప్రస్తావనలు కనుదగిలే అవకాశం ఉంది. హిందూ రజతోత్సవ, స్వర్ణోత్సవ, వజ్రోత్సవ సంచికలు సంప్రదించడానికి ఈ రచయితకు అవకాశం లభించలేదు. వీటిలోనూ పీపుల్స్ ఫ్రెండ్ రెఫరెన్సులు ఉండవచ్చని అనిపిస్తుంది. ఆంధ్రప్రకాశిక, "ఇండియన్ సోషల్ రిఫార్మర్" మొదలైన పత్రికల్లో నరసయ్య పత్రికల ప్రస్తావనలు ఉండే అవకాశం ఉంది.

మద్రాసు మహాజనసభ కార్యక్రమాల్లో నరసయ్య క్రియాశీలంగా పాల్గొని ఉంటాడని అనిపిస్తుంది. ఆ రికార్డులు పరిశీలిస్తే నరసయ్య పాత్ర ఏమైనా ఉందా అనే సంగతి తెలుస్తుంది.

"లెటర్స్ ఆన్ హిందూ మేరేజస్" తప్ప, నరసయ్య రాసిన పుస్తకాలేవీ లభించలేదు. తమిళనాడు ఆర్కైవ్స్‌లో ఓపికగా అన్వేషిస్తే, నరసయ్యకు, ప్రభుత్వానికి మధ్య నడిచిన 'కరస్పాండెన్సు' మరికొంత బయటపడే అవకాశం ఉంది. నెల్లూరు కలెక్టరాఫీసు రీటైన్డ్ డిస్పోజల్సు (Retained disposals) పరిశీలిస్తే, నరసయ్య పంపిన మహజర్లు, అర్జీలు లభ్యం కావచ్చు.

నరసయ్య ఫోటో కూడా ఆయన వారసులవద్ద లేదు.[24] "ఆచార్య రంగాగారన్నట్లు దంపూరు నరసయ్యగారు ఎంతటి అద్భుతమైన వ్యక్తి" అనే వాక్యంతో బంగోరె "నూరేళ్ళనాటి జర్నలిస్టు" వ్యాసం ప్రారంభించాడు.[25] ఆచార్య రంగా ఏ సందర్భంలో ఈ మాటలు రాశాడో, అన్నాడో బంగోరె ఆ వ్యాసంలో స్పష్టం చెయ్యలేదు. ఆచార్య రంగా నరసయ్య మీద రాశాడా అని శోధించవలసి ఉంది. నా కృషి సమగ్రంగా లేదనే అసంతృప్తితో ఈ రచన ముగిస్తున్నాను.

# పాదసూచికలు

## సంకేతాలు

AG : ఆంధ్రభాషా గ్రామవర్తమాని

FG : Fort Saint George Gazette

NG : Nellore District Gazette

దినచర్య : నరసయ్య దినచర్య

R. Suntharalingam (సుందరలింగం) : R. Suntharalingam, Politics and Nationalist Awakening in South India, 1852 - 1891, Published for the Association for Asian Studies, by the University of Arizona press, 1974.

Leonard (లెనార్డ్) :J.G.Leonard, Kandukuri Viresalingam, 1848 -1919, A Biography of an Indian Social Reformer, Doctoral Thesis, University of Wisconsin, 1970.

వి.మం.స. : విక్రమ సింహపురి మండల సర్వస్వం, (సంపాదకుడు : ఎన్.ఎస్. కృష్ణమూర్తి), నెల్లూరు జిల్లా పరిషత్ ప్రచురణ, నెల్లూరు, 1963.

ఒంగోలు వెంకటరంగయ్య : ఒంగోలు వెంకటరంగయ్య, "నెల్లూరఁ బత్రికా ప్రచారము" (వ్యాసం), ఆంధ్రసాహిత్య పరిషద్పత్రిక, సంపుటం10 సంచిక 4, దుర్మతినామ సంవత్సరం, 1922.

వీ.స్వీ.చ : వీరేశలింగం స్వీయచరిత్రము, ప్రథమభాగం, విశాలాంధ్ర ప్రచురణ, ఐదవకూర్పు, మొదటి ముద్రణ, నవంబరు, 1993.

*

### 1. అర్ధ సత్యాలు - అసమగ్ర ప్రయత్నాలు

1. ఒంగోలు వెంకటరంగయ్య, పుటలు, 238-246.
2. బంగోరె, బంగోరె కూనిరాగాలు - ఇతర రచనలు, నెల్లూరు యువజన లలితకళా సమాజం, నెల్లూరు, 1983 (పరిశోధక వ్యాసాలు ఇతరేతరాలు శీర్షికలో), నూరేళ్ళనాటి మొదటి జర్నలిస్టు కీ.శే. దంపూరు నరసయ్య పుట, 18.
3. "నరసయ్యగారు తన స్వీయచరిత్రను రాసుకున్నారట. అది వెంకటగిరిలో ఆయన వారసుల ఇంట్లో చాలాకాలం భద్రంగా ఉండేదట. కొన్నేళ్ళక్రితం వర్షాలకు తడిసి అది ఎందుకూ పనికి రాకుండా పోవడంతో ఆ కుటుంబీకులు దాన్ని పారవేశారట. ఆవిధంగా ఒక విలువైన గ్రంథాన్ని కోల్పోయాము" - పెన్నేపల్లి గోపాలకృష్ణ, జమీన్‌రైతు, 6-7-1979.
4. "I wrote a letter to Dr. Miller but as it was not copied it was not forwarded by చలమయ్య to P.O." దినచర్య 27-12-1905. "Wrote one card to R.A. and got it entered in book" దినచర్య, 27-5-1906.
5. A History of Journalism in Madras, Madras Tercentenary Commemoration Volume, Madras, 1939, P 54.
6. The Mail (incorporating the Spectator of 1836, The Madras Times 1860) 1868-1968, Centenary Supplement, "Some Journalists of South India", P 69.

7. Rangaswamy Parthasarathy, A Hundred years of the Hindu, The Hindu, Kasturi and sons Madras 1978, P2.

8. Madras once upon a time, Heritage magazine (Vol 5 No 1), January 1989, P, 52.

9. History of Indian Journalism, Part II of the Report of the Press Commission, the Publication Division, Government of India, 1955, P. 201.

10. Peeps at the Press in South India, Madras Book Printers, Madras, 1966. P 17.

11. The Press in Madras 1785 - 1990 (M.Litt. unpublished thesis), University of Madras, 1963; Indian Journalism (Origin, Growth and Development), 'Prasarange', University of Mysore, Mysore, 1966.

12. "Two English newspapers which were started in the metropolis were the People's Friend (1881) and the Hindu Observer (1883), but neither survived long as they were unable to make much headway against already entrenched news Papers" - R.Suntharalingam, P 145.

13. The Growth of Public Opinion in the Madras Presidency (1858-1909), University of Madras, Madras, 1974. P 60.

14. ఆరుద్ర రచనలు వ్యాసపీఠం, న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడ, 1985. పుటలు 208-213.

15. గురజాడ లేఖలు, విశాలాంధ్ర ప్రచురణ, 1958.

16. గురజాడ రచనలు, జాబులు - జవాబులు, దినచర్యలు, విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాదు 2000.

17. Gurajada collection, A.P. State Archives, Hyderabad.

18. విశాలాంధ్ర ప్రచురణ, 1987 ప్రతి. పుట, 221.

19. "నెల్లూరు మండల పత్రికలు" వి.మం.స పుట, 853.

20. 21-11-1963 సంచిక. రచయిత పేరు ఉన్న భాగం చినిగిపోయింది. రచయిత బంగోరె కావచ్చు.

21. ఈ వ్యాసాలు "బంగోరె కూనిరాగాలు - ఇతర రచనలు", యువజన లలిత కళాసమాజం, నెల్లూరు, 1983 ప్రచురణలో చేర్చబడ్డాయి.

22. "దంపూరి నరసయ్య - మరికొన్ని జీవిత శకలాలు" జమీన్‌రైతు, 6-7-1979; "దంపూరి నరసయ్య జీవిత చరిత్రలో ప్రధానమైన ఘట్టాలను తెలియజేసే రెండు డైరీలు - రెండు జాబులు" జమీన్‌రైతు 13-7-1979. ఈ వ్యాసాలు అనుబంధంలో చేర్చబడ్డాయి.

23. Tamil Nadu Archives, Chennai - GO No 397 Public dated 22-2-1886 and GO No 455 Public dated 30-4-1888.

24. 25-11-1972 ఉత్తరం.

25. 26-1-1973 ఉత్తరం.

## 2. నరసయ్య చెన్నపట్నం అనుభవాలూ – ప్రభావాలు


1. "తుమ్మగుంట ద్రావిడులు మళైనాటి వారని చెప్పుదురు", మల్లంపల్లి సోమశేఖరశర్మ, విజ్ఞాన సర్వస్వం, మూడవ సంపుటం, తెలుగు సంస్కృతి I, హైదరాబాదు, 1959, పుట, 13.
2. A.V. Venkatarama Ayyar, Curator, M.R.O, "Dubash Avadhanum Paupiah and a Famous Madras Trial (A paper presented at the 12th public meeting of the Indian Historical Records Commission held at Gwalior in December, 1928) Government of India Press, Calcutta, 1930.
3. దిగవల్లి శివరావు, "మన చెన్నపట్టణము – దాని పూర్వ చరిత్ర", ఆంధ్రపత్రిక, వృష ఉగాది సంచిక, పుటలు, 119–139; దిగవల్లి శివరావు పీఠిక, ఏనుగుల వీరాస్వామి, కాశీ యాత్రా చరిత్ర, ఏ.సి. యస్. ఎడ్యుకేషనల్ సర్వీసెస్, న్యూఢిల్లి, 1992; C.S. Srinivasa Sastry, History of the City of Madras, 1939; మోచర్ల రామకృష్ణయ్య, వి.మం.స, పుట 86.
4. ఈ తాళపత్రప్రతి మద్రాసు జి.ఓ.ఎం.ఎల్‌లో భద్రపరచబడి ఉంది; కాళిదాసు పురుషోత్తం, గోపీనాథ వెంకటకవి–వెంకటగిరి సంస్థానం ఇతర కవులు, అముద్రిత డాక్టొరల్ థీసిస్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు, పుట, 45.
5. ఆంధ్ర మహాభారతం, పరిష్కర్త : దంపూరు వేంకటసుబ్బాశాస్త్రి, ఆలూరు ఏకామ్రనాథ జ్యోతిష్కళా ముద్రాక్షరశాల, భువనగిరి రంగయ్యసెట్టి జ్ఞానసూర్యోదయ ముద్రాక్షరశాల, మద్రాసు, 1861. ఈయన పరిష్కరణలో సంస్కృత భారతం ప్రచురించబడింది. వివరాలకు : హిందూ బాంధవి 1–9–1929 సంచిక.
6. FG 14-12-1880.
7. FG 1969 సంపుటం, పుట, 124.
8. జమీన్‌రైతు 17–7–1979 సంచిక.
9. FG 29-4-1864, P 889.
